అసంఖ్యాక మహిళల కోరిక మేరకు మరో

మహిళా గ్రూప్ నెం. 2

7 నెలల పొదుపు! 70 నెలల గెలుపు!!

మొత్తం బహుమతులు:

8 లక్షల, 6 వేలు

మొదటి బహుమతి:

రూ: 1,50,000/- లు.

మొత్తం **34,659** బహుమతులు

ఎన్ని బహుమతులు పొందినా...పొదుపు మొత్తం గ్యారంటీగా తిరిగి వస్తుంది. బ్యాంకు భద్రత కూడా!

మీ పొదుపు మీద ఉచితంగా రూ. 40/- అదనపు బోనస్ కూడా! త్వరపడండి!!




గోదావరి సేవింగ్ సిండికేట్
H.O. రాజమండ్రి

ప్రధాన శాఖలు:

- సుల్తాన్ బజార్, హైదరాబాద్
- ఎల్లమ్మగుట్ట, నిజామాబాద్
- గాంధీనగర్, విజయవాడ.
- నెహ్రూ రోడ్, కర్నూలు.
- మహాత్మాగాంధీ రోడ్, విజయనగరం.
- మెయిన్ రోడ్, గుంటూరు
- మెయిన్ రోడ్, గుడివాడ.
- [illegible] మహల్ ఎదురుగా, మచిలీపట్నం • పవర్ పేట. ఏలూరు.
- టి.బి. రోడ్, ఆళ్ళగడ్డ. • స్టేషన్ రోడ్, కొత్తగూడెం. • కస్బా బజార్, ఖమ్మం.
- నంద్యాల.

DIMPLE DESIGNERS


తిరిగిరానిది మనిషి ప్రాణం
తిరుగులేనిది రామబాణం
కౌముదీ పిక్చర్స్ రంగుల రాకెట్
రామబాణం
నిర్మాత: యం. యస్. రెడ్డి
దర్శకత్వం: వై. ఈశ్వరరెడ్డి B.A.

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్య

సంస్థాపకులు
కీ॥ శే॥ వి.వి. రాఘవయ్య

జ్యోతి
సచిత్ర మాస పత్రిక

మార్చి 1979

సహకార సంపాదకుడు : వేమూరి సత్యనారాయణ

సంపుటి 17 సంచిక 2

విషయసూచిక

మయసభ	16	ఎ. రామసంజీవి
రసవద్గీత	20	అవసరాల రామకృష్ణారావు
ప్రేమసింహాసనం (సీరియల్)	21	యద్దనపూడి సులోచనారాణి
నథింగ్ బట్ ట్రూత్ (నాటిక)	33	ఆదివిష్ణు
అదృశ్యమైన అనామకుడు	62	కొమ్మూరి సాంబశివరావు
రాంగ్ నంబర్....కాదు	76	వీరభద్రరావు పమ్మి
సాధన	82	స్వామి చిత్రానంద
ఇది మరో తెలుగు సినిమాకథ	94	డి. యల్. ఎన్. శాస్త్రి
మీరా (కొత్త సీరియల్ ప్రారంభం)	97	లక్ష్మి
మరో ప్రపంచం	111	'సత్యవంశి'
సినిమా	117	యన్. నారాయణ
పదబంధ ప్రహేళిక	122	శ్రీ శ్రీ

ఇంకా కార్టూన్లూ, జయదేవ్ (వి)చిత్ర విజ్ఞానం:

Gali Malliah,
THE HINDU News Agent
CHIRALA. (A.P.)

నవలానుబంధం

నవలల పోటీలో ప్రథమ బహుమతి పొందిన నవల


పొద్దు తిరుగుడు పువ్వు—'యామిని'

ముఖచిత్రం:

'బంగారు చెల్లెలు'లో శ్రీదేవి

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, P. B. నెం. 2650, మద్రాసు-600 024.
ఫోన్: 423123. సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో రు. 42/)

‘అమ్మా,
నాకప్పుడే 3 నెలలు నిండాయి!’



‘అవును, ఇప్పుడే ప్రారంభించాలి
ఫారెక్స్®’

మీ పాపాయికి ఘనఆహారాలు
ఇవ్వడం ఆరంభించేందుకు
డాక్టర్లు సిఫార్సు చేసేది ఫారెక్స్®

సత్వరమైన, సంపూర్ణమైన
పెరుగుదల కోసం పాపాయికి
ఆదర్శవంతమైన ఘన ఆహారం.



లింటాస్.GLP.65-1710 TL

తొలిమాట

జ్యోతి నిర్వహించిన నవలల పోటీలో బహుమతులు పొందిన నవలల వివరాలు క్రింద ఇస్తున్నాము.

ప్రథమ బహుమతి: రు. 2000/-

పొద్దుతిరుగుడు పూవు — 'యామిని'

రెండవ బహుమతి: రు. 1000/-

వరాలిచ్చే దేవుళ్ళు — 'వసుంధర'

మూడవ బహుమతి: రు. 750/-

వేలాడిన మందారం — జ్వాలాముఖి

ఈ నవలలు కాక పోటీకి వచ్చిన నవలలలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన నవలల గురించి ఆయా రచయితలకు తెలుపడం జరిగింది.

మొత్తంమీద ఈసారి పోటీకి వచ్చిన నవలలు అంతగా సంతృప్తికరంగా లేవని న్యాయనిర్ణేతలు అభిప్రాయపడ్డారు. ఆంధ్రదేశంలో పాఠకుల కంటే రచయిత లెక్కువయ్యారన్న విమర్శ ఒకటి ఉంది. నిజానికి పత్రికల సంఖ్య పెరగడంతో మంచి రచనల లోటు బాగా తెలిసివస్తోంది పత్రికలకు. మేమనుకోవడం చదివేవారికన్నా, రాసేవారు పెరిగారేమోగాని 'రచయితలు' మాత్రం కాదని!

X X X

జ్యోతి నిర్వహించబోతున్న 'జ్యోతి కథల పోటీ' వివరాలు వచ్చే సంచికలో ప్రకటించబడుతాయి. పోటీ నిర్వహణకు పూర్వపు పద్ధతికాక విభిన్నమైన మరికొన్ని పద్ధతులు సూచిస్తూ కొందరు పాఠకులు, రచయితలు ఇచ్చిన సలహాలను పరిశీలిస్తున్నాము.

X X X

'పత్రికల ద్వారా ఉత్తమ సాహిత్యం రాదు' అన్న శ్రీమతి మాలతీ చందూర్ వ్యాఖ్యపై గత సంచిక తొలిమాటలో మేము చేసిన వ్యాఖ్యలకు జవాబుగా రచయితలూ, పాఠకులూ పాల్గొంటున్న రసవత్తరమైన చర్చ ఈ నెల ఉత్తరాల శీర్షికలో ప్రారంభమయింది.

ఉత్తరాలు


'పత్రికల ద్వారా ఉత్తమ సాహిత్యం రాదా?' రసవత్తరమైన చర్చ!!

ఫిబ్రవరి నెలలో తొలిమాటగా మీరు రాసిన వ్యాఖ్య చదివాను. ఆంధ్రజ్యోతి దిన పత్రికలో శ్రీమతి మాలతీచందూర్ వ్యాసం నేను చదవలేదు. కానీ, జ్యోతిలో మీరు ఉదహరించిన వాక్యాలు చదివాక, ఈ నా అభిప్రాయం రాయాలనిపించింది.

మన వారపత్రికల్లోంచి ఉత్తమ సాహిత్యం రాదు—అన్నమాట మాలతీచందూర్ గారు అని వుండాల్సింది కాదు. అంటే అర్థం ఆవిడ ఇంతవరకూ 'ఉత్తమం' అనిపించుకునే సాహిత్యాక్షరం ఒక్క ముక్క కూడా రాయలేదని ఒప్పుకున్నట్టే! తెలుగులో (ఆవిడ నిర్వచనంలో?) ఉత్తమ సాహిత్యం ప్రచురించటానికే ఉద్దేశించబడి ఏ అసోసియేషనూ, బుక్ క్లబ్బూ ఇంతవరకు రాలేదు. అంటే తెలుగులో పోనీ, ఆధునిక లేదా సమకాలీన (రచనల్లో) ఉత్తమ సాహిత్యం అనేదేదీ రాయబడలేదా? బీనాదేవి నవలల్ని జ్యోతి మాస పత్రికా, ఆంధ్రజ్యోతి వారపత్రికా కూడా సీరియల్స్‌గా ప్రచురించాయి. ఎన్నార్ నంది నవలలు వారపత్రికల్లో సీరియల్స్‌గా వచ్చాయి. అవి ఉత్తమ సాహిత్యం కాదు అని ఎవరన్నా అంటే, వాళ్ళెంత పేరువున్న వాళ్ళయినాసరే, ఉత్తమ సాహిత్యం అన్నమాటకి అర్థం తెలీని వాళ్ళే! వంటలు-పిండి వంటలు, పాఠకులమూస ప్రశ్నలకి సంబంధంలేని చేట భారతాలు-ఇవే ఉత్తమ సాహిత్యం అనుకున్నా అవీ సమకాలీన వారపత్రికల్లో వస్తున్నవే! 'జ్యోతి' రాసినట్టు రావిశాస్త్రి, కొడవటిగంటి, గోపీచంద్ రచన్లే కాక, నాగమణి రాసిన 'ప్రతి', అరవింద రాసిన 'అవతలి గట్టు', దాశరధి రంగాచార్య రాసిన 'జనపదం', మందా వెంకట రమణరావు రాసిన 'కొలువు', కేశవరెడ్డి రాసిన 'ఇన్‌క్రెడిబుల్ గాడెస్' లాటి అసంఖ్యాక రచయితల నవలలు ఉత్తమ సాహిత్యం కోవకి చెందేవే. ఇవన్నీ వారపత్రికలు అందజేసిన ధారావాహికాలే.

ఇంతకీ తెలుగువాడికో తెగులుంది. తన సమకాలీనమూ, తనకి అందుబాటులో వున్నదీ చెత్త-లేనిదీ, కానిదీ గొప్ప అనుకోవటం! అలాగనేవాడు గొప్ప చేస్తున్నవాడుగా చలామణీ అయ్యే రివాజు వుంది. శ్రీమతి మాలతీ చందూర్ కూడా అలాటి చలామణీకోసమే ఈ వ్యాసంలో ప్రయత్నించి వుండవచ్చు. సానుభూతి చూపటం తప్ప మరేం చెయ్యలేం ఆవిడ ప్రయత్నానికి! 'వ్యాపార ధోరణికీ, సాహిత్య విలువలకీ పొంతన కుదరదు' అనటం అర్థరహితం. కాకపోతే, వ్యాపార ధోరణి మరీ ఎక్కువయితే సాహితీ విలువలు తగ్గిపోతాయి. సాధారణ లాభాలకీ, స్వల్ప లాభాలకీ రాజీ పడేవారు ఉత్తమ సాహిత్యం తప్పకుండా అందజెయ్యగలరు—అందజేస్తున్నారు-అందజేశారు.

—పి. వి. ఆర్. శివకుమార్
హైదరాబాదు


ఇప్పుడు కేవలం రూ.
365లు మాత్రమే
అదనం-మరి అమెరికాకి
గం ఎక్స్‌కర్షన్
ఫేర్‌లో రెండువైపుల
ప్రయాణాల్లోనూ మరో
మజిలీ చేసేందుకు వీలు:
లండన్, ప్యారిస్, జెనీవా
ఫ్రాంక్‌ఫర్ట్ లేదా రోమ్.
ఇతర వివరాలకై మా
కార్యాలయాన్ని గానీ మీ ట్రావెల్
ఏజెంటునిగానీ సంప్రదించండి.
ఎయిర్-ఇండియా
శుభయాత్ర...శుభవార్త
అమెరికాకి వెడుతూ యూరోప్‌లో
ఆగి వెళ్ళండి.
AI-3508A

విమర్శకునిపై రచయిత ప్రతివిమర్శ!
విప్లవకవుల ప్రస్తావన కూడా!

ఫిబ్రవరి జ్యోతిలో నా "శేషప్రశ్న" కథను విమర్శిస్తూ రాసిన ఉత్తరానికి విజయ్ గారికి నా కృతజ్ఞతలు. నా కథ ఒకర్ని ఆలోచింప చేసిందన్న విషయం నాకు తెలిసింది. ఈ విషయంలో విజయ్‌గారు వెలిబుచ్చిన అభిప్రాయాలమీద నా అభిప్రాయాన్ని, కాస్త దీర్ఘంగానే ఐనా, 'జ్యోతి' అభ్యంతరపెట్టదని ఆశిస్తూ రాస్తున్నాను.


"సమగ్రత, సామాజిక ప్రయోగం, అశాస్త్రీయం" లాంటి పెద్దమాటలతో విజయ్‌గారు నా "మంచి ప్రయత్నాన్ని" పరిశీలించారు. మొదట నేను ఒకమాట చెప్పాలి. నేను "శేషప్రశ్న" కథ రాసింది—"పుస్తకాలు చదువరాకున్నా" "భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటాన్ని" సాగిస్తున్న ప్రజల్ని వెనక్కి లాగటానికి కాదు. విప్లవం శేషప్రశ్న కాకూడదంటే, వాళ్ళను విద్యావంతుల్ని ('అక్షరాస్యుల్ని' అనికాదు) చేయాలని 'విప్లవ కవులమనుకునే' వాళ్ళకోసం, వట్టి ఆవేశం తప్ప ఆలోచనలేని 'విజయ్‌గారిలాంటి' వాళ్ళకోసం మాత్రమే.

ఉపమానాన్ని సాగదీయటం అలంకార శాస్త్రప్రకారం అశాస్త్రీయమే. అంతేకాదు, "....ఎండిపోయిన చెరువు పల్లెప్రజల మెదళ్ళ లాగే వుంది...." అన్నమాటమీద చేసిన దాడి వెనుకవున్న ఆలోచన, దానికి ముందూ, వెనకావున్న మాటల్ని విడిచిపెట్టడంవల్ల అసమగ్రమవుతుంది. 'దాదాపు' ఎండిపోయిన— అన్నాను నేను. అట్లాగే,...."అది నిండితే గానీ రెండుపూటలా తిండి దొరకదు, వాళ్ళ బ్రతుకులు ఓ దారిన పడవు" అన్నమాటే, "జరుగుతున్న పోరాటాన్ని తెలుసుకుంటే చాలు" అని విజయ్‌గారు వర్ణించిన పోరాటం జరుగుతున్న చోట్ల వాళ్లు మేలుకున్నారని చెబుతూనే వుంది.

కుహనా సిద్ధాంతాలమీది నా అభిప్రాయమే నేను, "అవి ప్రజల్ని ఆలోచింపచేయ గలిగేట్టు లేవు" అన్న అర్థంలో వాడాను. ప్రజల్ని ఆలోచింపచేసి, వాళ్ళలోకి చొచ్చుకుపోయిన ఒక్క సిద్ధాంతం చూపించండి ఎవరైనా? పోరాటాలు సిద్ధాంతాల గిరుల్లో వుండవు. మార్క్స్ శ్రామికవర్గంతో విప్లవం వస్తుందన్నాడు. అది పొరపాటని లెనిన్ నిర్వహించిన రష్యా విప్లవమే చెబుతూంది. పల్లె ప్రజలదాకా ఎందుకు, కమ్యూనిష్టులమని చెప్పుకునేవాళ్ళలో మార్క్స్ చెప్పిన **Dialectic Materialism** (గతితార్కిక భౌతిక వాదం) అంటే ఏమిటో ఎందరికి తెలుసు? ఆ **dialects** తోనే **communism** నిలవదని నిరూపించవచ్చని విజయ్ గారికి తెలుసా?

ఇక విప్లవ కవుల కవితలు పశువుల అరుపులకు మించి ఏమాత్రం ప్రభావాన్ని చూపిస్తున్నాయి? 'మహాప్రస్థానం' అనే మాటకు అర్థం ఎంతమందికి తెలుసు? శ్రీశ్రీ చేసిన "ప్రతిజ్ఞ" ఎందరికి అర్థమయింది? వరవరరావు గారు రాసిన పుస్తకాల్ని చదివే అదిలాబాద్, కరీంనగర్‌లలో విప్లవం వచ్చిందా? ఈ విప్లవ కవులమని చెప్పుకుంటున్నవాళ్ల "చెట్టు పేరుచెప్పి కాయలమ్ముకుంటున్నవాళ్లు", "అసమంజసమైన ఆలోచనలు, అసమగ్రమైన అవగాహనలు వున్నవాళ్ళు" కాకపోతే, వాళ్ళు నడుపుతున్న "అరుణ తార", "సృజన"లాంటి పత్రికల పేర్ల అర్థాలు ఎందరికి తెలుసని ఆలోచించారా? చెక్క భజనలకూ, ఈ విప్లవ కవిత్వాలకూ ఏమాత్రం వైవిధ్యం వుంది?


"దూరంగా ఆకాశంలో తేలే సిద్ధాంతాలు కళ్లు నెత్తికెక్కిన వాళ్ళకే కనిపిస్తాయి." నాకు కళ్ళు నెత్తికెక్కలేదు కనుకే అవి నాకు (ఆశావహంగా) కనిపించటంలేదు. సామాన్య



ఇది తప్పక
డెట్
డిటర్జెంట్
బిళ్ల వుతుకే



Shilpi DM 35A/78 Tel



మయసభ

దక్షయజ్ఞం కధ అందరికీ తెలిసిందేకదా!

అసలు మార్క్సిస్టు అవగాహనతో పరిశీలిస్తే ఈ దక్షుడు బడా పెట్టుబడిదారుగాను, శివుడు దళితవర్గాల ప్రతినిధిగాను గోచరిస్తారు. సతీదేవిని ప్రజాస్వామ్యానికి ప్రతీకగా స్వీకరిస్తే, 'దక్షయజ్ఞ ధ్వంసం' ఒక మహత్తరమైన వర్గ సంఘర్షణ అన్పించక మానదు.

కాని ఇలా కనపడ్డదాన్నెల్లా మార్క్సిస్టు సులోచనాలతో విశ్లేషించడం అన్నది అందరికీ సాధ్యమయ్యే యోగంకాదు; దానికెంతో పూర్వజన్మ సుకృతం వుండాలి. (మార్క్సిజానికీ పూర్వజన్మలకూ సంబంధం ఏవిటని అడిగితే మీరింకా—కొందరు మార్క్సిస్టు అవగాహన వున్న జాతక కధాస్వాములను కలవలేదని అర్థం)

ఆ విధంగా ఆనాడు సతీదేవిని దక్షుడు అవమానించాక, ప్రళయకాల రుద్రుడైన శంకరుడు తన ప్రమథగణాలతో భూతప్రేత పిశాచాధినాధులతో యజ్ఞవాటికకు వెళ్ళి వియత్నాం-అమెరికాను చితకపొడిచినట్లు, ఆ యజ్ఞాన్ని ధ్వంసం చేశాడు; దక్షుడు, తెలుగు సినిమా కథ ఆఖరి సీనులోని రావు గోపాలరావు పాత్రవలె, లెంపలు వేసుకుంటాడు. శివుడు శాంతిస్తాడు.

కాని—

శివపురాణం (నేపాల్ తాళ ప్రతి)లో ఒక ధర్మసూక్ష్మం వుంది.

ఆ విధంగా శివుడు దక్షుడిని క్షమించి వెనక్కు వెళదామని బయలుదేరేసరికి ఆయన వెంటవున్న గణాలన్నీ సవినయంగా ఇలా మనవి చేసుకున్నారుట!

"స్వామీ! శంకరా! క్షమించు! ఎంతో కాలానికి ప్రళయతాండవానికి అవకాశం వచ్చిందని అగ్రదగ్రమహోదగ్రంగా, కడలి కెరటాల్లా పైకి లేచాము మేము. కాని ఈ మునులూ, ఋషులూ మమ్మల్ని చూడగానే పారిపోయారు. ఎవరో ఒకరిద్దరు దొరికినా మా అందరకూ చేతినిండా పనే లేకపోయింది. షడ్రసోపేతమైన విందు భోజనానికి ఆవురావురుమంటూ వచ్చిన మాకు ఉత్త పడియాలు మాత్రమే దొరికినట్లయింది.మా కోపానికి ఆకలి తీరలేదు: మా హింసాజ్వాలకు ఆహుతి చాల లేదు; మా విలయతాండవానికి ఈ వేదిక బొత్తిగా ఇరుకయి పోయింది. అంచేత నాగభూషణం! మా తనివితీరా చెలరేగడానికి అవకాశం కల్పించు....ఆ తర్వాత మాకు శాంతి నివ్వు!" అని ముకుళితహస్తులై ముక్త కంఠంతో ముక్కంటికి మొక్కుకున్నారుట.

మందస్మిత వదనుడైన పరమశివుడు— "అట్లేయగుగాక! పొండు! మీరీ సువిశాలమైన భరతభూమి యందు 'ఆకాశవాణి' నాబరగు సంస్థా వాటికను జేరి తనివితీర అరవైకోట్ల

ఏ. రామసంజీవి



కేశ సంపదకు

రీటా

స్త్రీలూ పురుషులూ వాడవచ్చును



సూపర్ ఎకానమి (100 ml) సైజులో కూడా వస్తున్నది



ప్రజానీకానికి కళ్ళు నెత్తికెక్కలేదు కనకనే అవి వున్నాయని వాళ్ళకూ తెలియదు. నాకు విప్లవ కవులమీద అక్కసు లేదు. కానీ వాళ్ళు విప్లవాన్ని 'మాటలు'గా మార్చటంపట్ల వుంది. విజయ్‌గారిలాంటివాళ్ళు అవగాహన, ప్రయోజనం లేకుండా 'ఊసుపోకకు' రాస్తున్న రాతలవల్ల నక్సల్బరీ ఉద్యమం పదహారు ముక్కలై నవ్వులపాలయినట్లు, మళ్లీ ఓ సారి విప్లవం ప్రజల దృష్టిలో అల్లరిపాలవుతుందేమోనన్న ఆవేదన మాత్రమే నాకుంది. "మీ పాలసీ ముందుగా నిర్ణయించుకుని తరువాత దేశాన్ని పాలించండి" అని జనతా వాళ్ళని అంటున్నట్లుగానే, విప్లవకారులనూ అంటుంది మధ్యతరగతి ప్రజ. ఇవన్నీ చదువగలిగిందీ, చదువుతున్నదీ వాళ్ళే.

పోతే, నేను కథను తెలంగాణా భాషలో మాత్రమే రాస్తున్నానని ఎక్కడా చెప్పలేదనుకుంటాను. నిజానికి "చెబుతాను" అని ఎక్కడా లేదు. పోతే, "పసిజేస్తోందో", "ఎంటో"లు అచ్చుతప్పులు. ఐనా, విజయ్‌గారు కలంగారడీతో కైతలవలలల్లే ఎంతటి చాతుర్యం కలవారు కాకపోతే, "ఉదయం" వగైరాలు తెలంగాణా మాటలుకావు—అన్నదాన్ని చర్చనీయాంశంగా లేవదీస్తారు? ఈ తత్త్వం "కళకళకోసమే" అన్నదాన్ని సమర్థించటం లేదా? ఎవరు అసలు రియాక్షనరీ?

విప్లవం అంటే "తుపాకీ", "రక్తం" అని కాక "చైతన్యం", "స్పందన" అన్న అర్థాలతో నా రచనలు పరిశీలించండి. నేను ప్రజల చైతన్యాన్ని వెక్కిరించే ప్రజాద్రోహిని కాను. అలాంటి ప్రజాద్రోహులైన విప్లవ కవులమంటున్న కొందరిగురించి ఇక్కడ రాయటం సమయోచితం కాదు.

ఇక్కడ కాళోజీగారి ప్రస్తావన అనవసరం.

వ్యక్తిత్వం లేనివాళ్ళవల్ల, ఆత్మద్రోహం చేసుకుంటున్నవారి ద్వారా విప్లవం రాదని విజయ్‌గారు, అలాంటివాళ్ళు గుర్తిస్తే మంచిది.

"అప్పటిదాకా వెలిగిపోయిన సూర్యుడు పడమరన జారిపోయాడు. అది చూసి—మళ్ళీ ఎప్పటికో వెలుగు—అనుకుంటుందా పల్లె అన్నట్టుంది, చిక్కగా అలుముకున్న చీకట్లతో, బిక్కు బిక్కుమంటూ" అన్న నా ముగింపులో నిజాయితీ వుంది.

నేనిప్పుడు విజయ్‌గారి నిజాయితీ (sincerity) ని ప్రశ్నిస్తే తప్పంటారా? ఇలాంటి వాళ్ళున్నంతవరకూ మధ్యతరగతి మేధస్సుల్లో విప్లవం శేషప్రశ్న కాదంటారా?

వినయ్ ఎస్.జి. ఖమ్మం. ★

జనులను కాల్చుకుని తినండి——" అని వర మొసంగెనట!

o o o

ఈ నేపాళ తాళ్రపతి చదివి మా మిత్రుడూ, తెలుగు భాషలో పరిశోధన చేసినవాడూ అయిన సంగమేశ్వరరావు——"అ పోదురూ! ఇదీ మరీ అన్యాయం!" అన్నాడు.

ఏమిటా అనుకున్నాను.

"ప్రమథగణాలకూ, భూత ప్రేత పిశాచాలకూ బోలెడంత సంయమనం, నిష్ఠా వుంటాయి; వాళ్ళకి వంద కిలోవాట్ల ట్రాన్స్‌మిటర్లూ, టేప్‌రికార్డర్లూ వంటి సహాయ సంపత్తి వుండదు....." అని వివరించాడు.

సంగమేశ్వరావు మరీ 'శ్రీకాకుళం' ధోరణిలో పడ్డాడుస్మీ అనుకున్నాను.

o o o

సంగమేశ్వర్రావులు ఏమనుకున్నా ఆకాశవాణి అంతటా ప్రమథగణాలూ నిండివున్నారని అనడం బొత్తిగా ప్రతిపక్షాల ధోరణి అని చెప్పవచ్చు.

అయితే చచ్చి ఏ స్వర్గాన వున్నాడో సర్ లయొనిల్ ఫీల్డెన్——ఆయన తాను పాలుపోసి పెంచిన ఈ ఆకాశవాణి ఈనాడు పనిచేస్తున్న విధానం చూచివుంటే తాక్షన ఆత్మహత్య చేసుకునేవాడు అని చెప్పవచ్చు.

వినోదం, విజ్ఞానం, వార్తలు ఇవి ఆకాశవాణి యొక్క ముఖ్యోద్దేశాలు.

కాని ఈ మూడు రంగాలలో దాని చెమట ఎలా ఓడుతుందో గమనిస్తే నేపాళ తాళ్రపతి వెర్షన్ గుర్తుకు రాక తప్పదు.

వినోదంకన్నా.......

వినోదం విషయంలో——ఆ మధ్య ఒక తెలుగు పత్రికలో వచ్చిన కార్టూను చాలు.... ఆకాశవాణి సిగ్గుతో 'హరాకిరీ' చేసుకోవడానికి.

ఆ కార్టూనులో ఒక పోలీసు కాన్‌స్టేబిల్



ఒకానొక నిందితుడిని అడుగుతాడు...."నిజం చెప్పు! ఊఁ....నిజం చెప్పమని అడుగుతున్నాను చెప్పేసెయ్!....నిజం చెబుతావా లేక 'శ్రోతలు కోరిన పాటలు' వినిపించమంటావా?" అని రేడియో ట్యూన్ చేయబోతాడు!!

అది సినిమా గీతాల సంగతి.

లలిత గీతాలు అక్కడా అక్కడా మినహాయిస్తే—ఏదో "పనసకాయి-తద్దినం" ధోరణిలో వుంటాయి. కారణం ఆ శాఖ సిబ్బంది అశ్రద్ధ కొంత; సరయిన కళాకారుల నెన్నుకుని ప్రోత్సహించడానికి దోహదం చేయని గుడ్డి దర్బారు విధానాలు; కొండొకచో ఆ సిబ్బంది తామేదో కళాకారులకు శ్రోతలకు మెహర్బానీగా వరాలిస్తున్న ధోరణిలో ప్రవర్తించడం!

ఆకాశవాణి మదరాసులో పెట్టిన కొత్తలో దాని అధికారి ఒకరు అప్పట్లో ఉజ్వల సినీ తారగా వున్న పసుపులేటి కన్నాంబ దగరకు వెళ్ళి—"మీరు మా రేడియోకో ప్రోగ్రాం ఇవ్వండి; చాల మంచి పబ్లిసిటీ వస్తుంది" అన్నాడట.

"ఎవరికి? రేడియోకా?" అని కన్నాంబ అడిగిందని చెప్పుకుంటారు.

కళాకారులపట్ల రేడియో అధికారుల ధోరణికి ఇంకొక ఉదాహరణ.

హిందూస్తానీ సంగీత సామ్రాజ్యానికి సార్వభౌముడు లాటివాడు బడేగులాం ఆలీఖాన్.

సంస్కారం, విద్య, వివరించగల ఒక ఉన్నత రేడియో అధికారి బడేగులాం వున్న వూరికి వెళ్ళారు. అక్కడి రేడియో స్టేషన్ డైరెక్టర్‌ను-"బడేగులామాలీఖాన్ ఇల్లు తెలిసిన వారెవరయినా ఇక్కడ వున్నారా? ఆయనను కలుసుకోవాలి" అన్నారట.

వెంటనే ఆ ఎస్. డి.—"ఓ, దానికేం భాగ్యం! ఆయన్ను పిలిపిస్తాను యిక్కడికి"—అన్నాడట.

దానికా అధికారి మండిపడి-"అది మర్యాద కాదు; ఆ పని చేయకండి; ఆయన్ను యింటి దగ్గర నేనే వెళ్ళి కలుస్తాను. దారి తెలిసినవారిని పంపండి" అన్నారు.

స్టేషన్ డైరెక్టర్ సంస్కారం అంతలో వుంది! ఇక తక్కువగలవారి........?!

స్టూడియోలో కూచుని గ్రామఫోన్ రికార్డు సరిగా వేయలేని ప్రబుద్ధులున్నారంటేనమ్మండి!


—లలితమూ, అలలితమూ, శాస్త్రీయమూ సినిమయమూ కలిసి నూటికి అరవైగంటల సేపు మనకు సంగీతాన్ని అందిస్తున్నారు మరి!

విజ్ఞానానందం!

కళ్ళూ చెవులూ చైతన్యవంతంగా వాడుకుని, ప్రపంచాన్ని చదువుతుంటేగాని విజ్ఞానపు విశ్వరూపంలో వెయ్యోవంతు సాక్షాత్కరించని యుగం యిది! కనుక ఏ ఏ విషయాలు జనానికి చెప్పాలో, ఏ పద్ధతుల్లో చెప్పాలో, అలా చెప్పగల వారెవరో తెలుసుకోవాలి! అలాటి సమర్థులను ఆకర్షించి చెప్పించగలగాలి. ఢిల్లీలో ఒక "మాస్ కమ్యూనికేషన్స్ సంస్థ" వున్నప్పటికీ అడపా దడపా ఏదో 'రిఫ్రెషర్' కోర్సులు నడుపుతున్నప్పటికి ఆకాశవాణి నుంచి జనం సాధారణంగా సంగీతం తప్ప ఇంకేదయినా వస్తే రేడియో సెట్ మూసేస్తారు! అంత 'డల్'గా వుంటాయి—ఆ ప్రసంగాలు, ఇంటర్‌వ్యూలు.

ప్రసంగాల విషయం బాగున్నచోట ఆ చెప్పేవారు అదేదో రెండో తరగతి కుర్రవాడు "ఉప్పు కప్పురంబు" అప్పచెబుతున్న ధోరణిలో చదువుతారు. వారికేం ఖర్మ సాక్షాత్తు 'ఆకాశవాణులకే' మాడ్యులేషన్, వాయిస్ కల్చర్, లాంటివి అసలు తెలియవు.

ఇంక ఇంటర్‌వ్యూలు అని చెప్పి విషయం తెలిసిన పెద్దమనిషిని పిల్చి కూచోబెట్టి—అతడికన్న తమ గొంతే ఎక్కువగా వినిపించే అమర్యాద ఆకాశవాణి ప్రొడ్యూసర్‌కే చెల్లుతుంది! కొండొకచో గోష్ఠి అని చెప్పి "అల్లం సాగు" నుండీ "అల్లసాని పెద్దన" దాక మధ్య మధ్య తామే చిత్తం వచ్చినట్లు వాగే వాక్ భూషణులకు కొదవే లేదు! ప్రొడ్యూస్ చేస్తున్న నాసి కార్యక్రమాలకు తోడు తగుదునమ్మా అని వ్యక్తిగతమైన పబ్లిసిటీఇచ్చుకునే ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌లు, కళాకారులకు



సరయిన పారితోషికం ఇవ్వని నిబంధనలు, మన దేశంలో గనుక చలామణి అవుతున్నాయి.

ఇప్పుడు తెలుగులో.

వ్వా(ర్)త్తలు

"ఆకాశవాణి.... వ్వార్ త్తలు.... చ్చదువు తోంది బ్బెండపూడి అన్న యామాత్యరావ్"– అని తెలుగుపదాలను ఏ కీలుకు ఆ కీలు వూడ దీసి దాన్ని లెంపకాయ కొట్టి, మొహం బాగా వాచి ఉబ్బేలా చేసి వికారంగా కక్కడం మన కొచ్చిన వార్తా పఠనా సంప్రదాయం. కృత్రిమంగా, దొంగ రాగాలు తీస్తూ చదవడం ఒక రయితే,తొందర తొందరగా షిఫ్టుఅవగానే బస్సు పట్టుకుని ఆ ఢిల్లీ పార్లమెంటు వీధినుండి యే మాలవ్యానగర్‌లో పడి పోవాలేనన్న హడా విడిలో పొడి పొడిగా పదాలను చల్లేవారొకరు. ఒకరిది "నూతిలో గొంతుకయితే" "యముని మహిషపు లోహపుఘంట" మరొకరి గొంతుక.

ఇదే మనకుండే వార్తా చదువరుల, అనౌన్సర్ల స్వర మాధుర్య వైవిధ్యం!

ఇక మన దేశంలోంచి సరయిన వార్తలు కావాలంటే బి.బి.సి. (లండన్) కి రేడియోను తిప్పి వినడం తెలివయినవారు చేసేపని! 1977 ఎన్నికలలో ఇందిరాగాంధి ఓటమి వార్త బి.బి.సి. చెప్పిన నాలుగయిదు గంటల తర్వాత కాని మన "ఆకాసవాణి" సెలవివ్వలేదు.

ఇంతటి మడ్డితనమూ, వృత్తిదక్షతారాహిత్యమూ (Lack of Professionalism) అహంభావమూ—ఆకాశవాణిలో పీటలు వేసుకుని కూర్చున్నాయంటే అందుకు ఒకటే కారణం ఆకాశవాణి Monopoly గా వుండడం; దానికి పోటీ అంటూ లేకపోవడం. ఆకాశవాణి బొత్తిగా One–way trafficకు అలవాటయిపోవడం....

ఆకాశవాణిలో అంతా, అన్నివేళలా ఇంత అధ్వాన్నంగా వుందా అనే వారికి—సంగమేశ్వర్రావ్ వేసే ప్రశ్న— "ఆకాశంలో వెళ్లాల్సిన విమానం ఎగరకుండా నేలమీదే గంటకు 300 మైళ్ళ వేగంతో నడిస్తే క్షంతవ్యమా?" అని....

డామిట్ .... ఎప్పుడు?

బ్రిటీష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ వారొక్కసారి, బ్రిటన్ ప్రధానమంత్రిగా వున్న హెరాల్డ్ విల్సన్, రేడియోస్టేషన్ ద్వారా తాను ప్రసంగించ దలచుకున్నాను అంటే — ఆ రేడియో స్టేషన్‌వాళ్ళు—వీలులేదు అన్నారుట! ఆ ప్రధాని ఆ నిర్ణయానికి తలఒగ్గాడు!!

మన రాజకీయ డంబావారులకు ఆ ప్రజాస్వామ్యపు విలువలు పాటించే సంస్కారం ఏనాడు వస్తుంది?

ఆ ఎత్తుకు మన రేడియో వ్యవస్థ ఎప్పుడు ఎదుగుతుంది?

When ?

★

సంఖ్యా యోగం

మన ప్రభుత్వం ప్రకటనల పరమ సత్యాలు
సగం సరిగ్గా అబద్ధాలు, సగం సర్వాబద్ధాలు.

★

ఈ అంకెల గారడీలు మనవాళ్ళకి మామూలే
మాట వరస కడిగి చూడు 'మీ యింట్లో జనమెందరు?'
అది రేషన్ కార్డయితే సతీ సుతులు, సరితూగరు
పనిమనిషీ, చుట్టాలూ ఇరుగు పొరుగు తనవారే!
కలరా ఇంజక్షనుకై వివరా లడిగా మనుకో
ఏరీ తనవాళ్ళు యిచట, పిట్ట పురుగు కనపడరే!

★

జనం మిథ్య జగం మిథ్య అని కాదా వేద సూక్తి?
సత్యా సత్యాల మధ్య తగునా యీ భేద బుద్ధి?
అనే పలుకు మన జనులకు ఎంతవరకు చెవిని సోకు?
మన గణాంక శాఖ మటుకు, మనడానికి అదే కిటుకు!
గద్దె మీది ప్రభువు బట్టి దిద్దుబాటు తప్పదు
అటూ ఇటూ కదపనిచో అన్ని అంకె లెందుకు!

★

సిటీ బస్సు కింద జనులు చిటికెలోన చస్తుంటే
పడుచు గుండె మండిపోయి ఆ బండిని అంటిస్తే
అన్నారో మంత్రిగారు 'లక్ష విలువ ఈ శకటం
చేజేతుల నుసి చేసిరి ప్రజా ధనం నాశనం'
నిజమే ఈ బొపోసనలో ప్రతి మంత్రీ ఘనాపాటి
బస్సు లెన్ని వెల కలిపిన ఒక్క మంత్రి మేత సాటి!

★

అయినా అనుకున్నంతగ చేదుకాదు స్టాటిస్టిక్సు
అప్పుడప్పు డందులోంచి పైకి తన్ను తీపి విట్సు
తెలుగు సీమలో ఇరవై వేల గుళ్లు ఉన్నాయిష
గుడికి వెయ్యి మెట్ల లెక్క సగటు మీద అనుకున్నా
మెట్టుకి ఓ సంసారం సర్దుకున్న అదే చాలు
అద్దె కొంప వెదుకు బాధ ఆంధ్రుల కింకెందుకు!

సీరియల్

స్వప్నసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

5

వారం రోజుల అనంతరం—

స్వప్న నర్సింగ్‌హోమ్ గదిలో కిటికీ దగ్గరగా నిలబడి వుంది. చేతులు కిటికీ కమ్మీలని పట్టుకుని వున్నాయి। స్వప్న చూపులు తదేకంగా, గేటువైపు చూస్తున్నాయి. నర్సింగ్‌హోం ఆవరణలోకి రకరకాల కారులు వచ్చి వెళ్తున్నాయి। స్వప్న చూపులు నర్సింగ్‌హోమ్ ఆవరణలో గేటుపక్కనే వున్న పెద్ద రావిచెట్టువైపు నిల్చినాయి। దాని క్రింద యెండిన ఆకులు విపరీతంగా రాలి పడివున్నాయి। చూస్తుండగానే గాలి విసురుగా వచ్చింది। ఆకులు చెల్లాచెదురుగా లేచి దూరంగా వెళ్ళి పడినాయి। కొన్ని ఆకులు గుండ్రంగా లేచినాయి। వెళ్ళి గోడబైట తలో దిక్కునా పడినాయి। స్వప్న వాటినే చూస్తోంది। అంతక్రితంవరకూ, అన్నీ కలిసి ఒక్కచోటున వున్నాయి। మరు నిము షంలో ఒకదాని వునికిని మరొకటి తెలుసుకోలేనంత దూరంగా, చెల్లాచెదురయి పోయినాయి।

"స్వప్నా!" మేనమామ పిలుపు వినిపించింది. పరధ్యాసగా నిలబడిన స్వప్న వెనక్కు తిరిగి చూసింది। లక్ష్మీరంజనంగారు గదిలోకి వచ్చాడు.

ఆయన ముఖం ఉదయంనుంచి ఎండలో, విశ్రాంతి లేకుండా తిరుగుతున్న వాడిలా, అలసిపోయినట్టుగా వుంది.

"మన ప్రయాణానికి అన్ని యేర్పాట్లూ అయినాయి! ఇల్లు ఖాళీచేసి అప్పగించి వచ్చాను. సామాను సంచీలో కుట్టి లారీకి బుక్‌చేసి వచ్చాను" ఆయన కూజాదగ్గరకి వెళ్ళి గ్లాసులో నీళ్ల ఒంపుకుంటూ అన్నారు.

స్వప్న మౌనంగా వింది!

అయిపోయింది! వున్న ఆ యిల్లు అనే ఆధారం ఒక్కటీ, వీళ్ళు తన ప్రాణాలు తోడి, ఆ నీడకూడా లేకుండా వూడబెరికేసారు!

స్వప్నకి కాస్త స్వస్థత చిక్కినప్పటినుంచీ ఆయన యిదే గొడవ!

"నువ్వు యీ వూళ్ళో ఒంటరిగా వుండటానికి వీలులేదు. మన వూరు వెళ్దాం. రా!" అని మొదలుపెట్టాడు.

స్వప్న రానని తిరస్కరించింది.

"రావా! రాకుండా ఒక్కదానివీ యిక్కడ వుండి ఏం చేస్తావు?"

"నాకెలా వ్రాసిపెట్టివుంటే అలా జరుగుతుంది! నన్ను పదిసార్లు ఈ మాటతో తర్కించవద్దు."

కానీ మామయ్య అఖండుడు! అప్పటికి యింకేం తర్కించలేదు! తను బలవంత పెట్టిన నెపం తనమీద వుంచుకోలేదు! డాక్టర్‌గారిచేత, సుధీర్‌చేత చెప్పించాడు. స్వప్న వూరు వెళ్ళటానికి యిష్టపడటం లేదని తెలిసి, డాక్టరుగారు అన్నారు "మీ మామయ్య నాకు అంతా చెప్పారు. నీ పరిస్థితులు, పంతాలకి, పట్టింపులకిపోయేవి కావు! స్వప్నా! ఆడపిల్లవి! సిటీలో ఒంటరిగా వుండటం ఏమాత్రం మంచిదికాదు! నీ మేలు కోరే చెబుతున్నాం! నువ్వు వినాలి!"

"అదికాదు డాక్టర్! కానీ—"

"నువ్వు యింకేం చెప్పవద్దు! నువ్వు ఆరోగ్యం చక్కబడేవరకూ మీ మామయ్యదగ్గర వుండాలి. తప్పదు."

స్వప్న నిస్సహాయంగా చూసింది?

ఆ సాయంత్రం సుధీర్ వచ్చాడు. అతనుకూడా యిదే ప్రసంగం ఎత్తాడు.

"నువ్వు ఒంటరిగా వుండడం అనేది సమస్యకాదు! ఆ యింట్లో వున్నన్ని రోజులూ నువ్వు కోలుకోలేవు! మీ అమ్మ జ్ఞాపకాలు నిన్ను మరింత కృంగదీస్తాయి! అందుకే, ఆ యిల్లు ఖాళీ చేసేస్తున్నామని, నువ్వు మీ మామయ్యతో వూరు వెళ్తున్నావని చెప్పాను. ఆ యిల్లు యీ ఫస్టునుంచి యింకోరికి అద్దెకి యిచ్చేసారు. సోమవారం నాడు బాగుందని మీ మామయ్య అంటున్నారు. ఆ రోజే నీ కోసం టికెట్లు బుక్ చేయించాను!"

అంతవరకూ, ముఖం పక్కకు తిప్పుకుని, మౌనంగా, తన కిష్టంలేని యీ హితవచనాలన్నీ బలవంతంగా దిగమింగుతున్నట్టుగా వున్న స్వప్న ఒక్కసారిగా? యిటు చూసి, ఆగ్రహం ఆపుకోలేనిదానిలా అంది. "ఇల్లు ఖాళీ చేసేస్తామని చెప్పారా,

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నగురించి ఆలోచనలలో ఉండగానే మరదలు విమల బర్త్‌డే పార్టీకి పిలిచింది సుధీర్‌ను. స్వప్నకు సీరియస్‌గా ఉందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. హాస్పిటల్‌లో ఉండటం ఇష్టంలేకపోయినాఅనారోగ్యం వల్ల ఉండక తప్పలేదు స్వప్నకు. సుధీర్ సహాయం వద్దనుకొని కూడా పొందవలసే వస్తోంది.

ఎందుకు చెప్పారు? ఎవరినడిగి చెప్పారు? అసలు నా విషయాల్లో కల్పించుకోవటానికి మీరెవరు? నామీద యీ పెత్తనం మీకెవరిచ్చారు?"

స్వప్న తీక్షణస్వరంతో, నిలదీస్తున్నట్టుగా అంటున్న యీ మాటలకి, అతను క్షణంసేపు జవాబు చెప్పలేనట్టు చూసాడు.

లక్ష్మీరంజనంగారు చప్పున కల్పించుకుంటూ అన్నారు. "స్వప్నా? ఏమిటా మాటలు? సుధీర్, నేనూ, బాగా ఆలోచించే, నీ మంచికోరే యీ పని చేసాం!"

"మంచి! ఏమిటా మంచి? మీరు నా మంచి కోరేవారయినట్టయితే, నా బాధేమిటో ఆలోచిస్తే, యీ పని చేసేవారు కానేకాదు? నన్ను—నన్ను—అప్పుడేమో—చావనీయకుండా చేసారు! ఇప్పుడేమో—బ్రతకనీయకుండా చంపుతున్నారు!" స్వప్నకి ఏడుపు ముంచుకు వచ్చేసింది!

ఈ డాక్టర్‌గారికి, యీ సుధీర్‌కి తన బాధేమిటో ఎలా తెలుస్తుంది? తన తల్లిని యింట్లోంచి వెళ్ళగొట్టిన మేనత్తదగ్గర తను మళ్ళీ వెళ్ళివుండాలిట! ఛీ-ఛీ! అంతకంటే చావటం నయం! వీళ్ళకేం చెబుతారు! అత్తయ్యకి అసలే తనంటే విలువలేదు! మామయ్య ఆపేక్షగా చూస్తాడని కోపం! అందులో యీ పరిస్థితుల్లో వెళితే యింకేమైనా వుందా! ఆవిడ నోటి ధాటి వీళ్ళకేం తెలుసు!

స్వప్నకి- వీళ్ళ అభిప్రాయాలకి ఎదురుతిరగాలని, తన భవిష్యత్తు గురించి తనకు తానుగా ఒక నిర్ణయం చేసుకోవాలని ఎంతగానో వుంది! కానీ, యీ నిస్సత్తువలో, ఆ నిర్ణయం ఎలాటిదయితే బాగుంటుందో తోచటంలేదు!

చివరకి స్వప్న యిష్టా యిష్టాలతో నిమిత్తం లేకుండా వూరు వెళ్ళే నిర్ణయం జరిగిపోయింది! యిల్లు ఖాళీ చేసేసారు, సామాను లారీకి పంపేసారు!

స్వప్న నిట్టూర్పు విడుస్తూ కిటికీ దగ్గరనుండి తిరిగి వచ్చింది.

"మామయ్యా! మరి డాక్టరుగారి బిల్లు?" అంది మంచంమీద కూర్చుంటూ.

"అదా! అదంతా సుధీర్ చూసుకుంటాడు!"

ఈ మాట వినగానే, స్వప్న ముఖంలో చిరాకు తొంగి చూసింది.

"ఇదికూడా గురుదక్షిణ క్రిందే జమ వ్రాసుకున్నావా?"

ఆయన ముఖంలో చిరునవ్వు మెదిలింది.

"నిజం చెప్పాలంటే, అతను యింత యిచ్చినా ఆ గురుదక్షిణ తీరనేతీరదు. ఇది నేను అన్నమాట కాదు. అతను చెప్పినమాట!"

స్వప్న మెడలో గొలుసు తీసింది! "ఇది అమ్మెయ్యి మామయ్యా! ఖర్చులకి వుంటుంది. అతనికి యివ్వాల్సినది లెఖ్ఖచూసి యిచ్చెయ్యి."

"సుధీర్ తీసుకుంటాడనే అనుకుంటున్నావా?"

లక్ష్మీరంజనంగారు ఆ రోజు వుదయమే, తెలిసినతనిద్వారా, వడ్డీకి అప్పు తెచ్చి, సుధీర్‌చేతికి కొంత డబ్బు యివ్వబోయాడు. కానీ అతను తీసుకోలేదు. ఆ డబ్బు ఆయన జేబులో పెట్టేస్తూ "నేను ఖర్చుపెట్టింది చాలా తక్కువ! దీన్ని మీరు పెద్ద ఋణంగా భావించకండి మాస్టారూ! మీరు చూసారుగా! డాక్టరుగారు నా క్లయింట్! వైద్యానికి ఆయనేం ఛార్జీ చేయలేదు. నేను యిచ్చింది కేవలం మందులకి, రూమ్‌కి మాత్రమే! ఇవిగో ట్రెయిన్‌కి టికెట్స్. బుక్‌చేయించి తెప్పించాను." అంటూ జేబులోనుంచి తీసియిచ్చాడు.

"స్వప్నకి నాతో వూరు రావడం యిష్టమేలేదు." అన్నారాయన బాధగా.

"రెండు రోజులు అక్కడుంటే, తనకే అలవాటు అవుతుంది లెండి" అన్నాడతను.

ట్రెయిన్‌కి టైమ్ అయింది! లక్ష్మీరంజనంగారు ఆటో తెచ్చారు. స్వప్నకి నర్సింగ్ హోమ్‌లోనుండి బైటకి వస్తుంటే, తనకి యీ ప్రపంచంలో తలదాచుకోవటానికి కూడా నీడలేనట్లుగా అనిపించసాగింది! కానీ, చిత్రంగా-స్వప్నకి ఏమాత్రం భయం వేయటంలేదు! తను యీ జీవితం వద్దనే అనుకుంది! అంతం చేసుకోవటానికి ఆత్మహత్య నిర్ణయించుకుంది! కానీ, జీవితం మృత్యువుని యెదిరించి, ఓడించి తనని దక్కించుకుంది! తను యిప్పుడు జీవితం చేతిలో బందీ! ఎలాచెబితే అలా వినాలి! తప్పదు!

ఇద్దరూ స్టేషన్‌కి వచ్చారు. రైలు అప్పటికే ప్లాట్‌ఫారంమీద సిద్ధంగావుంది! లక్ష్మీరంజనంగారు, స్వప్నని రైలులో కూర్చోబెట్టి యెవరికోసమో, ఎదురు చూస్తున్నట్టు క్రింద నిలబడివున్నారు. రైలు కదలబోతున్నానని హెచ్చరిక చేస్తున్నట్టుగా కూతవేసింది. ఆయన పెట్టెలోకి యెక్కివచ్చి స్వప్న పక్కన

'ప్రేమ సింహాసనం'

నవలా రచయిత్రి

ఆంధ్ర పాఠకుల ఆదరాభిమానాల

విజేత

శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి

రాష్ట్ర సాహిత్య అకాడెమీ నుండి

ఉత్తమ నవలా రచయిత్రిగా అవార్డు స్వీకరించిన సందర్భంలో

మా అభినందనలు

—ఎడిటర్, జ్యోతి

కూర్చున్నారు. ఇంతలో సుధీర్ వచ్చాడు. అతన్ని చూడగానే ఆయన ముఖం చాటంత అయింది.

"సుధీర్! వచ్చావా! టైమయిపోతుంటే, నువ్విక రావేమో నీకు చెప్పకుండా వెళ్ళిపోవాల్సి వస్తుందనే అనుకున్నాను."

"బైలుదేరబోతుంటే, ఎవరో వచ్చారు. ఇదుగో! అమ్మ మీకు యిమ్మని యిచ్చింది" అంటూ స్వీట్ పాకెట్ అందించాడు.

"అమ్మగారిని అడిగానని చెప్పు" తీసుకుంటూ అన్నారాయన.

సుధీర్ కళ్లు క్షణంసేపు, స్వప్న ముఖంమీదనే తదేకంగా నిల్చినాయి! స్వప్న అతన్ని గమనించనట్టే తలదించి బాగ్‌లో ఏదో వెతుకుతోంది!, ఆ క్షణంలో స్వప్నని చూస్తుంటే, అతనికి చాలా జాలి కలిగింది! ఆ అమ్మాయికి మేనమామ యింటికి వెళ్ళటం ఏమాత్రం యిష్టంలేదని తెలుసు! ఒకవిధంగా, బలవంతంగా, నిస్సహాయంగా వెళుతోందనే చెప్పాలి! ఆక్షణంలో అతనికి, "స్వప్నా! నీకు అక్కడ ఏదయినా మరీ బాధలాటిది కలిగితే, నా దగ్గరికి వచ్చెయ్యి నేను నీకు ఏదో ఒకమార్గం చూపించ లేకపోను!" అని చెప్పాలని యెంతగానో అనిపించింది! కానీ చెప్పలేకపోయాడు.

రైలు మళ్ళీ కూతవేసింది! కదిలింది!

"వస్తాను సుధీర్" అన్నాడు లక్ష్మీరంజనంగారు.

"ఉంటాను మాస్టారు."

కదిలిన రైలుతోపాటు రెండడుగులు వేస్తూ అన్నాడు. స్వప్న హఠాత్తుగా కిటికీలోంచి అతనివైపు చెయి చాచింది. స్వప్న చేతిలో చిన్న కవరువుంది! అది అతనికి అందిస్తోంది!

సుధీర్ గభాల్నా దాన్ని అందుకున్నాడు.

రైలు వేగం పుంజుకుని వెళ్ళిపోయింది!

సుధీర్ క్షణంసేపు విచిత్రంగా తన చేతిలోవున్న కవరువైపే చూస్తూ నిలబడ్డాడు!

ఏముంది యీ కవరులో? స్వప్న కృతజ్ఞతలు తెలియచేస్తూ వ్రాసిన వుత్తరమా? అతను కుతూహలంగా కవరు చింపిచూసాడు!

అందులోనుంచి మిలమిలలాడుతున్న ఒంటిపేట గొలుసు జారి అతని అర చేతిలో పడింది! అతను దాన్ని చూడగానే తెల్లబోయాడు. కవరులో చిన్న కాగితం కూడా వుంది! అందులో యిలా వుంది.

"మామయ్యకి గురుదక్షిణ పేరుతో, మీరు మాకు సాయంచేస్తున్నా మీకు ఋణపడడం నా కిష్టంలేదు! ఇప్పటివరకూ నా కోసం ఖర్చుపెట్టిన దానికి యిది సరి పోతుందనే భావిస్తున్నాను! దయయుంచి, యికముందెప్పుడూ, నా విషయంలో జోక్యం కలుగచేసుకోవద్దు! నన్ను యాచకురాలిని చేయవద్దు! స్వప్న."

అతను రెండుమూడుసార్లు ఆ వాక్యాలు చదివాడు! ఒక్కనిముషం ఆ గొలుసు వైపు చూసాడు! తర్వాత, దాన్ని స్వప్న వ్రాసిన చీటీలో భద్రంగాకట్టి జేబులో వేసుకుని బైటికి నడిచాడు.

స్టేషన్ దాటి బైటకి వస్తుంటే అతని చెవుల్లో స్వప్న కంఠం మారుమోగు తోంది. "అసలు నా విషయాల్లో కల్పించుకోవటానికి మీరెవరు? నామీద ఈ పెత్తనం మీకెవరు యిచ్చారు?" ఆ మాటల్లో ఆగ్రహమే అతనికి మరీమరీ గుర్తుకొస్తోంది!

బైట పార్కింగ్‌లో నిలిపివుంచిన కారు దగ్గరకెళ్ళి, డోర్ తెరిచి కూర్చుని స్టార్ట్ చేసాడు! అతనికి యిప్పుడప్పుడే యింటికి వెళ్ళాలనిపించలేదు! టేప్ ఆన్ చేసాడు! మృదుమధురంగా వున్న వాయిద్యగోష్టి వినిపించసాగింది! డ్రైవ్‌చేస్తున్న అతను అప్రయత్నంగా జేబు తడుముకున్నాడు! అతని చేతికి గొలుసు తగిలింది! స్వప్న మెడని కౌగలించుకుని వుండే, గొలుసు, యిప్పుడు తన గుండెలని తాకుతూ, జేబులో దాక్కుని వుంది! అతనికి ఆ భావన గమత్‌గా అనిపించింది.

6

ఇంటిముందు బండి ఆగడం చూడగానే, చేస్తున్న పని వదిలి నాంచారమ్మ తొంగిచూసింది! బండిలోనుంచి దిగిన లక్ష్మీరంజనంగారు, చేయి అందించి, మేన కోడలిని దింపుతున్నాడు.



స్వప్నని చూడగానే ఆవిడ నిర్ఘాంతపోయింది! తను ఆయనకి వెళ్ళేటప్పుడు లక్షచెప్పి పంపించింది! తను చెప్పినవన్నీ యిక్కడే గాలికి వదిలేసి, ఆయన దాన్ని వెంటబెట్టుకు రానేవచ్చాడు!

నాంచారమ్మకి ఒళ్ళు మండిపోయింది! స్వప్నకి ఎదురు వెళ్ళలేదు. పలకరించ లేదు! చేతిలో బియ్యం ఏరుతూ కూర్చునివుంది!

లక్ష్మీరంజనంగారే లోపలికి వచ్చి, గ్లాసులో మంచినీళ్ళు తీసుకువెళ్ళి మేన కోడలికి యిచ్చివచ్చారు.

మంచం వాల్చి, దుప్పటివేసి, దిండుతెచ్చి వేస్తూ, "చాలా అలసటగా వుందామ్మా! కాసేపు పడుకో! ఒక్క నిముషంలో కాఫీ తెప్పించి యిస్తాను" అన్నారు.

స్వప్న మాట్లాడలేదు. బండిలోనుంచి దిగగానే, మేనత్త ఎదురువచ్చి, ఆప్యాయంగా ఒక్క మాట మాట్లాడకపోగా, చురచురా చూసి, తల తిప్పికోవడంచూసి, చాలా బాధకలిగింది! రోషపడి, ఆవేశంగా, వెనక్కి తిరిగి వెళ్ళిపో అని అరుస్తున్న మనసుని అదుపులోకి తెచ్చుకుంటూ మామయ్య 'రామ్మా రా' అంటూంటే లోపలకి వచ్చింది! మేనత్త ప్రవర్తన తను వూహించినట్టే ఎదురయింది. ఇందులో వింతేం లేదు!

స్వప్న మంచంమీద కూర్చుంది! లోపలినుంచి భార్యాభర్తల ఘర్షణ వినిపిస్తూనే వుంది!

"నేను మీకు అంత గట్టిగా చెప్పి పంపిస్తే, మళ్ళీ దాన్ని వెంటేసుకువచ్చారేమిటి" అంటూ నిలదీసింది.

"నేను అవన్నీ తర్వాత చెబుతాగానీ, నువ్వు ముందు కాస్త కాఫీ యివ్వు" అన్నారాయన.

"ఆ చెప్పేదేదో యిప్పుడే చెప్పి ఏడవచ్చుగా!"

"అబ్బబ్బా! నీ ధోరణి నీదేకదా!" లక్ష్మీరంజనంగారు స్వప్న యెలా చావు బ్రతుకులయిందీ హృదయవిదారకంగా వర్ణించి చెప్పారు. కానీ, ఆ కరుణగాథ, ఆవిడ హృదయాన్నేమీ కరిగించలేదు. "చాల్లెండి! మీ కాశీమజిలీ కథలు నా దగ్గర చెబుతారేం! దాన్ని యింటికి తీసుకురావటానికి యిదొక ఎత్తు!" అంది.

"రామ! రామ! ఆ శ్రీరాముడి మీద ఒట్టు!" అన్నారాయన.

"చాల్లే వూరుకోండి! మీరు వూరినుంచిరావటం ఆలస్యం అయితే యిలాటిదేదో నిర్వాకం చేస్తారని నేను అనుకుంటూనే వున్నా. కానీ సంపాయించటం రాదుగానీ, వూరిలో వున్నవన్నీ నెత్తిన వేసుకోవటం బాగా వచ్చు. వూరంతా దానికథ తెలిసి పోయిం తర్వాత ఆ ఖూనీకోరుని మనం యింట్లో వుంచుకోవడం ఎలా?"

"ఇదుగో! ఇప్పటికేం గొడవ చెయ్యకు! నీకు పుణ్యం వుంటుంది! నాలుగు రోజులు ఓపిక పట్టు, నేనేదో మార్గం చూసి దాన్ని పంపించేస్తానుగా!" ఆయన కంఠం తగ్గించి బ్రతిమలాడారు.

"ఉద్ధరిస్తారు! ఇదుగో ఇప్పుడే చెబుతున్నాను. దాన్ని ఆ వాకిటగదిలోనే పడి వుండమనండి! యింట్లోకి రావటానికి వీల్లేదు! తెలిసిందా?"

ఇంతలో 'అమ్మగారూ!' అని వినిపించింది.

నాంచారమ్మ తాత్కాలికంగా భర్తమీద కేకలు ఆపి, వాకిట్లోకి వెళ్ళింది. అక్కడ నల్లటి కుర్రాడు, చేతిలో పెరుగుగిన్నె పట్టుకుని నిలబడ్డాడు.

"అమ్మ యిచ్చి రమ్మన్నదండీ!"

ఆవిడ పెరుగు గిన్నె అందుకుని దాన్ని అటూ, యిటూ కదిపి చూసింది.

"ఏరా! ఈ నీళ్ళపెరుగు పంపకపోతే ఎవరు ఏడ్చారు! మీకేమో, ఓ అంటే న రాదు. పంతులుగారికేమో మీతో అరిచి, అరిచి గొంతంతా పోతుంది. అన్ని గేదెల పాడి పెట్టుకుని, మాకు కాస్త పెరుగుపోయాలంటే ఏడ్చి ఛస్తారు. చదువులేమో తేరగా రావాలి. మీకు పొలంలో దోసకాయలు కాస్తాయిగా! ఏం బండీమీద పోసుకుని తీసుకెళ్ళి సంతలో అమ్ముకుని, డబ్బు చేసుకోవటం తెలుసుగానీ, పంతులుగారికి నాలుగు కాయలు పప్పులోకి పంపిద్దామని తెలియదన్నమాట. యివన్నీ అడుగుతామని మీ అమ్మ రాకుండా, పెరుగు నీతో పంపించింది. అవునా?"

కుర్రాడు బిక్కముఖం వేయటం మినహా జవాబు చెప్పలేకపోయాడు!

ఆవిడ నోరు ఒక్క క్షణం వూరుకోదు. లక్ష్మీరంజనంగారు పాఠాలు బోధించినా, ఆవిడ వాగ్ధాటికి వూరిలోవారంతా ఆవిడనే పంతులమ్మగారు అంటారు. పంతులుగారు ఆవిడకి ఎదురు చెప్పలేరని, యింట్లో ఆవిడ మాట నిరాటంకంగా చెలాయించు

కుంటుందనీ అందరికీ తెలుసు! కానీ, ఎలాటి ఆకతాయి వెధవలకైనా, ఎలాటి మొద్దు బుర్రలకైనా పంతులుగారు చక్కగా చదువు నేర్పగలరు. అందుకే, ఆయన దగ్గరకి పిల్లల్ని పంపాలనుకునేవారందరూ, ఆవిడ ధాష్టికం కిమ్మనకుండా భరిస్తారు.

ఆవిడ కాఫీ తయారుచేసి గ్లాసులో పోసి అక్కడపెట్టి భర్తని కేక పెట్టి పిల్చింది.

"ఇదుగో! దానికిచ్చిరా! కాఫీ తాగిన తర్వాత గ్లాసు అటునుంచివచ్చి కడుక్కు తీసుకుని వెళ్ళాలని చెప్పు" ఆవిడ ఒకరి యింటికెప్పుడూ వెళ్ళదు. బంధువు లెవరయినా తన యింటికి రావటం అసలు యిష్టం వుండదు. అందువల్ల తన మాటల వల్ల ఎవరికైనా బాధ కలుగుతుందేమోననే వెరపు ఆమెకి లేదు. భార్య స్వభావానికి ఆయన పూర్తిగా విరుద్ధం. లక్ష్మీరంజనంగారు బంధుప్రీతిగల మనిషి! తను అందరి యిళ్ళకీ వెళ్ళి ఆత్మీయంగా, వారి యోగక్షేమాలు కనుక్కుంటాడు. ఎవరికైనా ఆపద వస్తే ముందువెళ్ళి నిలబడి తను ఆదుకోవాలని తాపత్రయపడతాడు. అలాగే, అందరూ తనని గౌరవించాలని, తన యింటికి రావాలని కోరుకుంటాడు. అయన మంచితనం

మినీకథ

లక్కీ నెంబర్

రామారావుకి లక్కీ నెంబరుమీద గురెక్కువ. ఆ సంగతి పసిగట్టిన అతని శ్రీమతి, ఆ వీక్‌నెస్ నెలాగైనా ఉపయోగించుకోవాలని నిశ్చయించుకుంది.

మొదటి తారీఖున జీతాలందగానే సరదాగా చీర కొనిద్దామని భార్యను షాపుకు తీసుకెళ్ళాడు రామారావు. ఆవిడకు రెండు చీరలు నచ్చాయి. కాని ఎలా? "ఏమండీ, నా లక్కీనెంబరు రెండండీ! రెండు చీరలు తీసుకుందాం" అంది ముద్దుగా. రామారావు ఒక్కక్షణం బిత్తరపోయి "దాందేముంది డార్లింగ్ .... చిన్న ఎడ్జెస్ట్‌మెంట్ చేస్తే సరిపోతుంది. ఈ చీరే రెండోసారి వచ్చినపుడు తీసుకుందాంలే...." అని బయటకు నడిచాడు.

అలాగే రెండోసారి షాపుకి వచ్చింతర్వాత మళ్ళీ అలాగే అంది ముద్దుగా.... రామారావు యీసారి ఎక్కువసేపు ఆలోచించలేదు. పర్సు జేబులో పెట్టేసుకున్నాడు. "మర్చేపోయాను డార్లింగ్....నా లక్కీ నెంబరు ఒకటే .... మొదటిసారి వచ్చినపుడే తీసుకోవాల్సింది—" అన్నాడు నెమ్మదిగా బయటికి నడుస్తూ.

—యనమండ్ర రామకృష్ణ

మీకు తెలుసా?

వ్యాపారదృష్టిలేని ఏకైక పుస్తక ప్రచురణ సంస్థ "నేషనల్ బుక్ ట్రస్ట్." ఆంధ్రుల అభిమానానికీ, అభిరుచికీ తగిన అనేక ఉత్తమ పుస్తకాలు ప్రచురించింది. కథా సంపుటాలు, నవలలు, యాత్రావర్ణనలు, విజ్ఞాన గ్రంథాలు, జానపదసాహిత్యం, బాల సాహిత్యం —ఈ క్రింది రచయితలు మాటలు పొదిగి రూపం దిద్దారు.

క్రొవ్విడి లక్ష్మణ
ఎన్. ఆర్. చందూర్
కొత్తపల్లి వీరభద్రరావు
వేమరాజు భానుమూర్తి
డా॥ గాలి బాల సుందరరావు
డా॥ అయ్యగారి వీరభద్రరావు
చాగంటి గోపాలకృష్ణమూర్తి

జి. వి. కృష్ణారావు
వాడ్రేవు పతంజలి
దేవులపల్లి ప్రభాకరరావు
చెఱుకుమిల్లి భాస్కరరావు
తిరుమలశెట్టి శ్రీరాములు
పోకూరి శ్రీరాములు
గోవాడ సత్యారావు
తంగిరాల రామచంద్రరావు

పుస్తకాలు దొరుకుచోట్లు

ఎన్. బి. టి. బుక్ సెంటర్
సిటీ సెంట్రలు లైబ్రరీ
అశోక నగరు
హైదరాబాదు 500 020

నవోదయ ప్రచురణలు
విజయవాడ—గుంటూరు

ఎ. పి. బి. డి.
హైదరాబాదు, మద్రాసు,
మచిలీపట్నం.

విశాలాంధ్ర పబ్లిషింగు హౌసు
హైదరాబాదు, విశాఖపట్నం,
అనంతపురం, తిరుపతి,
గుంటూరు, వరంగల్లు.

మీద గౌరవంతో యింటికి వచ్చిన బంధువులందరూ, ఆవిడ నోటిధాటికి ఆగలేక వెంటనే పారిపోతూ వుంటారు.

లక్ష్మీరంజనంగారు కాఫీగ్లాసు తీసుకుని స్వప్న వున్న గదిలోకి వచ్చారు. స్వప్న మంచంమీద కూర్చుని వుంది. ముఖం పాలిపోయి వుంది. కళ్ళల్లో సుళ్ళు తిరుగుతున్న నీళ్ళు బిగబట్టుకోవటానికి విశ్వప్రయత్నం చేస్తోంది.

"స్వప్నా! కాఫీ తాగమ్మా!" అన్నారాయన.

"వద్దు మామయ్యా!"

ఆయన భార్య వాగుడంతా స్వప్న విన్నదని గ్రహించారు. ఆ క్షణంలో స్వప్నని చూస్తూంటే ఆయనకి అపరిమితమైన జాలి కలిగింది. తను స్వప్నని అలా బలవంతంగా యింటికి తీసుకు రావటం పొరపాటు చేసానేమోననే శంక కలిగింది. కానీ తమాయించుకున్నారు. తనే యిలా ఆలోచిస్తే స్వప్న యింకా బెంబేలుపడి పోతుంది అనుకున్నారు.

"మీ అత్తయ్య సంగతి నీకు తెలియందేముందమ్మా!" ఆయన స్వప్న దగ్గరకు వచ్చి తలమీద చేయివేసి చెప్పారు. "స్వప్నా! ఒక్క మాట నువ్వు బాగా జ్ఞాపకం పెట్టుకో! నువ్వు నాకోసం యీ యింటికి వచ్చావు. నా మేనకోడలుగా, నీకు యీ యింట్లో వుండటానికి అన్ని అధికారాలూ వున్నాయి. మీ అత్తయ్య ఏదో అంటే పట్టించుకోవాల్సిన అవసరం నీకు లేదు!"

స్వప్న చేతిలో ముఖం దించుకుని నిశ్శబ్దంగా ఏడవసాగింది.

'నువ్వు యిలా భీరువు అయినకొద్దీ, మీ అత్తయ్యకి మరింత అలుసు అవుతావు. నువ్వు ధైర్యంగా వుండాలి స్వప్నా! నీ జీవితం అందరి ఆడపిల్లల్లాటిది కాదు! నీకు మొండితనం, ధైర్యం, చాలా అవసరం."

స్వప్న కళ్లు తుడుచుకుంది.

"నిజమే మామయ్యా! నువ్వన్న మాటలు ఎంతో నిజం. నా జీవితం అందరి ఆడపిల్లల్లాటిది కాదు. కానీ....కానీ....ఏ ఆడపిల్లకీ యిలాటి జీవితం వద్దు." చివరి మాటలు అంటుంటే స్వప్న కంఠం వణికింది.

"ఇక్కడ కాఫీ చల్లారిపోతుంది. అవలేదా మీ గుసగుసలు?" నాంచారమ్మ వంటింట్లోంచి అరిచింది.

"ఇదుగో, వస్తున్నా!" ఆ కంఠం వినగానే ఆయన వెంటనే వెళ్ళిపోతూ 'కాఫీ తాగు స్వప్నా, చల్లారిపోతుంది' అని హెచ్చరించి వెళ్లారు.

స్వప్నకి మేనమామ మాటలే మళ్ళీ గుర్తుకు వచ్చినాయి. "నువ్వు యిలా భీరువు అయినకొద్దీ మీ అత్తయ్యకి మరింత అలుసు అవుతావు. నువ్వు ధైర్యంగా వుండాలి."

స్వప్న కాఫీగ్లాసు తీసుకుని మెల్లగా తాగసాగింది. (సశేషం)

శ్రీనివాసా
క్లాత్ ఎంపోరియం

ఫోన్స్
హెడ్డాఫీస్: 409
నివాసం: 755
బ్రాంచి: 355

హోల్ సేల్ & రిటైల్ కట్ పీసెస్ క్లాత్ మర్చంట్స్

మేనేజింగ్ పార్టనర్: కబ్బాల అప్పారావు



హెడ్ ఆఫీస్:
భీమవరం-2

బ్రాంచి
ముస్లింవారి వీధి,
అమలాపురం.

చౌకధరలకు
నాణ్యమైన బట్టలు.

వివాహాది
శుభకార్యములకు,
రోజువారి వాడుకకు
అన్నిరకముల
మిల్లువస్త్రములు
సరసమైన
మిల్లుధరలకు
టోకుగాను,
చిల్లరగాను
లభించును.

మా
షోరూం
సందర్శించండి!

ఆదివిష్ణు నాటిక



[తెర తొలిగింది. అదొక హోటల్. లాంజ్ కనుపిస్తోంది. లాంజ్ కెదురుగా రెండే గదులున్నాయి. ప్రేక్షకులకు కుడివైపున్న గది నెంబరు నూట ఒకటి. ఎడంవేపున్న గది నెంబరు నూటరెండు. నెంబరు ప్లేట్లు ఆ యా గదులకు తగిలించబడి వున్నాయి.

ఈ రెండు గదులే ప్రేక్షకులకు కనిపిస్తాయి. నెంబరు నూటఒకటి ప్రక్కనే మేడమెట్లు

ఇందులోని పాత్రలు

రాంబాబు	:	మేధావి. కుర్రతనం జాస్తి.
అప్పారావు	:	ఇంటి పేరు నిప్పు. పోలీసు కానిస్టేబిల్.
దీనబంధు	:	ఇది బిరుదు. ప్రజానాయకుడు.
ప్లీడరు	:	పేరు తెలీదు. అందరూ దేవుడి ప్లీడరంటారు.
మాలీషు	:	పేరు లేదు. వళ్ళు పట్టడం వృత్తి.
శంకరం	:	పూర్తి పేరు భవానీ శంకరం. కొత్తగా పెళ్ళిచేసుకున్నాడు.
ధనకోటి	:	ఇంకేం ఫేక్టరీ ఓనరు!
బోయ్	:	హోటళ్ళలో దొరుకుతాడు.
సుగుణ	:	శంకరం భార్య. ఈ వివరం చాలు!

న్నాయి. ఆ మెట్లెక్కిపైకి వెళ్ళవచ్చు. ఆ మెట్లమీద **Way to Rooms 80 to 90** అనే బోర్డుంది. అట్లాగే నెంబరు నూటరెండు పక్కనే వున్న మెట్లుమీద **Way to Rooms 91 to 100** అనే బోర్డుంది.
లాంజ్‌లో అయిదారు కుర్చీలూ + ఒక టీపాయి వున్నాయి. రాంబాబు నిలబడి వున్నాడు! అతను చాలా ట్రిమ్ముగా వున్నాడు. అతని చేతిలో ఒక వస్తువుంది. అతను ప్రేక్షకుల నుద్దేశించి అంటున్నాడు]

రాంబాబు: అందరికీ వందనాలు. ఇండియాలో అడుగుపెట్టి రెండురోజులయింది. ఈ హోటల్లో దిగి అరగంట గడిచింది. ఈ దేశం వదిలి ఆస్ట్రేలియాలో నాలు గేళ్ళున్నాను. పై చదువులకోసం వెళ్ళే నక్కడికి. అక్కడ నేనేం చదువు కున్నానో, ఏం సాధించానో తమకి చెప్పుకోవాలని తొందరగా వుంది.అంత కంటే ముందు నేను కనిపెట్టిన 'నథింగ్ బట్ ట్రూత్'ని మీ అందరిముందు.... ఇక్కడే....ఈ హోటల్లోనే ప్రయో గించి-దాని రిజల్టేమిటో మీ ముందుంచి మీరు మెచ్చుకుంటే పొంగిపోదామని ఎంతో ఆశగా వుంది.

[బోయ్ కుడివేపు మెట్లమీంచి దిగివస్తు న్నాడు. అతన్ని చూడగానే తన చేతిలో వస్తు వుని కనపడకుండా దాచేసి మాటలాపుజేసేడు]

బోయ్: గుడ్‌మార్నింగ్ సార్!

రాంబాబు: గుడ్‌మార్నింగ్!

బోయ్: ఎవరైనా ఫ్రెండ్సుగాని రావాలా సార్?

రాం: వండ్రఫుల్! ఎట్లా కనిపెట్టేవు?

బోయ్: గది విడిచి లాంజ్‌లో తిరుగుతున్నా రంటే ఎవరికోసమో వెయిటింగ్‌లో వున్నారని ఈజీగా చెప్పచ్చు సార్!

రాం: నీది చాలా షార్ప్ బ్రెయిన్!

బోయ్: థేంక్యూ సార్....

(కులుకుతూ వెళ్ళిపోయేడు బోయ్.రాంబాబు ప్రేక్షకుల్తో అంటున్నాడు.)

రాం: నా చేతిలో వున్న ఈ వసువుని చూడండి. ప్లీజ్ హేవె గ్లాన్స్ ఎట్ దిస్! (చూపిం చేడు) పాకెట్ ట్రాన్సిస్టరులాగా వుంది కదూ? కానీ, ఇది ట్రాన్సిస్టరు కాదు. నేను కనిపెట్టిన ఇన్‌స్ట్రుమెంట్. దీనికి 'నథింగ్ బట్ ట్రూత'ని పేరు పెట్టేను. దీనివల్ల ఏం ప్రయోజనమని సహృద యులు అడగొచ్చు. అయ్ విల్ ఎక్స్ ప్లైన్. ప్రపంచంలో అబద్దం ప్రతి

గమనిక:

ఈ నాటికను మిత్రుడు నెమలికంటి రాధా కృష్ణమూర్తి (శ్రీకళానిలయం, రామచంద్ర పురం, హైదరాబాదు) కోసం రాసేను. ఇత రులు ప్రదర్శించాలనుకుంటే మూర్తికి తెలియ జేయడం మంచిది.

ప్రదర్శనకాలం గంటకి తక్కువైతే నాటి కనీ, రెండూ రెండున్నర గంటలు నడిస్తే నాటకమనీ పరిషత్పోటీ రూలు. నాటికగా రాద్దామనే కూచున్నాను. రాస్తున్నప్పుడు ఉత్సాహం ఎక్కువై గీత దాటి నాటకం పొలి మేరల్లోకి వచ్చి ఆగింది. ఇంకో సీను రాస్తే నాటకమే అయ్యేది. ఆ ప్రయత్నం ఇప్పట్లో చేయాలనిలేదు. పోటీల్లో దీన్ని నాటికగా ప్రద ర్శించాలనుకుంటే కొన్ని డైలాగులు తప్ప కుండా తీసేయాలి. నా చేతుల్తో ఆ పని చేయడం నా కిష్టంలేదు. ఆ భావం ప్రదర్శకులకే వదిలే స్తున్నాను.

పోటీల్లో గాకుండా మామూలు సందర్భాల్లో అయితే పూర్తి స్క్రిప్టుని ఆడుకోవచ్చు. కేవలం చదవడానికైతే సైంతో ఎల్లాంటి ఇబ్బందీ వుండదని నమ్ముతున్నాను.

—రచయిత.

అంగుళం రాజ్యం చేస్తోంది. నిత్య జీవితంలో ముప్పావు వంతు అబద్ధం లోనే బతుకుతున్నాం. 'సత్యం వద' అని మహర్షులు, శాస్త్రిలూ, చివరికి దేవుళ్ళు చెప్పినా వుయ్ డోంట్ కేరిట్. తాతలు దిగొచ్చినా నిజం చెప్పని ఘనా పాటీలు మన ఎరికలో ఎంతోమంది వున్నారు. వాళ్ళచేత నిజం చెప్పించ డమే దీని ప్రయోజనం. దీన్ని ఆన్ చేసి మీ జేబులో పెట్టుకోవచ్చు. పక్క వాడికి అంటించవచ్చు. మంచానికి తగి లించవచ్చు. గుమ్మానికి వేలాడదీయ వచ్చు. ఎక్కడైనా వుంచండి. మీ ఇష్టం. ఇదెక్కడుంటే అక్కడ నిజమే వినిపిస్తుంది. పచ్చి కోతల రాయుడు సైతం ఇది ప్రొడ్యూస్‌చేసే ఎలక్ట్రానిక్ రేస్‌వల్ల మనిషి ఉన్మత్తా వస్థలో పడిపోతాడు. ఎంత కాదనుకుని ఎంత గింజుకున్నా ఆ మనిషి పరమ సత్యాలే చెబుతాడు తప్ప అక్షరం అబద్ధమాడలేడు. ఇదంతా ఏదో ఫెంటా సిక్ నాన్‌సెన్సనీ, మసోటని తీసి పారేయకండి. ఇక్కడ కొత్తయినా పొరుగు దేశాల్లో ఇల్లాంటి ఇన్వెన్షన్స్ జరుగుతున్నాయని మీరు పేపర్లలో చదివే వుంటారు. ఆల్‌రైట్.... దీన్ని—

[చుట్టూతా చూసేడు. కుర్చీల్లో ఒక కుర్చీ మీద అతని దృష్టి నిలిచింది. అటువేపు తిప్పుతూ అన్నాడు]

రాం: అదుగో....ఆ కుర్చీకి తగిలిస్తాను.

[అని అక్కడికి వెడుతుండగా బోయ్ కొంత లగేజీ మోసుకొస్తూ అన్నాడు.]

బోయ్: సార్....మీరిట్లా నిలబడితే బావుండదు సార్. నమస్కారం చేయండి!

రాం: (తన ప్రయత్నానికి వాయిదా వేసి అడి గేడు) నమస్కారమా?

బోయ్: అవునుసార్! రెండు చేతులూ జోడించి నిలబడాలి.

రాం: ఎవరికి? నీకా?

బోయ్: నాక్కాదు సార్! నా వెనకొస్తున్నారు. ఆయనకి! నమస్కారాలంటే చాలా యిష్ట మాయనకి. ఆయనొచ్చేవేళకి నమస్కారం చేస్తూ కనిపిస్తే ఎంతో ఆనందిస్తారు.

రాం: (కొంచెం కోపంగా) వాట్ నాన్‌సెన్స్ యూ ఆర్ స్పీకింగ్? ఆయనెవరో ఏమిటో తెలీకుండా—

[ఆ వ్యక్తి రానేవచ్చేడు. బరువుగా ఠీవిగా నడుచుకుంటూ వచ్చి బోయ్‌తో అన్నాడు]

వ్యక్తి: నా కిచ్చిన గది నెంబరెంత నాయనా!

బోయ్: ఎయిటీవన్ సార్!

వ్యక్తి: మరిక్కడ నిలబడ్డావే?
బోయ్: వెళ్ళిపోతున్నానుసార్!

[అంటూ కుడివేపు మెట్లెక్కి వెళ్ళిపోతున్నాడు]

వ్యక్తి: (చేతులు జోడించి అన్నాడు) ఇందాక నాకు నువ్వు నమస్కారం చేసేవు కదూ? చూసుకోలేదు!

రాం: (మరింత ఆశ్చర్యంగా) నేను....మీకు?

వ్యక్తి: (నమస్కారముద్ర తొలిగించేసి అన్నాడు) వదిలెయ్. అవునూ నిన్నెక్కడో చూసిన గుర్తు?

రాం: మాది ఈ ఊరుకాదు!

వ్యక్తి: ఆ మాటకొస్తే మాదికూడా ఈ ఊరు కాదు. నిత్యం ఎన్నోవేల లక్షల ప్రజల్తో సంబంధం మాకు. ఎందర్నని గుర్తుంచుకుంటాను చెప్పు? మనిషికి ఏ శక్తి వున్నా ఏది లేకపోయినా జ్ఞాపకశక్తి మాత్రం చాలా అవసరంరా కుర్రాడా అనేవారు టంగుటూరి ప్రకాశంగారు. రాజమండ్రి జైల్లో నాతోపాటు అర్నెల్లున్నారు పంతులుగారు.

రాం: వారిగురించి విన్నాననుకోండి. మీరెందుకు జైలుకు వెళ్ళేరో....

వ్యక్తి: అంటే? నేనొకందుకూ, వారొకందుకూ వెళ్ళి అక్కడ ఇద్దరం కలుసుకున్నామని డవుటుపడుతున్నావా? పిచ్చివాడా- వారెందుకు వెళ్ళేరో నేనూ అందుకే వెళ్ళేను. జేబులు కొట్టిగానీ మేము జైళ్ళకు వెళ్ళలేదు నాయనా! దేశం.... దేశంకోసం లాఠీదెబ్బలు తిన్నాం. జైళ్ళకు వెళ్ళేం. అర్జంటుగా ఫోన్ చేయాలి. వస్తా!

[వెళ్ళబోయి ఆగి అన్నాడు]

వ్యక్తి: కంగారుపడకు. నేనెవర్నో ఏమిటో తెలుసుకోవాలనుంటే బోయ్ వస్తాడు. వాడిని అడిగి తెలుసుకో!

[వ్యక్తి తన రూమ్‌కోసం మేడ ఎక్కేడు. అతను వెళ్ళిపోయేంతవరకూ చూస్తూ నిలబడి ఆ తర్వాత ప్రేక్షకుల్తో అన్నాడు]

రాం: పానకంలో పుడక. ఈ ఇన్‌ప్రష్షన్ని పట్టించుకోవద్దు. నవ్—(కుర్చీని తాకుతూ) ఇదొక కుర్చీ. చెక్క కుర్చీ. ఈ కుర్చీకి 'నథింగ్ బట్ ట్రూత్'ని బిగిస్తున్నాను. హేవె లుక్!

[కుర్చీ కింద దాన్ని బిగించేడు]

రాం: బిగించినంత మాత్రాన సరిపోదు. యాక్షన్లో వుండాలంటే స్విచ్ ఆన్ చేయాలి. (చేసేడు) ఇటీజిన్ యాక్షన్ నవ్! ఇదిప్పుడు అఫ్టరాల్ చెక్కకుర్చీ కాదు సత్యపీఠం.

[ఎవరో వస్తున్న అలికిడి అయ్యింది. రాంబాబు కుర్చీకి దూరంగా కదిలేడు. బోయ్ దిగివచ్చి మాటా పలుకూ లేకుండా రాంబాబుని చూస్తూ ఒక్కో అడుగు వేస్తున్నాడు. రాంబాబుకి అతని చర్య ఏమిటో అర్థంకాలేదు. అందుచేత అతని దృష్టి మళ్ళించేందుకు ఒక పక్కకి కదిలేడు. మళ్ళా అటువేపు వచ్చి నించున్నాడు బోయ్. రాంబాబుకి విసుగు కలిగింది.]

రాం: వాటీజ్ దిస్?

బోయ్: (బదులివ్వలేదు. మనిషిని గుచ్చి గుచ్చి చూస్తున్నాడు)

రాం: నీకేం పిచ్చెక్కలేదుగదా!

బోయ్: లేదు సార్!

రాం: మరెందుకట్లా పిచ్చిచూపులు చూస్తున్నావు?

బోయ్: నన్నేమైనా అడగాలని మీకు అనిపించడంలేదా సార్!

రాం: ఏ విషయం....ఎవర్ని గురించి?

బోయ్: అదే! దీనబంధుగారి గురించి సార్!

రాం: దీనబంధెవరు?

బోయ్: ఇందాక మీతో మాట్లాడి వెళ్ళారే.... ఎయిటీవన్—

రాం: ఓహో! ఆయనా?

బోయ్: (ఆనందంగా) అవును సార్! ఆయనే! ఆయన గురించి నన్నేమైనా అడుగుతారా సార్?

రాం: నాకేమిటవసరం?

బోయ్: అమ్మో! అట్లా అనకండి సార్! మీరడగాలిసార్. నేను చెప్పాలి సార్.

(అయిదు రూపాయల నోటు తీసి చూపెడుతూ అన్నాడు) వారి గురించి మీకు సమస్తం చెప్పమని ఇదిచ్చేరు సార్! మీరడక్కపోతే ఈ ఫీజు నాకు దక్కదు సార్!

రాం: ఇటీజ్ నాన్‌సెన్స్! షీర్ నాన్‌సెన్స్!

బోయ్: ఈ అయిదూ నాకు దక్కాలంటే మీ రడక్కపోయినా చెప్పేస్తాను సార్! (నోటు జేబులో వేసుకుని ఠీవిగా చెప్పేడు) ఆయన ఎం. ఎల్. ఏ.గారు. అసలు పేరు కనకారావు. వాళ్ళ పార్టీ వాళ్ళు ఆయనకు దీనబంధు అని బిరుదిచ్చి సన్మానం చేసేరు. అప్పట్నుంచి అసలుపేరు ఆయన్తోపాటు జనం కూడ మరిచిపోయేరు. దీనబంధు అనే పిలుస్తుంటారు. ఆ పేరుతో పిలుస్తేనేగాని ఈయన పలకరు.

[బజర్ వినిపించింది]

బోయ్: కమింగ్ సార్!

[అంటూ బయటకి వెళ్ళిపోయేడు]

రాం: ఇటీజ్ పెక్యులియర్! (మూడు మార్చుకుని అన్నాడు). ఇంక మన కథలోకి వచ్చేద్దాం. ఆ కుర్చీని గుర్తుంచుకోండి. దానిమీద కూర్చున్నవాడు—ఆ వ్యక్తి ఎవరైనా కావచ్చు. ఎంత లౌక్యుడైనా కావచ్చు. దానిమీద కూర్చుంటేమాత్రం హి విల్ బి అవుట్! ఆ మెషిన్ పవర్‌కి అతని మెదడు అంకితమవుతుంది. అప్పుడు లోపలి మనిషి బయటకి వస్తాడు. అన్నీ నిజాలే....పచ్చి నిజాలే పలుకుతాడు.

[బోయ్ మరికొంత లగేజితో వచ్చి ఎడమవేపు మెట్లెక్కుతున్నాడు. ప్లీడరు ప్రవేశించి గుమ్మం దగ్గిరాగి ఎవర్తోనో చెబుతున్నాడు]

ప్లీడ: కారు తీసుకెళ్ళిపోండి. బస్టాండ్‌కి కారు పంపినందుకు ధనకోటికిగారికి థేంక్స్ చెప్పండి. వారికోసం వెయిట్‌చేస్తుంటానని కూడ చెప్పండి. ఓ. కె! దట్స్ గుడ్! (గాల్లో చెయ్యూపి అన్నాడు) బోయ్!

బోయ్: (ఆగి అన్నాడు) సార్!

ప్లీడ: రూంనెంబర్ నైన్టీత్రీ!

బోయ్: ఇదే సార్ దారి! రండి!

ప్లీడ: పద పద!

[వాళ్ళిద్దరూ ఎడంవేపు మెట్లెక్కి వెళ్ళిపోయేరు. రాంబాబు ప్రేక్షకుల్తో అంటున్నాడు]

రాం: సో! ఎవరిథింగ్ ఈజీ రెడీ నౌ! నేను నా గదిలో కాలక్షేపం చేస్తాను. మీరిక్కడ జరిగే తంతుని గమనిస్తుండండి.సీ యూ అగైన్?

[రాంబాబు....తన గది నూటఒకటిలోకి వెళ్ళబోతుండగా కానిస్టేబిల్ వచ్చి సెల్యూట్ చేసి అన్నాడు]

కాని: నా పేరు అప్పల్సామండి. ఇంటి పేరు నిప్పండి. టూటవున్లో పనిచేస్తున్నానండి. తమకోసం వచ్చేనండి!

రాం: (ఉలిక్కిపడ్డాడు) నాకోసమా?

అప్ప: అయ!

రాం: నేనెవరో....ఏమిటో....

అప్ప: అప్పల్సామి పవరెంటో తమకు తెలవదులాగుందండి. టవున్లో ఎవర్నడిగినా చెబుతారండి. తమర్ని చూసుకోమని యస్సైగారు నన్ను పంపించేరండి.

రాం: యస్సైగారు—

అప్ప: యస్సైగారంటే యస్సైగారు కాదనుకోండి. ఆరు హెచ్‌సికి చెపితే హెచ్‌సిగారు నాకు సెలవిచ్చేరండి.

రాం: అది సరేనయ్యా! నన్నే చూసుకోమని....

అప్ప: ఇంకొద్దండి! మడుసుల్ని పోల్చుకోడంలో అప్పల్సామి తర్వాతే ఎవరైనానండి! తమకేం కావాలో ఆడరేయండి. వరేంజిమెంట్లు చేసేస్తానండి.

రాం: నన్నెవరనుకుంటున్నావో....

అప్ప: తర్టీ ఇయర్స్ సార్వీసండి. కళ్ళకి మెదడికి పవరెక్కువండి. పెద్దోళ్ళు చెప్పింది చాకులాగా చేసుకుపోడం మొదట్నుంచీ అలవాటండి. డూటీలో నిప్పండి. అదే ఇంటిపేరండి. ఊళ్ళో

వోళ్ళకి పులండి.

రాం: ఇట్సాల్‌రైట్....ఇప్పుడు నాతో ఏం పనో చెప్పు?

అప్ప: తమ పేరు శంకరంగారండి. తమరిక్కడ దిగుతారని ఇన్‌ఫర్మేషనండి. తమర్ని—

రాం: ఆగాగు! నా పేరు శంకరం కాదు. రాంబాబు!

అప్ప: (దెబ్బతిన్నాడు. దాచుకున్నాడు) తమరు వాల్తేరునుంచి వచ్చేరండి!

రాం: లేదు. బొంబాయినుంచి వచ్చేను.

అప్ప: (మరింత దెబ్బతిన్నాడు. మరింత దాచుకున్నాడు) తమరిక్కడ టూడేసుంటారండి!

రాం: కాదు. ఇవాళ సాయంత్రమే వెళ్ళిపోతున్నాను.

అప్ప: (బెంగగా) తమరు యస్పైగారి మేనల్లుడుగారండి?

రాం: నాకసలు మేనమామలే లేరు.

అప్ప: (రోషం వచ్చింది) అంతేనంటారాండి! అయితే సరేనండి. మీ డూటీ ఏంటో మీరు చూసేసుకోండి. నా డూటీ నేను చూసుకుంటానండి.

[రాంబాబు నూటఒకట్లోకి వెళ్ళిపోతున్నాడు. కానిస్టేబిలు కుర్చీలవేపు వస్తున్నాడు. బోయ్ మేడదిగుతూ అప్పలస్వామిని పలకరించేడు.]

బోయ్: గుడ్‌మార్నింగ్ గురుగారూ!

[బోయ్‌ని చూసుకోకుండా—అలవాటుకొద్దీ—సెల్యూట్ కొట్టేసేడు. ఆనక చూసి చాలా ఫీలైపోయేడు. పెద్ద పోజొకటి పెట్టి సీరియస్‌గా అడిగేడు]

అప్ప: ఏంట్రా? ఏంట్రా కూసేవ్?

బోయ్: గుడ్‌మార్నింగ్ గురూగారూ అన్నాను. తప్పేంటండీ?

అప్ప: గుడ్‌మార్నింగ్ వొరకూ సరిపెట్టుకుంటావ్రా? అందులో తప్పులేదు. ఆ తర్వాత ఏం కూసేవని అడుగుతున్నాను.

బోయ్: గురూగారూ అన్నాను. అంతేకదా?

అప్ప: (కోపంగా) కొరికేస్తాన్రోయ్! అప్పడం నమిలినట్టు నమిలేస్తాను. డూటీలో వున్నాను. కాపడ్డంలేదా? ఇట్టాంటప్పుడు గురూ గిరూ అని గీరగా పిలిచేవంటే తినేస్తాను జాగ్రత్త! అసలు నా పేరేంట్రా?

బోయ్: అప్పలసామి!

అప్ప: అంతవొరకూ కరక్టే! మన ఇంటి పేరు చెప్పు!

బోయ్: సొరకాయలండి!

అప్ప: ఏంట్రా? సొరకాయలా?

బోయ్: మా ఇంటిపేరు అదేనండి మరి.

అప్ప: నిన్నడిగింది మనింటి పేరురా! మన అంటే అర్థం కాలేదా? నేను. నా ఇంటి పేరు చెప్పు!

బోయ్: నిప్పు!—

అప్ప: అద్గదీ! అట్లా రా దారికి! ఇప్పుడు మన పూర్తిపేరు చెప్పు.

బోయ్: సొర—


అప్ప: (కోపంగా) తింటాన్రోయ్. కరిచేస్తాను. మన అంటే అర్ధమేమిటో ఇందాకే చెప్పేను.

బోయ్: నిప్పు అప్పలసామండి!

అప్ప: అవునా? నిప్పు అప్పలసామంటే ఏంటనుకున్నావురా? నిప్పన్నమాట. అంటుకుంటే కాల్తాను జాగర్త? అల్లాటప్పాగాడ్ని కాదురా? నిప్పు. నిప్పంతే! గేంబ్లింగ్‌గాళ్ళని బొక్కలో పొడిచేను. బ్రోతల్స్‌ని బొక్కలో తోసేను. జేబులు కొట్టే యెదవల్ని ఏరి పారేసేను. పదీ పాతికా చేతిలోపెట్టి తప్పుకోవాలనుకున్న కేటిగాళ్ళని కరకరా నమిలి మింగేసేను. నన్ను గురూ అంటావురా? నీ లెవలేంటి నా లెవలేంటి? సారను. ఏంటి అర్ధమైందా?

బోయ్: అర్ధమైంది సార్!

అప్ప: (ఖుషీగా) యెదవంట యెదవ! బతికిపోయేవు పో! నాపైనోడు నన్నెట్లాగూ సారనడు. నా కిందోడు కూడా సారనకపోతే నాకేంట్రా మరియాదా? ఎల్లెల్లు.



నీ డూటీ నువ్ చూస్కో షో!

[బోయ్ బయటకు వెళ్ళిపోతున్నాడు. లాఠీ నేలమీద కొడుతూ తీవిగా తిరుగుతున్న అప్పల సామికి ఎం. ఎల్. ఏ. దిగిరావడం కనిపించింది. లాఠీ చంకలో పెట్టి ఆ చేత్తోనే సెల్యూట్ కొట్టేడు. చంకలో లాఠీ కిందపడిపోయింది. సెల్యూట్ మాత్రమే మిగిలిపోయింది.]

దీన: నీ పేరు అప్పలసామి కదూ?

అప్ప: నిప్పండి! నిప్పు అప్పలసామి!

దీన: నీ ప్రమోషను ఏవయ్యిందీ?

అప్ప: అయ! అదింక రాదండి!

దీన: అదేం మాటోయ్?

అప్ప: (వినయంగా చెప్పినా లౌక్యంగా అన్నాడు) డూటీలో నిప్పు కదండి మరీ! ప్రమోషను రాదండి. తవకు తెలీందేముందండీ....ఆనెస్టుగా బతికే వోడికి ప్రమోషన్లు రావండి. ప్రమోషనో ఆనెస్టో ఏదో ఒకటి కోరుకోవాలండి. నేను ఆనెస్టుని కోరుకుని ఇట్లాగై పోయేనండి!

దీన: ఛూడు నాయనా నిప్పు _అప్పలసామీ!

అప్ప: అయ!

దీన: ఆనెస్టీని ప్రతి ఒక్కడూ నమ్ముకు బతకాలి.

అప్ప: అదే గదండీ నేను చేస్తోంది!

దీన: ఆనెస్టీని విసుక్కునే అమాయకులంతా వట్టి వాజమ్మలని లంబోదరన్ నాతో అన్నాడు.

అప్ప: లంబోదరనా? ఆయ నెవరండీ!

దీన: ఈ రాష్ట్రంలో నేనేమిటో తమిళదేశంలో లంబోదరనూ అంతే! చంగల్‌పట్టు జైల్లో మేమిద్దరం నాలుగు వారాలు కలిసి వున్నాం. ఇప్పుడాయన లేడు. శిలావిగ్రహం కట్టించే రక్కడ. నే నింకా వున్నాను. నేనుండగానే శిలా విగ్రహం ఏర్పాటు చేయించాలనుకుంటున్నా రిక్కడ. ఈ విగ్రహాల డిఫరెన్స్ తీసేస్తే మా ఇద్దరికీ చాలా దగ్గిర పోలికలున్నాయి.

అప్ప: అయ! చిత్తం!

దీన: నాకు మంత్రి పదవి కట్టబెట్టాలని మా వాళ్ళంతా పట్టుబడితే వద్దు పొమ్మన్నానోయ్!

అప్ప: నేనూ అంతేగదండీ మరి! ప్రమోషను వద్దనేసేను!

దీన: మంత్రి పదవిలో ఆనెస్టీ ఆట్టే ఎక్కువ వుండదని గాంధీగారు తమ ఆత్మకథలో రాసుకున్నారు. ప్రజలకు మరింత ఇతోధి

కంగా సేవచేసి చరిత్రలో నిలిచిపోవాలంటే ఆనెస్టీ చాలా అవసరమన్నాడు గుల్‌బహార్‌సింగు!

అప్పు: ఈ సింగుగా రెవరండీ?

దీన: గాంధీగారికి కుడిభుజం. వదిలెయ్. మంత్రి పదవిలో వుంటే నా ఆనెస్టీ దెబ్బతింటుందనే భయంతో ఎం. ఎల్. ఏ. గానే వుండిపోతున్నాను.

అప్పు: (మొహమాటంగా చెప్పినా ఖచ్చితంగా అన్నాడు) ఏం టో అనుకున్నాను గానీండీ....డీప్‌గా ఆలోచిస్తే తమకున్న గుణాలే నా క్కూడా వున్నాయండి!

దీన: ఉంటాయ్ నాయనా! ప్రజాసేవకి ప్రతినిధులం మనం. మనకి ఆనెస్టీ వజ్రకవచం. ప్రమోషన్లు రాకపోవచ్చు.... పదవులు లేకపోవచ్చు. ఆనెస్టీఆనెస్టీయే!

అప్పు: చిత్తం! చాలా మంచి విషయాలే చెప్పేరండి!

దీన: మరి వస్తానోయ్! కింద కారుంది. ప్రజలు నాకోసం వెయిట్ చేస్తున్నారు. వాళ్ళ సేవకే అంకితమైపోయేను గదా! వాళ్ళకెల్లాంటి సేవ చేయాలో కనుక్కొని మళ్ళా వస్తా!

[అప్పలసామి మళ్ళా సెల్యూట్ కొట్టేడు. ఆ దెబ్బకి రొమ్ము విరుచుకుని అడుగు వేసేడు దీనబంధు.

ఇప్పుడు శంకరం, సుగుణలు ఒకర్నొకరు పెనవేసుకుని వస్తున్నారు. వాళ్ళని చూడగానే చేతులు జోడించేడు దీనబంధు. సుగుణ భర్త నుంచి దూరంగా జరిగి, వెంటనే ప్రతి నమస్కారం చేసింది. శంకరం యింకా నమస్కారం చేయకపోవడంతో దీనబంధు దిగులు పడిపోతూ నమస్కార ముద్రని శంకరంవేపు తిప్పేడు. శంకరం—ఇక తప్పదన్నట్టు—చేతులు జోడించేడు.

అప్పటిగ్గాని నమస్కార యుద్ధం ముగిసింది కాదు. దీనబంధు సుగుణవేపు చూస్తూ అన్నాడు]

దీన: నీ పేరేమిటమ్మా?

సుగు: సుగుణండి!

దీన: అవునూ— నిన్నెక్కడో....ఎప్పుడో చూసినట్టు జ్ఞాపకం తల్లీ! ఎక్కడబ్బా?

సుగు: (సగ్గుపడుతూ) మా పెళ్ళికి వచ్చేరండి! (శంకరంతో) దీనబంధుగారని ఎం. ఎల్. ఏ.గారు. (దీనబంధుతో) మా వారండి!

దీన: ఇంక చాలు. మొత్తం గుర్తుకొచ్చేసింది. మీది బొబ్బర్లంక కదూ?

సుగు: కాదండి! కాకినాడ!

దీన: కాకినాడా? అట్లా చెప్పు! సుందర్రామయ్య గారమ్మాయివి—

సుగు: నాన్నారిపేరు సుందర్రామయ్య కాదండి. సూర్యారావుగారు.

దీన: సూర్యారావుగారా? అవునవును. సూర్యా రైస్‌మిల్లని మీకు రైసు మిల్లొకటి వుందికదూ?

సుగు: కాదండి. నాన్నారు కంట్రాక్టులు చేస్తుంటారు. లారీలుకూడా వున్నాయ్.

దీన: ఓహోహో! ఆయనా! అవునవును. ఆయన్నాకు బాగా తెలుసు. బావుంది. హనీమూన్‌లో వున్నారన్నమాట.

సుగు: లేదండి. మావారి ఊరు వెడుతూ ఇక్కడాగేము. ఈ ఊళ్ళో మా వారికి చాలామంది ఫ్రెండ్సున్నారు.

దీన: భేష్. బావుంది. మళ్ళా వస్తాను. నేను కూడా ఇదే హోటల్లో ఎనభై ఒకటిలో ఉంటున్నాను. మళ్ళా కలుద్దాం. (శంకరంతో) వెళ్ళొస్తానోయ్!

శంక: మంచిదండి (దీనబంధు వెళ్ళిపోయేడు. శంకరం తల బాదుకుంటూ అన్నాడు) పాడు నస. ప్రాణాలు తీసేడు.

సుగు: పోన్లెండి పాపం! పెద్దవారు! ఎందరెందరో కలుస్తుంటారు. అందర్నీ ఎట్లా గుర్తుంచుకుంటారు?

శంక: ఇట్సాల్ రైట్! ఈ గొడవదేముంది గానీ....నేను యెక్కువగా వర్రీ అవుతోంది నీ గురించి!

సుగు: నా గురించా?

శంక: కాదా మరి? ఆయనకు సమాధానాలు చెబుతూ నువ్వెంత అలిసిపోయావో నాకు బాగా తెలుసు!

సుగు: మీరు మరీనండి! ఈ మాత్రం దానికే అలిసిపోతానా ఏమిటి?

శంక: ఫ్లయిట్‌లో వద్దమంటే నువ్వే వద్దన్నావు. గతుకులరోడ్డు. కారుప్రయాణం. మల్లెపూవులాటి నిన్ను ఈ పాడు ప్రయాణం వర్రీ చేసి వుంటుంది. సారీ సుగుణా....సో సారీ! క్షమించు!

సుగు: (ప్రేమతో అతని నోరు మూసింది) అమ్మో! అంత మాటనకండి. నేను వినలేను. కారులో వెడదామని నేనే అన్నాను. అందులో మీ తప్పేముంది?

శంక: తప్పా? తప్పున్నారా? నీ మాట పెడ చెవిని పెట్టి నిన్ను ఫ్లయిట్‌లో తీసుకు రావలసిన బాధ్యత నాకు లేదా? కాని సుగుణా....నీ మాటని కాదనే చొరవ నాకు లేదు. ఇకముందు రాదు!

[అతని మాటలకు సుగుణ బాగా కదిలిపోయింది. అతని చేతులు తీసుకుంది. మూడీగా తియ్యగా అంటోంది]

సుగు: ఏవండీ!

శంక: (పరవశుడయేడు) సుగుణా!

సుగు: మీరెంత మంచివారండీ!

శంక: నీకంటేనా సుగుణా!

[ఇద్దరూ ఒకరికొకరు దగ్గరైపోయేరు. అప్పలసామి కళ్ళని ఒకచేత్తో మూసుకుని మరో చేత్తో లాఠీని నేలమీద కొట్టేడు]

అప్ప: ఏమండోయ్! ఇది హోటలండి! పది మందీ వచ్చేపోయే హోటలండి; పడగ్గది కాదండి. దూరమైపోవాలండి!

[భార్యాభర్తలు దూరమైపోయేరు. శంకరం చిరాగ్గా అన్నాడు]

శంక: మైండ్ యువర్ డ్యూటీ!

అప్ప: మిమ్మల్ని దూరంగా నుంచోబెట్టడం కూడా నా డూటీయేనండి! నా కిప్పుడు డూటీ గుర్తుచేయమాకండి! నిప్పైపోతాను!

శంక: నువ్వేమైపోతే మాకేమిటోయ్?

అప్ప: అమ్మో! అమ్మో! ఓయ్....ఓయ్‌నా? (రుద్రుడైపోయేడు) ఏవండోయ్.... మాటలు తిన్నగా రావాలండి! అనవసరంగా పోలీసుల్తో పెట్టుకోకూడదండి: గట్టిగా చూసేనంటే — నిప్పుగదండి మరీ—మాడిపోతారంతే!

శంక: (కోపం వచ్చింది. అప్పలసామిమీది కొస్తూ అన్నాడు) అట్లాగా? ఏదీ? నీ ప్రతాపం ఏమిటో చూపించవోయ్!

అప్ప: గీత దాట్తున్నారు!

శంక: (ఇంకో అడుగు వేస్తూ) ఇంకా దాటుతాను.

సుగు: (అడ్డు పడింది) ఏవండీ?

శంక: నువ్వు తప్పుకో సుగుణా! ఇతని ముచ్చటేదో చూద్దాం!

అప్ప: (ఫోన్‌వైపు పరుగెత్తి, ఆగిపోయి అన్నాడు) చూడండి బాబూ....చూసేసుకోండి. టూటవున్‌కి ఫోన్ కొడతాను. జీపొస్తాది. ఆ చూసుకునేదేదో టూటవున్ స్టేషన్లోనే చూసేసుకుందాం. (ఫోన్ ఎత్తేడు)

శంక: ఆ స్టేషన్లో యస్సై వుంటాడు. పిలు!

అప్ప: ఏంటీ? 'డు'నా?

శంక: అవును. 'డు'నే! అతన్ని పిలు!

అప్ప: ఆరుండరు. కూనీకేసుకెళ్లేరు. (ఆగి అన్నాడు) అయినా ఆరి సంగతెందుకండీ మీకు?

శంక: అతన్నాకు మేనమామ!

అప్ప: (అకస్మాత్తుగా ఫోన్ పెట్టేసేడు)

శంక: ఏం? ఫోన్ పెట్టేసేవే?

[అప్పలసామి సెల్యూట్ చేసేడు. పాఠం ప్రారంభించేడు]

అప్ప: తమ పేరు శంకరంగారండి!

శంక: అవును.

అప్ప: తమరు వాల్తేర్నుంచి వచ్చేరండి!

శంక: అయితే?

అప్ప: తమర్ని చూసుకోమని యస్సైగారు చెప్పేరండి! ఆరేమో రేపొచ్చి తమర్ని కలుస్తామన్నారండి!

శంక: అయ్‌సీ!

అప్ప: అయ్యబాబో! అయ్‌సీ అనేస్తే నా బాద రిలీజై పోదండీ. తమరు మన్నించాలండి. ఈ సంగతి యస్సైగారికితెలిస్తే నండీ—నాకు ఉరిశిక్ష పడిపోద్దండి! ఆరు నిప్పండి బాబూ. డూటీలో తిరకాసొస్తే నమిలి మింగేస్తారండి! ఆ డెట్టాంటోడయ్యేది డొక్కలో పొడిచేస్తారండి. బాబ్బాబూ—ఈ తప్పు కాయండి! (సుగుణతో) అమ్మా-తవరైనా చెప్పాలండి.

శంక: ఇప్పుడావిడ్ని విసిగించకు. తప్పయిందన్నావు గదా....అది చాలు. కింద లగేజి వుంది. బోయ్‌ని పిలిచి—

అప్ప: (గట్టిగా అరుస్తూ అక్కడ్నించి కదిలేడు) బోయీ....రేయ్ బోయీ....

[శంకరం సుగుణ నూటరెండులోకి నడిచేరు. బోయ్ లగేజి మోసుకొస్తున్నాడు. అప్పలసామి లాఠీ ఊపుకుంటూ ఆర్డర్లు వేస్తున్నాడు.]

అప్ప: మెల్లిగా! బద్రం—జాగర్త! ఏ ఒక్క వస్తువైనా కిందపడిందో నా పంటికింద పడి నలిగిపోతావ్ జాగర్త!

[బోయ్ లగేజీని నూటరెండులోకి తీసుకు వెళ్ళబోయేడు. అప్పలసామి అరిచేడు]

అప్ప: ఆగక్కడ! అక్కడాగంతె! ఇక్కడ వారకే నీ డూటీ. లోపల డూటీ నాది! ఏం టర్దమైందా?

[బోయ్ లగేజీని దించేడు. అప్పలసామి ఆ లగేజీని తీసుకుని 102 లోకి వెళ్ళివచ్చేడు. తలెత్తి చూస్తే బోయ్ నడ్డిన చేతులుంచుకుని నిలబడి అప్పలసామి వేపు విడ్డూరంగా చూస్తున్నాడు. అప్పలసామి గాంబ్రించేడు.]

అప్ప: ఏంట్రా? ఆ చూపేంటి? ఆ పోజేంటి?

బోయ్: (సరిగ్గా నిలబడి గొణిగేడు) మా పని కూడా మీరే చేస్తుంటే....

అప్ప: (ఆనందంగా అన్నాడు) చేస్తాన్రా!సంతోషంగా చేస్తాను. ఆ రెవరనుకుంటున్నావ్? యస్సై బాబుగారి బంధుగుల్రా సన్నాసి! యస్సై బాబంటే ఏంటనుకుంటున్నావ్? పరమేస్వరుడితో సమానం. పరమేస్వరుడే మారేషం కట్టుకుని స్టేషన్లో యస్సైగా ఎలిసేడు. జిల్లా మొత్తమ్మీద పెద్ద పేర్రా ఆయనకి! ఆనెస్టులో ఆయన ఫస్టు.నేను సెకండు. అట్టాంటి మహానుభావుడి బంధుగులకి మూటలు మోయడమే కాదురా, నా చెర్మం వలిచి చెప్పులు కుట్టించి పళ్ళెంలో పెట్టిచ్చినా తప్పులేదురా యెదవా! నేను నిప్పు. యస్సైగారు యమ నిప్పు. అందుకే....ఆరన్నా ఆరి మనుసులన్నా అంత భక్తి....ఇంత విస్వాసం! ఏం టర్దమైందా?

[ఈ మొత్తం మాటాడుతూనే అప్పలసామి సత్యపీఠంవేపు నడిచేడు. డైలాగు పూర్తయ్యేసరికి అతను ఆ కుర్చీదగ్గిర నిలబడ్డాడు]

బోయ్: అర్ధమైందండి!

అప్ప: (సరదాగా అన్నాడు) ఏం టర్దమైందో చెప్పరా! ఇందారి!

(అని కుర్చీలో కూర్చున్నాడు. కుర్చీలో అప్పలసామి కూర్చోగానే అతని వళ్ళు జలదరించింది. మొహంలో రంగులు మారుతున్నాయి. పూర్తిగా అతను కుర్చీకి వశమైపోయేడు. బోయ్ సమాధానం చెబుతున్నాడు)

బోయ్: మీరు నిప్పైతే వారు యమ నిప్పన్నారండి!

అప్ప: ఏంట్రా? నేను—

బోయ్: నిప్పండి!

అప్ప: ఆరు?

బోయ్: యమ నిప్పండి!

అప్ప: నా సంగతేంటో తర్వాత చెబుతాగాని, ఆరంటే ఎవుర్రా?

బోయ్: యస్సైగారండి!

అప్ప: ఆడ్ని గారన్నావంటే నిన్ను కూరొండుకొని తినేస్తా జాగర్త! ఎవడ్రా యస్సై.

బోయ్: పరమేశ్వరుడండి!

అప్ప: ఇంకో తడవ ఆడికి బిరుదిచ్చేవంటే నీ పేగు తీసి మెళ్ళో దండేసుకుంటా నేమనుకుంటున్నావో? ఆడు పరమే

(వి) చిత్ర విజ్ఞానం



తల్లి పాలుకు నోచుకున్న పసివాడికి మాటలు త్వరగా రావడమే గాక మాట ఉచ్ఛారణలో లోపాలు అస్సలుండవని ఫ్రాన్సిస్ బ్రాడ్, న్యూజీలాండ్ మెడికల్ పత్రికలో పేర్కొన్నాడు. నూటముప్పై నలుగురు పసిపిల్లల్ని, వారి తల్లుల్ని పరీక్షించిన పిమ్మట యీ సంగతి తెలుసుకున్నాడు బ్రాడ్. పుట్టడంతోటే కనీసం ఏడువారాల వరకైన తల్లిపాలు తాగగలిగితే పిల్లవాడికి మాటలు చక్కగా వస్తాయి!

స్వరుడా? ఆడి సంగతి స్టేటంతా తెలుస్రా? ఆకలెక్కువ్రా ఆడికి! అందిన కాడల్లా తినేయడం రూలాడికి. నెల చివర్లో వెయ్యి రూపాయల కేమాత్రం తక్కువైనా చిందులుతొక్కుతాడ్రా ఆడు! కన్న తల్లి కావచ్చు. కట్టుకున్న వైఫే కావచ్చు. డోంట్ కేర్ గాడు. చేయి జాపి జేబు చూపిస్తాడు. రేయ్—ఆడిల్లెప్పుడైనా చూసేవంట్రా నువ్వు?

బోయ్: (ఆశ్చర్యంగా వింటూ లేదన్నట్టు తలూపేడు)

అప్ప: ఒకపాలి ఎల్లి చూడు. బాల్చీ తన్నేసి సొర్గానికి యెల్లిపోయేవని డవుటు కలుగుద్ది. ఇంద్రుడు నేలమీదికి దిగి అద్దింటో కాపరం పెట్టేడని పేపరోళ్లు రాసేయాల్సిందే. అట్టా వుంటాదిరా ఆడిల్లు. ఆ ఇంటో ఆడి వైభోగం చూస్తుంటే కళ్ళు తిరిగిపోవాల్సిందే. ఆడి జీతం ఆడి సిగరట్లకే చాలదు. మెరిసిపోతున్నాడంటే ఆడు నిప్పా? రెండుసార్లు వుద్యోగం పోయేది. ఎవుడెవుడ్నో సరిచేసి....ఎవుడెవుడికో లంచాలు గుప్పేసి నిలబెట్టుకున్నాడు. ఆడు నిప్పేంట్రా? ఆడ్నేకాదు, నన్ను కూడా సిప్పనొద్దు.

బోయ్: అదేంటండీ! మీ ఇంటి పేరు నిప్పు. మీరు నిప్పు!

అప్ప: రేయ్....రెచ్చగొట్టమాకు. పిచ్చికుక్కనై పోతాను.

బోయ్: ఆనెస్టులో చూసుకొన్నా మీకు మీరే సాటి!

అప్ప: ఎవడ్రా? నేను ఆనెస్టా? నేను ఆనెస్టయితే ఎప్పుడో వచ్చేది ప్రమోషను. అయినా ఒరే—ప్రమోష నెవడిక్కావాలి? చిలక్కొట్టుడు ముందు ప్రమోషనెంతరా? నేనెంత సంపాయించేనో నీకేమైనా తెలుస్రా?

బోయ్: (తెలీదన్నట్టు తలూపేడు)

అప్ప: నా పెళ్లాం మెళ్ళో నగలు, నా మంచాలూ నా కంచాలు, ఒరే బోయ్‌గా—నీలాంటోళ్ళని నలుగుర్ని కొనేగలన్రా నేను! కొనేస్తే ఎంక్వయిరీ పెడతారని గుట్టుగా లాక్కొస్తున్నా! నేను నిప్పేంటి? ఆనస్టేంటి? రేయ్—ఉద్యోగం వూడిపోయినా రెండు తరాలు లాగించేగలన్రా! ముండల దగ్గిర కక్కుర్తి పడిందీ, చోరీ కేసులో నొల్లుకుందీ, రేడింగుల్లో గుంజుకుందీ, కేటిగాళ్ళని సరిచేసిందీ—తల్చుకుంటే దీనమ్మ మొగుడు హోటలు దీని పక్కనే

కట్టించేగలను. ఏం టనుకున్నావో—

[ప్లీడరు మెట్లమీదికొచ్చి బోయ్ అని పిలిచేడు. బోయ్, యస్సార్ అన్నాడు. అప్పలసామి లేచి నించుని తల పంకించేడు]

ప్లీడ: (బోయ్‌తో) బెల్లుకొట్టినా బెల్లంకొట్టిన రాయికిమల్లె కదలవేం?

బోయ్: నాకు వినపళ్లేదు సార్!

ప్లీడ: మాలీష్‌వాడ్ని పిలుచుకురా!వళ్ళు పట్టించుకోవాలి!

[ప్లీడరు వెళ్ళిపోయేడు. బోయ్ వెళ్ళబోతూ ఆగి అప్పలసామివేపు విడ్డూరంగా చూస్తున్నాడు)

అప్ప: ఏంట్రా ఆ చూపు? కొత్తెదవని చూసినట్టు అ బెదురేంట్రా నీకు?

బోయ్: (నాన్చుతూ అన్నాడు) అబ్బే! మరేం లేదండి!

అప్ప: మాలీష్ పని కూడా నన్నే చూడమంటావా ఏంట్రా?

బోయ్: అందుక్కాదండి!

అప్ప: మరెందుకా యెదవ చూపని అడుగుతున్నాను!

బోయ్: ఇందాక మీ మీటింగు విన్నాను కదా! మతిపోయిందండి!

అప్ప: మీటింగా? మీటింగేంట్రా సన్నాసి?

బోయ్: ఒకసారి గుర్తు చేసుకోండి. జాతకాలన్నీ బయట పెట్టేసేరు.

అప్ప: ఏంట్రోయ్— మోళీగాని కడతన్నావా ఏంటి? తెలిసి మాటాడినా తెలవక మాటాడినా—నేనేది మాటాడినా నిప్పే. ఏం టర్ధమవుతుందా? నా మాట, నా చేత అన్నీ కూడా అనెస్టే! డూటీలో దేవుడున్నాడనుకుంటాను. డూటీ నే కొల్చుకుంటాను. తప్పుడు మాటలు, యెదవ మాటలు, ఎంగిలి మాటలు మందగ్గిర లేవు. ఎల్లెల్లు. ప్లీడరుబాబు మాలీసోణ్ణి అట్టుకొచ్చేయమన్నాడు. ముందా పనేదో చూడు. పో!

[బోయ్‌కి యింకా మత్తు వదల్లేదు. బుర్రని చేత్తో కొట్టుకుంటూ వెళ్ళిపోయేడు. సుగుణ చీర చెంగుతో విసురుకుంటూ గదినుంచి బయటకు వచ్చింది. అప్పలసామి అటన్నో నించున్నాడు. శంకరం సుగుణకు విసిరేందుకు పేపరు తీసుకొస్తున్నాడు)

సుగు: అబ్బబ్బ! పాడు కరెంటు. అన్నిచోట్లా వుండి మన గదిలోనే పోయింది.

శంక: చిరాకుపడకు సుగుణా! అసలే నీ ఆరోగ్యం అంతంత మాత్రం.

[పేపర్తో విసురుతున్నాడు]

సుగు: పాపిష్టిదాన్ని. మిమ్మల్ని ఇబ్బందిపెడుతున్నాను.

శంక: (విసురుతూనే) ఇబ్బందా? నా బెటాల్! ఇట్స్ ప్లెజర్ టుమీ!

అప్ప: (వినయంగా కలగజేసుకున్నాడు) పేపర్తో గాలి తగలదేమోనండి. తమ సెలవైతే విసినకర్రలు తెస్తానండి.

శంక: అవేమీ అక్కర్లేదుగానీ నూటరెండులో కరెంటు ఫెయిలైందని రిసెప్షన్లో చెప్పు.

అప్ప: చిత్తం!

[అటెన్షన్ కొట్టి అక్కడ్నించి వెళ్ళిపోయేడు)

సుగు: (భర్త తనకి విసరడం నచ్చలేదు) ఇక చాల్లెండి. ఎవరన్నా చూస్తే బావుండదు....

శంక: (విసరడం ఆపి) బావుండకపోడానికిందులో తప్పేముంది సుగుణా!

సుగు: మీకేం మీ రలాగే అంటారు. మొన్నామధ్య సీతాదేవి మన గురించి ఏం కామెంట్ చేసేరో తెలుసా?

శంక: ఏవన్నారేమిటి?

సుగు: నేను మిమ్మల్ని కొంగున ముడేసుకుని తిరుగుతున్నానట!

శంక: నా మొగుడు నా యిష్టం అని గట్టిగా చెప్పి వుండాల్సింది.

సుగు: (దిగులుగా) మీరుకూడా నన్ను ఆ మాత్రమే అర్థం చేసుకున్నారన్న మాట?

శంక: (అయోమయంగా) సుగుణా!

సుగు: మిమ్మల్ని కొంగున ముడేసుకోలేదండి. నా గుండెల్లో దాచుకున్నాను.

శంక: (ఆనందంగా) సుగుణా!

సుగు: ఏ జన్మలో ఏ పుణ్యం చేసుకున్నానో మీరు నాకు భర్తగా లభించేరు. నా మీద మీకున్న అభిమానం, అనురాగం తలుచుకుంటూ నా అదృష్టానికి పొంగి పోతుంటాను.

శంక: నిన్ను భార్యగా పొందినందుకు నేను కూడా అదృష్టవంతుడినే సుగుణా! మనది జన్మ జన్మల అనుబంధం.

[పై డైలాగులు పూర్తయ్యేసరికి ఇద్దరూ దగ్గిరయ్యేరు. అతుక్కుపోయేంత దగ్గిరై పరవశంలో మునిగిపోయేరు.]

సుగు: ఏవండీ?

శంక: సుగుణా!

సుగు: ఏవండీ!

శంక: సుగుణా!

[అప్పలసామి వచ్చి అన్నాడు]

అప్ప: తమ గదిలోకి కరెంటొచ్చేసిందండి!

[ఇద్దరూ విడిపోయేరు. సుగుణ గదిలోకి వెడుతోంది. ఆమెను వెంబడిస్తున్నాడు శంకరం]

అప్ప: (ఏం చెప్పాలో తెలీక) నేనిక్కడే వుంటానండి!

[శంకరం ఆగిపోయాడు. ఏదో గుర్తుకురాగా జేబులోంచి పదిరూపాయల నోటు తీసియిస్తూ అన్నాడు]

శంక: లక్ష్మీటాకీసుకి రెండు టిక్కట్లు రిజర్వు చేయించు.

అప్ప: చిత్తం. ఫస్టుషోకి కొనమంటారా? సెకండుషోకా?

శంక: ఫస్టుషోలూ సెకండుషోలూ అమ్మగారికి పడవు. మేట్నీలే యిష్టం!

అప్ప: చిత్తం!

[శంకరం గదిలోకి వెళ్ళిపోయాడు. అప్పలసామి సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయేందుకు వెనక్కి తిరిగేడు. అక్కడ ధనకోటి వెలిసేడు. ఆయన్ని చూడగానే మళ్ళా సెల్యూట్ కొట్టేడు]

ధన: ఏవయ్యా—ఈమధ్య బొత్తిగా కనిపించడంలేదు?

అప్ప: ఏం చెప్పమంటారండయా! డూటీమీద డూటీ పడిపోతుందండి! గాలి పీల్చుకోడానిక్కూడా టైం లేదండి! తమరిలా దయచేసేరేంటండీ?

ధన: ప్లీడరుగారొచ్చేరంటేనూ—

అప్ప: ఆయ! ఆయన మేడమీద గదిలో దిగేరండి!

ధన: ఇంత హోటలు కట్టించేదేగాని లిఫ్టు దగ్గిర కక్కుర్తి పడిపోయాడు. అసలే గుండెజబ్బు. మేడెక్కకూడదని డాక్టరు చెప్పేడు.

అప్ప: (సత్యపీఠం చూపించేడు) తమరట్లా కూచోండి. నేనెల్లి ప్లీడరుబాబుని పిల్చుకొస్తాను.

ధన: చాలా సంతోషం.

(సత్య పీఠమ్మీద కాకుండా వేరే కుర్చీమీద కూర్చున్నాడు. టీపాయ్‌మీదున్న పేపరు తీసుకున్నాడు. క్షణంసేపు చదివేడు. ఈలోగా, అప్పలసామితోపాటు ప్లీడరు కూడా వచ్చేడు]

అప్ప: ప్లీడరుగారొచ్చేరండి!

ప్లీడ: నమస్కారం.

ధన: (లేచి నించున్నాడు) నమస్కారం.

అప్ప: మరి నాకు సెలవిప్పించాలండి!

ధన: మంచిది! ఒకసారి ఫేక్టరీకొచ్చి కనిపించు.

అప్ప: చిత్తం.

[అప్పలసామి ఇద్దరికీ సెల్యూట్ కొట్టి వెళ్ళిపోయేడు. ధనకోటి చదివిన పేపర్ని సత్యపీఠమ్మీద వేసేడు. మరో కుర్చీని చూపెడుతూ అన్నాడు]

ధన: కూచోండి!

ప్లీడ: (కూర్చున్నాడు) థేంక్యూ.

ధన: (తానుకూడా కూచుంటూ) యావత్తు మానవజాతిమీదే నాకు విశ్వాసం నశించిపోతోంది ప్లీడరుగారూ—

ప్లీడ: సత్యకాలపు మనుషులు గదా—దేనికీ తట్టుకోలేరు.

ధన: నా ఫేక్టరీలో పనిచేసే కార్మికుల్ని నా కన్నబిడ్డల్లా చూసుకునే స్వభావం నాది.

ప్లీ డ: ఆ మాట మీరు వేరే చెప్పాలా ధనకోటి గారూ. మీరంటే ఏమిటో తెలిసిన ప్రతివాడికీ ఆ విషయం తెలుసు.

ధన: అవునాండి. అట్లాంటి నామీద సత్యం మర్డర్ కేసు బనాయించేరంటే ఈ ప్రపంచాన్ని ఏవిధంగా అర్థం చేసుకోవాలో నాకు తెలీడంలేదు.

ప్లీ డ: ఒక్కమాట చెబుతాను. వింటారా?

ధన: చెప్పండి!

ప్లీ డ: లోకంలో న్యాయం, అన్యాయం కవల పిల్లలకు మల్లె పక్క పక్కనే బతుకుతున్నాయి. ధర్మం అధర్మం కూడా తో బుట్టువుల్లా పెరుగుతున్నాయి. తాత్కాలికంగా కలతపెట్టినా అంతిమ విజయం ధర్మానికీ న్యాయానికే వుందని శాస్త్రాలు చెప్పేయి. కోర్టులు నిరూపిస్తున్నాయి. మీరేం బెంగపడక్కర్లేదు. న్యాయం మీ పక్షాన వుంది. మీ తరపున వాదించేందుకు నేనున్నాను.

ధన: (కళ్ళుతోడు తీసేడు. విచారంగా అంటున్నాడు) సత్యం నా బిడ్డలాంటివాడు. ఇంతప్పట్నించీ మా ఇంటోనే పెరిగేడు. మా పిల్లల్తో ఆడుకున్నాడు. యూనియన్ నాయకుడైతే కావచ్చు గానీ సత్యం నా ప్రాణమండి. యూనియన్ గొడవల్లో జోక్యం కల్పించుకొని నామీద వాడెన్నిసార్లు తిరగబడినా నేను వాణ్ని పల్లెత్తుమాటనలేదు. వర్కర్లంతా నా బిడ్డలతో సమానమనుకునే మనిషిని. పిక్నిక్లకూ, పిప్పరమెంటులకీ నా సొంతపిల్లలు నన్నెంత విసిగిస్తారో—జీతాలు పెంచమనీ, బోనస్లు ఇవ్వమనీ వర్కర్లుకూడా మారాం చేస్తారని సరిపెట్టుకున్నానే కానీ వాళ్ళమీద కక్షసాధింపు చర్యలకు నేనెప్పుడూ సిద్ధపడలేదు. అట్లాంటి నేను....నా సత్యాన్ని చంపుకుంటానండీ?

ప్లీ డ: అనవసరంగా మనసుపాడు చేసుకోకండి. మీ ఆరోగ్యంకూడా....

ధన: (నిట్టూర్పుతో) హు....ఆరోగ్యం! చెట్టులాంటి సత్యం పోయింతర్వాత నా ఆరోగ్యం ఏమయితే ఏం కావాలండీ? ఎవరు చెడగొట్టేరో....ఎందుకు చెడగొట్టేరోగాని బంగారంలాంటి సత్యాన్ని పూర్తిగా పాడు చేసేరు. వ్యభిచారానికి సైతం అలవాటు పడ్డాడు. లంజల విషయంలో తగాదా పడ్డాడు. అదే వాడి ప్రాణం తీసింది. గిట్టని వాళ్ళెవరో ఆకేసు నామీద బనాయింహారు. ఛీ.... ఛీ....(కంఠం రుద్ధమయింది) వాడు పోయినందుకే కృంగిపోయి ఏడుస్తున్నాను. పైగా ఈ అపవాదొకటి!

ప్లీ డ: (సీరియస్గా అన్నాడు) నేను మామూలుగా ఏ కేసునూ టేకప్ చేయను. నా దగ్గరకొచ్చిన క్లెయింట్ దోషో నిర్దోషో కనిపెట్టేనేర్పు నాకు భగవంతుడిచ్చేడు. క్లయింట్ కళ్ళలోకి గుచ్చి గుచ్చి చూస్తాను. అతను నిర్దోషి అని నా అంతరాత్మ చెబితే ఆ కేసుని తప్పకుండా తీసుకుంటాను. హరిహరాదులు అడ్డుపడినా న్యాయాన్ని గెలిపించి నా విధిని నిలబెట్టుకుంటాను. (లేచి నించున్నాడు) ఆనాడు మీరు నా దగ్గరకి వచ్చినపుడు మీ కళ్ళలోకూడా నిర్దోషినే చూశాను. అందుకే మీ తరపున వాదించేందుకు అంగీకరించాను.

ధన: రేపే కోర్టు. ఉదయమే కారు పంపుతాను. మీరింక రెష్టుతీసుకోండి. సెలవు.

ప్లీ డ: సెలవు. ఇక వుంటాను.

[ధనకోటికి నమస్కరించి మేడెక్కివెళ్ళిపోయేడు ప్లీడరు. ధనకోటి బయటకు వెళ్ళబోతుండగా దీనబంధు ఎదురయ్యాడు. చేతులు జోడించాడు ధనకోటి. దీనబంధు అట్టహాసం ప్రారంభమైంది.]

దీన: నమస్కారం. నమస్కారం. నేను మీ కోసం మీ యింటికి వెడితే మీరు నా కోసం ఇక్కడికొచ్చేరన్న మాట. రాండి, రాండి. కూర్చోండి.

ధన: ఫర్లేదు. మీరు కూచోండి ముందు.

దీన: అమ్మమ్మ. మీరే ముందు.

[సత్యపీఠంలో పేపరుతీసి, కూచోమని సైగచేసేడు.]

ధన: నామాట వినాలి. ముందుమీరే కూచోండి.

దీన: అయ్యా! ప్రజాసేవకులం. నిలబడటమంటేనే యిష్టం. మీరు కూచుంటే నేనూ కూచుంటాను.

ధన: ఏమిటో....మరీ మొహమాట పెట్టేస్తున్నారు.

[ధనకోటి సత్యపీఠంలో కూచున్నాడు. మూడ్ మారుతోంది. అది గమనించలేదు దీనబంధు. తానుకూడా వేరే కుర్చీలో కూర్చున్నాడు. సానుభూతి వచనాలు ప్రారంభించేడు]

దీన: ఇంత మంచివారు. చీమకి సైతం కీడు తలపెట్టని వారు. ధర్మాత్ములు.అల్లాంటి మీమీద మర్డర్ కేసు బనాయించేరంటే 'నాకెంతో దిగులుగా వుంది. కష్టాలనేవి చెప్పిరావంటారు. ఇందుకే కాబోలు. చెప్పండి.నావల్ల మీకెటువంటి సాయం కావల్సివచ్చినా సిద్ధంగా వున్నాను.

ధన: నాకెవరి సహాయంగానీ సత్రకాయలు గానీ అఖ్ఖర్లేదు. అనుకున్నదేదో అనుకున్నట్టు సాధించేను. సత్యంగాడి పీడ విరగడయ్యింది. పెట్టిన చెయ్యినే నరకాలనుకున్నాడు త్రాష్టుడు. పూడ్చిపెట్టేసేను. నన్ను ఎదిరించి బతగ్గల మొనగాడా వాడు? హు .... అయిపోయేడు. అంతే!

దీన: (ఖంగారు పడ్డాడు) మీరేదో వేళాకోళం చేస్తున్నారు. మీరేమిటి? సత్యాన్ని చంపడమేమిటి? అతన్ని కన్నబిడ్డలా పెంచుకుని——

ధన: గాడిద గుడ్డు. ఎవడండీ బిడ్డ? నాకు పుట్టినబిడ్డలే నా బిడ్డలు. దారినపోయే ప్రతి ముష్టి వెధవనీ కన్నబిడ్డగాభావి స్తే నేనూ ముష్టివెధవనవుతానే తప్ప లక్షలు సంపాయించలేను. ఫేక్టరీలు నడపలేను. కూలిచేస్తున్నారు వాళ్లు. అందుకు డబ్బులిస్తున్నాన్నేను. అంతవరకే మా సంబంధం.

దీన: ఏమిటో....ఇవాళెందుకో మీరు అదోలా మాట్లాడుతున్నారు. ప్లీడరుగార్ని కలిసేరా?

ధన: ఎవడండీ ప్లీడరు? వాడొక త్రాష్టుడు. దొంగ ముండాకొడుకు. నేను ఖూనీ కోరునని వాడికి బాగా తెలుసు.అయినా సరె నన్ను ఇంద్రుడనీ చంద్రుడనీ పొగిడి నాటకమాడుతున్నాడు.నా దగ్గిర డబ్బుంది. వాడిదగ్గిర వాదించే విద్య వుంది? ఫీజిస్తాను. చచ్చినట్టు వాదిస్తాడు. బి.పి. పేషెంటుని. అనవసరంగా కోపం తెప్పించకండి. అర్జంటు పనులున్నాయి. వెళ్ళొస్తాను.

[ధనకోటి లేచేడు. తల విదిలించేడు. దీనబంధు కూడా అయోమయంగా లేచి నిలబడ్డాడు. చేతులు జోడించి ధనకోటి అన్నాడు]

ధన: వీలున్నప్పుడు తమరు మాఇంటికి రావాలి. నా ఆతిధ్యం స్వీకరించాలి. ఎప్పుడో ఎందుకు? రేపు కోర్టు అయిపోగానే ప్లీడరుగారు మా యింటికి యెల్లాగో వస్తారు. తమరుకూడా అదే కార్లో దయచేయండి.

దీన: ప్లీడరుగారికి ప్రోగ్రాం చెప్పేరా మరి?

ధన: వేరే చెప్పడమెందుకండి. నా తరఫున యిక్కడకొచ్చేరు. కనక ఆయన నా మనిషే! పైగా ఆయనకిల్లాంటి ఫార్మాలిటీస్ గిట్టవు. ప్లీడరంటే అందర్లాటి ప్లీడరా ఏవన్నానా? మూర్తీభవించిన న్యాయం. కనుక....అల్లాంటివేమీ ఆలోచించవద్దు. వార్తోపాటు వచ్చేయండి.

దీన: (చేతులు జోడింపు తీయలేదు. అయోమయం చూపు మార్చలేదు. నవ్వుతూ అన్నాడు) అల్లాగే....అల్లాగే....

ధన: (ఆశ్చర్యంగా) అదేమిటండీ? ఎందుకల్లా నీళ్ళు నములుతారు?

దీన: అబ్బే....మరేం లేదండి....వంట్లో ఏదోగా వుంటేను. సరే! తప్పకుండా రేపు సాయంత్రమే తమ దర్శనం చేసుకుంటాను.

ధన: సెలవు మరి.

[ధనకోటి వెళ్ళిపోతున్నాడు. దీనబంధు విచిత్రంగా చూస్తున్నాడు. బోయ్ విస్కీ సీసాతో ప్లీడరు గదివేపు వెళుతూ, ఆగి వెనక్కి వచ్చి దీనబంధు పరిస్థితికి ఆశ్చర్య పోతూ పలుకరించేడు]

బోయ్: సార్!

దీన: ఊఁ!

బోయ్: ఏవిటి సార్....అట్లా వున్నారే?

దీన: మరేం లేదోయ్....రాజకీయవేత్తలకంటే ప్రజలే గొప్ప చమత్కారులని జలా లుద్దీన్ జైల్లో చెప్పేరు.

బోయ్: జలాలుద్దీనా? ఆయనెవరు సార్?

దీన: లక్నోలో వుండేవాడు. ఇప్పుడెక్క డున్నాడో తెలీదు. ప్రైమినిస్టరు కాతగినవాడు. ఆ లెవల్లో చేసేడు దేశ్సేవ. వ ది లె య్. జలాలుద్దీన్ చెప్పింది అక్షరాలా నిజమని ధనకోటి గార్ని చూస్తే తెలిసింది. క్షణం క్రితం మాటాడింది క్షణం తర్వాత కాదు పొమ్మన్నాడు. ఎప్పుడో ఒకప్పుడు మినిష్టరై పోతాడు. ఆ లక్షణం నాకు తెలుసు.

[అని మేశాక్కి వెళ్ళిపోయేడు. బోయ్ ప్లీడరున్న వేపు మెట్లెక్కుతూ వెళ్ళిపోయాడు. నూటఒకటినుంచి రాంబాబు వచ్చి లాంజ్‌లో కూర్చున్నాడు. పేపరు తిరగేస్తున్నాడు. అతని చేతుల్లో సిగరెట్టుంది. అతను కూర్చున్న క్షణం తర్వాత 102 నుంచి శంకరం వచ్చేడు. శంకరాన్ని చూడగానే రాంబాబు లేచి నిలబడ్డాడు. షేక్‌హేండ్‌కోసం చెయ్యి జాపుతూ పరిచయం చేసుకున్నాడు,]

రాం: నా పేరు రాంబాబు!

శంక: (కరచాలనం చేస్తూ) శంకరం. భవానీ శంకరం!

రాం: లవ్‌లీ నేమ్! మీ పేరుతోనే నాకో క్లాసు మేటుండేవాడు. క మా న్....హేవె స్మోక్?

[సిగరెట్ పెట్టె ముందు పెట్టేడు]

శంక: సారీ! నేను కాల్చను!

రాం: ఈజిట్? అకేషనల్‌గా కూడా కాల్చరా?

శంక: అకేషనా?

రాం: ఎగ్జాక్లీ! మనిద్దరం కలుసుకోవటమే అకే షను అనుకుందాం. అందుకైనా కాల్చ వచ్చుకదా!

శంక: ఆ మాటకొస్తే నేను ఛెయిన్‌స్మోకర్ని ఒకప్పుడు! పెళ్ళయిం తర్వాత చాలా అలవాట్లను మానుకున్నాను.

రాం: Why?

శంక: మీకు పెళ్ళయిందా?

రాం: అఫ్‌కోర్స్. కాలేదు.

శంక: అయితే మీకు చెప్పినా అర్థంకాదు.

రాం: పర్లేదు చెప్పండి. అయ్ విల్ ట్రై టు అండర్‌స్టాండ్ ది పాయింట్!

శంక: మనిషి జీవితంలో పెళ్ళి ఒక గొప్ప మలుపు. సరిగ్గా అక్కడ్నించే అతని జీవిత విధానం మారుతుంది. అలవాట్లు మారుతాయి. అయ్ లవ్ మై వైఫ్ సోకి మచ్!

రాం: ఆ సంగతి నాకు తెలుసు!


శంక: (ఆశ్చర్యంగా) తెలుసా? ఎల్లా తెలుసు?

రాం: ఇందాక మీరు మాటాడుకున్న కొన్ని వి ష యా లు విని ఆ నిర్ణయానికి వచ్చేను.

శంక: మేము మా టా డు కు న్న వి మీరు విన్నారా?

రాం: వినాలని కుతూహలం లేకపోయినా మీ మాటలు నా చెవిని సోకేయి. అయ్ కాంట్ హెల్పిట్!

శంక: (సీరియస్‌గా అన్నాడు) నిజం చెబుతు న్నాను రాంబాబుగారూ! నా భా ర్య అమాయకురాలు. నాకోసం తన ప్రాణ మయినా త్యా గ ం చే సే దేవత! నా అదృష్టంకొద్దీ ఆమె నాకు భార్యగా నా జీవితంలో అడుగుపెట్టింది. నన్నే నమ్ముకుంది. ఆమెను ఆనందపర్చడం నా కర్తవ్యం. సిగరెట్లన్నా, ఆ పొగ అన్నా నా వైఫ్‌కి రోత. వెగటు. ఆమె కోసం నా అలవాటుని మానుకోవాలి



ఎ క్రైండ్ ఆఫ్ శాక్రిఫైస్! పెళ్ళయిన కొత్త రోజుల్లోనే సిగరెట్లకి స్వస్తి చెప్పేను.

రాం: సిగరెట్లకి సేక్రిఫైస్ అని పేరుపెట్టేరా?

శంక: ఎ క్రైండ్ ఆఫ్ సేక్రిఫైసని అందుకే అన్నాను.

రాం: భార్యా భర్తలమధ్య ఇలాంటి త్యాగాలు అవసరమా?

శంక: అని వాదించలేను. భార్యకోసం భర్తా, భర్తకోసం భార్యా ఇలా సర్దుబాట్లు చేసుకోడంలో పెద్ద రిలీఫుంటుంది. పెద్ద థ్రిల్లింగ్‌గానూ వుంటుంది. నా అనుభవాన్ని పురస్కరించుకొని యీ స్టేట్‌మెంటిస్తున్నాను.

రాం: ఫెంటాస్టిక్! మీ అభిప్రాయాలు నన్ను బాగా మువ్ చేసేయి. ఇంతక్రితంవరకూ పెళ్ళే వద్దనుకున్న నా సొంత అభిప్రాయాన్ని మీ దంపతులిద్దరూ మార్చి పారేసేరు. నవ్, అయ్ వాంట్ టు మేరీ! (ఆగి అన్నాడు) మీరు ఏమీ అనుకోకపోతే....

శంక: (ఆనందంగా) నాట్‌ఎటాల్! ఏమీ అనుకోను. ఓ. కె?

రాం: థేంక్యూ! ఒక్క అయిదు నిమిషాలు. జస్టు ఫైవ్ మినిట్స్. నాకు స్పేర్ చేయాల్సి వుంటుంది. అఫ్‌కోర్స్ మీకది కష్టంగానే వుండొచ్చు. ఈ కొత్త ఫ్రండుకోసం—

శంక: ఓ. కె! ఓ. కె!

[రాంబాబు సత్యపీఠం చూపించేడు]

రాం: ప్లీజ్. హేవ్ ది సీట్!

[శంకరం సత్యపీఠమ్మీద కూర్చున్నాడు. సంచలనం ప్రారంభమయ్యింది]

రాం: ఇప్పుడు నేను మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగదలచుకున్నాను.

శంక: ప్రొసీడ్!

రాం: మీరు, మీ భార్యని అమితంగా అపారంగా ప్రేమిస్తున్నారు.

శంక: స్టాప్‌దట్ నాన్‌సెన్స్! నేనెప్పుడూ నా భార్యను ప్రేమించలేదు. ఇకముందు ప్రేమించలేను.

రాం: (ఆందోళన నటించి) శంకరంగారూ!

శంక: దాని తండ్రి పెద్ద కంట్రాక్టరు. లక్షలున్నాయి. ఒక్కగానొక్క కూతురు. వాళ్ళకి డబ్బు మదమెక్కువ. నాకు డబ్బుమీద వ్యామోహమెక్కువ. అందుకే మా ఇద్దరికీ పెళ్ళయింది. లెట్ మి హేవ్ యువర్ సిగరెట్—

రాం: (చిరునవ్వుతో) విత్ ప్లెజర్! (సిగరెట్టిచ్చేడు)

శంక: (సిగరెట్ ముట్టించుకుని అన్నాడు) ఏభై వేల కట్నం. పెద్ద మొత్తం. విత్ ఫిఫ్టీ థౌజంట్ బక్స్—దే హేవ్ కిల్డ్ మై లవ్ ఎండ్ లైఫ్! యాభై వేలరూపాయలతో నా ప్రేమనీ నా జీవితాన్నీ చంపేసేరు. ఇదే హోటల్లో రూం నెంబర్ సెవెంటీటూలో నా లవ్ వుంది. పేరు రీటా. నాకోసం ఈ హోటల్లోనే దిగింది. క్షణమో యుగంగా గడుపుతోంది—సింగిల్‌గా. నేను రీటాని కలుసుకోవాలి. నాకూ నా రీటాకూ ఈ బ్లడీ సుగుణ ప్రతిబంధకంగా వుంది. యాభై వేలు పోసి కొనుక్కున్నాననే ధీమా నా పెళ్ళానికి. దాని తండ్రి ఛస్తే లక్షాధికారి నవుతాననే ఆశ నాకు. ఇటీజ గేమ్ గోయింగాన్ సిన్స్ మై మేరేజ్. డబ్బింటి పిల్లగదా—అది చెప్పింది వేదం. అది ఏడిస్తే ఏడవాలి. నవ్వితే నవ్వాలి. అంతేగాని నా సొంత ఏడుపుకీ నవ్వుకీ విలువే లేదు. (ఆగి అన్నాడు) మిస్టర్, పెళ్ళిలో సుఖం లేదు. ప్రేమించు. ఎవర్నో ఒకర్ని ప్రేమించు. పెళ్ళొద్దు. ప్రేమిస్తునే జీవితాన్ని లాగించెయ్. ఇది నా ఫిలాసఫీ!

[లోపల్నుంచి సుగుణ ఏవండీ అని పిలిచింది]

రాం: మీ వైఫ్ పిలుస్తున్నారు!

శంక: వైఫ్ కాదు. డబ్బు. డబ్బు పిలుస్తోంది. లక్షలు. లక్షలు పిలుస్తున్నాయి. అయ్ మస్టు ఒబే! రీటాని చూళ్ళేదు మీరు. పూర్ రీటా! రీటా పిలుస్తే ఆ పిలుపులో ప్రేమ వినిపిస్తుంది. మ్యూజిక్ ఆఫ్ లవ్—అదే వినిపిస్తుంది. ఇవాళ నా వైఫ్‌కి స్లీపింగు టాబ్లెట్సిచ్చి నేను రీటా గదిలోకి వెళ్ళిపోతాను. అలనాటి స్వర్గం మళ్ళా కావాలి నాకు.

[ఏవండీ-అనే పిలుపు మళ్ళీ వినిపించింది. శంకరం లేచి నుంచున్నాడు. తల విదిలించేడు. ఖంగారుగా అన్నాడు]

శంక: వస్తున్నా సుగుణా! వచ్చేస్తున్నా! (చేతిలో సిగరెట్ కనిపించింది. రాంబాబు నుద్దేశించి అన్నాడు) మీరేనా ఇచ్చింది?

రాం: అవును.

శంక: (సిగరెట్‌ని కాల్తో నలుపుతూ అన్నాడు) మీకో నమస్కారం. దయచేసి నన్ను పాడుచేయకండి!

[వేగంగా తన గదిలోకి వెళ్ళిపోయేడు. రాంబాబు హాయిగా నవ్వుకుంటున్నాడు. అంతలో 'పాలీష్' అని బిగ్గరగా కేక వినపడింది. రాంబాబు ఉలిక్కిపడ్డాడు. అటువేపు చూసేడు. మాలీషువాడు వెలిసేడు]

మాలీ: మీరేనా బాబూ....పిలిచేరట. పని మొదలుపెట్టమంటారా?

రాం: నేను పిలవలేదు. నీ పనేమిటో నాకు తెలీదు!

[అని తాను తన గదిలోకి వెళ్ళిపోయేడు. మాలీషువాడు భుజాలెగరేసేడు. మళ్ళా బిగ్గరగా 'మాలీష్' అని కేక పెట్టేడు. ప్లీడరు గారు బనీనుతో వున్నాడు. మేడ దిగుతూ అన్నాడు]

ప్లీడి: ఏరా? ఎప్పుడో కబురంపితే ఇప్పుడా రావడం?

మాలీ: (సంతోషంగా) మీరా బాబూ పిలిచింది? ఆ సంగతి బెదరు చెప్పేడుగాదండి. ఎవరో పాసింజేరనుకున్నానే గానీ దేవుడు ప్లీడరుగారని తెలుస్తే క్షణాల్లో వచ్చేదునండి!

ప్లీడ: (తనకిచ్చిన బిరుదుకి ఆనందించేడు) దేవుడు ప్లీడరా? వాడెవడ్రా? (ఒక కుర్చీమీద కూర్చున్నాడు.)

మాలీ: ఇంకెవరో యేంటి బాబూ? తమరే? తమరు మాకు దేవుడు ప్లీడరే మరి! న్యాయం యెటుంటే తమరంటుంటారు. ఇది నాఒక్క మాటాకాదు బాబూ! కోర్టు కెళ్ళి కనుక్కోండి. బంట్రోతు వగ్గిర్నుంచి జడ్జీ వోరకూ అంతా యిదే మాటంటారు.

ప్లీడ: (మరింత మురిసిపోయేడు) సర్లేవోయ్! పన్లోనే కాదు మాటల్లో కూడా వుంది మాలీషు. పోచికోలు ఖబుర్లాపి పని మొదలెట్టు.

మాలీ: తలొంచేసి కాళ్ళు చాపుకోండి బాబూ! దెబ్బమీద దెబ్బ నాలుగైదు దెబ్బ లిచ్చేస్తాను.

[ప్లీడరు తన కాళ్ళని సత్యపీఠమ్మీద పెట్టేడు. కదలిక ప్రారంభమయ్యింది. గంభీరంగా అడిగేడు.]

ప్లీడ: రోజుకెంత సంపాయిస్తావురా నువ్వు?

మాలీ: (వళ్ళు పడుతూ అన్నాడు) అంతా గాలి వాటం బాబూ! లేచినేళ మంచిదైతే దిగుల్లేదండి. పొద్దున్నే యెదవ బేరం తగిలిందనుకోండి—ఇంకా రోజు పస్తే బాబు!

ప్లీడ: పస్తులుండొచ్చు. ఆకలితో చావచ్చు. కానీ నీ వృత్తిలో నిజాయితీ వుందిరా మాలీషు. నీ రెక్కల కష్టమే నీకు రక్ష. నేనూ వున్నాను ఎందుకు? భూమికి బరువు.

మాలీ: (తనని పొగిడినందుకు మెలికలు తిరిగినా—ప్లీడరు తనని తాను తిట్టుకున్నందుకు బాధపడ్డాడు) తమరట్లా నన్ను మెచ్చుకుంటే సిగ్గేస్తది బాబూ! తమ రెక్కడ, నేనెక్కడ? తమది బుద్ధి బలం. నాది జబ్బబలం. కూలికి వళ్ళు పట్టి కడుపు నింపుకునే బతుకు బాబూ నాది! తమ రట్టా కాదే? దేవుడు ప్లీడరు. న్నాయంకోసం బతికే దేవుళ్ళు.

ప్లీడ: కాదురా! ఆ ముసుగులో బతుకుతున్న లోఫర్ని!

మాలీ: (బాధగా+ఆశ్చర్యంగా) బాబూ!

ప్లీడ: అబద్ధం పెట్టుబడి నాకు. లౌక్యం నా ఊపిరి! నెత్తురు తాగే పులిని బోనులో నుంచోబెట్టి 'యువరానర్ ఇది గంగిగోవ'ని వాదించి నమ్మిస్తాను. వేలకు వేలు సంపాయిస్తాను. మోసం దగా కుట్రలకు ప్రాణం పోస్తాను. అవినీతికి పట్టాభిషేకం చేస్తాను. నేను తొడుక్కున్న కోటు నలుపు. నా బుద్ధి నలుపు. నా వంట్లో ప్రవహించే నెత్తురు నలుపు.

మాలీ: (బెదిరిపోయేడు) బాబూ!

ప్లీడ: ధనకోటి—ఫేక్టరీ ఓనరు—తెలుసు గదా!

మాలీ: (బెంగగా అన్నాడు) తెలుసు బాబూ!

ప్లీడ: వాడు సత్యాన్ని చంపేడు!

మాలీ: (భయపడ్డాడు) బాబూ!

ప్లీడ: ఒక్క సత్యాన్నే కాదు. వాడు ఎందర్నో పొట్టన పెట్టుకున్నాడు అల్లాంటి స్కౌండ్రల్ని ఉరిశిక్ష నుంచి తప్పించాలి. వాడిదే ధర్మం న్యాయమని వాదించాలి. అల్లాంటివారికోసమే నేనీ వృత్తి చేపట్టేను. ఒరే మాలీషూ—

మాలీ: (కలతపడిపోయేడు) బాబూ!

ప్లీడ: నీ జబ్బ బలంతో ఒక మంచి పని చేయరా? నా పీకను కసితీరా నలుపు. నిలువు గుడ్లతో చావాలి నేను.

మాలీ: (ఆందోళనగా) బాబూ!

ప్లీడ: నా పీడ విరగడవ్వాలి! చంపరా! చంపు!

మాలీ: (పని ఆపేసి దూరంగా జరిగి భయం భయంగా అన్నాడు) నేను కూనీకోరుని కాదు బాబూ! నన్ను విడిచి పెట్టేయండి.

[లాయరు సత్యపీఠమ్మీంచి కాళ్లు తీసేడు. తల విదిలించేడు.]

ప్లీడ: అబ్బ! ఇప్పుడెంతో హాయిగా వుందిరా మాలీషు! నీ చేతుల్లో ఏముందోగాని వళ్ళు ఉలిపిరి కాగితమయిందనుకో!

మాలీ: (నూటిగా చెప్పేడు) వళ్ళు సంగతేమోగాని బాబూ—నా చేయి పడితే మాటకూడా మారిపోద్దని తెలిసిందండి!

ప్లీడ: (ఆశ్చర్యంగా) ఏమిట్రా? మాట మారుతుందా?

మాలీ: అవును బాబు! తమరేం మాటాడేరో—

ప్లీడ: ఏం మాటాడేనురా?

మాలీ: ధనకోటి బాబుగార్ని నోటికొచ్చినట్టు తిట్టిపోసేరండి. తమరు తిట్టవుంటే

ఆరు లేరుగానీ బాబూ—వుంటే మాత్రం....

ప్లీడ: (అకస్మాత్తుగా లేచి నించున్నాడు) నోరు కుట్టేస్తాను రాస్కెల్! వళ్ళు తిమ్మిరిగా వుందా యేమిట్రా? నేను—నేను శ్రీ ధనకోటిగార్ని నోటికొచ్చినట్టు తిట్టేనా? ఆయన్ని కలలోకూడా తిట్ట లేన్రా నేను! వళ్ళు పట్టే వెధవ్వి,వళ్ళు కొవ్వెక్కి దేవుడు ప్లీడరు ముందే అబద్ధాలాడుతావుట్రా?

మాలీ: (దీనంగా అన్నాడు) తల్లితోడు బాబూ! తమరు తిట్టేరు!

ప్లీడ: ఛీ....మీ జాతి నీచమే అదిరా! సాక్ష్యం లేకుండా చూస్తారు. మీ నోటికొచ్చినట్టు కూస్తారు. ఆ మాటలన్నీ మేమే అన్నట్టు అక్కడికి మోస్తారు.

దీన: (వస్తూ అన్నాడు) ఏమిటండీ? యేం జరిగింది? ఎందుకట్లా పేదముండావాడి మీద విరుచుకుపడతారు?

ప్లీడ: (కోపంగా) పేదముండావాడేనండీ నెత్తి మీదకు తెచ్చేది. ఆఫ్టరాల్ ఈ వెధవ యేం కూసేడో వింటే....

మాలీ: (వణికిపోతూ అన్నాడు) నేనేం కూయలేదండి బాబూ! నా మాట నమ్మండి. ఆరికంటే నేనే మెరుగని ముందర నా బతుకుని మెచ్చుకున్నారండి.

ప్లీడ: (అక్కసుగా) విన్నారా? విన్నారా? నేనెక్కడ—వీడెక్కడ? వీడు నా కంటే ఘనుడని మెచ్చుకుంటానా?

దీన: దాంటో తప్పేముందండి? దేశానికి పేదలే ప్రాణమని తిరుక్కుచ్చి నంబియార్ ఎప్పుడో అన్నాడు.

ప్లీడ: (కోపంగా) ఎవడండీ తిరుక్కుచ్చి నంబియార్? రమ్మనండిలా నేను చెబుతాను వాడికి!

దీన: తిరుక్కుచ్చి నంబియార్ని తీసేయకండి. మళయాళ దేశమ్మొత్తమ్మీద గొప్ప ప్రజాసేవకుడు. నాగపూర్ జైల్లో మేమిద్దరం రెండేళ్ళున్నాం. 'ప్రాణం వుంటే దేహం బాగు—పేదల్తోనే దేశం సాగు' అని తిరుక్కుచ్చి మళయాళంలో అంటే నేను దాన్ని తెలుగు చేసేను. (ఉపన్యాస ధోరణిలో) పేదలంటే 'ఎవరనుకుంటున్నారు? ఎవరని మీ ఉద్దేశమని అడుగుతున్నాను. పేదల్లోనే రాముడున్నాడు. వాళ్ళల్లోనే క్రీస్తు ప్రభువున్నాడు. అల్లా దేవుడున్నాడు. అసలు వాళ్ళతోనే దేశం వుంది.

మాలీ: ఇప్పుడెందుకో మాట మారుస్తున్నారు గాని బాబూ—ఇంతకు ముందు మీకు మల్లె పేదోళ్ళని దేవుడు ప్లీడరుగారు మెచ్చుకున్నారండి. శానా మెచ్చుకున్నారు.

ప్లీడ: అదుగో మళ్ళీ! ఆ మాటే వద్దన్నాను. నోటికొచ్చినట్టు మిమ్మల్ని పొగిడేందుకు నేను రాజకీయాల్లో లేనురా! ప్లీడర్ని. గుర్తుంచుకో!

దీన: (దెబ్బ తగిలింది) అంటే మీ దృష్టిలో మేము—మా రాజకీయవేత్తలం అష్టాలనే కదా అర్థం?

ప్లీడ: అట్లా మీకెందుకర్థమైంది?

దీన: ఇంకా యేమని అర్థం చేసుకోమంటారు?

[వాళ్ళిద్దరూ పోట్లాడుకోడం మాలీకు కిష్టం లేదు. అంచేత కలుగజేసుకున్నాడు]

మాలీ: బాబూ మీకు దణ్ణమెడతాను. మీరు తగూలాడుకోవద్దండి! యెదవని—ఈ గోలంతా నా మూలనే వచ్చింది.

ప్లీడ: ఒరే! వినయం నటించకు. వళ్ళు మంట నాకు. వినయం నటించే ప్రతి మనిషినీ (దీనబంధుని సూటిగా చూస్తూ) అయ్ హేట్ హిం!

[అని మేడెక్కి తన గదిలోకివెళ్ళిపోయేడు]

మాలీ: అర్థంగాక అమాయకంగా అడిగేడు. యేంటిబాబూ అంటారాయన!

దీన: (శాంతంగా అన్నాడు) మనమంటే రోతట్రా! వదిలెయ్.

మాలీ: మనమంటారేంటి బాబూ! ఇంత

పెద్దోరు. తమరన్నా కూడా—

దీన: రోతేరా! ఆ మనిషికి అసలు కోపమంతా నామీదేరా! ఈ ఆసామికి నేనెంత దగ్గరవుతుంటే అతనంత దూరమవుతున్నాడు. ఇతని తోడల్లుడుకూడా నాలాగే ప్రజా సేవకుడు. కాకపోతే అతన్దో గ్రూపు!

మాలీ: సేవకి గ్రూపులేంటి బాబూ, మద్దెన?

దీన: ఉంటాయి నాయనా! అవి వున్నాయి గనుకనే ఈ ప్లీడరుకు నేనన్నా నా గ్రూపన్నా వళ్ళు మంట.కాని మాలీషూ- ఈ కోపతాపాలు నాలాటి ప్రజా సేవకుడు అసలు పట్టించుకోడు. మెచ్చుకున్నా- మెడమీద చేయివేసి డొక్కలో పొడిచినా ఒక్క చిరునవ్వుతో సరిపెట్టుకుంటాం. మా నిస్వార్ధ సేవా నిరతిలో తేడాలు రావు. (ఆగి అన్నాడు) ఆ కుర్చీ యిట్లా లాగు!

[మాలీషు సత్యపీఠాన్ని తీసుకొచ్చేడు]

దీన: పేదలకు చేసిన సేవే సేవ అన్నాడు మాధవరావు బాజీ!

మాలీ: (కుర్చీ తుడుస్తున్నాడు) ఆయనెవరు బాబూ?

దీన: మహారాష్ట్రి మనిషి. నెహ్రూగారికి కుడిభుజం. నేనంటే వల్లమాలిన ప్రేమ. గుల్బర్గా జైల్లో మేమిద్దరం ఏడాదిపాటున్నాం. తెలుగుదేశంలో ఒక్క దీనబంధే పేదలకు బంధువని మరాఠీ పేపర్లో రాసేడు. ఆ భాష మనవాళ్ళకి రాదుగనక నన్ను గుర్తించవలసినంతగా గుర్తించడంలేదు. కొంచెం భుజాలు పట్టు.

[సత్యపీఠమ్మీద కూచున్నాడు. మార్పు ప్రారంభమయ్యింది. మాలీషువాడు పనితో పాటు మాటలు మొదలుపెట్టేడు]

మాలీ: తమరొద్దన్నా సరే! తమకో నిజం చెప్పేయ్యాలి!

దీన: ఊ....చెప్పు!

మాలీ: మా పేదోళ్ళందరికీ తమరంటే భక్తి బాబూ! ఎదవని తమగురించి ఇన్నాళ్ళూ ఏంటో అనుకున్నానేగాని, తమరిందాక ప్లీడరు బాబుగార్ని దులిపేసేతలికి నాకెంతో ఆనందమేసిందండి.

దీన: ఊ....వేస్తుందిరా! ఆనందమే వేస్తుంది! దేశంలో మీకు మెజారిటీ యెక్కువ. ఎంత అధికారంలో వున్నా మాకు మీరే పెట్టుబడి. మేము మీ కాళ్ళు పట్టుకోక తప్పదు. మీరే మా పాలిట కామధేనువులు. కల్పతరువులు. మీరు తిరగబడితే మాకు పుట్టగతులుండవు.అందుకే మీరు తిరగబడకుండా మేము జోకొడుతుంటాం. ఓట్లేయించుకుంటాం. గద్దెనెక్కుతాం. సమయానుకూలంగా దెబ్బతీస్తుంటాం.

మాలీ: (అర్ధంకాలేదు. అందుకే ఆనందించి అన్నాడు) బాగా చెప్పేరు బాబూ! దేశంలో మీలాటోళ్ళు ఒకరిద్దరున్నారు గనుకనే మేమింకా ఇట్టాగైనా బతుకుతున్నాం.

దీన: ఆ ఒకరిద్దర్లో నేను ఛస్తేవుండను. తీసేయ్ నన్ను!

మాలీ: (షాకు తిన్నాడు) బాబూ!

దీన: మీలాంటివాళ్ళను నెత్తి నెక్కించుకుని తిరిగేందుకు నేను గాంధినీ కాను.పండిత నెహ్రూనీ కాను. నేను నేనే. దీనబంధుని. పేరులోవున్న కీర్తి గుణంలో లేదు.

మాలీ: (కలవరపడ్డాడు) బాబూ!

దీన: మీవల్ల మా కేమిట్రా లాభం? ఓట్లు వేసేంతవరకే మీరు. ఆ తర్వాత మా ప్రజలు మాకున్నారు. మా ప్రజాసేవ మాకుంది. అసలు ప్రజలంటే ఎవరనుకున్నావురా నువ్వు?

మాలీ: (బిక్కమొగంతో అన్నాడు) అదికూడా తమరే చెప్పేయండి బాబూ!

దీన: రిక్షా లాగేవాళ్ళూ, మాలీషుగాళ్ళూ, ఫేక్టరీ వర్కర్లూ, కూలీనాయాళ్ళూ వీళ్ళేనను కుంటున్నావా ప్రజలు?

మాలీ: (రోషంగా అన్నాడు) ఆళ్ళేనని ఎట్టా అనుకుంటాను బాబూ? ఆళ్ళు కూడా

పెజలే కదాని మనవి చేసుకొంటాను బాబు!

దీన: వీల్లేదు. కుదరదు. వాళ్ళని ప్రజలని పిలిచేం దుకు మా రూల్సు వప్పుకోవు. అలగా జనాన్ని ప్రజలని పిలవలేం. మమ్మల్ని అంటుకు తిరిగేవాళ్ళే మా ప్రజలు. ఎన్నికల్లో మా తరపున డబ్బు ఖర్చు పెట్టిన పెద్దలే—మా ప్రజలు. లాలూచీ కుస్తీల్లాగా మాకు దారిచ్చి తప్పుకున్న మాజీ నాయకులు, వాళ్ళ ముఠావాళ్ళు, మందీ మార్బలమంతా కూడా మా ప్రజలే. మాకు వాళ్ళు సహకరించేరు గనక మేము వాళ్ళకి సేవ చేయాలి. ఈ అయిదారేళ్ళలో అది నెరవేరితే చాలు ప్రజాసేవ అని బోర్డు కట్టుకుంటాం.

మాలీ: (కృంగిపోతూ అడిగేడు) అంతేనా బాబూ! అంతేనా? ప్రజలంటే ఆళ్ళేనా? మరి, మేము ఎవరు బాబూ? మా పేరేంటి?

దీన: ఉత్తుత్తి ప్రజలు. చదరంగంలో పావులు. మీరంతా ప్రజల్లో చేరిపోతే లక్ష దాటు తుందిరా సంఖ్య! ఇంతమందినీ అయి దేళ్ళలో ఉద్ధరించాలంటే దేవుడితరం కూడా కాదు. వాళ్ళనట్లా వదిలెయ్. పెద్ద పెట్టుబడితో ఈ రంగంలో అడు గెట్టేం. మా బాగు మాకేమిటి? మా భవిష్యత్తేమిటని అడుగుతున్నా న్నిన్ను!

మాలీ: అర్థమైంది బాబూ! బాగా అర్థమైంది. ఏళాకోళమాడుతున్నారేమో అనుకు న్నాను. ఆ ప్లీడరెంతో తమరూ అంతే నని బాగా అర్థమైంది బాబూ!

దీన: వేళాకోళమా? నేను నీతో వేళాకోళ మాడతానుట్రా? నువ్వేమైనా గవ ర్నరువా? ఛీఫ్ మినిష్టరువా? ఒరే— వీధుల్లో మీకు చెయ్యెత్తి నమస్కరి స్తున్నానని మీరంతా నన్ను వెర్రి వెంగళప్పనుకుంటున్నార్రా! మీ బావ మరిదిగాడినని చొరవ తీసుకుంటు న్నారు. జాగ్రత్త. చీమని నలిపినట్టు నలిపేగలను.

మాలీ: నలిపేయండి బాబూ! మా జాతి మొత్తాన్ని నలిపేయండి. ఆ తర్వాత బాబూ....మీ మాయ మాటలు నమ్మి, మోసపోయి, మీకు ఓట్లు వేసేందుకు మా జాతే వుండదు.

దీన: అందుకేరా....ఆలోచిస్తున్నాను. ఆగి పోతున్నాను. మీరుండాలి నాయనా. మా మాటలు నిన్నా ఇవాళ రేపు మీరు నమ్ముతుండాలి. ప్రతి తడవా మమ్మల్ని గెలిపిస్తుండాలి. మేము బాగుపడు తుండగా మీరు రోజుకో చావు చావాలి. లంగరు బాతురా మీ జాతి. గుప్పెడు మెతుకులు చాలు పాపం. మాకు రోజుకో బంగారు గుడ్డిస్తారు. బాతుని చంపం. మీ మేతలో కోటా పెంచం. దినదిన గండం నూరేళ్ళాయుష్షు. మీ రట్లాగే బతకాలి. మీ హోదా పెంచితే తెలివితేటలొస్తాయి. తెలివి మీరితే మీరు నాయకులవుతారు. మేము ప్రజల మవుతాము. ఆగిపోయేవే—భుజాలు పట్టు!

మాలీ: పనైపోయింది బాబూ! సెలవిప్పిం చండి....

[మాలీషు వెళ్ళిపోతుండగా దీనబంధు లేచేడు. తల విదిలించేడు. మాలీషువాడ్ని యెంతో ప్రేమగా పిలిచేడు]

దీన: ఏవిట్రా అది? మాటా పలుకూ లేకుండా వెళ్ళిపోతావే? ఆగు నాయనా! ఆగు! (మాలీషు ఆగేడు) పిచ్చివాడా—డబ్బు లొద్దట్రా నీకు?

మాలీ: (నిష్ఠూరంగా అన్నాడు) ప్లీడరేమిచ్చే డని మిమ్మల్నడగను?

దీన: అమాయకుడా! అతన్నీ నన్నూ ఏకం చేస్తావా? అతని గ్రూపేమిటి? నా గ్రూపేమిటి? వాళ్ళ గ్రూపు దోపిడి గ్రూపు. నేను ఆ జాతివాడ్ని కాను నాయనా! మీలో ఒకడ్ని. మీ వాడ్ని.

మాలీ: (అయోమయంగా) బాబూ!

దీన: (పది నోటిస్తూ) అయినా సరే! ప్లీడర్ని

క్షమించు. అతని డబ్బులుకూడా నేనే యిస్తున్నాను. ఇదుంచు!

మాలీ: (తీసుకుంటూ అన్నాడు) బాబూ! ఈ మాయేంటో తెలవకుండా వుందండి!

దీన: పాపం! మీరంటే నా కందుకే జాలిరా! పది స్తే మాయంటున్నావు. అదే వంద కాగితమి స్తే నీ గుండె ఆగిపోతుంది. అందుకే పెద్దపెద్ద ఉపకారాలను మేము తలపెట్టం. మీ స్థితిగతుల్ని మెల్లి మెల్లిగా మెల్లిమెల్లిగా మెరుగుపరచా లని చల్లా వెంకటప్పయ్య నాతోపాటు నెల్లూరు జైల్లో వుండగా చెప్పేడు. ఒకటి గుర్తుంచుకో....మీ అందరి కోసం బతుకుతున్నాను. మీ బతుకు ల్తోనే నా బతుకు ముడిపడి వుంది. వుంటుంది!

[దీనబంధు మేడ ఎక్కేడు. మాలీషుకి పిచ్చెక్కినట్టయింది. చేతిలో పదిరూపాయల కాగితం చూస్తూ పిచ్చిగా అరిచేడు—మాలీష్ అని]

బోయ్: (వస్తూ అన్నాడు)ఏయ్....ఏమిటా కేక? హోటలనుకున్నావా? రోడ్డనుకున్నావా?

మాలీ: పిచ్చెక్కింది బెదరూ! ఈ హోటల్ కెవడో చేతబడి చేసేడు.

[మళ్ళా మాలీష్ అని గట్టిగా కేక పెట్ట బోయేడు. బోయ్ అతని నోరు మూసి అన్నాడు]

బోయ్: పాసెంజేర్లు వింటే నన్ను తిడతారు. ప్రొప్రయిటరు వింటే నా ఉద్యోగం ఊడపీకుతాడు. తొంభైతొమ్మిదికెళ్ళు. సినీమా దేన్సరు జయమ్మగారికి మాలీషు చేయాలంట.

[మాలీషువాడు మళ్ళా అరవబోయి నోరు మూసుకుని మేడమెట్లు ఎక్కి వెళ్ళిపోయేడు. బోయ్ సత్యపీఠాన్ని చూసేడు. అది విడిగా ఎక్కడో వుండటం అతని కిష్టంలేదు. దాన్ని తీసి మునుపటి స్థానంలో వుంచేడు. అలిసి పోయి వున్నాడేమో అటూ యిటూ చూసి సత్యపీఠమ్మీద కూచున్నాడు.మూడ్ మారింది]

మాలీ: (మేడ దిగి వచ్చి అన్నాడు) తలుపు కొడితే తర్వాత రమన్నారు బెదరూ!

బోయ్: ఎవరు బెదరూ?

మాలీ: సినీమా దేన్సరు జయమ్మగారు!

బోయ్: లేచిపోయేవు. ఎవడో బేరం తన్నుకు పోయుంటాడు. ఎవడోగాని ఆ గదిలో చేరిపోయి నీ పనీ వాడి పనీ వాడే చేస్తు న్నాడు. (ఆగి అన్నాడు)ఎవడై వుంటా డబ్బా? (గుర్తుకు వచ్చింది) ఆ....ఇంకె వడు? ఆ లైన్లో దేవుడు ప్లీడరే వున్నాడు. దొంగనాయాలు. ఆడవాసన తగుల్తే చాలు వాడికి నరాలు జివ్వు మంటాయి. సినీమా దేన్సరుకదా— ఇంక చెడుగుడే!

మాలీ: ఇదేంట్రా దేవుడా? బెదరుకూడా మొద లెట్టేడండీ!

బోయ్: ఏమిటి మొదలెట్టేను?

మాలీ: నిజాలు బాబూ! పచ్చి నిజాలు. ఒక పక్క దేవుడు ప్లీడరంటానే వున్నావ్. ఇంకో సైడునుంచి చెడుగుడం టన్నావ్!

బోయ్: అంటాను. ఇంకా అంటాను. నాకేం భయమా?

మాలీ: మీ ప్రొప్రయిటరుగారింటేనో?

బోయ్: హు....ప్రొప్రయిటరు, పదేళ్ళ క్రితం వాడి జాతకమేమిటో అడుగు చెబు తాను. అప్పట్లో వాడొక కోన్‌కిస్కా గొట్టాంగాడు. వంటలు చేసుకుని బతికే వాడు. గోప్పారింటో వంట మొదలెట్టి వాళ్ళ ఆడంగుల్ని సరిచేసేడు. డబ్బా దస్కంతో ఆమెగార్ని ఇల్లు దాటించి, బొంబాయిలో ముండల కంపెనీ నడిపి పెరిగిపోయేడు. ముండల కంపెనీ మేనేజ్ చేసినవాడికి హోటల్ నడపడం లెక్కా? జమా? ఇక్కడికొచ్చి ఈ హోటల్ పెట్టేడు. పేరుకి ఫేమిలీసే గాని యిన్ని గదుల్లో ఎన్ని ఫేమిలీ సున్నాయంటావ్? లైన్‌కో రూము. అంతే! (ఆగి అన్నాడు) అసలు హోటళ్ళకి డిమేండెందుకో తెలుసా?

మాలీ: (తెలీదన్నట్టు తలూపేడు)

బోయ్: ఇక్కడికొచ్చె పాసింజేర్లలో నూటికి దెబ్బైమందికి సొంతింటో సుఖముండదు. కేంపనీ మరోటనీ గేస్‌కొట్టి ఇక్కడ కొలువెట్టి, ఇంటో దొరకని సుఖాన్ని యిక్కడ కొనుక్కుంటారు. హోటలు గుమ్మం ఎక్కంగానే గాండ్రిస్తారు. పెద్దపులులై పోతారు. ఇంటి తలుపు కనిపిస్తే చాలు—పిల్లులు—బావురు పిల్లులై పోతారు. పెళ్ళాం కాల్తో తంతే పళ్ళూడగొట్టుకున్న హీరోలంతా యిక్కడికొచ్చి వీర మొనగాళ్ళమంటారు. తెల్ల వెంట్రుకలకు నల్లరంగు వేయించుకుంటారు. మాలీషులు చేయించుకుంటారు. తాగి తందనాలాడుతారు. లంజలు కావాలంటారు. ఎక్క దాలిస్యమైనా మామీద యింత యెత్తున్న గాండ్రుమంటూ లేస్తారు. మేమే వాళ్ళకి లోకువ. వాళ్ళ దృష్టిలో మేమంతా లోఫర్ల మి.బేవార్సుగాళ్ళమి. తాగేది తాగుతూనే వుంటారు. లెక్క తప్పు చెప్పేమని మామీద చెప్పు తీస్తారు. బతికేందుకి చాకిరీ చేస్తున్నామేగాని బ్రెదరూ—నీతి నిజాయితీల్లో పేసింజేర్లకంటే, ప్రొప్రయిటరు నా కొడుక్కంటే మేమే బెటరు.

[బజర్ వినిపిస్తుంది. లేచి నించున్నాడు. తల విదిలించేడు. బోయ్‌వేపు మాలీషు మనిషి ఆశ్చర్యంగా చూసి—మాలీష్ అని గట్టిగా అరిచేడు. బోయ్ ఉలిక్కిపడ్డాడు]

బోయ్: ఏయ్....యేమిటా కేకలు? నీకొక్కడూ చెప్తాంట. మనిషయ్యేక ఒకసారి చెప్తే వినాలి. అవసరమైతే ఖబురు చేస్తాను. ఇంక వెళ్ళు!

మాలీ: నువ్వుండమన్నా యిక్కడో క్షణం వుండలేను బెదరూ! మీ అందరికీ ఎట్టాగుందోగాని నా కిది పిచ్చాసుపత్రిగా వుంది. మిమ్మల్నందర్నీ (చేతులు పైకెత్తి-దేవుడ్ని ఉద్దేశించి) ఆదే ఆదుకోవాలి.

[మాలీష్ అని మెల్లిగా అంటూ వెళ్ళిపోయేడు. మళ్ళా బజర్ వినిపించింది?]

బోయ్: కమింగ్‌సార్! (అంటూ మేడమెట్ల వేపు వెళ్ళిపోయేడు]

[సుగుణ బయటకు వచ్చింది. ఎవ్వరూ లేరని చూసి బయటనుంచే భర్తను పిలిచింది]

సుగు: ఏవండీ!....మిమ్మల్నే—

శంకరం: (వస్తూ అన్నాడు) పిలిచేవా సుగుణా!

సుగు: (వాచీ చూసుకుంది) మేట్నీకి టైమవుతోందండీ!

శంక: ప్రతి చిన్న విషయానికీ ఆందోళనపడకు సుగుణా! వెళ్ళినవాడు రావద్దా? వచ్చేస్తాడు.

సుగు: ఏమొస్తాడో ఏమోనండీ! అతనొచ్చేసరికి టైటిల్స్ పోతాయి. టైటిల్స్ దగ్గర్నించీ చూడకపోతే నాకు సినీమా అర్థంకాదు!

శంక: డోంట్ వర్రీ! వర్రీ అవడం నీ ఆరోగ్యానికి మంచిదికాదు. ఇల్లారా! (సత్యపీఠం చూపించేడు) కూచో....కొంచెం స్థిమితపడు. టైటిల్స్ మిస్‌కాకూడదు. అదేగా నీ ప్రోబ్లమ్!

సుగు: (సత్యపీఠంవేపు నడుస్తూ అన్నది)ఊ... అదే!

శంక: ఓ. కె! ఓ. కె!

(సుగుణ సత్యపీఠమ్మీద కూచుంది.మూడ్ మారింది).

శంక: ఒకవేళ టైటిల్స్ చూశ్ళేదనే అనుకో! ఆ ప్రింటు కొంటాను. ప్రైవేట్‌గా మనిద్దరికే షో అరేంజ్ చేస్తాను. ఓ.కె?

సుగు: (వ్యంగ్యంగా) అబ్బ! నేనంటే మీకెంత ప్రేమండీ!

శంక: (అనునయంగా) అయ్‌కాంట్ హెల్పిట్! నా జీవితం నీ కంకితం!

సుగు: (కోపంగా) ఛీ! ఆ మాటనేందుకు సిగ్గు లేదూ?

శంక: (షాక్ తిన్నాడు) సుగుణా!

సుగు: డబ్బు మాది మిస్టర్! నీకేం పోయింది? ప్రింటు కొంటావ్! సినిమా హాలూ

కొంటావ్! అదంతా నామీద అనురాగమని కోతలు కోస్తావ్. నామీద నీకెంత అనురాగముందో నాకు బాగా తెలుసు మిస్టర్! బాగా తెలుసు!

శంక: సుగుణా!

సుగు: ఏం? భయంగా వుందా? నీ మోసమేమిటో తెలుసుకున్నానని వణికిపోతున్నావా?

శంక: లేదు సుగుణా! లేదు! నువ్వేదో కొత్తగా మాటాడుతున్నావ్!

సుగు: అవును. నా గోడు నీకు కొత్తగానే వినిపిస్తుంది. కానీ ఇది పాత కథ. నా హృదయంలో చెరిగిపోని పాత బాధ. ప్రతి నిమిషమూ అనుక్షణమూ గుర్తుకొస్తుంది. నిన్ను శాసించే అధికారం నా డబ్బుకుంది. కానీ, భార్యగా నిన్ను అదుపులో పెట్టుకునే ప్రయత్నం చేస్తే నా కాపరం ఎక్కడ శగలబడిపోతుందోనని భయం నాకు. అందుకే నీ దగ్గర నటిస్తున్నాను. నటించలేక ఛస్తున్నాను.

శంక: (కోపం వచ్చింది. గట్టిగా అరిచేడు) సుగుణా!

[ప్లీడరూ, బోయ్ ఒకపక్క దీనబంధు మరోపక్కా వచ్చి నిలబడి చోద్యం చూస్తున్నారు]

సుగు: డబ్బుకోసమే నన్ను పెళ్ళాడేవు. డబ్బుకోసమే నన్ను ప్రేమిస్తున్నట్టు నాటకమాడుతున్నావ్. నీ నిజమైన ప్రేమనంతా రీటాకి ధారపోస్తున్నావు.ఖంగారు పడకు. నీ డైరీలు చదివేను. నీ కపట ప్రేమ తెలుసుకున్నాను. భర్తను విడిచి పెట్టిన భార్యకి ఈ దేశంలో గౌరవం కూడా దూరమవుతుందనే భయంతో-నేను తెలుసుకున్న చరిత్ర నాలోనే దాచుకుని కృంగిపోతున్నాను.

శంక: సుగుణా! స్టాప్ దట్ బ్లడీ టాక్!

[అప్పలస్వామివచ్చి నీరసంగా సెల్యూట్ చేసేడు. అతని వెనుకనే మాలీషు నిలబడ్డాడు. అప్పలస్వామిని చూడగానే శంకరానికి ఆశ చిగురించింది. అందుచాత టాపిక్ మార్చేడు]

శంక: టిక్కట్లు వచ్చేయి సుగుణా! మేట్నీకి టైమయింది. గెటప్. ప్లీజ్ గెటప్!

సుగు: హుఁ! జీవితంలో పోగొట్టుకున్న సుఖాన్ని సినీమాల్లో చూసి సంతోషించే హింస నాకొద్దింక! (ఏడ్చింది) నేను మేట్నీకి రాను. నువ్వు నీ ప్లాన్ ప్రకారం రీటా దగ్గిరకే వెళ్ళిపో! నిన్ను కాపలాకాచే ఓపిక నాకు లేదు!

శంక: (రెచ్చిపోయి అరిచేడు) సుగుణా!

సుగు: అరవకు! ఏభై వేలు పోసి కొనుక్కున్నాను. వాకోసం నువ్వు బతకాలేగానీ, నీకోసం బతికే అవసరం నాకు లేదు. వుండదు.

శంక: యూ బ్లడీ! (లాగి చెంప మీద కొట్టేడు.)

[చూస్తున్న జనం ఒక్కడుగు ముందుకు వేసేరు. సుగుణ లేచి నిలబడింది. చెంప రాసుకుంది. అందర్నీ చూస్తోంది. వెంటనే మామూలు స్థితికొచ్చింది]

సుగు: ఏమిటండీ? ఏం జరిగిందీ?

శంక: (బదులు చెప్పలేదు.)

సుగు: మాటాడరేమండీ? ఇప్పుడేం జరిగిందో చెప్పండి.

దీన: (దగ్గిరికి వస్తూ అన్నాడు) ఏం లేదమ్మా! ఏం జరగలేదు. అబ్బాయేదో తొందరపడ్డాడు.

సుగు: లేదండీ! వారెప్పుడూ తొందరపడరు. తొందరపడి నామీద చెయ్యి చేసుకోరు. వారెంతో మంచివారండీ.... నేనే తొందరపడివుంటాను. (శంకరాన్ని పట్టుకుని ఏడిపింది) మాటాడరేమండీ?....నాకేదో భయంగా వుంది. మాటాడండీ!

దీన: (శంకరంతో) నాయనా — నువ్విలా వచ్చేయ్. (సుగుణతో) అమ్మాయ్ నువ్విలా వచ్చేయ్!(సత్యపీఠంచూపిస్తూ) కూచో ముందు. కాసేపు రెస్టు తీసుకో. ఊఁ....నా మాట వినాలమ్మా! నేను నీ తండ్రిలాటివాడిని. మీ తండ్రిగారూ నేనూ ప్రాణస్నేహితులం .... అందుకైనా నా మాట వినిపించుకుని కూచోవాలి!

[సుగుణ కూర్చుంది, మూడ్ మారింది. దీనబంధు సముదాయిస్తున్నాడు]

దీన: పెళ్ళనేది నూరేళ్ళ పంట. ఒకర్నొకరు అర్థం చేసుకుని—

సుగు: రాజకీయం గురించి మీటింగు పెట్టండి. వింటాను. పెళ్ళి....నూరేళ్ళ పంట గురించి మాట్లాడే హక్కు నాకే వుందండి. ఎందుచేతంటే (ఏడుపు వచ్చింది) ఎందుచేతంటే....నా పెళ్ళి నూరేళ్ళ పంట కాదండీ, మూన్నాళ్ళ ముచ్చట!

దీన: అమ్మాయ్—

సుగు: దయచేసి మీరు మా విషయాల్లో జోక్యం కల్పించుకోవద్దు. ముందా మనిషిని రీటా దగ్గిరికి వెళ్ళిపొమ్మని చెప్పండి. నా కతను కనిపించకూడదు. పొమ్మని చెప్పండి.

శంక: (కోపంతో) సుగుణా! అయ్ విల్ కిల్యూ!

సుగు: విన్నారా! చంపుతాట్ట! నన్ను చంపడమే అతని ఉద్దేశమండీ! (బాధగా అన్నది) అక్కడికి నేనెదో బతికి వున్నట్టు మాటాడుతున్నాడు. అతను యెప్పుడు నా మెళ్ళో మూడు ముళ్ళూ వేసేడో అప్పుడే చచ్చిపోయేనండీ.... ఆ పచ్చటి పందిరికింద....ఆ కళ్యాణ మంటపంలో నా శవానికి తాళి కట్టాడండీ ఇతను. ఇంక నేను బతికిందెక్కడ?

[శంకరం తట్టుకోలేకపోయేడు. సుగుణను బలవంతంగా లేవనెత్తి, బిరబిరా ఈడ్చుకు పోయేడు. సుగుణ తెప్పరిల్లింది. ఎంతో అమాయకంగా 'ఏవండీ' అని పిలిచింది. శంకరం ఆగిపోయేడు]

సుగు: ఏవండీ....నా కేవిటో ఇదిగా వుందండి. ....నేనేమి చేస్తున్నానో తెలీకుండా వుందండీ....

[మాలీషు ముందుకు వచ్చేడు. చేతులు జోడించి అన్నాడు]

మాలీ: బాబూ—తమరంతా ఏమీ అనుకోకపోతే నా మాటొకటి తమరు ఎనిపించుకోవాలి బాబూ!

అప్ప: (లాఠీ నేలమీదకొట్టి అన్నాడు) రేయ్— నమిలేస్తాను. జాగర్త! నువ్వెంటో సీ నీ స్టేటసేంటో చూసోకోవాలిగానీ— ఇంతమంది పెద్దోళ్ళముందు మీటింగెట్టే పవర్సు నీకు లేవు.

మాలీ: నేను చెప్పేదికూడా ఈ పెద్దోళ్ళ మంచికేనండి బాబూ! బాబూ—నేను మాలీసోడ్నే కాని మెదళ్ళు తినేవోడ్ని కాదండి. ఇక్కడోళ్ళందరి మెదళ్ళూ (సత్యపీఠాన్ని చూపించి) ఇదిగో ఈ కుర్చీ తినేస్తదండి. ఏ కుర్చీలో కూర్చున్నా దిగుల్లేదు. దీంటో కూచున్నారా....గోవింద! ఇది చెప్పడానికే ఎల్లినోడ్ని మళ్ళా వచ్చేనండి!

అప్ప: రేయ్....గేస్ కొట్టకు. కొరికేస్తాను ఖబడ్దార్! నిప్పు—నిప్పప్పలసామిన్నేను. నే కూర్చుంటాను. ఈ కుర్చీ నా మెదడెట్టా తింటదో చూస్తాను.

[వెళ్ళబోతుండగా బోయ్ ఆపేడు]

బోయ్: అదింతకు మునుపే అయిపోయిందండి. మీ రక్కడ కూర్చుని మీ యస్సైగార్ని తిట్టేరు.

అప్ప: అమ్మో! అమ్మో! ఏంట్రా కూసేవ్? యస్సై దొరవార్ని నేను తిట్టేనా? కళ్ళు పోతాయ్ నాకొడకా! నిన్ను....నిన్ను.... (లాఠీ ఎత్తి కొట్టబోయేడు).

దీన: (కలగజేసుకున్నాడు) ఆగాగు! నాకిప్పుడు బాగా జ్ఞాపకమొస్తోంది నాయనా! సరిగ్గా ఇదే కుర్చీ—అవునిదే! దీనిమీద ధనకోటిగారు కూర్చుని (ప్లీడర్ని చూపెడుతూ) మిమ్మల్ని తిట్టిపోసేరు.

ప్లీడ: (షాక్ తిన్నాడు) నన్నా? నన్ను శ్రీ ధనకోటిగారు తిట్టిపోసేరా? నేన్నమ్మను. నమ్మలేను!

మాలీ: తమరుకూడా దీనిమీద కాళ్ళెట్టి ధనకోటి బాబుగార్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టేరండి! నన్ను కూడా తిట్టేరనుకోండి!

దీన: అప్పుడే కదరా నేను వచ్చింది!

మాలీ: చిత్తం వచ్చేరండి! ఆ కుర్చీని అడి

గేయించుకుని, తమరు దాని మీద కూర్చున్నారండి.

దీన: సరి సరి! వదిలెయ్! ముందా కుర్చీ సంగతేమిటో కనుక్కోండి. అప్పలస్వామీ—

అప్ప: (బెదిరిపోయేడు) నిప్పండి బాబూ— దాన్నంటుకోనెంక! రేయ్—బోయిగా, ఏంట్రా ఈ గోల? దీన్నిక్కడ్నించి తీసేయ్ ముందు.

మాలీ: బెదరు కూడా ఒకపాలి కూచున్నాడండి. బాదెట్టొద్దింక!

ప్లీడ: ఇట్సాల్ రైట్! ఇంతకీ ఈ కుర్చీ ఈ హోటల్లోదేనా?

బోయ్: ఇక్కడిదే సార్! నిన్నటి వరకూ బాగుంది. ఇప్పుడేమొచ్చిందో రోగం!

[మాలీషు ధనామని ఫిట్టొచ్చినట్టు పడిపోయి కుర్చీకింద మిషిన్ని చూసి 'మాలీష్' అని గట్టిగా అరిచేడు. అందరూ అతనివేపు నడుస్తున్నారు.]

మాలీ: బాబూ! ఈ కుర్చీకింద మిషినెదో వుంచేరండి!

దీన: (ఆశ్చర్యంగా) మిషినా?

ప్లీడ: మిషినేమిటండీ?

సుగు: (భర్తతో) విన్నారా....మిషినట.... తప్పంతా ఆ మిషిన్దేనండి!

శంక: అవునవును! తప్పంతా దానిదే! ఇంతకీ ఆ మిషినెవరుపెట్టి వుంటారు?

[అప్పలసామి ములీషుతో సీరియస్‌గా అంటున్నాడు]

అప్ప: రేయ్....లేరా! లేచి నించో అంతె!

[మాలీషు లేచి నించున్నాడు]

అప్ప: నా దగ్గిరకొచ్చెయ్. (మాలీషు వచ్చేడు) నా కళ్ళల్లోకి సూటిగా చూసెయ్ (చూస్తున్నాడు). చూస్తున్నావా?

మాలీ: చూస్తున్నానండి!

అప్ప: (ఠీవిగా) నా పేరేంటి?

మాలీ: అప్పలసామండి!

అప్ప: నిప్పు....నిప్పు. మరిచి పోయేవురా యెదవ! దొక్కలో పొడుస్తా-అడిగిందానికి నిజమే చెప్పాలి. ఏం టర్థమైందా?

మాలీ: అట్టాగే బాబూ! అంతా నిజమే చెబుతా!....

అప్ప: ఇంతమంది మేము ఆ కుర్చీమీద కూచున్నామేగాని నువ్వు కూచోలేదు. అవునా?

మాలీ: అవును బాబు!

అప్ప: దానికింద ఏముందో ఏముంటదో మాకెవరికీ తట్టలేదు. నీకు తట్టింది. ఏంటవునా? అవునను.

మాలీ: నిజమే బాబు!

అప్ప: అద్గదీ! అట్టారా దారికి! ఇప్పుడు చెప్పరా నాయనా! ఆ మిషను ఎప్పుడు యెవడు తగిలించేడో సమస్తం చెప్పెయ్!

మాలీ: అది నా కెట్టా తెలుస్తుందండీ?

అప్ప: నమిలి మింగేస్తానొరేయ్! నే నడిగిందానికి టకటకా ఆన్సర్లొచ్చేయాల్సిందే మరి! మేమింతమందిమి తెలవక కుర్చీ యెక్కి యెదవలయ్యేం. నువ్వెక్కలేదు. అసలు కతంతా కుర్చీకింద వుందని మా కెవరికీ తెలవదు. నీకు తెలిసిపోయింది. మాలీసోడికి పోలీసోడికంటే బుర్రెక్కువంటే మా లావప్పుకోదు. ఆదెవడో ఇక్కడెదో పెట్టేడు. అది నువ్ చూసేవ్. చూసింది చెప్పడం నీ డూటీ! ఏం టర్థమైందా? ఎ. బి. పి. డీ.లు చదువుతాను. జడ్ వచ్చేలోగా చెప్పాలంతె! ఎ—

మాలీ: (భయంగా) బాబూ!

అప్ప: బి!

మాలీ: బాబూ!

అప్ప: సి.డి.ఇ.యఫ్-యఫ్-యఫ్-ఆ తర్వాతేంటండీ? నాకు ఇంగ్లీషు రాదు. ఎవరైనా అందుకోండి!

ప్లీడ: నువ్వాగు! ఆ సంగతేమిటో నేను కనుక్కుంటాను. ఒరే మాలీషూ-

మాలీ: బాబూ!

ప్లీడ: ప్రమాణం చేయరా! దేముని ఎదుట!

[మాలీషు నవ్వేడు]

ప్లీడ: నోర్ముయ్!

[మాలీషు నవ్వు ఆపేడు]

ప్లీడ: ఎందుకు నవ్వుతావ్?

మాలీ: ఏం లేదు బాబూ! (కుర్చీ చూపించి) దేవుడ్నే దింపేసుకున్నాం గదా. ఇంకా పెమాణాలూ, సాచ్చికాలూ, బోన్లూ అనవసరమండి!

శంక: అట్లా వచ్చేవా? వెరీ గుడ్! కనుక- ఆ కుర్చీ ఎక్కు. చచ్చినట్టు నిజమే చెబుతావ్!

మాలీ: పత్యేకించి కుర్చీ ఎక్కక్కర్లేదు బాబూ! నేలమీదున్నా నిజమే చెబుతా. నాకు నిజమొక్కటే ఆస్థండి. (లాయర్నీ, దీనబంధునీ చూపెడుతూ) ఈ బాబులకు వళ్లు పట్టినప్పుడు కుర్చీ పవరు నాక్కూడా అంటుకుంటుందండి. అప్పుడూ నిజమే మాటాడేను.ఇప్పుడూ నిజమే మాటాడుతుండాను.

సుగు: అతని మాటలు నమ్మొద్దు. ముందు కుర్చీ ఎక్కమనండి!

అప్ప: (మాలీషుమీద లాఠీ ఎత్తి) రేయ్.... ఎక్కరా ముందు!

దీన: (మాలీషు మీదికొస్తూ) పెద్దల మాట వినాలి నాయనా!

ప్లీడ: (మాలీషు మీదికొస్తూ) ఊ.... ఎక్కు ముందు!

మాలీ: (చేతుల్తో వారిస్తూ అన్నాడు) అట్టాగే బాబూ.... అట్టాగే!

[కుర్చీ ఎక్కేడు. పకపకా నవ్వేడు. నిల బడి యింకా నవ్వుతున్నాడు. మిగతా వాళ్ళు ఒకరి మొహాలొకరు చూసుకుంటున్నారు. మాలీషు యింకా నవ్వుతూనే వున్నాడు]

అప్ప: రేయ్—నవ్వొద్దు. గబగబా నిజం చెప్పేయ్!

[మాలీషు నవ్వు ఆపేడు. అతనికి సొంత కథ జ్ఞాపకానికొచ్చింది. బాధగా ప్రారం భించేడు]

మాలీ: ఇట్టాంటి పెద్ద పెద్ద హోటళ్ళకొచ్చి పెద్ద పెద్దోళ్తో బేరాలెట్టుకోడం మా తప్పే బాబూ! పెద్దతప్పే.... నాలుగు రోజుల్నించీ అన్నంలేదండి. ఇంటిది మంచమెక్కి వారం రోజులయ్యింది. బాబూ! పిల్లలంతా అయ్యా వొన్నం... అయ్యా వొన్నమని అలమటిస్తున్నా రండి. అదుగో బాబూ....అప్పుడే ఈ బెదరు కనిపించేడు. పెద్ద బేరముంది రమ్మని నన్నిక్కడికి అట్టుకొచ్చేడు. గేటు బయట పిల్లల్నెట్టి నేనిట్టా వచ్చే నండి. అంతేగాని బాబూ— ఈ మిషి నేంటో....ఎవరు కుర్చీకి అంటించేరో నాకు తెలవదు. తెలవదు. పెట్టినో డెవడోగాని— ఆడు దేవుడు. ఆడికి మనమంతా దణ్ణం పెట్టేయాలి.

దీన: కాదు నాయనా. వాడికి ఉరిశిక్ష వేయాలి!

శంక: (ఆశ్చర్యంగా) కుర్చీ యెక్కినా మాట మార్చడం లేదు.

సుగు: వాడికి ఆ ట్రిక్కులన్నీ తెలుసండి!

బోయ్: లేకపోతే వీడేం హరిశ్చంద్రుడా? దేవుడా?

ప్లీడ: (మాలీషుతో) అంతేనా? ఇంకా ఏమైనా చెప్పదలచుకున్నావా?

మాలీ: (ధైర్యంగా — రోషంగా) చెబుతాను బాబూ! చెబుతాను! అసలీ మిషన్‌మీద మీ బయమేంటో చెబుతాను. (దీన బంధుని చూపెడుతూ) మీ మీటింగుల్లో ఈ మిషినుంటే— "సోదర సోదరీ మణుల్లారా — మీ ఓట్లన్నీ నాకే వేయండి. మిమ్మల్ని ముప్పైఏమూడు చెరువుల నీళ్ళు తాగించేస్తానేంటను కున్నారో" అని నమ్మకంగా చెప్పేస్తా రని మీ బయం.

[దీనబంధు దెబ్బతిన్నాడు. మాలీషు కుర్చీ దిగేడు. లాయరు వేపు నడుస్తూ]

మాలీ: బోనెక్కిన కూనీకోరు 'బాబూ-ఆ కూనీ నేనే చేసేనండీ' అని నేర మొప్పు కుంటే మీ బోర్డులు తిరగబడి పోతా యని మీ బయం! (శంకరంతో) నువ్వంటే నా కిష్టంలేదు మొగుడోనని

పెళ్లాం చెప్పే నిజంతో మొగుళ్ళకి పిచ్చెక్కుతుందని మొగుళ్ళ బయం! (సుగుణతో) నీ డబ్బుకి మూడుముళ్ళూ ఏసేనే గాని నువ్వంటే రోతని మొగుడనే నిజంతో పెళ్లాలు ఉరేసుకుని చావాలని పెళ్లాల బయం!(అప్పలస్వామితో) వందకతికేనని ఈ బాబు యస్సైబాబుతో చెబుతె, వెయ్యి తిన్నానని యస్సై బాబు సిఅయి బాబుతో అంటాడని పోలీసోళ్ల బయం!(బోయ్‌తో) కోన్‌కిస్కా గొట్టం గాడివి నువ్వెంత, నీ ఉద్యోగమెంతని ప్రొప్రయిటర్తో తగూలాడి ఉద్యోగం పోగొట్టుకుంటామని వుద్యోగాలు చేసే వాళ్ళ బయం! (ప్రేక్షకుల్తో)నీకుమందూ మాకుల్తో పన్లేదు. నువ్వు రెండురోజుల్లో గ్యారంట్రీగా ఛస్తావని డాటరుబాబు రోగిష్టోడితో నిజంచెప్పి బేరం పోగొట్టుకుంటామని డాటర్ల బయం! (ఆగి అన్నాడు) ఇన్ని బయాలెట్టుకున్నారు గనకనే దీన్ని చూసి అల్లాడిపోతన్నారు. దీన్ని కనిపెట్టినోడికి దండెయాల్సింది పోయి ఉరెయ్యాలంటున్నారు. ఏం బాబూ? అంతేనా?

దీన: చూడు నాయనా. నువ్వు పేదవాడివి. ఈ దేశంలో నీ మాటకు విలువే లేదు. అందుచేత నువ్వు నిజంచెప్పినా అబద్ధం చెప్పినా గొడవ రాదు. కానీ— మా విషయం వేరు. మామాట వేదవాక్కు. మా ఉనికి దేవుడ్తో సమానం. అంచేత మాకు అలాంటి మిషన్లు ఆటంబాంబులవుతాయ్ తప్ప ఆటవస్తువులు కాలేవు.

మాలీ: అంటే? నిజాన్ని చంపేసి బతకాలంటారా బాబు!

దీన: అట్లా బతక్కపోతే పశువులమౌతామే గానీ మనుషులం కాలేం. మనిషికీ మనిషి మనసుకీ మధ్య ముసుగొకటి కావాలి. ఆ ముసుగులేకపోతే ప్రపంచ వ్యాపారం దివాలాతీస్తుంది. అల్లకల్లోలం నిత్య అరాచకం రాజ్యం చేస్తుందని శనక్కాయలు నరసింహామూర్తి ఎప్పుడో చెప్పేడు. నాయనా మాలీషూ—పెద్దవాణ్ణి చెబుతున్నాను- దాన్ని ని చేత్తో నువ్వే ధ్వంసం చెయ్.

మాలీ: చేయకపోతే?

ప్లీడ: నువ్విక్కడ్నించి వెళ్ళలేవు!

శంక: నీ పీక పిసికి చంపుతాం.

బోయ్: నిన్నిక్కడే పూడ్చిపెట్టేస్తాం!

మాలీ: ఎంత పిచ్చోళ్ళండి బాబూ మీరు? ఈ మిషిను పోతే ఇంకోటెలుస్తాదండి. ఒకటి కనిపెట్టినోడికి రెండోది చేయడం కష్టం కాదు బాబూ!

సుగు: అది కనిపెట్టిన మనిషెవరో నువ్వే చెబుతావ్!

మాలీ: అమ్మా! ఆ ధర్మాత్ముడెవరో నాకు తెలవదమ్మా!

దీన: తెలీదంటే రాజకీయం ఊరుకోదునాయనా! హింస పెడితే నువ్వే చెబుతావు. (మిగితావారితో) ఇంకా చూస్తారేమిటండీ....కార్యక్రమం ప్రారంభించండి!

[పోలీసు మాలీషుమీద దాడిచేస్తున్నాడు చెప్పరా....చెప్పరాని కొడుతున్నాడు. బాబూ-నాకు తెలవదనే అంటున్నాడు మాలీషు. అతను పారిపోవడానికి ప్రయత్నించినప్పుడు, అందరూ అతని చుట్టూ మూగేరు. మాలీషు కిందపడిపోయాడు. గావుకేక పెట్టేడు. ఫ్రీజ్....

రాంబాబు తన గదినుంచి బయటకువచ్చేడు. నథింగ్ బట్ ట్రూత్ తీసుకున్నాడు. ప్రేక్షకుల్తో అన్నాడు]

రాం: ఓవర్! తెలివితక్కువతనం నాది!(నథింగ్ బట్ ట్రూత్‌ని చూపెడుతూ) దీనితో లోకకళ్యాణం ఎట్లాగూ జరగదు. (ఫ్రీజ్ వేపు చూపెడుతూ) హింసాకాండం నా కిష్టంలేదు. ఒక అమాయకుడు పదుగురి మధ్య నలిగిపోవడం నరకం. నరకాన్ని సృష్టించే ప్రయోగం నేను చేయను. చేయలేను. సో-అయ్‌మస్టు-రేదర్-డిస్ట్రాయ్‌దిస్ నథింగ్ బట్ ట్రూత్. గుడ్‌నైట్!

[అతను నథింగ్ బట్ ట్రూత్‌ని నేలకేసి కొట్టే ప్రయత్నంలో వుండగా— తెర!]

సమాప్తం

డిటెక్టివ్ స్పెషల్



తాతలనాటి గడియారం పన్నెండుగంటలు కొట్టింది. గోవర్ధనరావు అటకమీదనించి యింకో పెట్టె దింపి, తెరిచాడు.

"అర్ధరాత్రి యింకా ఆ గదిలో ఏం చేస్తున్నారు? పడుకోండి!" ,అన్నది అవతల గదిలోంచి గోవర్ధనరావు భార్య శకుంతల.

"నాలుగు రోజుల్లో యిల్లు ఖాళీ చెయ్యాలి. మనం వెళ్లేది చిన్న అద్దెకొంపకి. చెత్తసామానంతా...." అని గొణిగాడు. పెట్టెలో కాయితాలు, ఫోటోలు, ..కట్టల కట్టల వుత్తరాలు,

జమా ఖర్చుల పుస్తకాలు—ఓపికగా,ఒక్కొక్కటీ పరీక్షగా చూసి; చదివి, అవసరం అనుకున్నవి ఒకపక్కగా పెడుతూ, మిగతావి అవతల పడేస్తున్నాడు గోవర్ధనరావు. అతని తండ్రి చలపతిరావు బాగా ప్రాక్టీసున్న వకీలు. మహాత్మాగాంధీజీ స్వాతంత్ర్య వుద్యమం నినాదం విన్నాక, వృత్తి మానేసి, స్వాతంత్ర సమరంలోకి దూకాడు. ఎన్నోసార్లు జైలుకి వెళ్ళాడు. ఆదాయం లేకపోవటంవల్ల, దాచుకున్న డబ్బు కాంగ్రెసు పార్టీకి విచ్చలవిడిగా వ్యయం చేయటంవల్ల అప్పులపాలయ్యాడు. దేశానికి స్వాతంత్రం వచ్చేనాటికి, చలపతిరావుకి యాభయి ఏళ్ళుకూడా లేవు. ఎం. ఎల్. ఏ.గా నిలబడమని అడిగినపుడు; ఎం. పి.గా నిలబడమని పార్టీ నాయకులు అడిగినపుడు; అతని త్యాగానికి అయిదు ఎకరాలు భూమి యిస్తామని ప్రభుత్వం వుత్తరం వ్రాసినపుడు, చలపతిరావు సమాధానం ఒక్కటే. "దేశానికి నేను ఏదో సేవ చేస్తున్నాననీ; యీ సేవకి ప్రత్యుపకారంగా, వడ్డీతో సహా నాకు ఏదో వస్తుందనీ చెయ్యలేదు. అది నా విధి. నా ధర్మం. అందుకని చేశాను. ప్రతిఫలం ఆశించి కాదు. నాకు వద్దు" అని పార్టీ నాయకులకి వుత్తరాలు వ్రాశాడు. ఆ వుత్తరాల కాపీలు; పార్టీ నాయకులు వ్రాసిన ఉత్తరాలు అన్నీ ఆ పెట్టెలో వున్నాయి. మహాత్మాగాంధీజీ, నెహ్రూ, తదితర నాయకులతో తన తండ్రి తీసుకున్న ఫోటోలు జాగ్రత్తగా పక్కనపెడుతున్నపుడు, గోవర్ధనరావు కళ్లు చెమ్మగిల్లాయి. స్వార్ధరాహిత్యంతో స్వరాజ్య సమయంలో యోధుడయిన తన తండ్రి, తనకి ఎన్నిసార్లు,

"గోవర్ధనం—ఒక్క విషయం జ్ఞాపకముంచుకో! నేను పోయిన తర్వాతకూడా, ఎప్పుడూ—ఎటువంటి కష్టసమయంలోను, నా పేరుకానీ, నా దేశసేవకానీ, వుపయోగించుకుని నువ్వు ధనరూపేణకానీ, యింకేవిధంగా కానీ, లాభం పొందకూడదు. తెలిసిందా!" అని చెప్పేవాడు. తను తల వూపి "సరే నాన్నా!" అనేవాడు. ఆనాటి నైతిక విలువలూ; ధర్మ ప్రవర్తనా; యీనాటి రాజకీయవేత్తలతో పోలిస్తే—నవ్వుకున్నాడు గోవర్ధనరావు. ఆ పెట్టె మూసేసి, అటకమీదనించి యింకోపెట్టె దింపాడు. బాగా తుప్పుపట్టింది. అతి కష్టం మీద తెరిచాడు.

అది గోవర్ధనరావు తాతగారు శేషయ్యగారిది. ఆ పెట్టెలో పుస్తకాలు, డైరీలు, వుత్తరాలు, ఫోటోలు, తీస్తుంటే చిన్నప్పటి విషయాలు ఎన్నెన్నో జ్ఞాపకం వస్తున్నాయి గోవర్ధనరావుకి.

తాతగారికీ, తన తండ్రికీ జరిగిన వాగ్వివాదాలు తనింకా మర్చిపోలేదు. శేషయ్యగారు డిప్యూటీ కలెక్టర్. బ్రిటిష్ ప్రభుత్వం, సామ్రాజ్యానికి చేసిన సేవకి సంతోషించి తన తాతగారికి "రావు బహదూర్" బిరుదుకూడా యిచ్చింది.

బ్రిటిష్ సామ్రాజ్య వుద్యోగులలో ఒక్కడయిన తన తాతగారు—ఆ సామ్రాజ్యాన్ని యెదిరిస్తున్న తన తండ్రీ—యిద్దరూ వాళ్ళ నమ్మకాలనుబట్టి వాళ్ళ బతుకులు బతికేవారు. "బ్రిటిష్‌వాళ్ళే మన దేశానికి రాకపోతే అసలు భారతదేశం, అంతా ఒక దేశంగా యెలా వుండేదిరా! చిన్న చిన్న రాజ్యాలుగా...."

"బ్రిటిష్‌వారు మన దేశానికి వుపకారమే చేశారో, అపకారమే చేశారో, అది అప్రస్తుతం. ఇప్పుడు మన దేశాన్ని మనం పాలించుకోగలం. ఇంకొకరికి బానిసగా వుండవలసిన అవసరంలేదు."

"ఈ కాంగ్రెసువాళ్ళ మాటలు విని చెడిపోతున్నావు. ప్రాక్టీసు మానేశావు. ఆఖరికి బికారివి అయి—"

"ముష్టి ఎత్తుకుంటానంటావు. ఆ అవసరం వుండదు. నీ ప్రభుత్వ జైలుందిగా అందులో తిండి పెడతారు."

ఇలా జరిగేవి ఆ తండ్రీ కొడుకుల పోట్లాటలు. చలపతిరావు కాంగ్రెసు వాలంటీర్ల వూరేగింపుకి నాయకుడిగా వెళుతున్నపుడు, డిప్యూటీ కలెక్టరయిన శేషయ్యగారు, ఆ వూరేగింపు మీద ముందు, లాఠీచార్జి, తర్వాత, తుపాకి కాల్పులు జరిపించడం—అప్పుడు ఆ తండ్రీ

కొడుకులు ఒకర్ని ఒకరు నడివీధిలో వేలాది ప్రజల ముందర యెదిరించడం—అదంతా ఓ కథ.

"షూట్!" అని ఆజ్ఞ యిచ్చాడు పోలీస్ సూపరింటెండెంటుకి.

తుపాకీలు ఎత్తారు. గురిపెడుతున్నారు. మొదటి వరుసలో, త్రివర్ణ పతాకం పట్టుకుని నిల్చుని వున్న తన కొడుకు ఒక్కడే ఒక్క కొడుకు, చలపతిని చూశాడు.

ఏం చెయ్యాలి? నా కొడుకు ప్రాణం రక్షించడంకోసం షూట్ అన్న ఆజ్ఞని వుపసంహరించుకోవాలా? నా ఉద్యోగ ధర్మం నేను నిర్వహించాలా! భగవంతుడా యిటువంటి సంధిగ్ద పరిస్థితి ఏ తండ్రికీ కలుగకూడదు అనుకున్నాడు ఆయన.

గోవర్ధనరావు తాతగారి డైరీ చదువుతున్నాడు. నవ్వుకున్నాడు.

అటువంటి పరిస్థితి చరిత్రలో ఎన్నోసార్లు జరిగింది—ముందు ముందు జరుగుతుంది. ఒక తరానికీ యింకో తరానికీ తండ్రీ కొడుకులు నాయకులు అయినపుడు. చటుక్కున ఆగాడు చదువుతున్నవాడు. తన కళ్ళని తనే నమ్మలేక పోతున్నాడు. అదే డైరీలో వున్న ఫోటోని చూశాడు, యింకో ఫోటో—యింకా వివరాలు.

"నిజమా! నిజమేనా! ఎంత మోసం! ఎంత ధైర్యం!" అనుకుంటూ చదువుతున్నాడు.

"అయ్యయ్యో! అసలు నిద్రపోలేదా! తెల్లారింది. పాలు కూడా వచ్చేశాయి. ఏం చేస్తున్నాడు?" అంటూ శకుంతల వచ్చింది. గోవర్ధనరావు పెట్టె మూసేసి, తాళంవేసి, "అయితే కాఫీ చెయ్యి. ఆలోగా నేను మొహం కడుక్కుంటాను" అన్నాడు.

*　　　*　　　*

"కూర్చోండి! స్వామినాధుల శకుంతల గారా! ఇంటిపేరు. మీరు చెప్పకండి! జ్ఞాపకం చేసుకుంటాను. స్వామినాధుల చలపతిరావు గారు—స్వాతంత్ర వుద్యమంలో ప్రముఖ నాయకుడు—ఆయన మీకేమవుతారు?" అడిగాడు డిటెక్టివ్ యుగంధర్.

"మామగారు. మావారి పేరు, స్వామినాధుల గోవర్ధనంగారు. అనాధుల హైస్కూలులో టీచరు మావారు" అన్నది శకుంతల.


ఆమె మొహం పీక్కుపోయింది. జుట్టు కూడా సరిగా దువ్వుకోలేదు.

"చెప్పండమ్మా! నావల్ల మీకు ఏం సహాయం కావాలి?" అడిగాడు యుగంధర్.

"మామగారు బతికున్న రోజుల్లోనే యింటిమీద అప్పు తీసుకున్నారు. మావారికి వచ్చే జీతంలో యిల్లు గడవడమే కష్టం. ఇక అప్పు ఎక్కడ తీర్చగలం? మాకు యిద్దరు పిల్లలు. అసలూ, వడ్డీ కలసి, ఎక్కువయి యిల్లు వేలానికి వచ్చింది. వేలం వెయ్యనవసరంలేదనీ, యిల్లు తీసేసుకోమనీ, అప్పు యిచ్చిన ఆయనకి మావారు చెప్పారు. ఒక చిన్న అద్దెయిల్లు స్కూలుకి దగ్గిరగా తీసుకున్నారు. మొదటి తేదీకి యిల్లు ఖాళీచేస్తామన్నాము. అందుకని, అనవసరమైన వస్తువులు—తాతలనాటివి అటకలమీదా, అలమారుల్లో వున్నవీ, అన్నీ పారెయ్యాలని మా వారు అన్నీ తనిఖీ చేస్తున్నారు.''

"ఎప్పుడూ?'' అడిగాడు యుగంధర్.

"అయిదురోజులయింది. ఆ రాత్రి అంతా అటకమీద వున్న పెట్టెలని దింపి, తనిఖీ చేస్తూ అసలు నిద్రేపోలేదు. తెల్లారిన తర్వాత మొహం కడుక్కుని, కాఫీ తాగి, బయటికి బయలుదేరారు. 'ఎక్కడికి?' అని అడిగాను? ముఖ్యమంత్రిని చూడటానికి అన్నారు. 'నిజం చెప్పండి!' అన్నాను. 'నిజమే చెపుతున్నాను' అని ఒక రిక్షా తీసుకువచ్చి అందులో ఒక పాత పెట్టె పెట్టుకుని వెళ్ళిపోయారు. ఎప్పుడూ, ఏ మంత్రినికానీ, ఏ వుద్యోగినికాని, ఏదీ అడగని మావారు, ముఖ్యమంత్రిని కలుసుకోవడానికి, ఒక పెట్టె తీసుకుని వెళుతున్నారంటే నమ్మలేకపోయాను. ఏదో ఆతురతలో వున్న ఆయన్ని ప్రశ్నలతో—వేధించడం యిష్టం లేక, నేను వూరుకున్నాను. ఆ రోజంతా ఆయన తిరిగి రాలేదు" అని ఏడ్వటం ప్రారంభించింది శకుంతల; ముతక ఖద్దరు చీరకొంగుతో కళ్ళు తుడుచుకుంటూ.



"ఎప్పుడు తిరిగివచ్చారు?" అడిగాడు యుగంధర్.

"అసలు తిరిగిరాలేదు. ఆ రాత్రి అంతా కన్ను మూయ్యకుండా కాచుకున్నాను. మర్నాడూ రాలేదు. తర్వాత పోలీస్ కంప్లయింట్ యిచ్చాను."

"పోలీసులు దర్యాప్తు చేసి ఏమైనా తెలుసుకున్నారా?"

"లేదండీ. ఈ నాలుగురోజులూ, రోజూ, పదిసార్లు పోలీసుస్టేషనుకి వెళ్ళి అడుగుతూనే వున్నాను. ఇంకా ఏమీ తెలియలేదనీ, తెలియగానే చెప్తామనీ అంటారు. అంతే! నా దగ్గిర డబ్బులేదు. బీదవాళ్ళం. మా మాటకి విలువ ఎవడు యిస్తారు. నేను ఏ కార్లోనో పోలీస్ స్టేషన్ ముందు దిగితే—"

"మీరెవరో—మీ మామగారు ఎవరో—మీవారు ముఖ్యమంత్రిని కలుసుకోవడానికి వెళ్ళారనీ—యివన్నీ మీరు పోలీసులకి చెప్పలేదా?" అడిగాడు యుగంధర్ అసిస్టెంటు రాజు.

"చెప్పానండీ! అంతా చెప్పాను. ఆఖరికి మా మామగారి తండ్రి రావుబహదూర్ శేషయ్యగారి పేరుకూడా చెప్పాను. పోలీసులు ఎక్కువగా పట్టించుకోవడంలేదు. ఎవరో బీద స్కూలు టీచరు, ఏమయితేనేం అనే వుపేక్ష. మీకూ నేను ఏమీ యిచ్చుకోలేను - మీ పాదాలకి నమస్కారం పెట్టటం తప్ప. ధనం ప్రధానం కాదనీ, న్యాయమూ, ధర్మమూ, నీతీ, మీకు ప్రధానమనీ అందరూ చెప్పుకోగా విన్నాను. దయచేసి, మావారు—" అని మళ్ళీ ఏడ్వడం ప్రారంభించింది శకుంతల. కాత్యా వేడి కాఫీ తెచ్చి బల్లమీద పెట్టి, "తాగండి!" అన్నది.

"అమ్మా! దేశంకోసం సర్వమూ త్యజించి, ఏ ప్రతిఫలమూ, కోరని మీ మామగారు చలపతిరావుగారు; తండ్రి పేరుప్రతిష్ఠలని వుపయోగించుకోకుండా, ఒక అనామకుడిగా—బ్రతుకు భారం మోస్తున్న మీ భర్త గోవర్ధనంగారూ, యిలాటివారు చాలా అరుదు. మీరు నాకు ఏమీ యివ్వనవసరంలేదు. గోవర్ధనంగారు ఏమయ్యారో తెలుసుకోవడం—మీ కుటుంబానికి సేవచెయ్యడం నా భాగ్యం" అన్నాడు యుగంధర్.

* * *

"రండి యుగంధర్! ఏమిటి యిలా వచ్చారు?" అడిగారు ముఖ్యమంత్రి ప్రతాప

రావు బట్టతలమీద వున్న గాంధీ టోపీ తీసి, సర్దుకుని మళ్ళీ పెట్టుకుంటూ. డబ్బయి ఏళ్ళ పైన వున్నాయి.

"స్వామినాధుల చలపతిరావుగారి పేరు మీకు జ్ఞాపకం వుందా?'' అడిగాడు యుగంధర్.

"అయ్యయ్యో! ఆయన్ని ఎలా మర్చి పోతాం! ఉత్తమోత్తముడు."

"ఆయన కుమారుడు గోవర్ధనరావు—"

"అవును. స్కూలుటీచరునని చెప్పాడు! చాలా యిబ్బందులలో వున్నాననీ, యిల్లు వేలం వేస్తున్నారనీ—సహాయం కావాలనీ అడి గాడు.''

"ఊ!"

"నేను అప్పుడు చాలా తొందరలో వున్నాను. అత్యవసర క్యాబినెట్ మీటింగ్ వుంది. చలపతిరావుగారి కొడుకు దరిద్రంతో వీధులపాలవుతున్నాడంటే నాకెంతో కష్టమని పించి, మర్నాడు పొద్దునరమ్మనీ, పార్టీ నిధి లోంచి, డబ్బు తీసుకుని యివ్వగలనని చెప్పాను. ప్రభుత్వం డబ్బు ఎలా యివ్వగలను చెప్పండి!"

"గోవర్ధనరావు—"

"థాంక్స్ చెప్పి వెళ్ళిపోయాడు. మూడు రోజుల క్రితం పోలీసు కమిషనర్ నన్ను గోవర్ధనరావు గురించి అడిగాడు. ఇదే విషయం చెప్పాను. ఏమైంది....?" అడిగాడు ముఖ్య మంత్రి.

"అప్పటినించీ గోవర్ధనరావు జాడలేదు. మీ దగ్గిరికి వస్తున్నానని చెప్పి వెళ్ళిన మనిషి మళ్ళీ యింటికి రానేలేదుట."

"పాపం! సహాయం చెయ్యడం యిష్టం లేకనే నేను తప్పించుకునేందుకు అలా అన్నా నని గోవర్ధనరావు అనుకోలేదుకదా!నిస్పృహతో ఏ దారుణానికీ పూనుకోలేదు కదా!"

"అదే తెలియదు. గోవర్ధనరావుని గురించి మీకు యింకా ఏమైనా తెలుసా?'' అడిగాడు యుగంధర్.

"అబ్బే! అదే అతన్ని మొదటిసారి చూడడం'' అంటూ చేతిగడియారం చూసు కున్నాడు. అంటే యిక వెళ్ళమని సంజ్ఞ. యుగంధర్ లేచాడు. "గోవర్ధనరావు కన్పిస్తే చెప్పండి - డబ్బు విషయం బెంగపడవద్దని" చెప్పాడు ముఖ్యమంత్రి.

* * *

"హల్లో మిస్టర్ యుగంధర్. కూవా నీడలా వుండే రాజు రాలేదా? ఏమిటి విశేషం?" అడిగాడు ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు. యుగం ధర్ చెప్పాడు.

"యస్. యస్. డి. 13 స్టేషన్‌లో కంప్లె యింట్ యిచ్చింది ఆమె. క్రయిమ్ బ్రాంచికి కేసు ట్రాన్స్‌ఫర్ అయింది మొన్న. నేనే యిన్‌చార్జి. దర్యాప్తు చేస్తున్నాను." అన్నాడు స్వరాజ్యరావు.

"ఇప్పటికి ఏం తేలింది?" అడిగాడు యుగంధర్.

"గోవర్ధనరావు ఎక్కిన రిక్షా అతన్ని పట్టుకున్నాము. సదరన్ బాంక్‌కి ఒక పెట్టెతోసహా గోవర్ధనరావు వెళ్ళాడనీ రిక్షా అతనికి డబ్బుయిచ్చి పంపేశాడనీ తెలి సింది. ఒక బరువైన తుప్పుపట్టిన పెట్టెని గోవర్ధనరావు బాంకిలో సేఫ్ కస్టడీలో పెట్టి వెళ్ళిపోయాడనీ తెలిసింది. కాలి నడకన వెళ్ళాడో, ఎందులో వెళ్ళాడో తెలియదుకాని, తర్వాత ముఖ్యమంత్రిని కలుసుకుని, ధన సహాయం కోరాడనీ తెలిసింది. మళ్ళీ మంత్రి యింట్లోంచి బయటికి వెళ్లిన మనిషి-ఏమ య్యాడో, తర్వాత జాడలేదు - గాలిలో మాయ మైనట్లు." అన్నాడు స్వరాజ్యరావు.

"బాంకిలో గోవర్ధనరావు పెట్టిన పెట్టె ఏమైంది?"

"అక్కడే వుంది. ఆ పెట్టెలో వస్తువులని బట్టి అతని జాడలు తెలుస్తాయేమోనని, ఆ పెట్టె తెరిచి చూశాము. ఆ పెట్టెలో చీపురు పుల్ల కూడా లేదు."

"కాళీ తుప్పుపట్టిన పెట్టెను గోవర్ధనరావు అంత జాగ్రత్తగా పెట్టాడంటే వింతగా లేదూ. బరువైన పెట్టె అని రిక్షా అతను చెప్పాడు కదా!"

"అవును. ముఖ్యమంత్రి, కమిషనర్‌కి, కమిషనర్ నాకు ఫోన్‌చేసి అడిగారు పెట్టెలో

ఏమున్నాయని? వాళ్ళు ఆశ్చర్యపోయారు?" అన్నాడు స్వరాజ్యరావు.

"బాంకిలో గోవర్ధనరావు పెట్టె పెట్టిన తర్వాత, అది తెరిచి, అందులో వస్తువులు ఎవరో అపహరించి వుండడానికి అవకాశం వుందా?" అడిగాడు యుగంధర్.

స్వరాజ్యరావు రెండు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించి, "అదే నా అనుమానమూ! పెట్టె తాళం; ఏ దబ్బనంతోనో తీసినట్టు గుర్తు లున్నాయి. అంతేకాదు, గోవర్ధనరావు పెట్టె బాంకిలో పెట్టిన రాత్రి, ఆ బాంకిలో దొంగ పడ్డాడు. డబ్బు ఏమీ పోలేదు" అన్నాడు స్వరాజ్యరావు.

"థాంక్స్! గోవర్ధనరావు భార్య శకుంతలా దేవి నా సహాయం కోరింది. మీ దర్యాప్తులో ఏమైనా విశేషాలు తెలిసినా! గోవర్ధనరావు దొరికినా దయచేసి వెంటనే నాకు ఫోన్ చెయ్యండి!" అన్నాడు యుగంధర్.

*　　*　　*

"పైకి కనిపిస్తున్నంత సులభమైన కేసు కాదు యిది." అన్నాడు యుగంధర్ రాజుతో.

"అంటే?" అడిగాడు రాజు.

"ఏనాడు, ఎవర్నీ ఏమీ అడగని గోవర్ధన రావు ముఖ్యమంత్రిని ధన సహాయంకోసం కలుసుకున్నాడంటే అది గోవర్ధనరావు నైజా నికి విరుద్ధంగా వుంది. బాంకిలో గోవర్ధనరావు ఖాళీపెట్టె పెట్టలేదని తెలుస్తోనే వుంది. బాంకిలో ఆ రాత్రి దొంగలు పడడం—డబ్బు ఏమీ తీసు కోకపోవడం కూడా వింతగా వుంది. ఆ దొంగలు గోవర్ధనరావు పెట్టిన పెట్టెలో వస్తు వులు తీసుకున్నారని మనం వూహించడంలో తప్పు లేదు అనుకుంటాను" అన్నాడు యుగంధర్.

"ముఖ్యమంత్రి యింటినించి బయలుదేరిన గోవర్ధనరావు ఏమైనట్టు?" అడిగాడు రాజు.

"అది తెలిస్తే కేసే పూర్తవుతుంది. అతను పెట్టిన పెట్టెలో ఏముందో తెలుసుకోవాలి ముందు" అన్నాడు యుగంధర్.

*　　*　　*

యుగంధరు, రాజూ, సదరన్ బేంకుకి వెళ్లారే కాని కొత్త విషయాలు ఏమీ తెలియ లేదు. సైకిల్ రిక్షా అతన్ని కలుసుకుని, తరచి, తరచి ప్రశ్నలు అడిగారు—ప్రయోజనం లేక పోయింది.

"రాజూ! గోవర్ధనరావు యింటికి వెళ్ళి అతని ఫొటో ఒకటి తెచ్చుకో. తర్వాత ఆ ఫోటో, ముఖ్యమంత్రి యింటిముందు కాపలా వుండే జవానుకి చూపించు. ఏమైనా తెలుస్తుం దేమో కనుక్కో!" అని రాజుకి చెప్పి, తర్వాత కాత్యాని పిలిచి, "ఊళ్ళో ఉన్న అన్ని బేంకు లకీ వెళ్ళు. ఏ ఒక్క బేంకునీ వొదిలిపెట్టక. గోవర్ధనరావు ఏ బేంకులోనైనా ఏ పెట్టో ఏ వస్తువో దాచాడేమో తెలుసుకో" చెప్పాడు యుగంధర్.

*　　*　　*

"క్షమించండి యుగంధర్! మీరు కోరిన పని చెయ్యలేను. చెయ్యడానికి అధికారాలూ లేవు. అంతేకాదు. అంతటి తీవ్ర చర్యకి ఆధా రమూ లేదు" అన్నాడు కమిషనర్ ఆఫ్ పోలీస్.

"ముఖ్యమంత్రి పదవినిబట్టి మీరు భయ పడుతున్నారు కాని, ఆధారము లేదు అని అన కండి. గోవర్ధనరావు ముఖ్యమంత్రి యింటికి వెళ్ళినట్లు నిదర్శనం వుంది. ముఖ్యమంత్రే వొప్పుకున్నారు. కాని గోవర్ధనరావు ఆ యింట్లోంచి బయటికి వచ్చినట్లు నిదర్శనం లేదు."

"గోవర్ధనరావు లాటి వాళ్ళు బయటికి వెళ్ళడం ఎవరూ జ్ఞాపకం పెట్టుకోరు. జ్ఞాప కమూ వుండదు—ముఖ్యమంత్రి యింట్లోంచి గోవర్ధనరావు బయటికివెళ్ళలేదని తెలిస్తేకాని- అంతేకాదు—గోవర్ధనరావుని అక్కడే బల వంతంగా వుంచేయడానికి తగిన కారణంవున్న దని నిర్ధారణ అయితేకాని—"

"ఆల్‌రైట్! ఎనివే థాంక్యు" అన్నాడు యుగంధర్.

"మిస్టర్ యుగంధర్! జాగ్రత్త! ముఖ్య మంత్రి అవసరమైనపుడు చాలా కఠినంగా

వుండగలరు" అన్నాడు పోలీసు కమిషనర్.

*　♦　*

గోవర్ధనరావు ఫోటో సంపాదించి, తీసు కెళ్ళి, ముఖ్యమంత్రి యింటిముందు కాపలా వుండే యిద్దరు పోలీసు కాన్‌స్టేబుల్సుకి చూపించి-అడిగానని, రెండు గంటల తరవాత రాజు వచ్చి చెప్పాడు యుగంధర్‌కి.

"ఏమన్నారు?" అడిగాడు యుగంధర్.

"గోవర్ధనరావు కాలినడకనే వచ్చాడుట. ముఖ్యమంత్రిని కలుసుకోవాలని చెపితే ఆ కాపలాదారు వెళ్లనివ్వలేదుట. అప్పుడు కాయితంమీద తన పేరు, తన తండ్రి పేరు, తన తాత రావుబహదూర్ శేషయ్యగారి పేరు వ్రాసి, ముఖ్యమంత్రికి యివ్వమన్నాట్ట గోవర్ధనరావు. ఆ చీటీ లోపలికి పంపించిన వెంటనే ముఖ్యమంత్రి ప్రతాపరావు, గోవర్ధనరావుని లోపలికి పంపించమని అనుమతి యిచ్చారట."

"తరవాత?" యుగంధర్ అడిగాడు.

"గోవర్ధనరావు తిరిగి వెళ్లటం కాపలా వున్న పోలీసు జవాన్లు చూడలేదుట. గోవర్ధనరావు బయటికి వెళ్ళలేదని వాళ్లు నిశ్చయంగా చెప్పలేకుండా వున్నారు. లోపలికి వెళ్ళేవాళ్ళ విషయమే ఆ జవానులు ఎక్కువగా పట్టించుకుంటారుగాని, బయటికి వెళ్ళేవాళ్ల విషయం అట్టే గమనించరుట" అంటూ రాజు చిన్న నవ్వు నవ్వాడు.

"ఏమిటి రాజూ! ఇంకేదో ముఖ్యమైన విషయం తెలుసుకొన్నట్టున్నావు?" అడిగాడు యుగంధర్.

రాజు తల వూపి, "బాంక్‌లో దొంగతనం విషయం—క్షమించండి. మీరు చెప్పిందే—" అంటున్నాడు రాజు.

"ఊఁ! ఏమటి?" పురమాయించాడు యుగంధర్.

"గజదొంగ పెరుమాళ్—బాంక్ దొంగతనాలలో ఆరితేరినవాడు జ్ఞాపకం వున్నాడా?"

"ఆఁ! జైలునుంచి వచ్చి నాలుగేళ్ళు అయింది. దొంగతనాలు మానేసి; చిన్న కొట్టు ఏదో పెట్టుకొని, పెరుమాళ్ నిజాయితీగా బతుకుతున్నాడుగా" అన్నాడు యుగంధర్.

"అతనిని కలుసుకున్నాను. సదరన్ బాంక్‌లో దొంగతనం చేసినది అతనే, పెరుమాళే" చెప్పాడు రాజు.

"తనేనని ఒప్పుకొన్నాడా? ఎలా ఒప్పించావు?" అడిగాడు యుగంధర్ ఆశ్చర్యంతో.

"మేమిద్దరం తప్ప ఇంకెవరు లేరు. అతను నాతో ఏం చెప్పినా, అది నిరూపించే సాక్ష్యం లేదు అని అతనికి తెలుసు. అందువల్ల గర్వంగా చెప్పాడు. గోవర్ధనరావు ముఖ్యమంత్రి ఇంటికి వెళ్ళిన సాయంకాలం, ఎవరో ఒక మనిషి—మారువేషంలోనే వున్నాడని చెప్పాడు—పెరుమాళ్‌ని కలుసుకొన్నాడు. గోవర్ధనరావుని బాంక్‌లో పెట్టిన పెట్టె గుర్తులు చెప్పి; పెరుమాళ్‌ని సదరన్ బాంక్‌లో ప్రవేశించి మర్నాటికల్లా ఆ పెట్టెలో వస్తువులు తెచ్చి యిమ్మన్నాడట. ఆ మనిషి ఆ పని చేస్తే ఒక లక్షరూపాయలు యిస్తానని చెప్పి పదివేల రూపాయలు అడ్వాన్సు యిచ్చాడుట. అంతే కాదు పోలీసులు ఎక్కువగా పట్టించుకోరనీ-ధైర్యంగా దొంగతనం చేయవచ్చనీ ఆ మనిషి పెరుమాళ్‌కి చెప్పాడుట."

"తరువాత?" అడిగాడు యుగంధర్.

"ఆ రాత్రి పెరుమాళ్ సదరన్ బాంక్‌లో ప్రవేశించాడు. గోవర్ధనరావు పెట్టిన పెట్టె తెరిచి, అందులో వున్న వస్తువులు తెచ్చేశాడు."

"తెచ్చి?"

"ఆ రాత్రంతా తన యింట్లో ఆ వస్తువులు-వస్తువులు కావు—కాగితాలు; చెత్తకాగితాలు; చిరిగిపోయిన కాయితాలు—పాత స్కూలు పుస్తకాలు, అన్నీ పెరుమాళ్ పరీక్షగా చూశాడట. వాటిలో విలువయినది ఏదీ పెరుమాళ్‌కి కనిపించలేదు. మర్నాడు పొద్దున్న మారువేషంలో వున్న ఆ మనిషి రాగానే పెరుమాళ్ ఆ కాయితాలు అతనికి యిచ్చేశాడు. అతను మిగతా తొంభై వేలు పెరుమాళ్‌కి యిచ్చాడు." చెప్పాడు రాజు.

అంతలో కాత్యా తిరిగి వచ్చింది. "సారీ

సర్! గోవర్ధనరావు ఇంక ఏ బాంక్‌లోను ఏ పెట్టె, ఏ వస్తువు పెట్టలేదు" అన్నది.

యుగంధర్ నిట్టూర్చాడు.

"పోలీసులకి తెలియని విషయం ఒకటి తెలుసుకొన్నాను" అన్నది కాత్యా గర్వంగా.

"ఏమిటది?"

"గోవర్ధనరావు సదరన్ బాంక్ నుంచి తిన్నగా ముఖ్యమంత్రి యింటికి వెళ్ళలేదు. మౌంట్‌రోడ్డుకి వెళ్లాడు. అక్కడ ఒక షాపులో ఒక చిన్న బ్రీఫ్‌కేసు కొని, అందులో, ఏవో ఫొటోలు; డైరీలు; కొన్ని కాయితాలు; పెట్టి తాళంవేసి, అక్కణ్ణించి సెంట్రల్‌స్టేషన్‌కి వెళ్లాడు."

"వెళ్ళి?"

"స్టేషన్‌లో ఏం చేసిందీ తెలియదు" అన్నది కాత్యా.

"పోలీసువాళ్ళు యీ వివరాలు ఎందుకు తెలుసుకోలేకపోయారు?" అన్నాడు యుగంధర్.

"ఏమో! సరిగా దర్యాప్తు చేయలేదేమో. సదరన్ బ్యాంక్‌వద్ద ఉన్న బస్సుస్టాప్ వద్ద ఆగి, వచ్చే పోయే బస్సు కండక్టర్ల ద్వారా కనుక్కొన్నాను" అన్నది కాత్యా.

"వెరీగుడ్" అన్నాడు యుగంధర్.

* * *

తలుపు చప్పుడు కాగానే, శకుంతల తలుపు తెరిచి యుగంధర్ని చూసి "రండి! కూర్చోండి! కాఫీ...." అని లోపలికి వెళ్ళిపోతోంది.

"వద్దమ్మా! ఒక ప్రశ్న అడగడానికి వచ్చాను. మీ వారు కనిపించకుండా వెళ్ళిన తరువాత, పోస్టులో మీ పేర్నకాని, మీ వారి పేర్నకాని, ఏదైనా కవరు వచ్చిందా?" అడిగాడు యుగంధర్.

"ఆ! రిజిష్టర్ పోస్ట్‌లో ఒక కవరు



వచ్చింది. పోస్టుమాన్ తెలిసినవాడు—ఆయన పేర్న వున్నా నా సంతకం తీసుకొని యిచ్చేశాడు." చెప్పింది శకుంతల.

"కవరులో ఏముంది?"

"ఒక కాయితము. రైల్వేకి సంబంధించినది—తెచ్చిస్తాను" అని శకుంతల లోపలకి వెళ్ళి క్షణంలో తిరిగివచ్చి, యుగంధర్‌కి ఒక కవరు యిచ్చింది. రైల్వేస్టేషన్ లెఫ్టు లగ్గేజ్ వారు యిచ్చిన రశీదు ఆ కవరులో వుంది. ఆ రశీదును పరీక్షగా చూస్తూ, "అమ్మా! ఈ రశీదు నేను తీసుకెళ్తాను" అన్నాడు యుగంధర్.

"తీసుకెళ్ళండి. మా వారు—"

"బతికే వున్నారనే అనుకొంటాను. మళ్ళీ వస్తాను" అని యుగంధర్ అక్కడనుంచి బయలుదేరాడు.

* * *

నాలిక ఎండిపోతోంది. ఆరు రోజులయింది- స్నానంచేసీ, గడ్డం గీసుకొనీ, బట్టలు మార్చుకొనీ. నిద్ర కూడా లేదు. అలా కునుకుపట్టి కళ్ళు మూసుకుపోతూ వుంటే మళ్ళీ వస్తారు.

"చెప్పు—ఎక్కడ పెట్టావు? బాంక్‌లో పెట్టిన పెట్టెలో చెత్త కాయితాలు తప్ప ఇంకేమీ లేవు."

"చెప్పను."

"అయితే యిలా నోరు ఎండి చస్తావు."

"సరే—"

రెండు మూడుసార్లు సూదులతో గుచ్చి హింసించారు. ఆ చిత్రహింసకి తను లొంగకపోయేటప్పటికి మానేశాడు.

"ఈరోజు ఆఖరిరోజు. చెప్పకపోయావా! నీ భార్య—పిల్లలు, చస్తారు. వాళ్ళ శవాలను చూపిస్తాను" అని చెప్పి వెళ్ళిపోయాడు. కర్కశులు. అన్నంత పనీ చేస్తారు. తన భార్య పిల్లల ప్రాణాలను బలివ్వడమా? నిజం చెప్పడమా. ఇతనొక్కడే కాదు, దేశంలో, ఎంతో మంది, ఒకనాటి దేశద్రోహులు ఈ నాటి దేశ నాయకులుగా చెలామణి అవుతూ, దేశాన్ని దోచుకొని ప్రజలను పీడిస్తున్నారు. చెప్పేస్తే- తన భార్య పిల్లల ప్రాణాలను రక్షించుకొనేందుకు—తన స్థితిలో తన తండ్రి చలపతిరావుండివుంటే ఏం చేసేవారో ఏమో! ఎవరో వస్తున్నారు. ఏం చేయాలి? చెప్పెయ్యాలి. చెప్పేసి—యీ నరకాన్నించి తప్పించుకోవాలి. తన భార్యా పిల్లలను రక్షించుకోవాలి.

* * *

లెఫ్టు లగ్గేజ్ కౌంటర్‌లో వున్న గుమాస్తా రాజుని సరిగా కూడా చూడలేదు. రశీదు తీసుకొని సంతకం పెట్టించుకొని ఒక బ్రీఫ్‌కేసు రాజుకు యిచ్చాడు.

* * *

"యస్ సార్. వెంటనే పంపిస్తాను" అని రిసీవర్ పెట్టేసి, ఐజి ఆఫ్ పోలీస్ తన పర్సనల్ అసిస్టెంటుని పిలిచి, "గోవర్ధనరావు పేర్న లెఫ్ట్ లగ్గేజ్ ఆఫీసులో రైల్వేస్టేషన్‌లో ఒక బ్రీఫ్‌కేసు వుందిట. దాన్ని వెంటనే తీసుకొని తనకి తెచ్చి యివ్వమని ముఖ్యమంత్రి ఫోను చేసి చెప్పారు. త్వరగా వెళ్ళు" అన్నాడు.

* * *

"మిస్టర్ రాజు! ఆగండి!"

కారు స్టార్టు చేస్తున్న రాజు, "ఆ! ఎవరు?" అడిగాడు.

"నేను ఐ.జీ. పి.ఏ.ని. ఇదిగో నా ఐడెంటిఫికేషన్ కార్డు. గోవర్ధనరావు బ్రీఫ్‌కేసు, మీరు అతని సంతకంపెట్టి తీసుకొన్నారు. దయచేసి ఆ బ్రీఫ్‌కేసు యిలా యివ్వండి" అన్నాడు ఐ. జి ఆఫ్ పోలీస్ పి. ఏ.

"ఇది మీకివ్వను. నేనే స్వయంగా ఐ. జి. ఆఫ్ పోలీసుకి తెచ్చి యిస్తాను," అన్నాడు రాజు.

"నాకు యిచ్చినా ఐ. జి.కి యిచ్చినా ఒకటే. వెంటనే ముఖ్యమంత్రికి యీ బ్రీఫ్‌కేసు అందజేయాలి. యీ బ్రీఫ్‌కేసు ద్వారా గోవర్ధనరావు ఆచూకీ తెలుస్తుందని ముఖ్యమంత్రి కబురు పంపారు. మీరు ఆ బ్రీఫ్‌కేసు తక్షణం నాకివ్వకపోతే మిమ్మల్ని అరెస్టుచేసి—" అంటున్నాడు అతను. ఆలోగా రాజు కారు స్టార్టుచేసి, స్పీడ్‌గా తోలుకు వెళ్ళిపోయాడు.

దరిదాపుల్లో వున్న ట్రాఫిక్ పోలీస్ ఇన్

స్పెక్టర్‌ని పిలిచి, "నేను ఐ. జి. పి.ఏ.ని. ఆ కారులో ఒక దొంగ బ్రీఫ్‌కేసు తీసుకొని పారి పోతున్నాడు. అతన్ని వెంబడించి పట్టుకొని, లాకప్‌లో పెట్టి ఆ బ్రీఫ్‌కేసుని తిన్నగా ముఖ్య మంత్రి యింటికి తీసుకురండి" అని ఆజ్ఞాపిం చాడు ఆ పోలీసు అధికారి.

ఒక జీపు—రెండు మోటార్‌సైకిళ్ళు తనని వెంబడిస్తున్నాయి. పైగా వాళ్ళు పోలీసు సైరన్ వేసుకొని వస్తున్నారు. ఆ బ్రీఫ్‌కేసు వాళ్ళకి చిక్కకూడదు. ఆ దృఢనిశ్చయంతో రాజు కారు స్పీడు పెంచాడు. ట్రాఫిక్ రూల్స్ పాటించడంలేదు. అయినా వాళ్ళు తనని కలుసు కొంటారు. పట్టుకొంటారు. ఆలోగా—బ్రీఫ్ కేసు—ఏం జెయ్యాలి? ఆలోచిస్తున్నాడు రాజు.

* * *

ముఖ్యమంత్రిని గురించిన విశేషాలు, వివ రాలు, వున్న ఫైలు తీసి చదువుతున్నాడు యుగంధర్. ఒక పేరా పదే పదే చదివాడు. ముఖ్యమంత్రికి అంత మూఢ నమ్మకమా? కాసేపు ఆలోచించి, ఒక నిశ్చయానికి వచ్చి, ఆ ఫైలు అలుమారులో పెట్టేసి, లేచి వాచీ చూసుకొన్నాడు. ఏమయ్యాడు రాజు? స్టేషనుకి వెళ్ళిరావడానికి యింత ఆలస్యమవుతుందా? అంతలో టెలిఫోన్ మోగింది. "యస్ యుగం ధర్ స్పీకింగ్" అన్నాడు.

"ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావు హియర్! మిస్టర్ యుగంధర్ చట్టాన్ని మీరు యిలా బాహాటంగా వుల్లంఘిస్తారని నేను ఎన్నడూ అనుకోలేదు."

"నేను ఏం చేశాను యిన్‌స్పెక్టర్?"

"గోవర్ధనరావు, రైల్వేస్టేషన్ లెఫ్ట్ లగేజ్ రూమ్‌లో ఒక బ్రీఫ్‌కేసు పెట్టాడని, మీకు తెలిసినపుడు, ఆ కేసు యిన్వెస్టిగేటింగ్ ఆఫీ సర్ అయిన నాకు మీరు వెంటనే తెలియ జేయవలసింది. అలా చేయకుండా, రాజుని పంపి, గోవర్ధనరావు సంతకం ఫోర్జరీ చేయించి ఆ బ్రీఫ్‌కేసుని తీసుకురమ్మని చెప్పడం చట్ట విరుద్ధంకాదా? రాజు ఆ బ్రీఫ్‌కేసు తీసుకొని వెళ్ళుతున్నప్పుడు ఐ. జి. ఆఫ్ పోలీసు పి.ఏ. రాజుని అడ్డగించి ఆ బ్రీఫ్‌కేసు తన కివ్వమని రాజుని అడగగానే; మీ అసిస్టెంట్ రాజు ఆ బ్రీఫ్‌కేసు యివ్వకుండా కారులో పారిపోవడం నేరంకాదా! ఐయామ్ వెరీ సారీ మిస్టర్ యుగం ధర్! రాజుని అరెస్టుచెయ్యమని—మిమ్మల్ని కూడా వెంటనే అరెస్టు చేయమని ముఖ్య మంత్రి ఆజ్ఞ యిచ్చారు. యివి ఎమర్జన్సీ రోజులని మీరు మరచిపోయారేమో! నేరం ఆరోపించవలసిన అవసరం కూడా లేదు. ఎంత కాలం అయినా మిమ్మల్ని డిటెన్షన్‌లో వుంచ వచ్చు. వస్తున్నాను" అని స్వరాజ్యరావు టెలి ఫోన్ పెట్టేశాడు.

యుగంధర్ లోలోన నవ్వుకున్నాడు. తనని అరెస్టు చేయడం స్వరాజ్యరావుకి యిష్టంలేదు. పై అధికారుల ఆజ్ఞలని పాటించకుండా వుండనూలేడు. అందుకే ముందుగా హెచ్చ రించాడు. రాజు ఏమయ్యాడు? రాజు సమ ర్థుడు. పోలీసులకి చిక్కడు. ఆ బ్రీఫ్‌కేసు వాళ్ళకి యివ్వడు. ఆ ధైర్యంతోనే మేకప్ రూములోకి వెళ్ళాడు యుగంధర్.

* * *

ముఖ్యమంత్రి ప్రతాపరావు నమస్కారం చేసి, పాదాలని తాకి, కళ్ళకు అద్దుకొని, "స్వామీజీ! మీ రాకతో నా యిల్లు పావనం అయింది" అన్నాడు.

"శుభం! శుభం! నా పూర్తిపేరు స్వామి సిద్ధానంద సంపూర్ణానంద సంపూర్ణానందం. నన్ను నా శిష్యకోటి 'మహర్షి' అంటారు. పన్నెండేళ్ళపాటు హిమాలయాలలో తపస్సు చేసి, యిటీవలే దేశ సంచారం బయలు దేరాను. భగవంతుడిపట్ల భక్తి, భగవంతుడి అనుచరులపట్ల గౌరవము మీకు అపారంగా వున్నాయని తెలిసి యిక్కడికి వచ్చాను. మీ రాష్ట్రంలో నేను ఒక ఆశ్రమం—"

"మేము అదృష్టవంతులం. స్వామీజీ! తమరు ఎక్కడ బస చేశారు?" అడిగాడు ముఖ్యమంత్రి.

"ఎక్కడా యింకా బస చేయలేదు. ఆకాశ

స్వయం ఉపాధికి సోపానాలు

నేటి యువతరానికి గుదిబండలా తయారైంది నిరుద్యోగ సమస్య. దీన్ని మనం దృఢనిశ్చయంతో తొలగించుకోవాలి. అందరికీ ఉపాధి కల్పించాలి.

ఈ బృహత్తర కృషిలో భాగంగానే విద్యావంతులైన నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడానికి 1978 ఆగస్టు 15 వ తేదీన రు. 5 కోట్ల ఖర్చుతో కూడిన ప్రత్యేక ఉపాధి పథకాల్ని ప్రారంభించారు.

1976-77 సంవత్సరం రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరిగాయి. ఉపాధి కేంద్రాల ద్వారా 52,876 మందికి ఉద్యోగాలు కల్పించారు. గత సంవత్సరం కన్నా 34 శాతం ఎక్కువమంది ఉద్యోగాలు పొందారు.

సన్నకారు రైతుల అభివృద్ధి లాభసాటిగాని రైతులు, వ్యవసాయ కూలీల పథకం; క్షామపీడిత ప్రాంతాల అభివృద్ధి; పశుగణాభివృద్ధి మొదలైనవి ఎన్నో కార్యక్రమాలు ఇప్పుడు అమలు జరుగుతున్నాయి. వీటివల్ల 15 లక్షలమంది సన్నకారు రైతులు, లాభసాటిగాని రైతులలో 6.58 లక్షల మంది ప్రయోజనం పొందారు.

2½ ఎకరాల మాగాణీ, 5 ఎకరాల మెట్టభూమిగల సన్నకారు రైతులను భూమి శిస్తునుంచి మినహాయించారు.

ఉత్సాహంతో స్వయం ఉపాధి సోపానాలను అధిరోహిద్దాం. నిరుద్యోగ సమస్యకు చరమగీతం పాడుదాం.

డై. జ. స. పౌ. శా.
31/78-79

కోనలో స్నానంచేసి, కాలినడకన తిన్నగా యిక్కడికే వచ్చాను. రేపు, యిక్కడ మీ పేరున యీ రాష్ట్రంలో పాడిపంటలు సమృద్ధిగా భగవంతుడు ప్రసాదించాలని ఒక యజ్ఞంచేయ సంకల్పించాను. మీ సహకారం—"

"ఇది నా భాగ్యం. ఏం కావాలో చెప్పండి. అన్ని ఏర్పాట్లు చేయిస్తాను" అన్నాడు ముఖ్యమంత్రి.

"సర్వదా భగవంతుడి కటాక్షం మీకు కలుగుగాక. ఏదీ! చెయ్యి జాపండి!"

ముఖ్యమంత్రి రెండు చేతులూ జోడించి జాపాడు.

స్వామి సిద్ధానంద కుడిచెయ్యి గుప్పిట బిగించి చేతివేళ్ళు నలిపాడు. ఆ చేతివేళ్ల మధ్య నుంచి విభూతి పడింది ముఖ్యమంత్రి చేతిలో. ఆ విభూతిని కళ్ళకద్దుకొని, నొసట రాసుకొని "మీకు మేడమీద గది—"

తల వూపాడు సిద్ధానందస్వామి.

* * *

పూనమల్లి వచ్చింది. లారీలు, బస్సులు, జనసమ్మర్దం. రాజు చటుక్కున కారు ఆపి, బ్రీఫ్‌కేస్‌తోసహా అరక్షణంలో కారులోంచి దిగేసి—జనంలో కలిసిపోయాడు. పోలీసు జీపు వచ్చేలోగా జనంతోపాటు ఎక్కేశాడు బస్సు.

ఇటువంటి పరిస్థితుల్లో అవసరం కలుగుతుందనే—రద్దీగా వుండే బజారు వీధిలో, ఒక చిన్న ఆఫీసు—తనకీ, యుగంధరుకీ, కాత్యాకీ తప్ప ఎవరికీ తెలియనిది ఏర్పరుచుకొన్నారు. రాజు రహస్యమైన ఆ ఆఫీసుకి వెళ్ళి, యుగంధర్‌కి ఫోన్ చేసాడు. యుగంధరు పలకలేదు. కాత్యా పలికింది.

"పట్ర—తాట్ర—పట్ర—రాట్ర—వుట్ర-యిట్రి—యిమ్ట్రీ—టిట్రీ—కిట్రీ—స్వాట్రి—మిట్రీ — సిట్రీ—ద్ధాట్రా — నట్రా—అంట్రా—దట్రా—పేట్రు — రుట్ర—తోట్ర—వెట్రి—ళ్ళాట్ర—రుట్రు. అట్ర—క్కట్ర—డిట్రి—కిట్రి— ఫోట్రా—నుట్రు—చెట్రియ్యిట్రి — మాట్ర — రుట్రు—పేట్రు — రుట్రా—తోట్రా."

అని కాత్యా టెలిఫోన్ పెట్టేసింది. అది చాలా సింపుల్ కోడ్. 'ట్ర' అక్షరం తీసేస్తే చాలు. రాజుకి అర్థమయింది.

* * *

చీకటిపడింది. ముఖ్యమంత్రి ప్రతాపరావు స్వామిగారి గదికి వెళ్ళారు.

"స్వామీజీ! తమకి అన్ని సదుపాయాలు సరిగా వున్నాయా?" స్వామిగారు తల వూపారు.

"రేపు యజ్ఞానికి అన్ని ఏర్పాట్లు చేశాము."

"ధన్యవాద్" అంతలో టెలిఫోన్ మోగింది.

ముఖ్యమంత్రి రిసీవర్ తీస్తూ, "ఈ గదిలోంచి టెలిఫోన్ తీసేయమని చెప్పాను. స్వామిగారి దీక్షకు భంగం కలుగకూడదు. మర్చిపోయినట్లున్నారు" స్వామివారితో అని, "హల్లో! ఔను. అలాగా! అడుగుతాను" స్వామీజీవైపు తిరిగి, "స్వామీ! శంకర మఠానికి చెందిన ఒక సాధువు మీతో మాట్లాడాలిట" అన్నాడు ప్రతాపరావు.

"పేరు?"

"యోగిరాజా అని పేరు చెపుతున్నారు."

"యిట యివ్వండి!!" అని రిసీవర్ తీసుకొని, "శుభం! ఏం కావాలి? దర్శనమా? ఈ రాత్రా? వీలుకాదు. చెప్పండి యోగీ! ఆ! ఆ!" అయిదు నిమిషాలు అవతల మాటలు విని, రిసీవర్ పెట్టేసి, "రేపు యజ్ఞానానికి వస్తానని యోగిరాజా అర్థిస్తున్నాడు. రమ్మన్నాను."

"మీ దయ—" అన్నాడు ప్రతాపరావు.

స్వామీజీ కళ్ళు మూసుకొని, "ఓం! శాంతి స్వరూపిణీ-" అంటున్నాడు. ముఖ్యమంత్రి ప్రతాపరావు చప్పుడు చెయ్యకుండా గదిలోంచి వెళ్ళిపోయాడు.

○ ○ ○

గోవర్ధనరావు అతి కష్టంమీద కళ్ళు తెరిచాడు.

ఎదురుగా నిలుచున్న స్వామీజీని చూసి,

ఎవరు అని అడగబోయి, గొంతులోంచి మాట రాక అలా చూస్తూ వుండిపోయాడు.

"గోవర్ధనరావు! భయంలేదు. నిన్ను ఇక్కడ్నించి తప్పిస్తాను." అన్నాడు స్వామి.

గోవర్ధనరావు కళ్ళలో నీళ్ళు నిండాయి. నెమ్మదిగా తల విదిలించాడు. ఏదో చెప్పబోయి—చెప్పలేక వూపిరి తీసుకొని నోరు మూసుకున్నాడు. నోరు మూసుకుంటూ వూపిరి వదిలాడు. అదే ఆఖరు వూపిరి. గోవర్ధనరావు ప్రాణం వొదిలేశాడు. అతనికీ ఈ లోకానికి ఋణం తీరింది.

స్వామీజీ చకచకా గోవర్ధనరావుని పరీక్ష చేశాడు. దావాపు ఆరు రోజులుగా, తిండి-నీళ్లు-నిద్రలేక, హింసలకి తట్టుకోలేక; శరీరంలో శక్తి నశించి ప్రాణం పోయిందని తెలుసుకున్నాడు.

"స్వామీజీ! చేతులు పైకెత్తి పెట్టండి!" అన్న మాటలు వినిపించాయి. స్వామీజీ చేతులు పైకెత్తి వెనక్కి తిరిగాడు. ముఖ్యమంత్రి పిస్తోలు స్వామీజీవైపు గురిపెట్టి తలుపుదగ్గిర నిలుచుని వున్నాడు. తలుపు మూసివుంది.

"మీరు ఈ గదిలోకి ఎందుకు వచ్చారు? అతను మీకేం చెప్పాడు?" అడిగాడు ముఖ్యమంత్రి ప్రతాపరావు.

స్వామీజీ నవ్వాడు. "మిస్టర్ ప్రతాపరావు! నా పేరు స్వామి సిద్ధానంద కాదు. నేను డిటేక్టివ్ యుగంధర్ని."

ప్రతాపరావు నిమిషంపాటు మౌనంగా వుండి, "అలాగా! గోవర్ధనరావు మరణించాడా?" అడిగాడు.

"ఔను. మీరే అతన్ని హత్య చేశారు." అన్నాడు యుగంధర్.

ముఖ్యమంత్రి పకపకనవ్వి, "అతన్నేకాదు. మిమ్మల్ని కూడా హత్య చేస్తాను. అంతేకాదు బ్రీఫ్‌కేస్ తీసుకొని పారిపోయిన మీ అసిస్టెంటు రాజునికూడా చంపిస్తా."

యుగంధర్ కూడా నవ్వాడు. "యిందాక నాతో టెలిఫోన్‌లో మాట్లాడిన యోగిరాజా ఎవరోకాదు నా అసిస్టెంటు రాజు. బ్రీఫ్‌కేసులో వున్నవన్నీ చూసేశాడు. రాజు విమానంలో బయలుదేరి ఢిల్లీకి వెళ్ళిపోయాడు. ఈపాటికి ఢిల్లీలో దిగి హోటల్లో వుండివుంటాడు. పొద్దున్న పదిగంటలలోపున నానించి కబురు రాకపోతే, పత్రికలవారిని—ఉన్నత పోలీసు వుద్యోగులిని పిలిచి. వారిముందు ఆ బ్రీఫ్‌కేస్ తెరిచి, ఆ కాయితాలు, ఫోటోలు వాళ్ళకి యిచ్చేస్తాడు. నన్ను చంపినా మీకు శిక్ష తప్పదు—యింకో హత్య చేశారన్న ఆరోపణ తప్ప—"

"యుగంధర్! ఆ బ్రీఫ్‌కేసులో ఏముందో నిజంగా మీకు తెలుసా?" అడిగాడు ముఖ్యమంత్రి. యుగంధర్ తలవూపాడు.

"అయితే చెప్పండి" అడిగాడు ముఖ్యమంత్రి.

"గోవర్ధనరావు తాత చలపతిరావు డిప్యూటీ కలెక్టర్‌గా వున్న రోజుల్లో—" అంటూ ఒక వురుకున వెళ్ళి, ప్రతాపరావు చేతిలో వున్న పిస్తోలు కాలితో తన్నేసి, అతని రెండుచేతులు పట్టుకుని వెనక్కి మెలివేశాడు యుగంధర్. వృద్ధుడైన ప్రతాపరావుకి యుగంధర్‌తో కలియబడే శక్తిలేదు, ఆత్మధైర్యమూలేదు.

"గోవర్ధనరావు మిమ్మల్ని ఏం అడిగాడు?" యుగంధర్ ప్రశ్నించాడు.

"డబ్బిస్తానన్నాను—పెద్ద వుద్యోగం యిస్తానన్నాను—యింకా ఎన్నో ఆశలు చూపించాను. తనకి ఏమీవద్దని నన్ను రాజీనామాచేసి, రాజకీయాల్లోంచి విరమించుకోమనీ చెప్పాడు. తను చెప్పినట్టు నేను చేస్తే నా గతచరిత్ర వెల్లడి చెయ్యనని అన్నాడు. మొండిపట్టు పట్టాడు" చెప్పాడు ముఖ్యమంత్రి.

"గోవర్ధనరావు తాతగారు, రావు బహదూర్ శేషయ్యగారు, డిప్యూటి కలెక్టర్‌గా వున్న రోజుల్లో, మీరు కాంగ్రెసులో వాలంటీరుగా; తర్వాత ఆలిండియా కాంగ్రెసు కమిటీ సభ్యులుగా వున్నారు. కాని, కాంగ్రెసుకీ; స్వాతంత్ర్య వుద్యమానికీ వెనకనించి గోతులు తీశారు. ఎప్పటికప్పుడు కాంగ్రెసు నాయకుల నిర్ణయాలు, ఆలోచనలు, మీరు రావు బహదూర్ శేషయ్యగారికి తెలియచేసేవారు. అంతేకాదు,

క్విట్ యిండియా వుద్యమం జరిగినపుడు, మీరు ఎందరో కాంగ్రెసు కార్యకర్తలని, దేశభక్తులనీ, బ్రిటిష్ అధికారులకి పట్టియిచ్చారు. అందుకు పారితోషికంగా, బ్రిటిష్ ప్రభుత్వం, మీకు డబ్బు యిచ్చింది. ఈ వివరాలన్నీ, రసీదులతో, ఫోటోలతో, వుత్తరాలతో సహా రావుబహదూర్ శేషయ్యగారి పెట్టెలో వున్నాయి. అవి చూసిన గోవర్ధనరావు వూరుకోలేక—మిమ్మల్ని రాజీనామా చెయ్యమన్నాడు.

గోవర్ధనరావు కోరినట్లు—ఆరోగ్యం సరిగా లేని కారణం చెప్పి మీరు రాజీనామా చేసి వుండవలసింది. కాని ఎలా చేస్తారు! కీర్తికి పదవులకి అలవాటుపడ్డారు. ప్రతాపరావుగారూ! నేను వెళ్ళిపోతున్నాను. రేపు పదిగంటలకి మీ గతాన్ని గురించి సాక్ష్యాలతోసహా ప్రపంచానికి వెల్లడి చేస్తాను. ఆలోగా మీరేం చేస్తారో నిర్ణయించుకోండి. మరొక విషయం జ్ఞాపకం చేస్తున్నాను—గోవర్ధనరావు భార్య పిల్లలు ఏ ఆధారమూ లేనివాళ్ళయ్యారు. వాళ్ళకి మీరు తీరని అపచారము చేశారు. వెళ్తాను" అని యుగంధర్ గదిలోంచి వెళ్ళిపోయాడు.

○ ○ ○

ఎవరికీ తెలియని రహస్యమైన ఆఫీసు గదిలో రాజు, యుగంధర్ కూర్చొని వున్నారు.

యింకా సూర్యోదయం కాలేదు.

రాజు సిగరెట్ వెలిగించి, "దారుణమైన హత్య చేసిన ఆ ప్రతాపరావుని పట్టుకొని, పోలీసు—" అంటున్నాడు.

"తొందరపడక రాజూ!'' చెప్పాడు యుగంధర్!

○ ○ ○

మర్నాడు పొద్దున వెలువడిన దినపత్రికలో పతాక శీర్షిక:

ముఖ్యమంత్రి ప్రతాపరావు
అకాల మరణం!

డబ్బయిరెండు సంవత్సరాల వయస్సు గల రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతాపరావు రాత్రి రెండు మూడు గంటల మధ్య గుండెపోటుతో మరణించారని తెలియజేయడానికి విచారిస్తున్నాము.

యుగంధర్ ఆ తరువాత వివరాలు చదువలేదు. పత్రిక మిగతా పేజీలు తిరగవేశాడు. ఒకచోట చిన్న అక్షరాలతో, "గత వారం రోజులుగా అదృశ్యమైన స్కూలుటీచరు గోవర్ధనరావు శవం కృష్ణా నది ఒడ్డున కనపడింది. పోలీసులు శవాన్ని శవ పరీక్షకు పంపారు—''

మిగతా వివరాలు చదవలేదు యుగంధర్. పత్రిక రాజుకు యిచ్చి, "తను చేసిన నేరానికి తనే శిక్ష విధించుకొన్నాడు ముఖ్యమంత్రి ప్రతాపరావు. ప్రతాపరావు గతాన్ని గురించిన వివరాలు వెల్లడిచేయడంవల్ల ప్రజలలో నాయకులమీద విశ్వాసం నశిస్తుంది. దేశ క్షేమానికి యిది మంచిది కాదు. అందువల్ల ఆత్మహత్య చేసుకొనేందుకు ప్రతాపరావుకి అవకాశం యిచ్చాను" అన్నాడు యుగంధర్ రాజుతో.

"పాపం—శకుంతల—'' అంటున్నాడు రాజు.

"ముఖ్యమంత్రి యింటికి ఫోన్‌చేసి పి.ఏ.ను పిలు" అన్నాడు యుగంధర్.

"యస్—నేను డిటెక్టివ్ యుగంధర్‌ని. చదివాను. చాలా విచారించాను, ముఖ్యమంత్రి ప్రతాపరావుగారి వీలునామా ఏదైనా వ్రాశారా?'' అడిగాడు.

"అవును. నిన్నరాత్రి పన్నెండు గంటలకి నన్ను తన గదికి రమ్మని తన వీలునామాలో చేసిన ఒక మార్పుకి సాక్షి సంతకం పెట్టమన్నారు ముఖ్యమంత్రి. పెట్టాను. గోవర్ధనరావుగారి కుటుంబానికి తన ఆస్తిలో సహం భాగం, అంటే దాదాపు నాలుగులక్షల రూపాయలు వారి పేర్న వ్రాశారు" చెప్పాడు పి. ఏ.

"అలాగా—'' అని యుగంధర్ రిసీవర్ పెట్టేసి, "రాజూ. గోవర్ధనరావు ప్రాణాన్ని రక్షించలేకపోయాము కాని ఆ కుటుంబం వీధులపాలు కాకుండా" అని, కుర్చీలోంచి లేచి "నేను వెళ్ళి శకుంతలాదేవిని చూడను. చూడలేను. నువ్వు వెళ్ళి చెప్పు రాజు" అన్నాడు యుగంధర్ గుండెబరువుతో. □

రాంగ్ నంబర్...కాదు

వీరభద్రరావు పవిత్ర

రాధారాణి చాలా ఆనందంగా వుంది. లేడి పిల్లలా గంతులేస్తోంది. ఆమెకు పాతికేళ్ళ వయస్సుంటుంది. ఆరోగ్యంగా అందంగా వుంటుంది. చక్కని పొడుగు, పొడుగుకి తగ్గ దబ్బపండురంగు వళ్ళు... చిలిపితనం ఉట్టిపడే కళ్ళు....ఎత్తైన గుండెలు. 'కేర్ ఫ్రీ' వారి అడ్వర్టయిజ్‌మెంట్ బొమ్మలా వుంటుంది.

షాంపూతో తలంటుకుని డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిలబడి అద్దంలో తన అందాన్ని తనే చూసుకుంటోంది. ఆమె ఊహల్లో....సుమన్-కాస్సేపట్లో అతనొస్తాడు. తను అతని కౌగిట్లో ఒరిగిపోతుంది. తనంటే సుమన్‌కెంత ఇష్టం....? బైట ఎంతో గంభీరంగా ఉండే సుమన్....తనదగ్గర ఎంత చిలిపిగా ప్రవర్తిస్తాడు. లౌ మేకింగ్ ఒక ఆర్టు....అది అతనికే తెలుసు. సుమన్ పెద్ద అందగాడు కాదు....హి ఈజ్ మేన్లీ—మొగాడికి అందం ఎందుకు మగతనం కావాలి.

విజయ్.... అందంగా వుంటాడు.... ఎర్రటి ఎరుపు....కాని ఎందుకు? డబ్బు సంపాయించడంలోవున్న శ్రద్ధలో పదోవంతు తనమీద వుంటే బాగుండేది.

రాధ టైంకేసి చూసుకుంది. పదకొండవడానిక్కి ఇంకా పదినిమిషాలుంది....మరో పది నిముషాల్లో తన కళ్ళముందు సుమన్....అతని గుండెల్లో తను.

రాధ తల దువ్వుకుంది. జుట్టు అలా వేళ్ళాడేటట్టు ఒదిలేస్తే సుమన్‌కెంతో ఇష్టం.... తెల్లటి మేక్సీ వేసుకుంది. ఇంటిమేట్ సెంటు స్ప్రే చేసుకుంది. ముఖానికి మేకప్ పూర్తయ్యింది. మళ్ళీ అద్దంలోకి చూసుకుంది.

"నన్నిలా చూస్తే సుమన్‌కి కళ్ళు తిరుగుతాయి. అతని రసికత కీవేళ పగ్గాలుండవ్...." అనుకుంది.

టైం చూసింది....పదకొండు.

ర ర ర

రాధ బాగా డబ్బున్న ఇంట్లో పుట్టింది.

ఆమెకు నాగరికతమీద మోజెక్కువ.... డ్రెస్సింగ్‌లోకాని, మాటలోకాని, నడతలో కాని....నాగరికత కనిపిస్తుంది. కాలేజీలో చదువుకున్నప్పట్నుంచి ఆమెకు విచ్చలవిడితనం ఎక్కువ. ఆమె బోయ్ ఫ్రెండ్స్‌తో పిక్నిక్కుల కెళ్ళేది........సినిమాలకెళ్ళేది, షికార్లకెళ్ళేది .... క్లబ్బులకెళ్ళేది .... 'అలా వెళ్ళకూడదని' ఆమె తలిదండ్రు లెప్పుడూ చెప్పలేదు.

వాళ్ళు బతుకుతున్న క్లాస్ సొసైటీకి అలాంటి విచ్చలవిడితనం తప్పుకాదు.

పార్థుతో కాశ్మీర్ వెడతానన్నప్పుడు, రవీంద్రతో ఢిల్లీ క్రికెట్‌మాచ్ చూడ్డాని కెడతానన్నప్పుడు ఆమెక్కావల్సిన డబ్బిచ్చి "స్వెట్టర్స్ తీసికెళ్ళడం మర్చిపోకు........చలి కుదిపేస్తుంది" అన్నాడే తప్ప....ఎవరితో వెడుతున్నావని అడగలేదు తండ్రి.

ఆమె పెళ్ళిచెయ్యాలనుకున్నప్పుడు ఆమె తండ్రి అల్లుడు తన అంతస్థుకు తూగుతాడా లేదా?....అన్న విషయమే ఆలోచించాడు.

అల్లుడికి కారుందా?....ఉంది.

మేడవుందా?....ఒకటికాదు రెండున్నాయి.

"నాక్కాబోయే అల్లుడికి ఇంకేమున్నాయి?"

చాలా వున్నాయి సార్....చాలా వున్నాయి.

పది కంపెనీల్లో షేర్లున్నాయి........నాలుగు ఫ్యాక్టరీల్లో వాటాలున్నాయి. స్వంతంగా లక్షల మీద నడిచే పెద్ద వ్యాపారం వుంది.

"ఇంకేం కావాలి........నాకు అల్లుడు కావడానికి కావల్సిన అర్హతలన్నీ ఉన్నాయ్...." అనుకున్నాడు తండ్రి.


"ఒకే డాటర్?—" అంటే.

"ఒకే డాడీ!" అనుకున్నారు....

రాధకు విజయ్‌తో బ్రహ్మాండంగా పెళ్ళి జరిగింది.

పెళ్ళి జరిగిన కొద్దిరోజులకే రాధకు భర్త విజయ్ పూర్తిగా అర్థమయ్యాడు.

అతని క్లబ్బులక్కర్లేదు. ఫ్రెండ్స్ అక్కర్లేదు. సినిమా లక్కర్లేదు .... పిక్నిక్ లక్కర్లేదు.



"ఛీ సరదాల్లేని మనిషి" అనుకుంది రాధ.

అతనిక్కావల్సిందల్లా .... డబ్బు, డబ్బు, డబ్బు.

బాంక్ ఎక్కౌంట్ పెరిగేకొద్దీ అతనికి బి.పి.లాగ ఆనందం పెరుగుతుంది.

"ఛీ! అంతకన్నా మింటింగ్ మిషన్ని పెళ్ళిచేసుకున్నా బాగుండేది...." అని చాలా సార్లనుకుంది.

అలా ఓసారనుకుంటున్నప్పుడు....

"నో....నో....రాధా! నువ్వలా అనుకోవద్దు....నువ్వలా అనుకుంటే నేనసలు భరించలేనుగాక, భరించలేను.

ఎంత మింటింగ్ మిషన్ని కట్టుకున్నా.... జీవితానికి మరో మగాడి ఆదరణ, ఆలంబన కావాలి....ప్రకృతి సిద్ధమైన కోర్కెలు తీరడానికి ఆడదానికి మగాడు, మగాడికి ఆడది కావాలి........తప్పదు.........గీతలో కృష్ణుడు, బైబిల్లో జీసస్ ఈ విషయం చాలా స్పష్టంగా చెప్పారు.

పోనీలే జరిగిపోయిందేదో జరిగిపోయింది. విజయ్....వాడో మింటింగ్ మిషననుకోకు.... వాడి జీవితలక్ష్యం డబ్బు సంపాయించడమే.... నీలాంటి ఆడదాన్ని ఇంట్లో పెట్టుకుని అసలు వాడికి బైటికెలా వెళ్ళ బుద్ధౌస్తోంది .... సమ్‌థింగ్ రాంగ్ విత్‌హిమ్.

నువ్వేం కంగారుపడకు రాధారాణీ! నువ్వు బాధపడుతుంటే నేను చూడలేనుగాక చూడలేను. నేనున్నాను-నీకు ఆలంబనగా.

నీ మనసు కుదుటపడటానికి కొన్నాళ్ళు ఛేంజాఫ్ ప్లేస్ కావాలి .... పదిరోజులు సిమ్లా వెళ్ళొద్దాం-" అన్నాడు ఆమె క్లబ్‌మేట్ సుమన్.

సుమన్లో ఆమెకు 'మగాడు' కనబడ్డాడు.

రాధ చాలా ఆనందపడింది.

పరిశ్రమల రంగంలో ముందడుగు

దేశం నడిబొడ్డున వున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రకృతి అపారమైన సహజ వనరులను ప్రసాదించింది. ప్రాచీన సంస్కృతీ వైభవం, నవీన నాగరికతా కలబోసిన రంగవల్లి మన రాజధాని. నేడు ఆంధ్రప్రదేశ్ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటూంది.

రు. 478 కోట్ల పెట్టుబడితో నిర్మించిన 260 భారీ, మధ్యతరహా పరిశ్రమలు రాష్ట్రానికి కొత్తరూపు యిచ్చాయి. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో సంస్థాగత ఆర్థిక సహాయం గత నాలుగేళ్ళుగా నాలుగింతలయింది.

రు. 232 కోట్ల పెట్టుబడితో కాకినాడలో నిర్మితమయ్యే ఎరువుల కర్మాగారానికి జూలై 7వ తేదీన భారత రాష్ట్రపతి శంకుస్థాపన చేశారు. ఈ కర్మాగారం 1981 నాటికి ఉత్పత్తి ప్రారంభిస్తుంది.

మన రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి సంస్థ, రాష్ట్ర ఆర్థిక సహాయక సంస్థ, పారిశ్రామిక ప్రాతిపదిక సౌకర్యాల కల్పనా సంస్థ వంటివెన్నో రాష్ట్రంలో అన్ని ప్రాంతాలా పారిశ్రామికాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పారిశ్రామికంగా ముందడుగు వేస్తుంది.

దై. జ. స. పౌ. సం. శా.
32/78-79

"షరే ఛేంజ్ సిమ్లా వెడుతున్నాను" అని భర్తతో చెప్పినప్పుడు

"నన్నుకూడా రమ్మంటావేమోనని హడలి పోయాను....అహఁ ఏంలేదు....యువతిల బిజినెస్...." అన్నాడే తప్ప ఎవరితో వెడుతున్నావని అడగలేదు.

రాధ, సుమన్ సిమ్లా వెళ్ళారు.

అతనిలో ఆమెకు మంచి స్నేహితుడు, చక్కటి కంపానియిన్ అంతకన్నా ఛక్కటి ప్రియుడు కనిపించారు.

సిమ్లా ట్రిప్ వాళ్ళ మనసుల్ని, సిమ్లా చలి వాళ్ళ శరీరాల్ని ఏకం చేసాయి.

"నాటీ....యూ ఆర్ రియలీ ఫెంటాస్టిక్" అంది రాధ, మొదటిరాత్రి సుమన్ గుండెల్లోకి చొచ్చుకుపోతూ.

సిమ్లా ట్రిప్ పూర్తయ్యాక "ఈ సంబంధం ఈ జన్మంతా సాగాలి...." అనుకున్నారు.

సిమ్లానుంచి తిరిగొచ్చి నెలే అయ్యింది.

ర ర ర

టాక్సీ చప్పుడు విని రాధ పోర్టికోలోకి వెళ్ళి కిందికి తొంగిచూసింది.

తన ఊహల్లోని మన్మధుడు .... సుమన్. లేడిపిల్లలా కిందకి పరుగెత్తింది.

తలుపు తియ్యడం అతన్ని లోపలికి రానిచ్చి తలుపు వేసెయ్యడం ఒక్కసారే జరిగి పోయాయి.

"అచ్చం-వీనస్‌లా వున్నావు" అంటూ సుమన్ ఆమెను దగరకు తీసుకున్నాడు. రాధ అతన్ని హత్తుకుపోయింది. అతను ఆమె గడ్డంమీద పెదాలతో చక్కిలిగింతలు పెడుతున్నాడు.

వాళ్ళిద్దరూ సుఖమనే స్వర్గపు అంచులమీద నడుస్తున్నట్టు ఫీలవుతున్నారు.

కాలింగ్ బజర్ మోగింది.

ఇద్దరూ ముఖాముఖాలు చూసుకున్నారు.

సుమన్ త్వరగా వెళ్ళి సోఫాలో కూర్చుని పేపరు చేతిలోకి తీసుకున్నాడు.

రాధ వెళ్ళి తలుపుతీసింది.

ఓ పొట్టిమనిషి గుమ్మందగ్గర నుంచున్నాడు. నున్నగా గుండు. పెద్ద పొట్ట. పంచె కట్టుకున్నాడు-చొక్కా లేదు. నుదుటిమీద పొట్ట మీద, జబ్బలమీద విభూతి పిండి కట్లు....

పురోహిత్యాల మనిషని చూడగానే చెప్పొచ్చు.

ఎందుకన్నట్టు కళ్ళతో అడిగింది రాధ. అతను డైరీలోంచి విజిటింగ్ కార్డు తీసి అందించాడు.

అవధాని & అవధాని

క్రిమేషన్ అండర్ టేకర్స్

ఇంగ్లీలో ఉంది....

రాధకేం అర్థంకాలేదు. అలాగే చూసింది.

అతనిక్కూడా ఆమె రూపం ఆశ్చర్యం కలిగించింది. డైరీ తీసి చూసుకున్నాడు.

"ఆదర్శ నగర్, ఫ్లాట్ నంబరు ఇరవైఆరు ఇదేనా?" అనడిగాడు.

"అవును ఇదే"- ఆమె మాటల్లో విసుగు కనిపిస్తోంది.

"ఈ ఇంట్లో ఎవరో పోయారని మా ఆఫీసుకి తెల్సింది. మేం దహన కార్యక్రమం, పది రోజులు దశాహం జరిపించడానికి కాంట్రాక్ట్ తీసుకుంటాం. ఆ విషయమై వచ్చాను...." అన్నాడు అవధాని.

"ఇక్కడెవరూ చావనూ లేదు, ఖూనీ కాబడాలేదు - మీ కాంట్రాక్ట్ మా కనవసరం. దయచెయ్యండి" అంది కోపంగా.

"అల్లా అనకండమ్మా. చాలా తక్కువ రేట్లో అన్నీ జరిపిస్తాం. శవాన్ని వేన్‌లో తీసుకెడతాం....పోయిన వ్యక్తికి ఉత్తమ గతులు కలిగేటట్టు కర్మకాండలు జరిపిస్తాం."

రాధ ఇంకతన్ని మాటాడనియ్యలేదు.

"ఇక్క దెవరూ చావలేదంటే వినవేం, చూస్తే నువ్వు బతికున్నవాళ్ళనే దహనం చేయించేటట్టున్నావ్. వెళ్ళు-వెళ్ళు" అంది.

"బహుశా మావాళ్ళు ఇంటినంబరు తప్పిచ్చి వుంటారు. మీరు దయతలిస్తే ఓసారి మా ఆఫీసుకి ఫోన్ చేసుకుంటాను."

"పీడిక జీళ్ళపాకంలా ఒదిలిపెట్టడు" అనుకుంది రాధ.

ఫోన్ చేసుకోడాని కనుమతించింది.

ఫోన్ దగ్గరకు వెడుతూ అవధాని సోఫాలో కూర్చున్న సుమన్‌కేసి చూశాడు. పేపరు ముఖానికి అడ్డంపెట్టుకుని సుమన్ కూడా అవధానికేసి ఓరగా చూశాడు.

ఫోన్లో మాట్లాడ్డం పూర్తిచేసి అవధాని సుమన్ దగ్గరగా వెళ్ళాడు.

"మావాళ్ళు ఇదే కరెక్టు నంబరంటున్నారు. మీరడిగే రేటుకే ఏర్పాట్లు చేస్తాం. మీరు అమ్మాయిగార్కి నచ్చజెప్పి ఒప్పించండి-" ప్రాధేయపడుతున్నాడు అవధాని.

సుమన్‌కేమీ అర్థంకాలేదు.

అవధాని విషయమంతా సుమన్‌కిచెప్పాడు.

రాధ కోపం తారస్థాయి నందుకుంది.

"నువ్వు బైటికి పోతావా, పోలీసుల్ని పిలవమంటావా?" అంది ఫోనందుకుంటూ.

అవధాని భయం భయంగా వెళ్ళిపోయాడు.

రాధ తలుపు బోల్టు వేసేసి సోఫా వెనకాల నిలబడి సుమన్ మెడచుట్టూ చేతులేసి తన గుండెల్ని అతని తలమీద ఆన్చింది.

ఫోన్ మోగింది.

విసుగ్గా ఫోనందుకుని మాటాడింది.

"ఎవరు ఫోన్లో?" అన్నాడు సుమన్.

"మా బుద్ధావతారం. సాయంత్రం లేటుగా వస్తాట. ఆ విషయం చెప్పడానికే ఫోన్‌చేశాడు. విజయ్ ఎంత లేటుగా వస్తే మనకంత హాయి కదూ?"

రాధ సుమన్‌ని పెనవేసుకుపోయింది.

"రాధా! తల దిమ్ముగా వుంది, కాస్త కాఫీ ఇస్తావా?" అన్నాడు సుమన్.

"యస్, డార్లింగ్!"అంటూ వంటింట్లోకి వెళ్ళి స్టౌమీద నీళ్ళు పడేసి కాఫీపొడి వేసింది.

ఆమెకు ఆలస్యం చిరాకు తెప్పిస్తోంది. ఆమె మనస్సు ఏదో అనుభూతికోసం తహతహలాడుతోంది. ఆమె శరీరం బరువెక్కిపోయినట్టనిపించి ఏదో అనుభవం కోసం తొందరపెడుతోంది.

మళ్ళీ కాలింగ్ బజర్ మోగింది.

ఆమె వంటింట్లోంచి పరుగున వెళ్ళి తలుపు తెరిచింది.

గుమ్మం ముందు అవధాని!

"నేను స్కూటర్‌మీద మా ఆఫీసు కెళ్ళి తెలుసుకు వొచ్చాను. ఇదే కరెక్టు నంబరంటున్నారు మావాళ్ళు. ఇక్కడే ఎవరో పోయారని, అంత్యక్రియల యేర్పాట్లు చూడమని నాకు మావాళ్ళు చెప్పారు" అన్నాడు అవధాని.

"నీకేం బుద్ధిలేదా? ఇక్కడెవరూ చావలేదంటే వినవేం-మళ్ళీ వచ్చావంటే పోలీసుల్ని పిలుస్తాను. అవతలికి పో" విసురుగా తలుపేసేసింది రాధ.

సుమన్ వస్తాడని - అతనితో ఎన్నో కబుర్లు చెప్పుకోవాలనీ యెన్నో అనుభవాలు పంచుకోవాలని, ప్రొద్దుట్నుంచీ యెదురుచూస్తున్న రాధకి జరిగే ఆలస్యం చిరాకుతెప్పించింది.

"సారీ రాజా! ఆలస్యమైపోతోంది" అంది అతన్ని పెనవేసుకుపోతూ —

టెలిఫోన్ మోగింది.

"ఛీ వెధవ ఫోన్"అనుకుంటూ ఫోనెత్తింది. మాటాడ్డం పూర్తయ్యేక రిసీవర్ పక్కన పెట్టేసింది.

"మనమేదన్నా హోటల్లో సూట్ రిజర్వు చేసుకున్నా బాగుండేది. ఈ న్యూసెన్సు లుండకపోను."

"ఎవరు మళ్ళీ ఫోన్లో?"అనడిగాడు సుమన్.

"నా మొగుడు. ఏదో కేంప్ కెడతాట్ట. రేపు సాయంత్రందాకా రాట్ట. రేపు సాయంత్రం దాకా మనిష్టం. పగటికి, రాత్రికి తేడా తెలియకూడదు మనకి."

బెడ్‌రూంలోకి దారితీస్తూ అంది రాధ.

అంతలో ఆమెకు కాఫీ విషయం గుర్తుకొచ్చింది. వంటింట్లోకి పరుగెత్తికెళ్ళి చూసేసరికి కాఫీ డికాక్షన్ బాగా మరిగిపోయింది. సగంవరకు ఆవిరైపోయింది.

గిన్నె దింపి వడబోసి, పాలు కలిపింది.

కాఫీ సిప్‌చేసి ఆవధం తాగినట్టు పెట్టాడు మొహం. మళ్ళీ రెండు మూడుసార్లు కాఫీ సిప్ చేశాడు.

వెగటుగా వుంది....

తల తిరుగుతున్నట్టుగా వుంది....

కళ్ళు మసకలు....మసకలుగా....

తనా ఇంట్లోకి వచ్చినప్పట్నుంచి జరుగుతున్న సంఘటనలు వరుసగా కళ్ళముందు కదిలాయి. అంత్యక్రియల యేర్పాటు చేస్తానంటూ అవధాని రావడం....

రాధ భర్తతో రెండుసార్లు ఫోన్లో మాట్లాడ్డం. రాధ ప్రవర్తనకూడా ఆ రోజు కొత్తగాఉంది... అదంతా నటనా?....

రాధ, విజయ్ కల్సి తనమీద కుట్ర పన్నుతున్నారా? లేక విజయ్ ఒక్కడే తనని మట్టుపెట్టాలనుకుంటున్నాడా?....

అతని అనుమానం దృఢపడింది.

"నువ్వు, విజయ్ కల్సి నన్ను చంపాలనుకుంటున్నారు కదూ" రాధను తీక్షణంగా అడిగేడు.

"ఛీ! నీకసలా అనుమానం యెందుకు కలిగింది?" రాధ అమాయకంగా అడిగింది.

"అందుకే కాఫీలో విషం కలిపావ్. నేను ఛస్తే అంత్యక్రియలు చేయించవచ్చని ముందుగానే అవధానిని మాట్లాడిపెట్టారు. నిజంచెప్పు. కాఫీలో విషం కలిపావ్ కదూ."

రాధ భుజాలు పట్టుకుని అడిగాడు సుమన్.

"లేదు సుమన్. నువ్వు నా ప్రణయమూర్తివి. నిన్ను చంపుకుంటానా?" ఆమె కళ్ళు నీళ్ళు తిరుగుతున్నాయ్.

"అబద్ధం. నన్ను చంపాలని కాఫీలో విషం కలిపావ్. అది తాగినప్పట్నుంచే నా కళ్ళు మసకలు బారుతున్నాయ్. తల తిరుగుతోంది. నువ్వు రాక్షసివి."

ఆమె చెంప ఛెళ్ళుమంది.

"లేదు సుమన్. కాఫీ డికాక్షన్ ఎక్కువగా మరిగితే అలాగే అనిపిస్తుంది. ప్లీజ్ నన్ను నమ్ము."

అతన్ని చుట్టుకుపోతూంది రాధ.

"ఛీ ఆడదాన్ని ఛస్తే నమ్మకూడదు" అని ఆమెను విసురుగా తోసేశాడు.

ఆమె వెళ్ళి సోఫాలో పడింది.



"ఈ అమ్మాయి మూగది-పైగా ఉత్త అమాయకురాలు కూడాను!!"

"ఐతే ఇంకేం! సిన్మాలకి బెస్టుగా పనికొస్తుంది!!"

అతను స్పీడుగా వెళ్ళి తలుపు తోసుకుని వెళ్ళిపోయాడు. గుమ్మానికున్న ఆరు మెట్లు రెండంగల్లో దిగిపోయాడు.

సోఫాలోంచి లేవబోతున్న రాధకి కీ్రుమని కారు బ్రేక్ వేసిన చప్పుడు, సుమన్ కేర్‌మని అరచిన చప్పుడు ఒకేసారి వినిపించాయి.

రాధ గుమ్మందగ్గరికి పరుగెత్తుకెళ్ళింది.

ఆమెకు కారు డోర్ తోసుకుని బైటికి వస్తున్న భర్త విజయ్, కారుచక్రంకింద రక్తపు మడుగులో ఆఖరి శ్వాస వదిలేసిన సుమన్ కనిపించారు.

ఆమెకి కళ్ళు బైర్లు కమ్మాయి.

ఆమెకు తెలివివచ్చి ప్రపంచంలో పడేసరికి ఆ పక్కనే కూర్చున్న అవధాని ఆమె దగరకు వస్తూ, "నేను చెప్పలేదమ్మా—ఇదే కరెక్టు అడ్రసని. మీరు విన్నారుకాదు. మరింక అంత్యక్రియల యేర్పాట్లు చూస్తాను" అని డైరీలో యేదో రాసుకుంటున్నాడు.

విజయ్ యేమీ అర్థంకానట్టు రాధ మొహంలోకి చూశాడు. రాధ యేం చెప్పాలో తెలియక అవధాని ముఖంలోకి చూసింది.

"పోలీసులకి ఫోన్ చెయ్యండి. శవపరీక్ష పూర్తికాగానే అంత్యక్రియలు జరిపిస్తాను. ముందో వంద ఎడ్వాన్స్ యివ్వండి" అంటున్నాడు.

[ఓ జర్మన్ నాటిక ఆధారంగా] □

సాధన

"ఏమండీ! పిన్నిగారూ! ఈ వారం పత్రిక చూశారా?"

"ప్రభ చూశారా?"

"జ్యోతి చూశారా?"

—అంటూ ఆమె చుట్టూ చేరిన వారందరికీ, ఆమె చేతిలోవున్న వారపత్రికల్ని అందరికీ తలొకటీ యిచ్చింది. వున్నది మూడు వారపత్రికలు, కాపరాలు ఆరు. అంచేత విధిగా, కొన్ని వారపత్రికలు రెండేసి ప్రతులు కొనితీరాల్సివచ్చింది. అవన్నీ తీసుకున్న ఆ ఆడవారు-అలవాటుగా వనితావాణి పేజీ చదివారు. అందులో 'ఆమెగారు' రాసిన వుత్తరమో, అడిగిన ప్రశ్నో వుంటుంది. 'ఆమెగారి' పేరు అచ్చులో చూసిన ఆ ఆడవారు ఆమెకన్న ఎక్కువగా ఆనందపడిపోతారు - కాని, 'ఆమెగారు' మాత్రం—

"ఈ ప్రభేనండి-మరీ పొడి అక్షరాల్లో వేస్తోంది—"ఏ.జె."అంటూ—" అని విసుక్కుంది.

ఆమె పేరు జానకి—ఆమె భర్త పేరు జానకీపతి-ఆమె యింటి పేరు ఆచంటవారు. ఆమె వుంటున్న యిల్లు పేరు జానకీనివాస్. వారి ఇంటికి పక్కనేవున్న, వారి ఆరు వాటాల మధ్యతరగతివారి 'కాలనీ' పేరు మిథిల. ఆవిడగారి భుజాలదాకా వచ్చే, ఆ యింటి ప్రహరీ దగ్గరకువచ్చి 'ఆమెగారు' నిలబడితే, ఆ ఆరు గుమ్మాళ్ళవారూ కనబడతారు. ఆ ఆరు వాటాలలోవారినీ, వారి వారి వయసులకు తగిన విధంగా 'పిన్నిగారూ!' 'అక్కగారూ!' 'వదినగారూ!' అనో లేక, వారివారి పేర్లతోనో పిలుస్తూ వుంటుంది.

వారంతా వచ్చి, గోడకి అవతల పక్కన నిలబడతారు. ఇలా రోజుకు కనీసం అయిదారు సార్లయినా, వారిని పిలవాలి. లేకపోతే ఆమెకు తోచదు. వారంతా నెలనెలా అద్దె కట్టుతున్నా, 'ఆమెగారి' యింట్లో అద్దెకు వుంటున్న పాపానికి 'ఆమెగారి' పిలుపు వినగానే, చేతిలో పని అలాగే మానేసి, వచ్చి ఆమెకు ఎదురుగా నిలబడాలి. ఆమె చెప్పింది చెవులారా వినాలి. ఆ విన్నదంతా బాగుందనాలి. ఇంతకుమించి ఆమె వారిదగ్గర్నించి ఏమీ కోరదు—ప్రతినెలా మొదటి వారంలో ఒక నెల అద్దె తప్ప.

ఆ నెల మొదటి వారంలో మొదటిసారిగా పిలవబడిన పిన్నిగారు ఆఖరి వాటాలో వుంటున్నది. 'ఆమెగారి' పిలుపు వినగానే ఆదరాబాదరా, చేతులో పని అలాగేపడేసి వచ్చింది. 'ఆమెగారి' ఎదురుగా తలవంచుకుని ముద్దాయిలా నిలబడి—

"అద్దె సంగతి చెబుదామనే, పొద్దున్నే అటు వచ్చాను. తలుపు తీసిలేదు-డబ్బింకా చేతికి అందలేదు. పత్రికవాళ్లు ఎంచేతో ఈనెల ఆలస్యం చేశారు," అంది క్షమాపణ కోరుతూ.

—ఇదంతా శ్రద్ధగా విన్న జానకి—

"పిన్నిగారూ! నాకో ఐడియా వచ్చింది. ప్రతినెలా మీవాడు ఓ కథ రాయడం, ఆ కథ ఏ పత్రికకో పంపడం-వాళ్ళు ఆర్నెల్ల తర్వాత- "ప్రచురించడానికి అంగీకరించాము వీలు వెంబడి ప్రచురించగలం", అని మరో ఆర్నెల్లకి ప్రచురించడం, ప్రచురించిన ఆర్నెల్లకి 'పారితోషికం' అంటూ ఏదో మని ఆర్డరు చేయడం-దాన్ని నాకు అద్దెగా యివ్వడం-ఎందుకిదంతా? నా అద్దెకింద నాకు నెలకో కథ రాసియివ్వమనండి - చాలు-" అంది.

"అద్దె రూ. 75/-లు కదా? వాడి కథకి ఎవరూ యాభై దాటి యివ్వరు" అంది పిన్నిగారు.

స్వామి చిత్రానంద

"అది మీకు లాభమేకదా? అంచేత మీ వాడికి నచ్చచెప్పండి. కథమాత్రం ప్రతినెలా మొదటి వారంలో నాకు యివ్వాలి." అంది జానకి.

"సరేనమ్మా — మా వాడితో చెప్పి చూస్తాను."

"చెప్పిచూడ్డం ఏమిటండీ? నచ్చచెప్పండి - సాయంత్రం మళ్ళీ కలుస్తాను," అంటూ లోపలకు వెళ్ళింది.

హాల్లోకి రాగానే—

"ఏమండీ! ఈ వారం పత్రిక చూశారా?" అంది భర్తతో.


"విన్నాను—అదే....పత్రికలో నీ లేఖ, ప్రభలో నీ ప్రశ్న, జ్యోతిలో నీ సందేహం పడ్డాయి. ప్రభలో మాత్రం నీ పేరు పూర్తిగా పడలేదు—"

"సంతోషించాం లెండి—మళ్ళీ నెలనించి ప్రతినెలా ఏదో వారపత్రికలో ఏదో కథ పడి తీరుతుంది." అంది గర్వంగా.

"తిని కూచోలేక ఇదేం పనే?" అన్నట్టు చూశాడు భార్య వంక.

"అవునండి-నేను రచయిత్రిని అవాలి."

"అవాలంటే, నువ్వు రాయొద్దూ? నీకంత తీరుబడి ఎక్కడుంది? ఎంతసేపూ పక్కవాటా



వాళ్ళతో కబుర్లు చెప్పడంతోటే సరిపోతుంది. కవిత్వం అంటే, మాటలా? ఆయన ఎవరో చెప్పినట్టు, పుట్టడమే కవిగా పుట్టాలి—" అన్నాడు భర్త వినయంగానే—

"అదేం అఖ్ఖర్లేదు. బోయవాడు వాల్మీకిగా మారి రామాయణం రాయలేదా? సినీమా కవులు ఎంతమంది పుట్టగానే కవులయ్యారు చెప్పండి?"

"అది నిజమే. సినీమాల్లో మనకంటికి కనిపించేదీ, చెవికి వినిపించేదీ వాళ్ళ వాళ్ళ సొంతాలు కావట—అన్నింటికీ 'ప్లే బ్యాక్' వుంటుందట!

"అలాగే, నాకూ ఓ 'ప్లేబ్యాక్' వుంది. సరేనా?" అంది గర్వంగా—

"ఎవరు? సుశీలా? జానకా?" అన్నాడు వేళాకోళంగా.

"కాదు—ఘంటసాల—" అంటూ కోపంగా లోపలకు వెళ్ళిపోయింది.

"ఘంటసాల పోయి చాలా కాలమైందిగా? కొంపదీసి, జూనియర్ ఘంటసాల ఎవరైనా?—" అని సణుక్కుంటూ దినపత్రిక తిరగేశాడు.

ర ర ర

ఆరోవాటా పిన్నిగారు వాళ్ళ అబ్బాయి కోసం, ఎదురుచూస్తోంది. చీకటిపడ్డ తర్వాత వచ్చాడు ప్రసాద్.

"ఏరా! ఇంత ఆలస్యం అయింది?"

"కథ పూర్తిచేసేసరికి ఆలస్యం అయింది" అంటూ షర్టు విప్పుకుని, లోపలకు వెళ్ళాడు.

"ఒరేయ్! జానకమ్మగారు ఇందాక వచ్చి, అద్దె అడిగిందిరా" అంటూ తల్లి చెప్పింది.

"ఇస్తామని చెప్పు. ఇవాళ మూడో తారీఖేగా—10 తారీఖుగ్గాని నెల అవదు. ఈలోపుగా పత్రికనించి మనిఆర్డరు వస్తుంది."

"వస్తే, అది బియ్యంవాడికి యివ్వొచ్చు. నువ్వు రాసిన కథ యిలా యివ్వు - ఆవిడకి యిచ్చేస్తాను."

"ఆవిడకెందుకు?"

"ఏమో, అద్దెకింద నెలకి ఓ కథ యిమ్మన మంది."

"ఏడవలేకపోయింది. ఈకథ తనదని పత్రికలకి పంపి, 'రచయిత్రిని' అయిపోవాలనుందేమో!"

"ఆవిడ ఏమైతే మనకేమిరా? ఏదో ఓ కథ రాసి, ఆవిడ ముఖాన పడేస్తే, నెలదాకా మనల్ని అద్దె అడగదు. పైగా నీ కథలకి ఏ పత్రికా ఏభైరూపాయలకన్న ఇవ్వడంలేదు. ఈవిడకిస్తే, రు. 75/-లు వచ్చినట్టేగా?"

"అదేవిటమ్మా - చూస్తూ చూస్తూ ఆత్మద్రోహం చేసుకోలేను. నా కథ ఆవిడకు యివ్వలేను" అన్నాడు నిష్కర్షగా.

"ఆహా! బయల్దేరాడండి—అపరపోతన!" అంది అప్పుడే లోపలకు అడుగుపెడుతున్న చెల్లెలు శారద, పుస్తకాలు అలమారాలో పెడుతూ—

"నోర్ముయ్, నీ అభినందనలు ఎవడికీ అక్కర్లేదు. ఎక్కడికెళ్లావ్ ఇంతవరకూ!"

"కాలేజీకి—"

"7-30 గంటలదాకా కాలేజీ ముయ్యలేదా?"

"ఆలస్యంగా వస్తానని అమ్మతో చెప్పాను."

"ఆ ఆలస్యమే ఎందుకయ్యిందీ అని?" అని రెట్టించాడు.

"ఏ స్నేహితులు ఇంటికో వెళ్లంటుందిరా" అని కూతురును సమర్థించబోయింది తల్లి.


"ఎవడా స్నేహితుడు? ఎక్కడ వాడి ఇల్లు? ఇవాళ తేలాలి."

"ఏమిట్రా నువ్వనేది?" అంది తల్లి. ఒక్కసారిగా విభ్రాంతపోయింది. పెళ్ళీడుకొచ్చిన పిల్ల, కాలేజీకి వెళ్తోందనుకుంటున్న పిన్నిగారికి- ఈ మాటలు పిడుగులా వినిపించాయి.

"ఏమిటమ్మా! ఇది నిజమేనా?" అంటూ శారద దగ్గరకువెళ్ళి సముదాయిస్తూ అడిగింది పిన్నిగారు.

"లేదమ్మా-నేను వాళ్ల వాణి ఇంటికే వెళ్లాను" అంది తలవంచుకుని శారద.

"వాణి యింటికే వెళ్ళింది సరే. వాణి అన్నకోసం వెళ్లిందా లేదా? వాడు రమ్మంటేనే, వాణి దీన్ని తీసుకువెళ్ళింది. అవునా?



కాదా? ఇప్పుడు తేలాలి."

"వాణి కుటుంబం సంగతి నాకు తెలియంది కాదు. ఆ మాత్రానికే ఇంత రాద్ధాంతం ఏవిటిరా?" అంటూ యిద్దరినీ సముదాయించి భోజనాలకు రమ్మంది.

ఇద్దరూ ఎడమొహం పెడమొహంగానే భోజనాలు చేశారు. అతను మాత్రం భోజనం చేసిన వెంటనే పడుకున్నాడు. శారద ఏవో పుస్తకాలు తిరగేస్తోంది. పిన్నిగారు ఆమె దగ్గరకు వచ్చి కూచుంది.

"ఏమ్మా! అన్నయ్య చెప్పింది నిజమేనా?" అని అడిగింది ఆశగా.

అవునన్నట్టు తలవూపింది శారద.

"వాణి ధర్మమా అని నువ్వు ఆ యింటి కోడలివైతే, నాకు ఏ బెంగా వుండదు." 'వాణి చెబితే, వాళ్ళ నాన్నగారు కట్నంకూడా పుచ్చుకోరు' అనుకుంది పిన్నిగారు.

"కాని-అతను.... వాణి వాళ్ళ అన్నయ్య కాదమ్మా" అంది శారద.

"మరి—?" నిర్ఘాంతపోతూ అడిగింది పిన్నిగారు.

"వాళ్ళ దూరపు బంధువు. బొంబాయిలో పెద్ద వుద్యోగంట - చాలా బాగా వుంటాడు. ఇవాళ నన్ను సినిమాకి తీసుకెళ్ళాడు."

"సిగ్గులేకండా, సినిమాకి వెళ్ళావా పరాయి మగాడితో-" గద్దించింది పిన్నిగారు.

"వాణి, వాళ్ళ అన్నయ్యకూడా వచ్చారమ్మా—" అంది శారద.

"ఏమోనమ్మా-మీ నాన్నగారుంటే ఆ దారి వేరు. ఏదో, నిన్నో యింటిదాన్నిచేస్తే, నా కదే పదివేలు—"

"ఆయన మనింటికి వస్తానన్నారు. కాని అన్నయ్య ఎప్పుడూ చుర్రుబుర్రు మంటూ వుంటాడని, నేనే వద్దన్నాను."

"వాణిని ఓసారి రమ్మను-నేను మాట్లాడతాను."

"అలాగే నమ్మా—"

✻ ✻ ✻

బొంబాయి అబ్బాయి సెలవు పొడిగించాడు. వాణి, వాళ్ళ అన్నయ్య మాత్రం శారదకు

అతణ్ణి పరిచయంచేసి వూరుకున్నారు. శారద కాలేజీ మానెయ్యడం, అతనికోసం అతను వస్తానన్నచోట అతనికోసం ఎదురుచూడ్డం-ఇద్దరూ సినీమాలు చూడ్డం-షికార్లు తిరగడం-రానురాను మరీ దగ్గరవుతున్నారు. వీళ్లిద్దరూ కలిసివుండగా, అన్నయ్యకి తటస్థపడ్డారు. శారద అతనితో—

"మా అన్నయ్య"అని పరిచయం చేసింది.

"మీరు—?"అని సందేహంగా బొంబాయి అబ్బాయికేసి చూశాడు.

"ఈయన వాణివాళ్ళ దూరపు బంధువు. అమ్మ చెప్పలేదూ? ఆయనే ఈయన."

"అమ్మ చెప్పడం ఏమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు ప్రసాద్.

"ఈయన నేను ప్రేమించుకున్నాం. పెళ్లి—" అని శారద చెప్పబోతూంటే, అతనే ఆపుచేశాడు.

"మీ చెల్లాయికి మరీ తొందరండి. పెళ్లంటే నూరేళ్ళపంట. చాలా ఆలోచించుకోవాలి. బొంబాయిలో కాపరం అంటే మాటలు కాదు. బ్రహ్మచారిగాణ్ణి గనక, నలుగురు బ్రహ్మచారులతో కలిసి, ఓ గదిలో వుంటున్నాను. కాపరం పెట్టడానికి ఒక ఫ్లేట్ కావాలంటే, నా వల్లకాదు—" అని తన బాధ చెప్పాడు బొంబాయి అబ్బాయి.

"పెళ్లికీ దీనికీ సంబంధం ఏమిటి?" అన్నాడు శారద అన్నయ్య.

"పెళ్లిదారి పెళ్లిది. దీనిదారి దీనిది. ఏదో పరిచయం, స్నేహం, నాలుగురోజులు కలిసి తిరిగాం! విడిపోతాం. అంతే- మళ్ళీ ఎప్పుడో.... ఎక్కడో........" అంటూ చాలా తేలిగ్గా చెప్పాడు.

"ఏమిట్రా కూశావ్?" అని లేచాడు అతని మీదకి. పిచ్చెత్తినవాడిలా అతనిమీద పడ్డాడు. చితకబాదాడు. స్పృహలేకుండా పడిపోయాడు బొంబాయి అబ్బాయి.

"నడు-ఇంటికి- గడపదాటావో, నీకూ అదే శాస్తి" అంటూ శారదను ఇంటికి తీసుకు వచ్చాడు.

తల్లితో జరిగిందంతా చెప్పాడు. ఆమె భోరున యేడ్చింది. తల గోడన వేసుకుని బాదు కుంది. ప్రక్కవాటాల వాళ్ళకు వివరాలు తెలియకపోయినా, "ఏదో ఘోరం" జరిగిందని అర్థమైంది. అంతా ఎవరిమటుకు వాళ్ళు తలుపులు మూసేసుకున్నారు.

ర ర ర

ఆ సాయంకాలం ఓ పోలీస్ జీపువచ్చి, ఆ కాలనీ ముందు ఆగింది. మొదటి వాటాలో వారిని శారద గురించి అడుగుతున్నాడు-పోలీస్ ఇన్‌స్పెక్టర్. ఇది గమనించిన ప్రసాద్ మెల్లగా చెట్లచాటునుంచి, జానకమ్మగారి యింట్లోకి దూకాడు. ఆ దొడ్లోవున్న చెట్లచాటున దాక్కున్నాడు.

సాయంత్రం పువ్వులు కోసుకుంటున్న జానకమ్మగారికి, ప్రసాద్ కనిపించాడు. ఆమెను చూసి అతను భయపడ్డాడు. అతన్ని చూసిన ఆమె నిర్ఘాంతపోయింది. ఆమె వాళ్ల యింటి వైపు చూసింది. పోలీసులు శారదనూ, పిన్నిగారినీఏదో అడుగుతున్నారు. జానకమ్మగారికి విషయం అర్థమైంది. 'నన్ను కాపాడ'మని ప్రసాద్ ఆమె కాళ్లమీద పడ్డాడు. ఆమెలో యేదో ఆలోచన మెరిసింది. ఏదో నిర్ణయం తీసుకుంది. అక్కడే ఆ గోడదగ్గరే నిలబడి జరిగినదంతా గమనిస్తోంది.

పార్కులో ప్రసాద్ చేత దెబ్బతిన్న బొంబాయి అబ్బాయి మరణించేలా వున్నాడనీ, అందుకోసమే వచ్చామనీ చెప్పాడు ఇన్‌స్పెక్టర్. ఇంట్లో లేడని చెప్పింది పిన్నిగారు. ఇల్లంతా సోదా చేశారు పోలీసులు. ఆకాలనీలో అంతా తలో రకంగా మాట్లాడారు. "ఈ ప్రేమలూ, హత్యలూ ఏవో వారపత్రికల్లో చదవడమేగాని-నిజంగా జరుగుతాయి అని మాకు తెలియదమ్మా-" అని బుగ్గలు నొక్కుకుంటూ వెళ్లిపోయింది నాలుగోవాటా వదినగారు.

పోలీసులు వెళ్ళడంతో, ఆ గందరగోళం చల్లబడిపోయింది.

ర ర ర

ఆనాటి రాత్రి—

ఆ కాలనీలో రోజూకన్న పెందరాళే

దీపాలు ఆర్పుకున్నారు అంతా. మెలకువగా వున్నారో, నిద్రపోతున్నారో తెలియదు. ఆరో వాటాలో పిన్నిగారు, శారద మాత్రం ప్రసాద్ కోసం యెదురుచూస్తున్నారు. బాధ, భయం వారి ముఖాల్లో తాండవిస్తోంది. ప్రసాద్ చేత దెబ్బలుతిన్న ఆ బొంబాయి అబ్బాయి మరణిస్తే, ప్రసాద్ బతుకు ఏమవుతుంది? అసలు ప్రసాద్ ఏమయ్యాడు? ఇదే ఆలోచన.

ఈ సంగతి తెల్సిన శారద స్నేహితులు కొందరు వచ్చి, ఆమెను ఓదార్చారు. వాణి మాత్రం రాలేదు. తన గురించి, తన అన్నయ్య గురించి వాణి ఏమనుకుంటుందో-ఇదే శారద ఆలోచన.

పక్కమేడలో పై అంతస్తులో తలుపులు అన్నీ మూసివున్న గదిలో ప్రసాద్ వున్నాడు. అతనికి ఏంచేయాలో తోచడంలేదు. పోలీసులకు లొంగిపోయి శరణుకోరితే-తాను జైలుకు వెళ్ళితే, అమ్మ, చెల్లి ఏంకావాలి? తానలా అజ్ఞాతంగా యెంతకాలం వుండాలి? యిదే ఆలోచన.

మరి కాస్సేపటికి జానకమ్మగారు అన్నం కంచంతో వచ్చింది. అతని పక్కనే కూర్చుని తల్లికన్న ఆదరంగా తనిపించింది. ఎంతో ఓదార్పుగా ధైర్యం చెప్పింది. అంత తొందర పనికిరాదని మందలించింది. ఏంజరిగినా అన్నింటికీ భగవంతుడే వున్నాడంది. అతను భోంచేసిన తర్వాత, ఆవిడ కిందకు వెళ్ళి, భర్తతో కల్సి భోజనంచేసి, ఆయన్ని పడుకోమని చెప్పింది-తాంబూలం యిచ్చి.

"ఈ సంగతి నరమానవుడికి తెలియడానికి వీల్లేదు" అని హెచ్చరించింది.

"మరో నరమానవుడితో—నువ్వు నీ నరమానవుణ్ణి కలవనిస్తే కదా తెలియడానికి? నీకా భయం అక్కర్లేదు—నా మాట నమ్మ" అని ఆయన పడకగదిలోకి వెళ్తూ—

"నువ్వు మాత్రం పెందరాళే వచ్చేయ్"అని బతిమాలాడు.

ఆమె మేడమీదకు దారితీసింది.

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి

లోధ్ర

75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!

ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.

పేరు: ____________________

విలాసము: ____________________

____________ PIN ____________



కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14

ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికింద్రాబాద్.

గదిలోకి రాగానే అలికిడి విని అదిరిపడ్డాడు ప్రసాద్.

"ఏం భయంలేదు-నేనే-" అని అక్కడే వున్న కుర్చీలో కూచుంది. అతన్ని సోఫాలో పడుకోమని, ఓ తలగడ, దుప్పటీ యిచ్చింది.

"ఏమండీ! పోలీసులు మళ్ళీ వచ్చారా?" అని ఆత్రుతగా అడిగాడు ప్రసాద్.

"ఇంతవరకూ రాలేదుగాని, మా యింటి క్కూడా 'ఎంక్వయిరీ'కి రావచ్చని అంటున్నా రాయన."

"మీరే నన్ను కాపాడాలి. నేను జెయిల్‌కి వెళ్తే, మా చెల్లెలు, అమ్మ దిక్కులేని వాళ్ళు. అయిపోతారు. మీరే రక్షించాలి."

"అయితే, ఓ చిన్న పనిచెయ్—"

"మీరేం చెయ్యమన్నా చేస్తాను. నిప్పుల్లో దూకమన్నా దూకుతాను."

"మరీ అంత పురాణకాలపు మనిషినికాదు నేను" అని సందేహిస్తోంది చెప్పడానికి.

"చెప్పండి. సందేహించకండి."

"నువ్విక్కడే వుండు. నువ్వు ఏమయ్యావో ఎవ్వరికీ తెలియదు. కావాలంటే, మీ అమ్మకీ, చెల్లెలికీ నేను చెబుతాను. వాళ్ళు అప్పుడప్పుడు వచ్చి, నిన్ను చూస్తుంటారు. ఈ సంగతి మూడో కంటివాడికి తెలియనివ్వను. కాని—" అని ఆగిపోయింది.

"ఆగిపోయారేం? చెప్పండి" అని రెట్టించాడు.

"మీ చెల్లెల్ని, మీ అమ్మని, నిన్ను పోషించే భారం నాది. మాకు దూరపుబంధువు ఒక డున్నాడు. తాలూకాఫీసులో పనిచేస్తున్నాడు. బుద్ధిమంతుడు. మీ చెల్లెల్ని వాడికిచ్చి పెళ్ళి చేస్తాను. నువ్విక్కడే వుండాలి. కానీ, ఒక కండిషన్—"

"చెప్పండి."

"నువ్వు కథలు రాయాలి. నాకు ఇవ్వాలి. ఏమంటావ్?" అని ప్రశ్నార్థకంగా చూసింది.

ప్రసాద్‌కి ఏం చెప్పాలో తోచలేదు. ఆత్మద్రోహం చేసుకోకుండా వుండలేడు. అలాగని, 'నిజాన్ని చెప్పండి' అని ధైర్యంగా చెప్పలేడు అటు, అమ్మ, చెల్లెలు-వాళ్ళ భవిష్యత్తు. ఇటు తను, తన అభిరుచి, ఆశయం, నియమం వగైరా,వగైరా. ఎటూ తేల్చుకోలేకపోయాడు.

"నన్ను కాస్సేపు ఆలోచించుకోనివ్వండి" అని మాత్రం అన్నాడు.

"కాస్సేపేం ఖర్మ? రాత్రంతా ఆలోచించుకో. వుదయాన్నే వస్తాను. 'అవును' అని మాత్రం చెప్పు" అని కిందకు వెళ్ళిపోయింది.

ఆ రాత్రంతా ప్రసాదుకి నిద్రలేదు. బమ్మెర పోతన గుర్తుకువచ్చాడు. అతనిముందు కన్నీరు కారుస్తున్న సరస్వతీదేవి సాక్షాత్కరించింది అతనికి. ఆమెకు అతడిచ్చిన వాగ్దానం గుర్తుకొచ్చింది. మరుక్షణంలో శ్రీనాథుడు పోతనను ఎగతాళి చెయ్యడం గుర్తుకొచ్చింది. ఏం చెయ్యాలి? తన అభిరుచి, ధ్యేయం, ఆశయం ఇవి ముఖ్యమా? చెల్లెలు పెళ్ళి, అమ్మ సుఖం ఇవి ముఖ్యమా? రాత్రంతా అదే ఆలోచన. స్వార్థాన్ని త్యాగం జయించింది. అజ్ఞాతంలో వుండడానికి నిర్ణయించుకున్నాడు.

ఉదయాన్నే టూత్‌పేస్టు, బ్రషుతో వచ్చిన జానకమ్మగారు అతన్ని అడక్కుండానే, అతని నిర్ణయం చెప్పాడు. సంతోషంగా కిందకు వెళ్ళింది. భర్తతో ఆమె ప్లాన్‌అంతా చెప్పింది.

"చెప్పండి. 'కవి అనేవాడు పుట్టుకతోనే పుట్టాలి' అన్నారే, ఇప్పుడేమంటారు?" అని దెప్పిపొడిచింది.

"ఏమైనా నువ్వు పెట్టి పుట్టావు జానకీ" అని ఆమెను మనస్ఫూర్తిగా అభినందించాడు జానకిపతి.

* * *

జానకమ్మగారు తమ వీధిగేటు తెరుచుకుని, పక్క గేటులోంచి ఆరువాటాల కాలనీలోకి వెళ్తోంది. ఆ వాటాలో వారందరికీ ఆమె రాక ఆశ్చర్యాన్ని కలిగించింది. ఎప్పుడూ గోడ అవతల నిలబడి, అందరినీ తనదగ్గరకే రమ్మనే ఆమె—తానుగా వాళ్ళదగ్గరకు రావడం ఆశ్చర్యంగానే వుంది. అంతా "రండి,రండి" అంటూ స్వాగతం చెప్పారు.

"విన్నారా? నిన్న సంగతి?" అంటూ చెప్ప

బోయింది నాలుగో వాటా వదినగారు.

ఆమె మాత్రం నేరుగా ఆరో వాటాలోకి వెళ్ళింది. వీధి తలుపు మూయించింది. జరిగిందంతా చెప్పింది జానకమ్మగారు. తన ప్లాన్ కూడా చెప్పింది. పిన్నిగారు మాత్రం—

"నువ్వు నాకన్న చిన్నదానివి. నీకు నమస్కారం పెట్టకూడదు. ఏం చేసినా నీ రుణం తీరదు. చచ్చి నీ కడుపున పుడతాను" అంది కళ్ళవెంట నీరు కారుతూండగా.


"ప్రసాద్‌ను మీరు అప్పుడప్పుడు వచ్చి, చూసి పోతూండండి. ఈ రహస్యం మూడో కంటివాడికి తెలియకూడదు. అతనివి నాలుగు జతల బట్టలు ఇవ్వండి" అని సంచీలో పెట్టుకుని, పమిట చాటున వాటిని దాచి రహస్యంగా తీసుకువెళ్ళింది.

ర ర ర

ప్రసాద్ రచనలు సాగిస్తున్నాడు. వాటిని జానకమ్మగారు శ్రద్ధగా సాపుచేసి ఆమె పేరిట పత్రికలకు పంపుతోంది. ప్రచురణ అవుతున్నాయి. ఆమె వారికి యిచ్చిన మాటప్రకారం, వాళ్ళ దూరపు బంధువును రప్పించి, పెళ్ళికి ఒప్పించి, పెళ్ళి జరిపించింది. పెళ్ళి దగ్గరవుండి జరిపించలేని ప్రసాద్ మేడమీంచే, ఆ దంపతుల్ని మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తూ, రెండు కన్నీటి బిందువులు రాల్చాడు. అవే ఆ నవ దంపతుల సుఖజీవనానికి అమృతబిందువులు.

నవ దంపతుల్నీ, వారికి తోడుగా పిన్నిగారినీ హైద్రాబాదు పంపించింది జానకమ్మగారు.

జానకమ్మగారు చేసిన సహాయాన్ని, ఆ అయిదు వాటాల్లో వున్నవాళ్ళూ ఏకగ్రీవంగా అభినందించారు. అద్దెకున్నవాళ్ళకు నిత్యావసరమైన, నీరు, గాలిలాంటి సౌకర్యాలే చూడని యజమానులువున్న ఈ మహానగరంలో జానకమ్మగారివంటి యజమానురాలు-అద్దెకున్నవారి ఇంటికి పెద్ద ఆడబడుచులా ముందుకొచ్చి, కన్నకొడుకులేని లోటు తీర్చి, శారదను ఓ యింటి దాన్ని చేసినందుకు అంతా ఆమెను పొగిడారు. ఊళ్ళోకూడా ఈ సంగతి పొక్కిపోయింది. ఎప్పుడూ క్లబ్బుల్లో పేకాడి, రాత్రి పార్టీలనించి లేటుగా వచ్చే నిక్షేపరాయుళ్లు ఒకళ్ళిద్దరు—



"ఉష్! నేనీ బీరువాలో దాక్కున్న సంగతి మావిడతో చెప్పేవ్. ప్రాణాలు తోడేస్తుంది జాగ్రర్త!!"

"ఏమైనా, బ్రదర్! మీరు ఖాళీ చెయ్యకండి. మీకిలాంటి యజమానులు దొరకరు."

"మీరు ఖాళీచేస్తే చెప్పండి. నాకు నలుగురు ఆడపిల్లలు. పెళ్ళికి ఎదిగివున్నారు" అని చమత్కరించాడు మరో నిక్షేపరాయుడు.

ఈ పెళ్ళి జరిగినతర్వాత ఆ హత్యగురించి చెప్పుకోడం మానేశారు. కొత్తనీరు వచ్చి పాత నీటిని కొట్టేసినట్టయింది.

ర ర ర

ప్రసాద్ జీవితం జైలులో వున్నట్టు వున్నా హాయిగా వుంది. పత్రికలు చదవడమేగాని, పత్రికలకు రాయడం మానేశాడు. ఆ అవసరం అతనికి ఇప్పుడులేదు. జానకమ్మగారు మాత్రం రచయిత్రిని అయిపోయాను గదా, రాయకపోతే ఎలాగ అని, రాయడం ప్రారంభించింది. ప్రసాద్ ఆమెకు సాయపడుతూ వుండేవాడు. స్వతంత్రంగా ఆమె పత్రికలకు పంపడం పరిపాటైపోయింది. రచయిత్రిగా పేరు సంపాదించిన ఆమెకు పత్రికకు సంపాదకురాలు అనిపించుకోవాలనిపించింది. స్వంతంగా పత్రికను ప్రారంభించింది. దానికి 'సాధన' అని పేరు పెట్టింది. ఆమె భర్త ప్రచురణకర్త. ఆ అయిదువాటాల్లో వాళ్ళూ ఆమె దీక్ష,పట్టుదలను చూసి ఆశ్చర్యపోయారు.

"తలచుకోవాలేగాని, ఆడది సాధించలేనిది లేదు" అన్నారు మగవాళ్ళు కొందరు.

"నువ్వు వున్నావు ఎందుకూ? ఓ కథ

రాయలేవు" అని భార్యని చీదరించుకున్నాడు మరో వాటాలో భర్త.

ఆమె కథల్ని పుస్తకరూపంగా ప్రచురించాలని, ప్రచురణకర్తలు ముందుకువస్తున్నారు. పుస్తక ప్రచురణ వ్యాపారదృష్టితోగాక, కళాత్మకంగానూ సాహిత్యపరంగానూ చూసేవారి కోసం ఆమె ప్రయత్నించింది. కాని, వారి షరతులు, వ్యాపారపద్ధతులూ ఆమెకు అంతగా నచ్చలేదు. అంచేత తానే స్వయంగా ఎందుకు ప్రచురించకూడదు అనుకుంది. 'సాధన ప్రచురణలు' అనే పేరిట ఓ ప్రచురణ సంస్థ నెలకొల్పింది. తొలి కథల సంపుటికి 'సాధన'అని పేరుపెట్టింది. అందులో పన్నెండు కథలున్నాయి. పుస్తక ఆవిష్కరణకూడా విద్యాశాఖామాత్యులచేతనే చేయించాలని ఆమె కోరిక (ఆ శాఖ మంత్రి స్త్రీ గనుక). ఆమె రాకకోసం ఒక నెలరోజులు ఆగింది కూడా.

ర ర ర

ఆ రోజే గ్రంధ ఆవిష్కరణ మహోత్సవం. కస్తూరిబా విద్యాలయంలో సభ ఏర్పాటయింది. వేదిక ఎంతో అందంగా అలంకరించబడివుంది. వేదికకు వెనకవున్న స్వచ్ఛమైన తెల్లని తెర మీద- "సాధనమున పనులు సమకూరు ధరలోన" అని ప్రస్ఫుటంగా, శుభ్రప్రదమైన పసుపు రంగులో రాయబడివుంది. దానికి కిందనే ఒక స్త్రీ మూర్తి దీక్షతో రాస్తున్న రేఖాచిత్రం వుంది. వేదికకు రెండుప్రక్కలా ప్రఖ్యాత రచయిత్రుల ఫోటోలు వున్నాయి. ఆ సమావేశం యెంత నిరాడంబరంగా జరపాలని అనుకున్నా, మంత్రిగారి రాకతో దానికి ఎక్కడలేని ప్రచారమూ వచ్చి, చుట్టుపక్కల గ్రామాలనుంచి యెందరో వచ్చారు. అందులో కవులు, రచయితలు, పండితులు, సిద్ధాంతులు ఎందరో వున్నారు.

అనివార్య కారణాలవల్ల అనుకున్నచోటికి, అనుకున్న ప్రకారం అమాత్యవరులు రాలేకపోతున్న కారణంగా, ఈ ఆవిష్కరణ సభ కూడా ఆలస్యమైంది.సాయంకాలం అల్పాహార విందు సిద్ధంచేసివుంచారు.మంత్రిణిగారు రాలేదు. సభ ప్రారంభం కాలేదు. అంచేత విందు సమయంలో దాన్ని ఆహూతులకు యిచ్చారు.అంతా అల్పాహార విందును అధికంగా సేవించి— (ఇళ్ళకు ఎప్పుడు వెళ్ళినా బాధలేదన్న ధైర్యంతో) అమాత్యుల రాకకోసం యెదురు చూస్తున్నారు.

అమాత్యులు అగ్రహారంనుంచి బయల్దేరారనీ, ఓ అరగంటలో వచ్చేస్తారనీ, ఒకతను మోటారుసైకిలుమీద వచ్చి చెప్పాడు. అతని కడుపు చల్లగా, అతను చెప్పినట్టే ఆమెగారు వచ్చారు.

కాలేజీ విద్యార్థినులు ఆమెమీద పువ్వులు చల్లారు. నుదుట కుంకుమదిద్ది మంగళహారతి యిచ్చారు. పన్నీరు జల్లారు. వేదపండితులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం చెబుతూ వేదికమీదకు తీసుకువెళ్లారు. వేదికమీదనే సిద్ధంగావున్న మరో బాలికల బృందం ఆమె మెడలో పూలమాలలు వేసింది. అన్నీ ఆమె వెంట వెంటనే తీసేసింది. అన్నిటికన్న లావుపాటి మాలను ఆమె మెడలోవేసి, పుష్పగుచ్ఛాన్ని చేతికిచ్చి, స్వాగతం పలికింది జానకమ్మగారు. "సాధన" పుస్తకం ప్రతిని ఒక పట్టుచీరలో చుట్టి, వెండి పళ్లెంలోపెట్టి, టేబిల్ ముందు వుంచారు జానకీపతి. టేబిల్ మీద వున్న కార్యక్రమం కాగితాన్ని తీసుకుని చూసి మంత్రిణిగారు—

"కార్యక్రమం చాలా బృహత్తరంగావుంది. నాకూ కార్యాభారం ఎక్కువగానేవుంది.అంచేత చెప్పవలసిన నాలుగుముక్కలూ నేను చెప్పేసి, వెళ్లిపోతాను. ఒక మహిళ, అందులోనూ ఒక ఆంధ్రమహిళ, ఏ ప్రభుత్వ సహాయమూ లేకుండా, తనకు తానుగా స్వయం కృషితో ఈ 'సాధన' అనే పుస్తకాన్ని రాసింది అంటే, స్త్రీలు, పురుషులూ అంతా గర్వపడాల్సిన విషయం. ఇందులోవున్న పన్నెండు కథలూ, ఇంతకుముందే- దినపత్రికల్లో—" ఇంతలో ఆమెకు చెవిలో యేదో చెప్పారు.

"దిన వారపత్రికల్లో కాదట—ఒక్క వార పత్రికల్లోనే వచ్చాయట.విశేష ఆదరణ పొందాయట! ఆ ఆదరణ మూలంగానే, ఆ కథలు



స్త్రీకి ప్రసవవేదన భరించరానిది. రష్యాలోని డా॥ పర్శియానియావ్ ఒక విద్యుత్‌పరికరాన్ని నిర్మించారు. ప్రసవకాలంలో యీ పరికరంలోని తీగలను స్త్రీ నుదుటి మీద వుంచి, విద్యుత్‌తరంగాలను ప్రవేశపెడితే, స్త్రీకి నిద్రముంచుకొస్తుంది. **Electro Sleep** (విద్యుత్‌నిద్ర?) లో స్త్రీకి ప్రసవవేదన తెలియకుండా సుఖప్రసవం జరుగుతుంది! ఇటు తల్లికీ, అటు శిశువుకూ యీ విద్యుత్ నిద్ర నిరపాయకరమైనదని తేల్చారు డా॥ పర్శియానియావ్.

పుస్తకరూపంలోకి తీసుకువచ్చారు. ఇప్పుడు నేను ఆ గ్రంథాన్ని బయటకు తీసేముందు, మా సోదరి, రచయిత్రిని మనసారా అభినందించి వెళ్లిపోతాను. నాకు చాలా కార్యాభారం వుంది. రచయితలు, రచయిత్రులు ఎందరో వున్నారు. వారంతా వుపన్యసిస్తారు. ఆ వుపన్యాసంకూడా మీరు విని మరీ వెళ్లాలి అని కోరుతున్నాను.

సోదరి జానకి, స్వయంకృషితో, తనకు తానుగా ఎంతో సాధన చేసింది. ఈ పుస్తకాన్ని రచించింది. ఇందులో ఏ పురుషుడి ప్రమేయం లేదు. అది స్త్రీజాతికే గర్వకారణం—''

ఇంతలో— "ఆగండి" అన్న పురుషుడి అరుపు వినబడింది. అంతా అటు తిరిగి చూశారు.

చరచరా ప్రసాద్ వేదికపైకి వస్తున్నాడు. అమాత్యులు నిర్ఘాంతపోయారు. వేదికమీద వున్న మైకును లాక్కున్నాడు ప్రసాద్.

"ఈ కథలన్నీ నేను రాసినవి" అని గర్జించాడు.

సభ అంతా గొల్లున నవ్వారు.

"నవ్వండి. నా బతుకే నవ్వులపాలు చేసుకున్నాను. నేనొక హత్యకేసులో ఇరుక్కుని బయటకు రావడానికి భయపడి, జానకమ్మగారి శరణు జొచ్చాను. నా బలహీనతను ఆమె అదనుగా తీసుకుంది. నా కథలు ఆమె పేరిట ప్రచురించుకోనిస్తే, నా రహస్యం బయట పెట్టనంది. నా చెల్లెలుకు పెళ్లి చేసి, మా కుటుంబాన్ని ఆదుకుంటానంది. ఆ పరిస్థితుల్లో నేను అంగీకరించాను. అజ్ఞాతంగా వున్నాను. కాని- నాకు జరగవలసిన ఈ సన్మానం ఈమెకు జరుగుతుంటే అజ్ఞాతంగా వుండలేకపోయాను."

"ఇదో పెద్ద కథలావుంది" అన్నారు సభలో ఎవరో—

"చెప్పు నాయనా - ఎంత చెప్పాలో అంతా చెప్పు" అంటూ ప్రేక్షకుల్లోని స్త్రీలు గోల చేశారు.

"అయితే, నువ్వు రచయితనంటావు" అన్నది మరో రచయిత్రి.

"అవును. 'కావ్యశ్రీ' అనే కలం పేరుతో అనేక పత్రికల్లో నేను రాశాను."

"ఆ కావ్యశ్రీ నువ్వేనని మాకు రుజువు ఏమిటి?" అని అడిగింది మరో రచయిత్రి.

"మిమ్మల్ని నమ్మించడానికి నా దగ్గర ఇప్పుడు ఆధారాలు లేవు" అన్నాడు ప్రసాద్.

"నీ మాటలు మాత్రం నమ్మమంటావు."

"నమ్మాలి-నమ్మితీరాలి. కావాలంటే, జానకిగారిని అడగండి."

జానకమ్మగారు ఏదో చెప్పబోయింది.

"మీరేం మాట్లాడకండి. నువ్వు నిజంగా రచయితవే అయితే, ఇప్పుడు రుజువుచేసుకో- ఓ విషయం ఇస్తాం - నీకూ జానకిగారికీ ఒకే ఒక గంట వ్యవధి యిస్తాం-రాసి తీసుకురా-" అని ప్రతిపాదించింది మరో రచయిత్రి.

మరుభూమిలో మళ్ళీ వసంతం

అది 1977 నవంబరు 19 శనివారం. కాళరాత్రి. ప్రళయ భయంకరమైన పెనుతుపాను విరుచుకపడి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరాన్ని తుడిచిపెట్టుకపోయింది. విధ్వంసకాండ జరిపి వల్లకాటిగా మార్చింది. తక్షణ సహాయ చర్యల నిర్వహణకుగాను స్వల్పకాల, దీర్ఘకాలిక ప్రాతిపదికలపై సత్వరమే బహుముఖ పునరావాస కార్యక్రమం చేపట్టడం జరిగింది. పన్నీటి జల్లులు కురిసి కొత్త జీవితం ప్రారంభమైంది.

* ఉదారంగా అందజేసిన సహాయం : రు. 17 కోట్లు
* భూమిశిస్తు మినహాయింపు : రు. 7.34 కోట్లు
* 41,800 మంది నేతపనివారలకు సహాయం : రు. 2.25 కోట్లు
* 14,000 మంది మత్స్య పారిశ్రామికులు : రు. 1.61 కోట్లు
* 7500 మంది వృత్తి పనివారలకు : రు. 68.5 కోట్లు
* రోడ్లు, భవనాలు, వంతెనల పునరుద్ధరణ : రు. 19.28కోట్లు
* నీటిపారుదల పనులు, విద్యుచ్ఛక్తి పనుల పునరుద్ధరణ : రు. 18.68 కోట్లు
* విద్యాసంస్థల పునరుద్ధరణ : రు. 1.38 కోట్లు
* మునిసిపల్ ఆస్తుల మరమ్మతులు : రు. 1.50 కోట్లు
* ఎరువులు, విత్తనాల సరఫరా, ఉప్పు, మళ్ళిపోయిన : భూమి మరమ్మతు వగైరా : రు. 1.84 కోట్లు
* ఇంతవరకు నిర్మించిన శాశ్వత గృహాలు : 1110.

డై. జ. స. పౌ. సం. శా.
33/78-79



"సరే" అన్నాడు ప్రసాద్.

ఇద్దరికీ చెరో కలం, ఇన్ని కాగితాలూ యిచ్చి, ఓ క్లాస్‌రూంలోకి పంపారు. పర్యవేక్షణకు ఒక రచయిత్రిని కూడా పంపారు.

జనంలో కలకలం, "గ్రంథ చౌర్యం విన్నాం గాని, ఇలాంటి చోద్యాలు వినలేదు" అన్నారు రిటైరయిన ఓ తెలుగు మేష్టారు.

"చౌర్యంకాదు - నా శ్రాద్ధంకాదు. ఇలాగ యేదన్నా అల్లరిచేస్తే, అతనికింత పడేస్తారని ఆశ-" అన్నారు మరో పండితుడు.

గంటసేపూ జనం కూచునే వున్నారు. మంత్రిగారు కార్యాభారం చాలా వుండటంచేత వెళ్ళిపోయారు. బాలికలు ఏవో పాటలు పాడుతూ ప్రేక్షకుల్ని కూచోబెట్టారు.

ఇచ్చిన వ్యవధి పూర్తికాకుండానే, జానకమ్మగారు తన కాగితాలు యిచ్చింది.

ప్రసాద్ మాత్రం తెల్లకాగితాలే యిచ్చాడు తెల్లమొహం వేసుకుంటూ.

"ఏమయ్యా! కవిని అన్నావు. పేరు 'కావ్యశ్రీ' అన్నావు. కనీసం నీ పేరైనా రాయలేదేం?" అని యెత్తిపొడిచింది యువ రచయిత్రి.

"అలవాటు తప్పిపోయింది" అన్నాడు ప్రసాద్.

"కాదు అవసరం తప్పిపోయింది. ఇలా రాయాల్సి వస్తుందనుకోలేదు పాపం" అన్నది మరో రచయిత్రి.

"నువ్వు నిజంగా రచయితవేఅయితే, సాటి రచయిత్రిని యిలా అవమానించకూడదు బ్రదర్- వెళ్లు-" అన్నాడు మరో రచయిత.

అంతా అతన్ని హేళన చేశారు.

ఇంతలో అతనికోసం వెతుకుతున్న పోలీసులు, ఇతని వునికి ఎలా తెల్సిందో- అతన్ని తమతో రమ్మన్నారు.

"ప్రసాద్! ఒక్క నిమిషం" అంటూ జానకమ్మగారు వచ్చి. 'సాధన' పుస్తకం ప్రతి అతనికి యిచ్చింది. దాని అట్ట తిరగేశాడు ప్రసాద్.

"నాకు ఆవేశాన్ని కల్పించి, నన్నూ రచయిత్రినిచేసిన రచయిత- "కావ్యశ్రీ" - కాదు- ప్రసాద్‌కు కృతజ్ఞతతో.

-జానకి,

అని వుంది. ఆ పేజీ తిరగేశాడు ప్రసాద్.

—అంకితం—

"లక్ష్మీ వరప్రసాద్‌కు" అని వుంది.

జానకమ్మగారి విశాల హృదయానికి తనలో తానే నమస్కరించుకుని పోలీసులతో వెళ్ళిపోయాడు ప్రసాద్.

వారి వెంట, జానకీపతిని పంపింది జానకమ్మగారు. □

ఇది మరో తెలుగు సినిమా కథ

డియల్ఎన్.శాస్త్రి



చౌదరి గారు గుంటూరులో పలుకుబడిగల వ్యక్తి. రెండు వందల ఎకరాల మాగాణి. అంతే కాక స్థానిక ఎమ్. ఎల్. ఏ. కొడుకు రంగా వ్యవసాయం చూసుకుంటున్నాడు. విజయ ఆయన గారాల బిడ్డ. కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎమ్. బి. బి. ఎస్. చదువుతోంది. కూతురు కబ్బినట్టు కొడుక్కి చదువబ్బలేదు. చౌదరి గారు ఒకవిధంగా మంచివ్యక్తే. కాని భార్య పోవడంతో స్త్రీ లోలత్వం, ఒకవిధమైన మొండివైఖరి ప్రబలాయి.

అవి ఫోర్తియరు ఎమ్.బి.బి.ఎస్. పరీక్షలు. ఆ అమ్మాయి అరగంటనించీ బెక్కుతోంది. అడపా తడపా కన్నీళ్ళు తుడుచుకుంటోంది. ఆమె ప్రక్కన రవి పరీక్ష రాస్తున్నాడు. ఇదంతా గమనిస్తున్నాడు. తన కెందుకులే అని తన పేపరు రాసుకుంటున్నాడు. ఇంకా గంట టైముంది. 'అమ్మయ్య ఈవాళ పేపరు ఈజీగా ఉంది' అనుకున్నాడు రవి. ఆ అమ్మాయి ఇంకా ఏడుస్తోంది. పోనీ పలకరిస్తేనో' "ఏమండీ! ప్లీజ్. ఎందు కేడుస్తున్నారు?" అనడిగాడు రవి. "ఇప్పటివరకూ అన్ని పేపర్లు బాగా రాశాను. ఈ పేపరు నాకు కొంచెం కఠినంగా ఉంది. నిన్నట్నుంచీ ఒకటే తలపోటు. ఒక్కటీ గుర్తు రావడంలేదు. ఈ పేపరుపోతే క్లాసు పోతుంది. పరీక్షా పోతుంది" అంది. "ఫర్వాలేదు భయపడకండి" అని రవి ఆ గంట టైములో కొన్ని ఆన్సర్ను తయారు చేసి ఆవిడకిచెప్పి, కొన్ని తన పేపరులోంచి

రెండర్థాల పాటైతే సెన్సారోళ్ళు పట్టుకుంటారని నాలుగర్థాల పాట రాశాను సార్!!



చూపించి శాయశక్తులా సహాయం చేశాడు. అలా అయింది రవి, విజయల పరిచయం. రవికి మెడికల్ కాలేజీలో మంచి పేరుంది. టెన్నీసు, క్రికెట్, స్పోర్ట్సు అన్నింటిలోనూ అతనే ఫస్టు. అలాగే చదువులో కూడా ఫస్టే. ప్రతి ఏడాదీ ప్రథముడుగా ఉత్తీర్ణుడవుతున్నాడు. ఆడపిల్లలంటే చాలా గౌరవం. అటువంటి రవి స్నేహాన్ని ప్రతి ఆడపిల్ల కోరుకునేది. అయినా తను అందరికీ దూరంగా ఉంటూ వచ్చాడు. తండ్రి పంపే కొద్దిపాటి డబ్బు క్లుప్తంగా వాడుకుంటూ, స్కాలర్‌షిప్పులతో చదువు సాగిస్తాడు. ఒక పేరుపొందిన డాక్టరు కావాలనే ఆశయం. విజయతో పరిచయ మయ్యేవరకు రవికి ఇంకే అమ్మాయి స్నేహం తెలియదు. అలా అయిన పరిచయం విజయతో ప్రేమగా మారింది. తను బ్రాహ్మణ యువకుడినని, పేదవాడినని తెలియజేసాడు. అయినాసరే విజయ చలించలేదు. అప్పట్నించీ, కాకినాడలోఉన్న అందమైన ప్రదేశాలన్నీ వారి విహారస్థలాలే అయ్యాయి. సముద్రపొడ్డు, సర్పవరం, భానుగుడి, కుళాయిచెరువు, గాంధీ నగరం పార్కు ఇవన్నీ రవి విజయల ప్రేమకు ఆటపట్టులు.

విజయ తమ ప్రేమ విషయం చౌదరిగారికి తెలియజేస్తుంది. చౌదరిగారు ససేమిరా ఒప్పుకోరు. కాని విజయ తండ్రి నెదిరించి అన్నవరం సత్యన్నారాయణస్వామి సాన్నిధ్యంలో రవిని వివాహం చేసుకుంటుంది. అప్పటికి వారిరువురూ హౌస్ సర్జన్సుగా ఉంటారు. వివాహానికి అనేకమంది మిత్రులు హాజరయి శుభాకాంక్షలు తెలియజేస్తారు.

రవి వ్యక్తిత్వం తెలిసిన అతని తల్లిదండ్రులు మనస్ఫూర్తిగా ఆశీర్వదిస్తారు. రవికి విజయకి హైద్రాబాదు ఉస్మానియా హాస్పిటలులో ఉద్యోగం దొరుకుతుంది! రోగుల సేవతోబాటు న్యాయమార్గాన డబ్బు సంపాదించడానికి రాత్రి పగలు ఇరువురూ కష్టపడతారు.

విజయని తన మేనల్లుడు చంద్రానికివ్వాలని చౌదరిగారు అనుకునేవారు. విజయ తనకి కాకుండా పోయినందుకు విజయమీద, చౌదరిగారిమీద చంద్రం కక్ష సాఫెంచ డానికి అవకాశం కోసం వేచి ఉంటాడు.

చౌదరిగారు ఎమ్. ఎల్. ఏ. కావడంవల్ల అడపా తడపా హైద్రాబాదు వెళ్ళివస్తూ ఉంటారు. అక్కడ డాన్సరు రీటాతో పరిచయ మవుతుంది. అది క్రమేణా వృద్ధిచెందుతుంది. చౌదరిగారితోబాటు ఉండే చంద్రాన్ని కూడా రీటా ఆకర్షిస్తుంది. విజయ అక్కడే ఉందని తెలిసినా కలవాలని ప్రయత్నించరు చౌదరిగారు. కాని చంద్రం వాళ్ళని గమనిస్తూ ఉంటాడు.

హైద్రాబాదులోనే చౌదరిగారి తమ్ముడు రామయ్యగారు ఉంటారు. ఆయనకి చెప్పుకో తగ్గ ఆస్తిలేదు. రామయ్యగారి కుటుంబం విజయ రవిలని సొంతకూతురు అల్లుడుగా ఆద రిస్తారు. చౌదరి డబ్బు మనిషని బాధపడతారు. విజయ రవిలకి అజయ్ పుడతాడు. రవి 'విజయ నర్సింగు హోమ్' ప్రారంభిస్తాడు. వారిరువురు హైద్రాబాదులో లీడింగు డాక్టర్సు గానూ ఆదర్శ దంపతులుగానూ పేరు గడిస్తారు.


కాలగమనంలో ఇరవై సంవత్సరాలు గడు స్తాయి. రవి రామయ్యగారి సాయంతో మామ గారి భూములు ప్రక్కనే కొంత భూమి కొంటాడు. అదంతా విజయ,రవిల కష్టార్జితమే. ప్రత్యుపకారంగా రామయ్యగారి కొద్దిపాటి భూమిని రైతులనుండి ధనసహాయం చేసి విడి పిస్తాడు రవి. స్వంత నర్సింగుహోమ్ మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగుతుంది. అజయ్ బాపట్లలో ఏజి బి.యస్.సి చదివి స్వంత భూముల్ని వ్యవసాయం చేస్తూ వుంటాడు. వ్యవసాయంలో కొత్త ప్రక్రియల్ని ప్రవేశ పెడతాడు. అజయ్‌కి మేనమామ కూతురు రాణితో పరిచయమై ప్రేమగా మారుతుంది. మాగాణీ క్షేత్రాలన్నీ వారి విహారస్థలా లయ్యాయి. రాణి గుంటూరులోనే బి.యస్.సి. చదువుతూ వుంటుంది. ఈసారి ఎలక్షన్లలో అందరి ప్రోద్బలం మీద చౌదరిగారికి వ్యతి రేకంగా అజయ్ నుంచుంటాడు. చౌదరిగారి విరోధులు ఆయన కుప్పల్ని కాల్చేస్తారు. చంద్రం ఇది అజయ్‌పైకి నెట్టుతాడు. ఈ గొడవకి విజయ రవిలు రావలసి వస్తుంది. రామయ్యగారి సహాయంతో అజయ్ నిర్దో షిత్వం నిరూపింపబడుతుంది.

ఆరోజు రిట్జ్‌లో కాలీగ్ స్వామినాధన్ అమెరికా వెళ్ళే సందర్భంలో సెండాఫ్ డిన్నరు జరుగుతుంది. రవి అటెండవుతాడు. డిన్న రయ్యేసరికి ఒంటిగంట దాటుతుంది. రవి వస్తూంటే చౌదరిగారు హోటల్ లోపలికి వెడుతూ కన్పిస్తారు. కాని పలకరించరు. తర వాత రవి ఇంటికి చేరుకోగానే ఫోను వస్తుంది రీటా హత్య జరిగిందని. పోలీసులు ముందు చౌదరిగార్ని అరెస్టు చేస్తే రవి జామీనుపై విడిపిస్తాడు. తానా హత్యచేయలేదని చౌదరి గారు రవితో చెప్తారు. ఉదయం అయిదుగంటల ప్రాంతంలో రీటాకు తెలివివస్తుంది. చంద్రం తనని పొడిచాడని చెప్పి ప్రాణాలు విడుస్తుంది రీటా. పోలీసులు స్టేట్‌మెంటు రికార్డు చేస్తారు. చంద్రం రీటాతో చౌదరిగారు ఆ హోటలు గది లోనికి రావడానికి ముందే వచ్చి రీటాతో డబ్బు విషయంలో ఘర్షణపడతాడు. రీటా టాయ్‌లెట్ కని వెడుతుంది. చంద్రం వెళ్ళిపోయాడను కుంటుంది తిరిగివచ్చి. కాని చంద్రం పరదా వెనుక నక్కివుంటాడు. ఈ లోపులో చౌదరి గారు వస్తారు. రీటా ప్రేమవిషయమై వారిరు వురికి వాదప్రతివాదాలు జరుగుతాయి. ఇదే అద నుగా చంద్రం రీటాను వెనుకనుండి పొడిచి పారిపోతాడు. రీటా మట్టుకు చంద్రాన్ని గుర్తి స్తుంది.

రీటా చివరిమాటలు విన్న రవి చంద్రం కోసం జంటనగరాలన్నిచోట్లా గాలిస్తాడు. చివరి ప్రయత్నంగా సికింద్రాబాదు స్టేషనుకు వస్తాడు. కృష్ణా ఎక్స్‌ప్రెస్సు అప్పుడే బయలు దేరుతుంది. అందులో వెళుతున్న చంద్రాన్ని రవి గుర్తిస్తాడు. కారులో ఛేజ్ చేస్తాడు. చివ రకు ఖమ్మం దగ్గర అందుకోగలుతాడు. చంద్రాన్ని పోలీసులకి పట్టిస్తాడు రవి.

అజయ్ తాతగారిపై ఎలక్షనులో గెలవడంతో బాటు, దేశస్థాయిలో మేలిరకం అధిక వరి దిగుబడికి బహుమతి పొందుతాడు. చౌదరిగారు విజయని ,రవిని క్షమించమని వేడుకుంటాడు. రాణి అజయ్‌ల వివాహం అతి వైభవంగా జరి పిస్తారు చౌదరిగారు. □

తన ప్రేమ, కోపం
తన సంతోషం, సంతాపం
తన ఆనందం, ఆవేదన
తన అవమానం, అభిమానం
తన జీవితంలోని ప్రతి అనుభూతీ
మీ కు వి వ రి స్తూ
వ స్తు న్న ది



కొత్త సీరియల్ ప్రారంభం!

పేజీ త్రిప్పండి

మీరా నిలువుటద్దం ముందు నిలబడి తిలకం దిద్దుకుంటోంది.

"ఇంకా తెమల్లేదూ! ఈ కాగితాలు మాత్రం సెంటరులో ఇచ్చి వెళ్ళాలి. తర్వాత నీ ఇష్టం"అప్పుడే అక్కడికి వచ్చిన కాంతమ్మ అంది.

"నేను ఆ కాగితాలు సెంటరులో ఇచ్చే వెళ్తాను.-నువ్వేం బెంగపెట్టుకోకు!" ఇంకా తన ముస్తాబుని చూసుకొంటూనే తల్లికి సమాధానమిచ్చింది మీరా.

మీరా తెమిలి చెప్పులేసుకొని బయలుదేరేసరికి ఇంకో పావుగంట పట్టింది. "ఇదిగో! కాయితాలు మర్చేపోయావ్" కాంతమ్మ కాయితాలు డ్రాయరుమీదవి ఇస్తూ అంది.

మీరా వాటిని బాగ్‌లో పెట్టుకోబోతూ ఆగి అంది "ఈరోజు శనివారం కదూ! మధ్యాహ్నం సెంటరు బందేమో!"

"సూర్యకుమారి అయిదింటివరకూ వుంటుంది. బట్టలు కుట్టుకొనేవాళ్ళు వస్తూంటారు. వెళ్ళు! అప్పుడే అయిదయిపోతోంది. మళ్ళీ సూర్యకుమారి వెళ్ళిపోతుంది."

మీరా గబగబా రోడ్డుమీదకి వచ్చింది. మే నెల. సాయంత్రం ఐదవుతున్నా ఎండ ఇంకా చుర్రుమంటూనే వుంటుంది.

కాంతమ్మ జ్యోతీ స్కూల్లోనే టీచరుగా పనిచేస్తోంది. జ్యోతీ స్కూలూ - సెంటరూ సరోజినీరావుది. ఆ సెంటరు వెలసి 20 సంవత్సరాలు అయితే; మరో సంవత్సరానికి ఆ స్కూలు వెలిసింది.

కోటేశ్వరరావు భార్య సరోజినీదేవి.

అప్పట్లో కోటేశ్వరరావు ఓ వెల్ఫేర్ సెంటర్‌కి సెక్రటరీగా వుండేవాడు.

అప్పుడు సరోజినీదేవి ఆ సెంటరుకెళ్ళి కుట్టుపనీ అదీ నేర్చుకొనేది.

మొదట్లో చాలా పిరికిగా, భయంగావుండే సరోజినీదేవికి రాను రాను - పదిమందితో పరిచయం పెరగడంతో ప్రపంచంలో తెలుసుకోవలసినవి ఎన్నో ఉన్నాయనిపించింది. చేయవలసినది కూడా ఎంతో వుందనిపించింది. కోటేశ్వరరావుకి తలిదండ్రుల బాధ్యత వుండేది. ఏదో పొందిగ్గా సంసారం గడుపుకొనేవారు.

కాని, సరోజినీదేవి నలుగురిలోకి వచ్చి ఇంకా తను తెలుసుకోవలసినదీ, చేయవలసినదీ ఎంతో వుందని తెలుసుకొన్నాక - ఇలా పొందిగ్గా గడపడం ఎన్నాళ్ళు? ఏదో చెయ్యాలి. ఏదో సాధించాలి అని ఆలోచించేది. ఇలాంటి ఆలోచనలు రావటం మొదలుపెట్టేకా ఆ ఇల్లూ ఆ వాతావరణం చాలా ఇరుగ్గా, ఇబ్బందిగా అన్పించేయి.

ఆ రోజుల్లోనే పురిటికి పుట్టింటికి వెళ్ళింది సరోజినీదేవి.

పుట్టింటినుండి పాపనెత్తుకొని హైదరాబాదు వచ్చేసరికి ఆవిడ ఆలోచనలు ఓ కార్యరూపం దాల్చాయి.

పుట్టిన పాపకి ముద్దుగా 'జ్యోతి' అని పేరు పెట్టుకొన్నారు. జ్యోతి మొదటి పుట్టిన రోజున ఒక గది అద్దెకి తీసుకొని, రెండు కుట్టుమిషన్లు ముందే సిద్ధం చేసుకొన్నారు. జ్యోతి మొదటి పుట్టిన రోజునాడు పదిమంది స్నేహితులని పిలిచి "జ్యోతీ సెంటర్"కి ప్రారంభోత్సవం చేశారు.

జ్యోతీ పేరు బలమో- ఆవిడ కార్యదీక్షో- మరి ఆ రెండూ కలిసో కాని జ్యోతీ సెంటర్ దినదినాభివృద్ధి చెందింది. పదిమందినీ ఆకట్టుకోసాగింది.

ఆరునెలలు తిరిగేసరికి మరో రెండు మిషన్లు కొన్నారు.

సంవత్సరం తిరిగేసరికల్లా గది అద్దెకిచ్చినావిడ ఇల్లు అమ్మేసి మావూరు వెళ్ళిపోతున్నానని సరోజినీదేవిని గది కాళీ చేయమని చెప్పింది. మొత్తం నాలుగు గదులు. చిన్న గదులే! సరోజినీ దేవి గుండెల్లో రాయి పడింది. తను ఇంత శ్రమపడి చేసిందంతా వృథానేనా? ఇంటికి చాలా దగ్గరలో వుందని- చాలా చౌకలో దొరికిందని తన అదృష్టానికి మురిసిపోయింది. తనకి ఇంత చౌకలో ఇంత దగ్గరలో దొరకదు. ఎక్కడో దూరంగా అంటే మెంబర్సు కొంతమంది రాక పోవచ్చు. ఏం చేయాలి!

భార్యాభర్త లిద్దరూ రెండు రోజులు తీవ్రంగా ఆలోచించేరు. ఆలోచించి చివరికి ఆ ఇల్లు తామే కొనడానికి నిశ్చయించుకొన్నారు.

మొత్తానికి ఇంటావిడని కిందామీదా పెట్టి పదిహేనువేలకి ఒప్పించేరు. చాలా దగ్గర స్నేహితులు "డబ్బంతా ఒక్కసారే ఇచ్చేటట్టా!" అని అడిగారు, ఇంత డబ్బు మీ కిప్పుడు ఎక్కడిది అన్న ప్రశ్న వ్యక్తపరుస్తూ.

వెంటనే సరోజినీదేవి సమాధానం చెప్పింది. "ఇంట్లోవున్న వెండి-బంగారం అమ్మేశాం- మా నాన్నగారు కొంత సర్దుతా నన్నారు" ఇది ఎవరికీ నమ్మబుద్ధి కాలేకపోయినా నమ్మక తప్ప లేదు. ఇంతవరకూ సరోజినీదేవే కుట్టుపని నేర్పేది. ఇప్పుడు ఇల్లు మొత్తం కొనుక్కొన్నాక చాలా మార్పులు వచ్చేయి.

మెంబర్సుకి ఫీజు ఎక్కువ చేశారు. మొదట్లో జాయినింగ్ ఫీజు రెండు రూపాయలు వుండి తర్వాత ప్రతీనెలా ఒకరూపాయి వుండేది. ఇప్పుడు నెలనెలా రెండు రూపాయల ఫీజు కట్టాలి. దీని కెవరూ బాధపడలేదు. దగ్గరలో వున్నది. ఇంట్లో బట్టలే కాకుండా చుట్టుపక్కల వాళ్ళవికూడా తెచ్చికుట్టుకుంటున్నారు.

ఆ ఇల్లు కొన్నాక మెంబర్సందరికీ చిన్న పార్టీ ఇచ్చి, తమమాట మన్నించి అందరూ పార్టీకి హాజరైనందుకు భార్యాభర్త లిద్దరూ కృతజ్ఞతలు తెల్పుకొన్నారు.

కుట్టుపనితోపాటు, ఎంబ్రాయిడరీ నేర్పేటందుకు అవకాశాలు కలుగజేశారు. అంతే కాకుండా పిల్లలకు అయిదోతరగతి వరకూ క్లాసులు నిర్వహిస్తూ స్కూలుకూడా ప్రారంభించారు.

ఇప్పుడు ఆడవాళ్ళకి చాలా హాయిగా వుంది. మరీ చిన్నపిల్ల లున్నవాళ్ళకి సదుపాయం గానే వుంది. పిల్లలని స్కూలుకి పంపి వాళ్ళు భోజనాలుచేసి, ఇల్లు సర్దుకొని సెంటరు కొచ్చే టప్పుడు పిల్లలకి ఇంత టిఫిను డబ్బాలోపెట్టి తెచ్చుకొంటే స్కూలూ అక్కడే గాబట్టి వాళ్ళకి స్వయంగా తినిపించి- తిరిగి ఇళ్ళకి వెళ్ళేటప్పుడు పిల్లలని వెంటబెట్టుకొని ఇళ్ళకి వెళ్ళేవారు.

మొత్తం ఇల్లుకొని సెంటర్‌లో మార్పులుపెట్టిన కొద్దిరోజులకే కోటేశ్వరరావు అదివరకు సెంటర్‌లో శక్రటరీగా మానేశాడు.

దీనికి చాలామంది చాలా రకాలుగా అనుకొన్నారు. ఆ భార్యాభర్తలు దేనికీ లెక్క-చేయలేదు.

అనుకొన్నట్టుగానే మళ్ళా సంవత్సరం తిరిగే సరికల్లా ప్రైమరీ క్లాసులతోపాటు స్కూల్లో ఇంకో రెండు క్లాసులు పెంచేరు-ఇప్పుడు ఏడవతరగతి వరకూ వుంది.

ఇంకో రెండు సంవత్సరాలు గిర్రున తిరిగాయి.

సెంటర్ పక్కనే కాళీ జాగా కలిసివస్తే అది తీసుకొని అక్కడ స్కూలుకి వీలుగా పొడుగ్గా వసారాల్లాగా కట్టి స్కూలుని దానిలోకి మార్చేరు. స్కూలు బాగానే నడుస్తోంది. సెంటరు సంగతి చెప్పనే అక్కరలేదు. చాలా ఉత్సాహంగా నడుస్తోంది. ఇప్పుడు సెంటర్‌కి రెడీమేడ్ దుస్తులు కూడా కుట్టడానికి వస్తున్నాయి. కుట్టడానికి ఓపికా, నేర్పూ వున్నవారు అవి కూడా కుట్టుకొని నాలుగు డబ్బులు సంపాదించుకుంటున్నారు.

అగస్టు 15, నవంబరు 14 ఇలాగే మరికొన్ని ముఖ్యమైన సందర్భాల్లో సరోజినీదేవి చేసే ఏర్పాట్లు- కార్యక్రమాలు చిన్నవయినా నలుగుర్నీ ఆకట్టుకొనే విధంగా వుండేవి. స్కూలు పిల్లలచేత నాటకాలు వేయించడం లాంటివి పిల్లలనే కాకుండా పెద్దల్నికూడా ఉత్సాహపరిచేవి. మెంబర్స్‌కి కూడా కుట్టుపనిలో పోటీలూ - ప్రైజులూ వుండేవి. అప్పుడప్పుడు రేడియోలో ప్రోగ్రాములు వుండడంతో ఆడవాళ్ళని మరీ ఉత్సాహపరుస్తోందనే చెప్పాలి.

ముఖ్యంగా మరీ చదువుకోని వాళ్ళకి ఇది సువర్ణావకాశంలా వుండి ప్రతీదానిలోనూ అత్యంత ఉత్సాహంతో పాల్గొనేవారు.

కోటేశ్వరరావు కూడా ఒక మిత్రుడి వ్యాపారంలో వాటాదారుగాచేరి, ఆ వ్యాపార వ్యవహారాలు చూసుకోసాగాడు.

* * *

ఇప్పుడు కోటేశ్వరరావు కోటీశ్వరుడు కాకపోయినా కొన్ని లక్షలకి అధికారి.

సెంటరూ, స్కూలూ బాగానే నడుస్తున్నాయి.

సరోజినీదేవికి అనుకొన్నదానికంటే అన్నీ బాగానే జరిగాయిగాని, ఒక్క-లోటు మాత్రం ఆవిణ్ని బాధపెట్టేది. జ్యోతి ఒక్కత్తే ఆడపిల్ల. ఒక్క మగపిల్లాడు పుడితే తన జీవితంలో లోటనేది లేదని ఎన్నోసార్లు అనుకొనేది. డాక్టర్లచేత పరీక్షలు చేయించుకొంది. ఆఖరికి రెండు ఆపరేషన్లు కూడా చేయించుకొంది. ఏం లాభం లేకపోయింది.

ఇంక ఆ ఆశ వదులుకొంది. జ్యోతికి ఇల్లరికం వచ్చే అబ్బాయికి చూసి చెయ్యాలని, ఒక్క-తే కూతురైనందువల్ల అతి గారాబంగా పెంచేరు. జ్యోతి పెంకె ఘటంగా తయారయింది. జ్యోతి పెంకెతనం తెలుసున్నవాళ్ళు, వాళ్ళ డబ్బుకి-వాళ్ళకి ఓ నమస్కారంపెట్టి జ్యోతిని పెళ్ళి చేసుకో నిరాకరించారు. తెలియనివాళ్ళు చూడ్డానికి వచ్చినవారు చేసే మర్యాదలకి ఉబ్బి తబ్బిబ్బయి- జ్యోతి పెంకి సమాధానాలకి హడలిపోయి వెనక్కి తిరిగి చూడకుండా వచ్చిన దారినే వెళ్ళిపోతున్నారు.

కూతురుపెళ్ళి ఆ తలిదండ్రులకి పెద్ద సమస్య అయి కూర్చుంది.

ఫారిన్ పంపిస్తామన్నా- మరెన్ని ఆశలు చూపినా లాభం లేకపోయింది. ఎవరూ ధైర్యం చేసి ముందుకి రావడంలేదు.

"అన్యాయంగా డబ్బు సంపాయిస్తే ఇంతే! ఇలాగే వుంటుంది" వాళ్ళంటే - వాళ్ళ స్థితి అంటే కళ్ళు కుడుతున్నవాళ్ళు అక్కడా ఇక్కడా అనేవారు. వాళ్ళ మాటలు ఒకటీ అరా ఆ భార్యాభర్తల చెవులకి సోకక పోలేదు. వాటిని వాళ్ళు పట్టించుకో దలచుకోలేదు.

అయినా ఇంకా వాళ్ళకి డబ్బు సంపాయించాలనే కోరికా చావలేదు. సెంటరులో ఫీజు పదిరూపాయలు చేశారు.

అయినా అందరూ వస్తూనే వున్నారు.


సెంటరుకీ స్కూలుకీ మధ్య కొంత ఖాళీ స్థలం వుంది. అది చిన్న పిల్లలకి అంటే, మూడు సంవత్సరాలనుంచి పన్నెండు సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఆటస్థలంగా నిర్ణయించి "బాలానందం" అన్న పేరుతో మొన్నీమధ్య జరిగిన మీటింగులో ఆ పేరుని సూచించేరు.

వెనువెంటనే ప్రారంభోత్సవం కూడా జరిగింది.

మీటింగు జరిగే హాల్లో లైబ్రరీ ఒకటి పెట్టేరు. నవల్సేగాక వార పత్రికలు, మాస పత్రికలు, చిన్న, పిన్నలకి ఉపయోగపడేవి చందమామ వగైరాలు కూడా పెట్టేరు.

ఇంక ఆడవాళ్ళు క్షణం కూడా వృథా కాలక్షేపాలు చేయనక్కరలేదు. ఏదో ఒకటి చేసుకోవచ్చు.

మీటింగులో చెప్పడం ఏమిటి- అందరూ ఉత్సాహంతో ముందుకి రావటం ఏమిటి- అప్లికేషన్ ఫారాలు చకచకా అందరి ఇళ్ళకి వెళ్ళిపోయాయి. కొంతమంది మగవాళ్ళు 'లబో'మని మొత్తుకొన్నారు. కాని పిల్లలు "మేము బాలానందానికి ఆడుకోవడానికి వెళ్తాం! అక్కడ నిచ్చెన్లు, జారుడు బండలు - రంగుల రాట్నాలూ ఉన్నాయి" అంటూ గొడవ చేయసాగారు.



ఫిబ్రవరిలో వెలువడే మార్చి సంచిక నుండి శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి సీరియల్ 'దాంపత్యవనం' ప్రారంభం.

తల్లిదండ్రుల దగ్గర చనువులేనివాళ్ళు, "నాన్నా! మేము ఒక్క సినిమా కూడా చూడం నాన్నా! బాలానందానికే వెళ్తాం" అని దీనంగా ప్రాధేయపడేవారు.

సరే! పిల్లలతో తల్లులు కూడా వంటా, పనీ ముగించుకొని, లైబ్రరీలో పుస్తకాలు చదువుకోవడానికి వెళ్ళేవారు. వచ్చేటప్పుడు పిల్లల్ని కూడా తెచ్చుకొనేవారు.

మగవాళ్ళకి మహామంటగా వుండేది. "ఏ కాంటీనో కూడా పెట్టమనండి. మాలాంటి వాళ్ళు సాయంత్రం పార్టయిమువర్క్ చేసుకొంటాం. కాలక్షేపం అవుతుంది; నాలుగు డబ్బు లొస్తాయి" అనేవారు.

ఈ బాలానందం, లైబ్రరీ ప్రవేశపెట్టి రెండు నెలలైంది.

మొదట్లో కొంతమంది ఆడవాళ్ళు ఉత్సాహమున్నా వెనకాడరు.

ఇప్పటికే ఇద్దరు ముగ్గురు పిల్ల లున్నవాళ్ళకి ఇరవై పాతికరూపాయలు సెంటరుకయితేనేం స్కూలు కయితేనేం అవుతున్నాయి. పిల్లలు చేసే గోడవ భరించలేకా ఒక క్రమపద్ధతిలో పిల్లలకి ఆటలు అలవడతాయనే ఉద్దేశ్యంతో యెన్ని ఖర్చులు చేసుకోవటం లేదూ! అనుకొని భర్తలని ఒప్పించి పిల్లలని జేర్పించేరు. పేకాట రాయుళ్ళకీ—ఇల్లంటేనే భూతాన్ని చూసి దడుచుకొన్నట్టుగా భయపడే వాళ్ళకి ఇది హాయిగానే వుంది. భార్యల సాధింపు లేదు. ఎప్పుడు వచ్చినా అడిగేవాళ్ళు వుండరు.

ఆడవాళ్ళ ప్రాణానికి తెరిపిగా వుంది. పిల్లలు ఎలా వుంటారో అన్న భయంలేదు. అక్కడ ఆయా వుంటుంది.

5 5 5

మీరా సెంటరు వరండా మెట్లు యెక్కబోతున్నదల్లా టక్కున ఆగిపోయింది.

లోపలనించి నవ్వులూ, కేకలతో చాలా కోలాహలంగా వుంది. "ఎవరా" అనుకొంది. లోపలికి వెళ్ళాలో వద్దో తెలిసిందికాదు. ఒకటి రెండు నిముషాలు అలాగే నిలబడిపోయింది. తర్వాత లోపలికి వెళ్ళడానికే నిశ్చయించుకొంది, సూర్యకుమారి వుంటే కాయితాలు యిచ్చి వెళ్ళిపోవచ్చని.

మీరా లోపలికి అడుగు పెట్టేసరికి యిద్దరు తెలుసున్న వాళ్ళు కనబడ్డారు. వాళ్ళు కాక పదిహేనుమందో—ఇంకా యెక్కువమందో వున్నారు. అందరూ ఇరవై సంవత్సరాలలోపువాళ్ళే. సూర్యకుమారి కోసం అటూ యిటూ చూసింది. ఆవిడ యెక్కడా కనిపించలేదు. తనకి తెలుసున్న అమ్మాయిని అడిగింది. "సూర్యకుమారి వెళ్ళిపోయారా?" మీరా మాటలు పూర్తి కాకుండానే నలుగు రైదుగురు అమ్మాయిలు ఘొల్లుమని నవ్వారు. అందులో ఒక అమ్మాయి, "ఇంకా కుమారే! ఏ సూర్యకాంతమనో—సూరమ్మనో పెట్టుకోక" అంది. ఆ మాటకి అందరూ విరగబడి నవ్వారు. మీరాకి తెలుసున్న అమ్మాయి లిద్దరూ "ఆవిడ వెళ్ళిపోయిందిలే! ఆవిడతో ఏమిటి పని?" అని అడిగారు. మీరా చెప్పింది.

తర్వాత మీరా వెళ్ళబోయింది. కాని, వాళ్ళు మీరాని వెళ్ళనివ్వలేదు.

"మంచి సమయానికి వచ్చేవు. వెళ్ళడానికి వీల్లేదు" అన్నారు.

మీరాకి అక్కడ వుండడం సుతరామూ ఇష్టంలేదు. అయినా అరుణతో ఐదింటికల్లా వచ్చేస్తానని చెప్పింది. ఇక్కడున్న పిల్లల నవ్వులూ అవీ చూస్తోంటే కంపరం పుడుతోంది. ఆ ఇద్దరమ్మాయిలూ సువర్చల, రమణలతో కూడా పెద్దగా స్నేహం లేదు.

"నేను అర్జంటు పనిమీద బజారు వెళ్తున్నాను. వచ్చేటప్పుడు వస్తాలెండి" అంది

రమణతో. రమణా సువర్చలతోబాటు వున్నవాళ్ళంతా మీరా చుట్టూరా మూగేశారు. "ఇప్పుడు—ఎప్పుడూ కనీ వినీ యెరగనంత "గమ్మత్తు" జరగబోతోంది. అది చూడకుండా వెళ్తే మహా పాపం చుట్టుకొంటుంది" అన్నారు.

మీరా దిగులుగా సువర్చలకేసి చూసింది. సువర్చల లాభంలేదన్నట్లు తిరిగి చూసింది. ఒకవేళ తను మొండితనంగా వెళ్ళబోయినా వాళ్ళంతా కలసి పెడరెక్కలు విరిచి కట్టి కూర్చోపెట్టడం ఖాయం అనుకొంది మీరా.

"ఏమిటదీ!" అంది వాళ్ళకేసి చూస్తూ, చాలా నీరసంగా.

ఇద్దరమ్మాయిలు మీరాని కుర్చీలో కూర్చోపెట్టేరు. అలా కూర్చోపెట్టిన అమ్మాయిల్లో ఒక అమ్మాయి, ఎంత సున్నితంగా పట్టుకుందో గాని—మీరా ఆ అమ్మాయి పట్టుకొన్న చోట చేత్తో రాసుకుంది.

తర్వాత ఇంకో అమ్మాయి జానెడు వెడల్పు మూరెడు పొడవూ వున్న అట్టలాంటిది మీరా చేతిలో పెట్టింది. అదేమిటో మీరాకి అర్థంకాలేదు. ఎఱ్ఱరంగు కాయితం అతికించివుంది. "ఏమిటిది?" అంది యేమీ అర్థంకాక.

"త్రిప్పి చూడుకు" సువర్చలా యింకో అమ్మాయీ అన్నారు.

తిప్పి చూసింది. "సు-స్వాగతం" అని మంచి నగిషీ చెక్కినట్లుగా అందంగా పొందిగ్గా రాసి, కింద యెఱ్ఱసీరాతో అండర్‌లైన్ చేసివుంది.

మీరాకి యేం అర్ధంకాలేదు.

అదే వాళ్ళని అడుగుదామని తలెత్తింది.

ఇంతలో కారాగిన చప్పుడయింది.

ఆ చప్పుడు వింటూనే అమ్మాయిలంతా బిలబిల్లాడుతూ గుమ్మంకేసి పరుగెత్తేరు. మీరా కూడా యేమిటా అని గుమ్మం దగ్గరికి వచ్చింది ఆ అట్ట అలా పట్టుకునే. గుమ్మం దగ్గిర అందరూ మూగివుండడంతో అసలు సంగతి యేమిటో తెలియక మీరా కిటికీ దగ్గరకి వచ్చి బయటకి వచ్చింది.

టాక్సీ ఆగివుంది. జ్యోతి నుంచోలేనట్టుగా కొద్దిగా ఒంగుని, కుడిచెయ్యి కడుపు కిందుగా అదిమిపెట్టినట్టు పట్టుకుంది. పక్కన; కొంచెం సన్నగా—పొడుగ్గా, ఎఱ్ఱగా వున్నతను జ్యోతిని పొదివి పట్టుకొన్నట్టుగా పట్టుకొన్నాడు. జ్యోతి ఎడంచెయ్యి అతని భుజంమీద వేసి, పూర్తిగా తన బరువంతటినీ అతనిమీద మోపి నడవలేక నడుస్తోంది.

కాదు—కాదు. అతను నడిపిస్తున్నాడు.

వాళ్ళు వరండా మెట్లు యెక్కుతున్నారు.

మీరా ఇటు తిరిగింది.

అప్పుడే ఇద్దరమ్మాయిలు, "ఏదీ? నువ్విక్కడున్నావా!" అంటూ మీరా చెయ్యి పట్టి ముందుకి లాగారు. మీరాకోసం—మీరా చేతిలో నున్న "సు-స్వాగతం" అని రాసివున్న అట్ట కోసం అప్పటికే అమ్మాయిలు ఒకటే హడావిడి పడిపోతున్నారు.

మీరాని ముందుకు లాగడం—జ్యోతీ, జ్యోతిని తీసుకొచ్చిన అబ్బాయీ గుమ్మంలోకి రావడం యేమిటి—మీరా చేతిలో ఆ అట్ట అలా వుండగానే మీరాని ముందుకునెట్టి, ఇంకో యిద్దరు ముగ్గురు అమ్మాయిలు కూడా ఆ అట్టని పట్టుకొని, జ్యోతికి అతనికి మొహాల దగ్గరగా

జానెడు ఎడంలో పెట్టడం యేమిటీ—అందరూ ఘొల్లున నవ్వడం ఎమిటీ—కన్నుమూసి తెరిచేంత చురుగ్గా జరిగిపోయింది.

జ్యోతి కడుపునొప్పి వూదేసినట్టు యెగిరిపోయింది. తనుకూడా వాళ్ళ నవ్వులతో శృతి కలిపింది. అసలు గుమ్మంలోకి రాగానే అమ్మాయిలంతా గుమిగూడ్డం, "సు-స్వాగతం" పలకడం దానికే అతను తెల్లబోయాడు. దానికి సాయం జ్యోతికూడా వాళ్ళతో సమానంగా నవ్వటంతో ఇదంతా జ్యోతి వేసిన యెత్తని తనని 'ఫూల్'ని చేయడానికే అని అతను గ్రహించడానికి యెంతోసేపు పట్టలేదు.

అతను సర్పంమీంచి తీసినంత జుగుప్సగా జ్యోతిమీంచి చేతులు తీసేశాడు.

మొదట అసలు సంగతేమిటో తెలియకుండా ఆ అట్టని పట్టుకున్న మీరా—యిప్పటికీ అసలు సంగతేమిటో తెలియక అంతా అయోమయంగా అన్పించిన మీరా ఆ అట్టని పట్టుకొని యింకా అలాగే నిలబడింది.

జ్యోతికీ, అతనికి మీరాయే అతి దగ్గరగా వుంది.

అందులోనూ అతనికి ఎడమవైపున అతన్ని తగిలీ తగలనట్టుగా నిలబడివుంది.

దాంట్లో ఈ అమ్మాయిది అతి ముఖ్యమైన పాత్ర అయుండచ్చనుకొన్నాడు అతను.

మీరా చేతిలోని అట్ట యెవరో తీసుకొన్నారు.

మీరాలో చలనం కలిగింది.

తేరుకొన్న క్షణం అతనికేసి చూసింది.

గురిపెట్టిన తుపాకి గుళ్ళల్లా మెరుస్తున్నాయి అతని కళ్ళు.

మీరా గుండెలు దడదడలాడాయి.

అతను ఒకసారి తల విదిలించి బాణంలా బయటకి దూసుకుపోయాడు.

వెనకనుండి అమ్మాయిల పరిహాసాలతో కూడిన నవ్వులు అతన్ని వెనక్కి తిరిగివచ్చేలా చేసినాయి. కాని, అతను అతి ప్రయత్నంమీద ఆవేశాన్ని అదిమిపెట్టి, ఆ ప్రయత్నం విరమించుకొన్నాడు.

§ § §

మీరా యింకా అలాగే నిలబడ్డం చూసిన జ్యోతి మీరా రెక్క పట్టుకొని కుర్చీలో కూలేసింది. మీరా మాట్లాడలేదు. అసలు సంగతేమిటో తెలుసుకోకుండా వెళ్ళటం మీరాకి ఇష్టంలేదు. అతను చూసిన చూపుని మీరా మర్చిపోలేకుండా వుంది. అయినా ఇందులో తనకి కూడా భాగం వుందనుకోగలదు.

మీరా దేనికీ కలవదైతేనేం—తమ హోదాకి తగదనయితేనేం మీరా అంటే జ్యోతికి ఎప్పుడూ చిరాకే. అలాంటిది ఇప్పుడు మీరాయే యెక్కువ పాత్ర వహించినట్లు జ్యోతి గ్రహించింది. దాంతో మీరామీద చెప్పలేని అభిమానం, గౌరవం యేర్పడినాయి జ్యోతికి.

అందరూ కోలాహలంగా ఒకటే గొడవ!

జ్యోతి చుట్టూ జేరి నేనంటే నేనని ముందుకి తోసుకెళ్తున్నట్లుగా వచ్చి జ్యోతికి ఊపిరి ఆడనీయకుండా చేస్తున్నారు.

రమణా సువర్చలల ద్వారా మీరా కొన్ని సంగతులు తెల్సుకొంది.

జ్యోతి మీరాతో చాలా స్నేహంగా మాట్లాడింది.

అమ్మాయిలందరూ యేదేనా సినిమాకి వెళ్దామా—లేకపోతే మంచి హోటల్‌కి వెళదామా

అని అనుకొంటున్నారు. కొంతమంది సినిమాకని—మరికొంతమంది కాదు హోటల్‌కని వాళ్ళల్లో వాళ్ళే వాదించుకొంటున్నారు.

అనుకొన్నది సాధించాననే గర్వంతో, తృప్తితో—మునిగి తేలుతున్న జ్యోతి, "మీరంతా యెలా అంటే అలాగే" అంది.

వాళ్ళల్లో వాళ్ళు వాదించుకొని ఆఖరికి సినిమాకి వెళ్ళడం—సినిమా మొదలయిపోతే హోటల్‌కి వెళ్ళడమని నిర్ణయించుకొన్నారు.

మీరా లేచి నిలబడింది.

జ్యోతి వూరుకోలేదు. మీరానికూడా రమ్మని పట్టుబట్టింది.

మీరా జ్యోతిని బ్రతిమాలుకుంది. తను అర్జంటు పనిమీద వెళ్తుంటే వాళ్ళంతా ఆపేశారని చెప్పింది. అమ్మాయిలంతా "పోనీలే వెళ్ళనియ్యి! పాపం! ఇందాకనే వెళ్ళాలంది" అన్నారు సానుభూతి చూపుతూ.

జ్యోతి మీరాని అప్పటికి వదిలేస్తూ, "రేపు మా ఇంటికి తప్పకుండా రావాలి. వస్తానంటేనే యిప్పుడు వదిలేది" అంది.

తప్పకుండా వస్తానని చెప్పి బయటపడింది మీరా.

* * *

మీరాకి ఇంటిదగ్గర బయలుదేరినప్పుడున్న ఉత్సాహం యిప్పుడు మచ్చుకైనా లేదు. తనసలు సెంటర్‌కి రాకుండా వుంటే యెంత బాగుండేది! సూర్యకుమారి లేదనగానే తను వచ్చేసినా యెంత బాగుండును? వాళ్ళు కూర్చోపెట్టేస్తే తను మొద్దులా కూర్చుండంతే! అతను ఎప్పుడైనా-ఎక్కడేనా తటస్థపడి అడిగితే?........తనకేం భయం! సంగతంతా చెప్పేస్తుంది. అడక్కపోతే

అమృతాంజన్
లిమిటెడ్‌వారి
విశిష్టమైన
ఆముదము



శుద్ధిచేసినది.
వాసనలేనిది.

అమృతాంజన్ ఆముదము

గొడవే లేదు. అయినా తనని ఎందుకడుగుతాడు? తనకేం సంబంధం! ఏమైనా అడగదల్చుకొంటే జ్యోతిని అడుగుతాడు........

ఎక్కడనించో వస్తూ సూర్యకుమారి యెదురుపడింది. మీరా ఆవిణ్ని ఆగమని తల్లి ఇమ్మన్న కాయితాలు యిచ్చేసి బరువు దింపుకొంది. అవి యివ్వడానికి వెళ్తేనే అనవసరంగా తనూ వాళ్ళ లిస్టులోకి జేరింది.

"మీకోసం సెంటర్‌కి వెళ్ళాను—మీరు లేరు" అంది కాయితాలు యిస్తూనే.

"జ్యోతమ్మ స్నేహితులు వచ్చి నన్ను బయటకి తరిమేశారు- జ్యోతమ్మ ఇంకా యెవరో వస్తారని చెప్పి. ఏం చేయను?" అందావిడ.

"సరేలెండి! అమ్మ మీకిమ్మంది. నేను వెళ్తున్నా" అని ఆవిడని దాటి వచ్చేసింది లేకపోతే ఆవిడేం పురాణం విప్పుతుందో నని.

ఐదింటికల్లా వస్తానని చెప్పింది అరుణకి. అప్పుడే ఆరవుతోంది. ప్చ్! అరుణకి చాలా కోపం వస్తుంది.

ఈరోజు అరుణ పుట్టినరోజు. అరుణకీ, మీరాకీ స్నేహం కలసి ఈరోజుకి ఏడాది నిండుతుంది. మీరాకి స్నేహితులు తక్కువ! కాంతమ్మకి భయంచేత మీరాని ఆట్టే ఎక్కడికీ కదలనివ్వదు. మీరాకి ఇద్దరే బాగా దగ్గర స్నేహితులు వుండేవారు. ఇందిరా, రాణీను. రాణీకి పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళిపోయింది. రాణీ అత్తవారింటికి రెండు రోజులకి వెళ్తుందనగా ఇందిరా, మీరా కూడా రాణీ వాళ్ళింటికి వెళ్ళేరు. అప్పుడు అరుణ అక్కడ వుంది.

ఆ రోజు అరుణ పుట్టినరోజు. ఇందిరతో పెద్దగా స్నేహం లేకపోయినా అరుణకి ఇందిర తెలుసు. ఇందిరనీ, మీరానీకూడా రమ్మని చెప్పడమే కాకుండా తనకూడా వచ్చేవరకూ వూరుకోలేదు అరుణ.

అసలు ఇందిరా, మీరా సినిమా ప్రోగ్రాం వేసుకొని వచ్చేరు. రాణీ అత్తారింటికి వెళ్ళిపోతోంది గదా మళ్ళీ ఎన్నాళ్ళకి కలుస్తామో ఏమోనని.

అలా మొదలైన స్నేహం ఒక్క నాలుగు రోజులు ఒకర్నొకరు చూసుకోకపోతే ఇద్దరికీ కూడా తోచదు. ఎలాగో వుంటుంది. ఇప్పుడు ఇందిర వూళ్ళోలేదు. వాళ్ళమ్మగారికి ఒంట్లో బాగుండలేదు. వాళ్ళ పెద్ద అన్నయ్య మద్రాలోవుంటే అక్కడికి తీసుకెళ్ళారు.

మీరా రావడం పైన బాల్కనీలో నిలబడ్డ అరుణ చూసింది.

గబగబా కిందకి వచ్చింది.

అలా గబగబా వచ్చిందల్లా మీరా ఎదురుపడేసరికి మూతి ముడుచుకుని ముఖం పక్కకి తిప్పేసుకొంది.

అరుణకి చాలా కోపం వస్తుందని మీరా ముందే అనుకొంది.

"అబ్బ! ఎంతకోపం తల్లీ! ఒక్కసారే మొహం తిప్పేసుకొన్నావు" అంది.

అరుణ అదేం వినిపించుకోనిదానిలా టేబుల్ దగ్గరకెళ్ళి యేదో బొమ్మల పుస్తకం తిరగేయ సాగింది. మీరా వెనకాలే వెళ్ళి భుజంమీద చెయివేసి, అరుణ ముఖం తనవైపు తిప్పుకోబోయింది. అరుణ ఇటు తిరగలేదు సరికదా మీరా చేయిని తోసేసింది.

"అసలు కారణం ఏమిటో తెలుసుకోకుండా ఏమిటే కోపం, పెంకితనం" అంది. అరుణ తిరిగి కూడా చూడలేదు.

"ఈ రోజే పుట్టిన వాళ్ళకి ఇంతకోపం పనికిరాదు."

(వి)చిత్ర విజ్ఞానం

వేలిముద్రల ఆధారంగా దొంగల్ని పట్టుకోవడానికి యెంతో నైపుణ్యంకావాలి. ఇది పోలీసుశాఖకు సంబంధించిన వేలిముద్రల నిపుణుల పని. రష్యను డాక్టర్లలో కొందరు వేలిముద్రలు పరీక్షించడంలో నైపుణ్యం సంపాదించారు. ఐతే వీరు దొంగల్ని పట్టుకోరు. రోగిని పీడించే రోగ లక్షణాలను అర్థంచేసుకుంటారు. వేలిముద్రలకీ రోగాలకి ప్రత్యేక సంబంధాలున్నాయట! రోగ నిర్ణయానికి రోగి వేలిముద్రలు చాలా ఉపయోగపడుతాయి!



“....................”

“ముందు కోపం పుట్టి-తర్వాత నువ్వు పుట్టావన్నమాట!”

“....................”

“ఎన్ని అనుకొని ఇంట్లో బయలుదేరాను?—ఆఖరికి ఆలస్యమైతే అయ్యిందని ఇంత కష్టపడి వస్తే....” వోరగా చూసింది అరుణని.

ఊఁహు! బొమ్మలా అలాగే నిలబడింది అరుణ.

మీరా తన ధోరణిని మారుస్తూ, “ఒకటా- రెండా- ఎన్ననుకొని బయలుదేరాను? వెళ్ళగానే నా చిన్నారి అరుణని రెండు చేతుల్లోకి తీసుకొని, ముద్దాడి- లాలపోసి ఇంచక్కా- పౌడరద్ది- ఉయ్యాలలో పరుండబెట్టి, “ఏడవకు ఏడవకు నా చిట్టి అరుణా! నీ కంట నీరూ నే చూడలేనూ....” అంటూ లాలి పాడాలనుకొన్నాను.”

అరుణ ఎంతో ప్రయత్నంమీద పెదాలు బిగించి అలాగే నిలబడింది.

“ఏం లాభం! నేను తెమిలి వచ్చేసరికి నువు పెరిగి—ఇంతదాని వయ్యావు. చీరలు కడుతున్నావు—ఇంక ఇప్పుడు ఎత్తుకొని ఏం జోలపాడను?”

“....................”

మీరాకి విసుగొచ్చేసింది. ఇంక ఆఖరి అస్త్రంగా అంది “పెద్దవాళ్ళమాటలు వినాలంటారు యిందుకే కాబోలు! ఎంత ముద్దుగా చెప్పింది అమ్మ! “నీ కిష్టమని దిబ్బరొట్టి చేశానే మీరా! తిని వెళ్ళమ్మా” అని. అప్పుడు ఆవిడ మాటలు చాదస్తంగా తోచాయి. అక్కడ దిబ్బరొట్టే వదులుకొన్నాను; ఇక్కడ ఐస్‌క్రీమ్‌లాంటివి తినడానికి పొట్ట చాలదని! పోతా! నేను! వద్దన్నాను కదా అని ఆ దిబ్బరొట్టి కాస్తా అమ్మ ఎవరికయినా పెట్టేయగల్దు. ఆ మంగమ్మగారు వచ్చిందంటే మూకుడు రొట్టే....”

“ఆపు తల్లీ. ఆపు!” అరుణ ఇంక నవ్వు ఆపుకోలేక ఇటు తిరిగింది.

“ఎవర్నీ ఎవరూ ఆపక్కరలేదు. నేను తొందరగా వెళ్ళాలి. లేకపోతే....”

“ఆ దిబ్బరొట్టి మంగమ్మగారు తినేస్తుంది కదూ!” మీరా చెయిపట్టుకొంటూ అంది అరుణ.

"అమ్మ తల్లీ! ఎన్ని తిప్పలు పెట్టావు. ఎంత నీరసం వచ్చింది!"

"అన్నీ పోగొడతాలే! నేనంటే నీకు లోకువ. లేకపోతే ఐదింటికి వస్తానని, వెళ్తే సినిమా కెళ్దాం—లేకపోతే హాయిగా కూర్చుని కబుర్లు చెప్పుకొందామని అన్ని కబుర్లు చెప్పి, ఇప్పుడా రావడం?"

"అయిందా! ఇంకా యేమైనా వున్నాయా?"

"బోల్డున్నాయ్! ఎంత ఆలస్యం చేశావో అంతకి పదిరెట్లు ఎక్కువసేపు కూర్చుని, నా కోపం పోగొట్టి, భోజనం చేసి వెళ్ళాలి."

"ఒచ్చిన కోపం ఎలాగూ వచ్చింది. ఇప్పుడే పోతాను. అమ్మ ఖంగారుపడుతుంది."

"ముందు నువు నోరుమూసుకొని రా" మీరా చెయిపట్టుకుని మేడమీద తన గదిలోకి లాక్కుపోయింది అరుణ.

టేబుల్ మీద అన్నీ సర్దివున్నాయి. మీరా కోసమే అరుణ వేచివుంది. ఇద్దరూ టేబుల్ చెరోప్రక్క కుర్చీల్లో కూర్చున్నారు. అరుణ రకరకాల గాజుకప్పుల మీదా పళ్ళాలమీదా వున్న మూతలని తీస్తోంది.

మీరా తను తెచ్చిన ప్రజంటేషన్ యిద్దామని బాగ్ జిప్ని తీయబోయింది. "ఏమిటి ఆలస్యం!" అంది అరుణ ముఖం యెత్తుతూ.

అరుణ యిప్పుడు తనని మింగేటట్టు వుందనుకుంది మీరా. బుద్ధిమంతురాల్లా టిఫిన్ కుపక్రమించింది.

"ఊఁ! ఇప్పుడు చెప్పు! ముందు రావటానికి ఆలస్యం యెందుకయిందో దానికి కారణం చెప్పి, తర్వాత వున్న కబుర్లు" అంది అరుణ.

"అదీ ఒక పురాణం!"

"అబద్ధాలు అల్లేవంటే—తెలుసుగా నా సంగతి!"

మీరా వినయంగా తలాడించింది.

"ఊఁ! కానియ్!"

"అబ్బ! ఏమిటి బాబూ! నీ సీరియస్‌నెస్సూ, నువ్వునూ" విసుక్కొంది మీరా.

అరుణ తలెత్తింది. అప్పటికి అరుణ ఓ ఐటమ్ తినడం పూర్తయింది. "ఇంకా అలాగే కూర్చున్నావా! ఏమయింది నీకివాళ? ఊఁ, ఊఁ. తిను! తింటూ చెప్పు."

"జ్యోతని అదివరకు చెప్పలా? సరోజినీదేవిగా రమ్మాయని."

"ఆ స్కూలు యజమానురాలు కదూ!"


"ఆఁ! మా అమ్మ నేను వస్తోంటే యేవో కాయితాలిస్తూ సెంటర్లో ఇమ్మందిలే! నేను సెంటర్‌కి వెళ్ళేసరికి ఆ సూర్యకుమారి లేదు. సరే వచ్చేద్దామనుకొన్నాను. వాళ్ళు బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టేశారు........"

"నువు కూర్చున్నావు........"

"చెప్పనీ! "సు-స్వాగతం" అని రాసివున్న అట్ట వాళ్ళు నా చేతిలో పెట్టేరు."

"అదేమిటే?" అరుణ ఆశ్చర్యంగా అడిగింది.

"నాకూ యేమిటో అర్థంకాలేదు మొదట. అర్జంటు పనిమీద వెళ్ళాలని ఎంత మొత్తుకున్నా వాళ్ళు వినలేదు. ఎప్పుడూ కనీ వినీ యెరగని "గమ్మత్" జరగబోతోంది; అది చూడకుండా వెళ్తే



మహా పాపం చుట్టుకొంటుందన్నారు. ఆ అట్ట నా చేతిలో పెట్టేరు. అలా యెందుకు రాశారో నాకు అర్థంకాలేదు. జరగబోయే గమ్మత్తేమిటో అసలే అర్థంకాలేదు. నేను వాళ్ళ నడుగుదామని అనుకునేంతలో కారాగిన శబ్దమయింది. అందరూ బిలబిల్లాడుతూ గుమ్మందగ్గరికి పరుగెత్తేరు. ఇంక గుమ్మం దగ్గర చీమ దూరడానికి కూడా సందు లేదనుకో! ఏమిటా అని నేను కిటికీదగ్గర కెళ్ళి బయటికి చూశాను.”

అరుణ తినడం ఆపి తలెత్తింది కుతూహలంగా చూస్తూ.

“టాక్సీ ఆగి వుంది; దాంట్లోంచి జ్యోతీ, ఇంకో అతనూ దిగేరు. జ్యోతి అసలు నిలుచోలేని దానిలా తన బరువంతటినీ అతనిమీద మోపి, పెద్ద కడుపునొప్పి వచ్చినట్లు చేత్తో అదిమిపట్టుకుంది. అతను అతి జాగ్రత్తగా రెండు చేతులతోటీ పొదివిపట్టుకొని తీసుకొస్తున్నాడు. నేను యేమిటాని ఇటు తిరిగాను—ఇంతలో ఇద్దరమ్మాయిలు నన్ను లాక్కుపోయారు.”

“ఎందుకూ?” ఆశ్చర్యంగా అడిగింది అరుణ చిప్స్ కొరుకుతూ.

“ఆ సు-స్వాగతం అన్న బోర్డు నా చేతిలో వుందిగా? నన్ను వాళ్ళముందుకి నెట్టేరు—అందరూ ఒకటే నవ్వులు. జ్యోతికూడా మామూలుగా అయిపోయి వాళ్ళతో సమానంగా నవ్వడం మొదలెట్టింది.”

“అదేమిటే?”

“మొదట నాకూ అర్థం కాలేదు—తర్వాత వాళ్ళు చెప్పేరు. జ్యోతికీ అతనికీ పడదుట. ఒకసారి రైల్లోనూ- మరోసారి యేదో ప్రోగ్రాం కెళ్ళినప్పుడూ దెబ్బలాడుకున్నార్ట. రైల్లో దెబ్బలాడుకోవటం ఎవరో తెలుసున్నవాళ్ళు చూసి, జ్యోతి నాన్నగార్కి చెప్పేర్ట. ఆయన జ్యోతిని కేకలేశార్ట. అతను జ్యోతి నాన్నగారితో పనుండి రెండు మూడుసార్లు జ్యోతి వాళ్ళింటికి వచ్చేట్ట. కాని అప్పుడు ప్రతీకారం తీర్చుకోవడానికి లేకపోయిందట. పైగా జ్యోతి నాన్నగారు వాళ్ళమ్మాయి తరఫున క్షమార్పణ చెప్పుకొన్నార్ట. అప్పట్నించీ జ్యోతికి అతన్ని ఎలాగయినా పరాభ

వించాలని ప్రయత్నంట...."

"ఇంతకీ...." అర్థోక్తిలో ఆగిపోయింది అరుణ నవ్వాపుకుంటూ.

"అదంతా నటనట-నాకూ తెలియదు."

"అసలు అతన్ని ఎలా నమ్మించి తీసుకొచ్చింది?"

"జ్యోతీ, ఇంకో ఇద్దరమ్మాయిలూ బజారుకి బయలుదేరార్ట. అతను బజార్లో కనిపించేట్ట. జ్యోతి బుర్ర చురుగ్గా పనిచేసింది. పక్కనున్న ఫ్రెండ్స్‌కి ఎలా ఎలా చేయాలో చెప్పి పంపేసింది- అతను వెళ్ళిన షాపులోకి తనూ వెళ్ళింది. జ్యోతిని చూసి అతను మొహం తిప్పుకొన్నాట్ట. తర్వాత అతను వెనకే తనూ వస్తూ హఠాత్తుగా "అబ్బా" అంటూ కింద కూలబడిందిట."

"ఆఁ!"

"ఏమి ఏమిటని అందరూ ఖంగారుగా వచ్చేరు. అతనుకూడా వచ్చి, ఏమైయ్యిందని అడిగాట్ట. కడుపులో ఏదో పెద్ద నెప్పిగా వుంది నిలవలేకుండా వున్నాను, మా అమ్మ సెంటర్‌లో వుంది కాస్త తనని అక్కడికి జేర్చమని చాలా జాలిగా చూస్తూ ప్రాధేయపడుతున్నట్లుగా అడిగిందట. సరే అక్కడున్నవాళ్ళంతా "ఆ అమ్మాయి మీకు తెల్సా? కాస్త తీసుకెళ్ళండి" అన్నార్ట- ఇంకేముంది? పాపం అతను నిజంగా నొప్పిగా వుందనుకొని అతి జాగ్రత్తగా తీసుకొచ్చేడు."

అరుణకి నవ్వాగలేదు. నవ్వి నవ్వి అరుణకి కడుపునొప్పి పుట్టింది. గ్లాసెత్తి కొద్దిగా నీళ్ళు తాగింది- బాగా పలమారింది.

"ఏమిటది? నింపాది. తలమీద కొట్టుకో!...." ఇంకా ఏదో అనబోతూ గుమ్మంకేసి చూసిన మీరా టక్కున ఆగిపోయింది.

అతనే!!

పెదాలు బిగించి చాలా సీరియస్‌గా మీరానే చూస్తున్నాడు.

మీరా అరిచేతుల్లో చిరుచెమట పట్టసాగింది.

అరుణ యింకా తెప్పరిల్లలేదు. తర్వాత అరుణ సర్దుకుని, "అబ్బ! చంపావులే! నవ్వి నవ్వి నా కడుపు నొప్పిపుట్టింది. పాపం! యెవరో ఆ అమాయకుడు. పొద్దున్న లేస్తూనే ఎవరి మొహం చూశాడో!" అంది.

అతను బాణం లాంటి ఓ చూపు మీరామీద విసిరి చకచక అక్కడనించి వెళ్ళిపోయాడు.

(సశేషం)

వచ్చే సంచికలో

ప్రత్యేకాకర్షణ

"ఊహానందం"

(పెద్దకథ)

రచన:

ఆరెకపూడి (కోడూరి) కౌసల్యాదేవి

మహిళాజ్యోతి

మరో ప్రపంచం!

ఆ పూటకి సూర్యుడు నిద్ర కోరిగే సమయం ఆసన్నమైంది. కాలేజీ వొదిలాక రోడ్డుని సొంతం చేసుకు నడుస్తున్నారు అందులో చదివే ఆడా మగా. వాళ్ళ నోళ్ళలో రకరకాల అంశాలు నలుగుతున్నాయ్. వాళ్ళలో నల్గురు కుర్రాళ్ళకి ఆడాళ్ళని ఏడ్పించటం అంటే చాలా సరదా. ముందు మాటలతోనూ అనంతరం చేష్టలతోనూ కబళించాలనేది వాళ్ళ ఉన్నతాశయం.

ఆ పూట ముందు నడుస్తున్న వరలక్ష్మి వాళ్ళ కళ్ళబడింది. వరలక్ష్మి ఎప్పుడూ వొంటరిదే. రిజర్వ్‌డ్‌గా వుండటం అనేది ఆమెకి పుట్టుకనుంచీ పుట్టిన అలవాటు. నోరున్న ఆడదాన్ని గయ్యాళి అనీ, నోరులేని దాన్ని అబల అనీ అనడం యీ ప్రపంచానికి అలవాటు. నలుగురు కుర్రాళ్ళూ నోరులేని ఆ వరలక్ష్మి వెనకపడ్డారు. పిల్ల అరుపులూ నక్క వూళలతో ప్రారంభించారు గొడవ.

వరలక్ష్మి గుండెలు వేగంగా కొట్టుకుంటు న్నాయ్. పుస్తకాలు రొమ్ములకి అదుముకుని నడుస్తుంది. అడుగులు తడబడ్తున్నాయ్.

చాలామంది ఆడవాళ్ళ వీపులకి కళ్ళుంటా యని ఎవరో వొకాయనన్నారు. వరలక్ష్మి విషయంలో అలాగే అన్పిస్తుంది మరి. రాను రాను పెచ్చుమీరుతున్న వాళ్ళ అల్లరి వెనక్కి తిరిగిచూడకపోయినా ఆమె మస్తిష్కంలో ఫ్రేమ్ అవుతూంది.

రోడ్డుమీది జనం పల్చబడ్డంతో ఆ నల్గురూ ధైర్యంచేసి వరలక్ష్మికి మరీ దగ్గర కొచ్చేశారు.

“........అంత తేలిగ్గా తీసెయ్యకు బ్రదర్ వరలక్ష్మి అంటే వరాలు ఇచ్చే లక్ష్మి అని అర్థం.” అన్నాడో కుర్రాడు.

“అలాగా! ఐతే, వొకొక్కళ్ళం వొకో వరం కోరుకుందాం.” అన్నాడు రెండో కుర్రాడు.

“అదేం కుదరదు. అసలు వరాన్ని నువ్వు కొట్టేద్దామని నీ వెధవ ప్లానంతా.”

“అది కాదు గురూ ఒకే వరాన్ని ఇంత మందికి యివ్వడానికి వరలక్ష్మికి శక్తి వుందా అని.”

“వుంది గనకనే యీమె పేరు వరలక్ష్మి” అని ఆమె మీదిమీదికి వస్తున్నారు.

ఆమె గుండె ఆగిపోయే స్థితికి వచ్చేస్తోంది. నీళ్ళు నిండిన ఆమె కళ్ళకి వాళ్ళు కిరాతకుల్లా కనిపిస్తున్నారు. వాళ్ళనేమీ అనడానికి సాహసించలేక పోతుంది.

తన ఇల్లున్న సందులోకి తిరిగేవరకూ ఆ రాక్షసుల అల్లరిని కన్నీటితోనే భరించింది.

యింటికొచ్చిన వరలక్ష్మి పుస్తకాలు కిటికీ గూట్లోకి విసిరి తన గదిలోకెళ్ళి మంచంమీద పడి వెక్కి వెక్కి ఏడ్చింది.

* * *

తన వానిటీ బాగ్‌లో వున్న తెల్లటి గ్లాస్కో గుడ్డతో టెలిఫోన్ తుడిచి మవుత్ పీస్ దగ్గర సెంటులో ముంచిన దూది పెట్టి బయటి కొచ్చింది ఉషారాణి. చాలా రాత్రి అయింది.

వేరే ఉద్యోగం దొరక్క తనకుగా తను ఏర్పరచుకున్న వృత్తి అది. అలా కొన్ని షాపులూ, ఆఫీసులూ, ఇళ్ళూ తిరిగి ఓ వంద ఖాతాలు ఏర్పర్చుకుంది. ఫోనుకి నెలకి రెండు


శుభకార్యాలలో
ఆనందాన్నిచ్చే
అందమైన వస్త్రాలకు!

మా
న్యూకాంత్ షోరూమ్
కు
దయచేయండి



చల్లా బులిశివయ్య
అండ్ కో.,
భీమవరం - 534201
ఫోన్: 227

నవీనమైన వస్త్రాలు
నమ్మకమైన ధరలు



రూపాయిలిస్తారు.

ఈ ఉద్యోగం బాగానే వుంది గానీ ప్రతి రోజూ ఇంటికి వెళ్ళేసరికి చాలా ఆలస్యమౌ తుంది. రాత్రి వేళలు యింటికి చేరుకోవడం ఓ సముద్రం దాటి వెళ్ళడమే ఔతుంది.

సాగర్ శిల్క్స్ అనే బట్టల షాపులో కుర్రాళ్ళకి తను మరీ చులకనై పోయిందీ మధ్య. ప్రతిరాత్రి ఏదో కూడలిలో కాచుకు కూర్చుం టున్నారు తనకోసం.

అందితే ఎత్తుకుపోదాం అనే అత్యాశ వాళ్ల కళ్ళల్లో ప్రతి చీకటి రాత్రీ తను స్పష్టంగా చూస్తోంది.

ఆలోచిస్తూ నడుస్తున్న ఉషారాణికి వాళ్ళు ఎదురవ్వనే అయ్యారు.

వాళ్ళలో ఒకడు బాగా దగ్గరగా వొచ్చాడు. వాడి ముఖం తన ముఖానికి మరీ దగ్గరగా పెట్టి అంటున్నాడు. "ముద్దనేది ముచ్చటగా ఇవ్వకూడదు ముఖమంతా నింపాలి. ఏమం టావ్?"

ఉషారాణి నరాల్లో రక్తం కళ్ళలోకి వొచ్చింది. ఏం చెయ్యలేని అసహాయురాలు. కన్నీళ్ళు నింపుకొని భయంగా, బెరుగ్గా వారిని తప్పించుకొని వడివడిగా నడిచిపోయింది.

* * *

"కళయరసి"అనే తమిళం వాళ్ళమ్మాయిని ఆ వీధిలో అంతా ఇడ్లీ సాంబార్ అని హేళన చేస్తుంటారు చాలామంది.

కళయరసి నాన్న ఆ వూరి చివర రైల్వే కాంటిన్ కాంట్రాక్టర్. మధ్యాహ్నం, రాత్రి ఆయన భోజనానికి వెళ్ళినప్పుడు కాష్‌లో కళయరసిని కూర్చోబెట్టేవాడు. ఆ రాత్రి వేళలు ఆయన భోజనానికి వెళ్తే తిరిగివొచ్చే సరికి పది దాటేది. ఆ రాత్రి వేళల్లో ఇంటికి వెళ్ళడానికి ఆమెకి విపరీతమైన భీతి. వో రాత్రి ఇంటికి వెళ్తుంటే రిక్షావాడు "వస్తావా? స్మశానాల దిబ్బల వెనక్కి పోదాం." అని రిక్షా తనముందు అడ్డుగా నిలబెట్టాడు.

స్మశానాల దిబ్బల వెనక్కి.

దేనికి? తల్చుకుంటే శరీరం రోమాంచిత మౌతోంది.

భయంతో గుండెలో రక్తం గడ్డకట్టుక పోతోంది—వణుకుతూ చూసిందిరిక్షావాడివేపు.

* * *

పై మూడు సంఘటనలూ అందులోని


మీ అందానికి తగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి. పట్టు చీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మి
జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్సు: శిష్ట్లా, ఫోన్: 73467, 77052



'తలవొంచింది-దుర్మార్గుల నెదుర్కొని తలనెత్తి నిలబడేందుకు!'
విజయవాడ మధు గార్డెన్స్‌లో కరాటే నేర్చుకొంటున్న సబలలు!

వ్యక్తుల పేర్లూ మినహాయిస్తే వాస్తవాలు. ఆడది వేటాడబడుతోంది మన సమాజంలో. అలా అని ప్రతి మగవాడూ వేటాడేవాడు కాడు. ఆడదాన్ని కేవలం విలాస వస్తువుగా మాత్రమే చూస్తున్న కొంత శాతం మగమహారాజుల ఆట అది. ఆ సంఘటనలు మరోలా ఎందుకు జరగకూడదు? దుర్మార్గం తలపెట్టే మగవాడిపై ఎందుకు పోరాటం జరిపే ధైర్యం చేయకూడదు ఆడది? అలా అయితే....మళ్ళీ అవే పాత్రలు అవే సంఘటనలు ఈ క్రిందివిధంగా జరగొచ్చుకదా?

* * *

వో సాయంత్రం వేళ కాలేజీ వదిలాక రోడ్డుమీదికి వచ్చిన వరలక్ష్మిని నల్గురు కుర్రాళ్ళూ అటకాయించారు.

"వరలక్ష్మి అంటే వరాలిచ్చే లక్ష్మిరా," అన్నాడు ఓకుర్రాడు ఆమెకి ఎదురుగా నిలబడి.

వరలక్ష్మి జంకలేదు. భీత హరిణంలా ఆమె కళ్ళు చలించలేదు.

సూటిగా ఆమాట అన్నవాడి కళ్ళలోకి చూస్తూ "ఏ వరం కావాలో కోరుకో" అంది.

ఆమె జవాబుకి షాక్ ఐన కుర్రాడు తన నోట్లోంచి మాటల ముక్కల్ని వదిలాడు. "నా....నా....ఒక్కడికే కాదు మా....సలు గురికీ........"

"సరే అందుకోండి" అని తన రెండు చేతులు గాలిలోకి విసిరింది. వాళ్ళ డొక్కల్లో కత్తుల్లా గుచ్చుకున్నాయ్ ఆమె చేతులు. సుత్తి పోట్లలా పడ్డాయ్ ఆమె పిడికిళ్ళు.

క్షణాల కాలంలో స్త్రీ మీద వాళ్ళకున్న స్వల్పమైన అభిప్రాయాలు చిన్నాభిన్నమయ్యాయ్. నేలమీద స్పృహతప్పి పడ్డారు.

♦ ♦ ♦

"ముద్దనేది ముచ్చటగా ఇవ్వకూడదు ముఖమంతా నింపాలి. ఏమంటావ్?" ఆ రాత్రి ఆ కూడలిలో ఉషారాణి చుట్టూ మూగిన బట్టల కొట్టు కుర్రాళ్ళలో ఒకడు అలా అన్నాడు భుజంమీద చెయ్యేసి.

"చెంపదెబ్బ కొడితే చెయ్యంతా ముద్ర పడాలంటాను." ధైర్యంగా అంది ఉషారాణి.

"జోకులు బాగా పేలుస్తావే."

"చెంపలుకూడా" ఛెళ్ ఛెళ్ మన్నాయ్ తన మీదికొస్తున్న వాళ్ళందరి చెంపలూ.

"ఇంతసేపూ మొగలిరేకులా పరిమళించిన ఈ ఆడది ముళ్ళకత్తిలా తయారైందేమిట్రా బాబూ!" అని వాళ్ళంతా వేగంగా అక్కడి నుంచి పరుగుపెట్టారు పడ్తూ లేస్తూ.

* * *

"స్మశానాల దిబ్బల దగ్గరకా....

....నిన్ను పూడ్చేదానికి రావాలిగా మరి?"

"ఏంటి పిల్లా జోరు?" రిక్షావాడి మాటల్లో వ్యంగ్యం.

అంతే—

కళయరసి పిడికిలి రిక్షావాడి పొత్తి కడుపులో దిగింది మొనలేని గునపంలా.

భళ్ళున వాంతి చేసుకున్నాడు వాడు.

"జాగ్రత్త ఆడదానివైపు వో చూపు, మగాడి వైపు మరో చూపు చూడ్డం మానుకో ఈ రోజునుంచి" అని హుంకరించేసి నిష్క్రమించింది కళయరసి.

* * *

[మరుమల్లె, ముద్దబంతి, సన్నజాజి, ఇలా ఎన్నెన్నో పుష్పాలతో పోల్చబడుతుంది స్త్రీ. లాలిత్యానికి ప్రతీకగా వర్ణించబడుతుంది. నిజమే! లాలిత్యానికి ప్రతీకే స్త్రీ. కాని ఆపద ఎదురైనప్పుడు కాదు. కాకూడదు. హఠాత్తుగా లతలాటి స్త్రీ మేకులా కఠినత్వం పొందలేదు. కొంత ప్రయత్నం అవసరమే. నిజానికి మొదటి వాస్తవ సంఘటనలకి, వాస్తవాలు కావాలని ఆశిస్తూ ఊహించి రాయబడ్డ తరువాతి సంఘటనలకీ మధ్య కేవలం ఊహ కాక కొంత ఆధారం కూడా ఉంది. 'యువతీ ఆత్మ రక్షణా ట్రయినింగ్ అసోసియేషన్' పేరిట కొందరు మహిళలు నిర్వహించే 'యువతీ ఆత్మరక్షణా ట్రయినింగ్ స్కూలు' (విజయవాడలోని మధు గార్డెన్స్‌లో) దాదాపు వందమంది 'టీన్ ఏజ్'లో వున్న అమ్మాయిలు కరాటే నేర్చుకోవడం చూసినప్పుడు అన్పించింది 'ఆ సంఘటనలు ఇలా ఎందుకు జరగకూడదూ?' అని—ఎందుకు జరగకూడదు?] —'సత్యవంశి'

యాజమాన్యం తదితర వివరాలు 'జ్యోతి'

ఫారం 4 (8వ నిబంధన ప్రకారం)

ప్రచురణ స్థలం :	మద్రాసు
ఎంతకాలానికొకసారి :	మాసపత్రిక
ముద్రాపకుని పేరు, జాతి, విలాసం:	శ్రీ టి. హనుమంతరావు, భారతీయుడు, 2. ఫ్రాన్సిస్ జోసఫ్ స్ట్రీట్, మద్రాసు-1.
ప్రకాశకుని పేరు, జాతి, విలాసం :	శ్రీమతి వి. లీలావతి, భారతీయురాలు 17బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024,
సంపాదకుని పేరు, జాతి, విలాసం :	శ్రీమతి వి. లీలావతి, భారతీయురాలు, 17బి, రాజారాం కాలనీ, మద్రాసు-600 024
పత్రిక యజమానురాలు :	శ్రీమతి వి. లీలావతి

పై విషయాలు నాకు తెలిసినంతవరకూ వాస్తవమైనవని తెలియజేయుచున్నాను.

మద్రాసు - 600 024. (సం) వి. లీలావతి

సినిమా

తెలుగు ఫిలిం జర్నలిస్ట్స్ అసోసియేషన్

మద్రాసులోని తెలుగు ఫిలిం జర్నలిస్టులు ఒక ఎసోషియేషన్‌గా ఏర్పడ్డారు. అసోషియేషన్ కార్యనిర్వాహక వర్గం వివరాలు ఇవి: అధ్యక్షులు: మోహన్‌కుమార్ (జ్యోతిచిత్ర); ఉపాధ్యక్షులు: 'కాగడా' శర్మ; కార్యదర్శి: అర్జునరావు(సినీ హెరాల్డ్); సంయుక్తకార్యదర్శి: వేమూరి సత్యనారాయణ (జ్యోతి సచిత్ర మాస పత్రిక); కోశాధికారి: 'డాక్టర్' మల్లిఖార్జునరావు (కాగడా); కార్యనిర్వాహక వర్గ సభ్యులు: మిక్కినేని జగదీష్‌బాబు (సితార); జి. వి. జి. (ఆంధ్రపత్రిక); శ్రీనివాస్ (ఆంధ్రపత్రిక); రామరత్నం (సితార); గోటేటి శ్రీ రామారావు (సినీరమ); గౌతమ్ (ఆంధ్రప్రభ); అప్పారావు (పిక్చర్‌ఫీల్డ్); ఎన్.ఆర్.చందూర్ (జగతి)

అమ్మబాబోయ్!

తెలుగు సినీ నిర్మాణ వర్గాల్లో తరచూ విన్పించే మాట కథల కొరత—'ఏదండీ అంతా సిద్ధంగానే వుంది, మంచి సబ్జెక్ట్‌కోసం వెదుకుతున్నాం' అన్నది చాలామంది నిర్మాతలనుంచీ వచ్చేమాట. ఇక్కడ పరిస్థితి ఇలా వుండగా తారాచంద్ బర్‌జాత్యఅనే హిందీ చిత్రనిర్మాత 1979-80 సంవత్సరాలలో తాను నిర్మించబోతున్న చిత్రాల వివరాలు ప్రకటించి ఆశ్చర్యంతో తలమునకలు చేశాడు మొత్తం భారత చలనచిత్ర పరిశ్రమలోని వ్యక్తుల్ని. మొత్తం ఇరవైఆరు చిత్రాలను వాటి పేర్లతో, దర్శకుల పేర్లతో ప్రకటించాడా నిర్మాత. కొత్తవారితో చిత్రాలు తీస్తూ, (అదీ భారీగా గాకుండా సామాన్యమైన బడ్జెట్‌తో) విజయం సాధిస్తూ వస్తున్న తారాచంద్ ఇదివరకే ప్రసిద్ధుడు. ఇప్పుడీ చిత్రనిర్మాణ కార్యక్రమ ప్రకటనతో 'అద్భుత వ్యక్తి'గా రూపొందుతున్నాడాయన.

డిటెక్టివ్ రచయిత్రిగా భానుమతి!

బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ భానుమతి డిటెక్టివ్ నవలలు రాస్తున్నారన్న వార్తకాదిది. భరణీ, మీనాక్షీ ఫిలింస్ పతాకాలపై ఆమె ప్రకటించిన రెండు చిత్రాలలో ఆమె ధరించే పాత్రల కలయిక డిటెక్టివ్ రచయిత్రి. ఒక చిత్రంలో డిటెక్టివ్‌గా, మరో చిత్రంలో రచయిత్రిగా నటిస్తున్నారామె. నెల్లూరు జిల్లా గూడూరు దగ్గర నిర్మితమవుతాయి రెండు చిత్రాలూ. 'సినిమాలలోనూ నవలల్లోనూకూడా 'ఫారెన్ ఎలిమెంట్స్' వచ్చి గందరగోళం చేసేశాయి' అని తన ఆవేదన వెలిబుచ్చారు డా॥ భానుమతి ఈ చిత్ర వివరాలు ప్రకటించేందుకు ఏర్పాటు చెయ్యబడ్డ ప్రెస్‌మీట్‌లో. భానుమతి చిత్రాలంటే భానుమతి పాటల అభిమానులు చెవికోసుకొనేందుకు చాకులు సిద్ధం చేసుకొంటున్నారన్నమాటే! 'వయసు పెరిగినా తన కంఠస్వరానికి దెబ్బతగలకుండా ఉండటం భగవంతుని వరం'గా అభివర్ణించారు శ్రీమతి భానుమతి.


కిళక్కే పోగుం రైల్!

అర్థంగాలేదని గాభరాపడవద్దు. దాని అర్థం 'తూర్పుకి వెళ్ళే రైలు' అని. తమిళంలో అద్భుత విజయం సాధించిన ఈ చిత్రాన్ని తెలుగులో బాపు దర్శకత్వంలో త్రివేణి ఆర్ట్ పిక్చర్స్ పతాకంపై పి. పేర్రాజు నిర్మిస్తున్నారు. కొత్త తారలు, యమ్వీయల్ మాటలు, యస్.పి.బాలసుబ్రహ్మణ్యం సంగీతం, ఇషాన్ ఆర్య కెమెరా పనితనం ఈ చిత్రంలో భాగాలు.

సృష్టి రహస్యాలు!

రచయితగా ప్రసిద్ధుడైన డా॥ కొమ్మూరి వేణుగోపాలరావు సమర్పిస్తున్న సాంకేతిక చిత్రం 'సృష్టి రహస్యాలు' నిర్మాణంలో ఉంది. ప్రతాప్ దర్శకత్వంలో తయారయ్యే ఈ చిత్రానికి







1: కెప్టెన్ కృష్ణ'లో కృష్ణ 2: బంగారు చెల్లెలు'లో శోభన్ బాబు 3: ఇది కథ కాదు లో కమల హాసన్, జయసుధ









4.'హేమాహేమీలు'లో అక్కినేని, జరీనా 5.'మా వారి మంచితనం'లో వాణిశ్రీ 6.'కుక్కకాటుకు చెప్పుదెబ్బ'లో మాధవి 7.'[illegible]'లో మురళీమోహన్

8.కార్తీకదీపంలో శోభనబాబు, శ్రీదేవి 9. త్రిమూర్తి కంబైన్స్ చిత్రంలో జయప్రద 10. పెళ్ళిళ్ళు-చిన్నిళ్ళులో దాసరినారాయణరావు, ప్రభ 11. వినాయకవిజయంలో జేబీరోహిణి



8



9



10



11



'ఇంటింటి రామాయణం'లో జయప్రద, రంగనాథ్

పెండ్యాల సంగీతం సమర్పిస్తున్నారు. శ్రీ వెంకటశాయి పిక్చర్స్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది కె. రాంబాబు.

రామబాణం!

శోభన్‌బాబు, జయప్రద, కృష్ణంరాజు, లత, జగ్గయ్య, జమున, రంగనాథ్, సత్యనారాయణ, నాగేష్, మోహన్‌బాబు, జయమాలిని నటించిన రామబాణం వర్ణచిత్రం ఫిబ్రవరిలో విడుదలవుతోంది. ప్రముఖ నిర్మాత యం. యస్. రెడ్డి తమ కౌముదీ పిక్చర్స్ బేనర్‌పై నిర్మించిన ఈ చిత్రానికి దర్శకత్వం ఈశ్వరరెడ్డి; చిత్రానువాదం, మాటలు, పాటలు: మల్లెమాల.

జర్నలిష్టుల చిత్రం!


ఒక జర్నలిస్టు నిర్మాతగా మరో జర్నలిస్టు దర్శకుడిగా తయారవుతున్న చిత్రం హరిజన్. నూతన నటీ నటులతో న్యూస్‌పెర్ స్పెక్టివ్స్ పతాకంపై ఈ చిత్రాన్ని రేపు పత్రిక సంపాదకుడు సి. నరసింహారావు నిర్మిస్తున్నారు. కేరళ కౌముది, కళా కౌముది మళయాళ పత్రికలలో జర్నలిస్టుగా పనిచేస్తూ భారతదేశపు గ్రామీణ జీవితాన్ని సునిశితంగా పరిశీలించిన రవీంద్రన్ ఈ చిత్ర దర్శకుడు. పూనా ఫిలిం ఇన్‌స్టిట్యూట్ గోల్డు మెడలిస్టు మధు అంబట్ ఛాయాగ్రహణంతో తయారవుతోంది ఈచిత్రం.

ఇంటింటి రామాయణం!

నవ్యతకు పెట్టింది పేరు నవతా ఆర్ట్స్. ఆ సంస్థ నుంచి ఏ చిత్రం వచ్చినా ఏదో కొత్తదనాన్ని ఆశిస్తారు ప్రేక్షకులు. చక్కటి సంగీతం, ఇంటిల్లిపాదీ చూచి ఆనందించే సభ్యతాయుతమైన కథ, సుప్రసిద్ధులైన నటీ నటవర్గంతో సర్వజన రంజకంగా తయారై తుది మెరుగులు దిద్దుకుంటోన్న 'ఇంటింటి రామాయణం' చిత్రానికి దర్శకుడు పి. సాంబశివరావు, నిర్మాత ఎస్. కృష్ణంరాజు.

—యస్వీనారాయణ

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారాలు — మార్చి '79

అడ్డం

1. అర, కాలు, ముక్కాలు వగైరా
4. విప్లవకవి తిరుగుబాటు
7. ఒక ఆటకు సంబంధించి——
8. జీవితానికి మరణం
10. గోవిందం రెండు గణాలు
11. వెదక దగది లేదు
13. ఆడు పక్షి
14. 9
15. 2
16. ఆపద సమయంలో అరుపు
18. ఎవరి వంతు? (వెదుక్కోవాలి)
21. సుల్తాను సూది మొన
22. యోగబోధిని
24. ధనికుల నివాసాలు
25. పూర్తికాలేదు, అటుకాదు ఇటు!

నిలువు

1. కస్తూరి అకటా వికటం
2. పంట! పండించేవాడు!
3. చలితం, కలతపడింది

4. ఒక నది కల్లోలమయింది
5. సమయం
6. నీళ్ళధార
9. ఒక ఆలంకారికుని జీవితం
10. హాస్య రచయిత ఇంటి పేరు
12. అల్లుడికి హాయి
15. దేశభక్తికి తుది కానుక
17. అనాడు తోకనుంచి తలదాకా
19. కొంచెం నంచుకొన్న సెనగలు
20. వాంతి
22. ఆశ్చర్యానికి, ప్రశంసకీ
23. పువ్వులపని తలకిందులు

ఫిబ్రవరి పదబంధ ప్రహేళికకు సమాధానం:

అడ్డం: 1. అనూరాధ 4. మాతులుంగ 7. కనుబొమ్మలు 8. రవి 10. అభం 11. కషణం 13. విహంగం 14. కైతల్లు 15. వసూళ్ళు 16. గురించి 18. రుచి 21. చుక్క 22. చిన్నయసూరి 24. గానుగలు 25. యవ్వనము.

నిలువు: 1. అదరక 2. రాక 3. ధనుడు 4. మామ్మలు 5. తులు 6. గణభంగం 9. విషయసూచి 10. అహంకరించు 12. శతఘ్ని 15. వరుసగా 17. చిక్కనము 19. అన్నలు 20. అసూయ 22. చిగ 23. రివ్వ.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి ఫిబ్రవరి 27 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడుతుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

ఫిబ్రవరి పదబంధ ప్రహేళికలో విజేత

శ్రీశ్రీయే!

ఆల్ కరెక్ట్ ఎంట్రీ ఒక్కటీ రాలేదు

ఈ నెల బహుమతి జాక్‌పాట్ రు. 100/-

ఫోన్: **75373**

ఉబ్బస వ్యాధికి ఉత్తమ చికిత్స

గౌతమి ప్రజా వైద్యశాల



డాక్టరు సుంకు బలరాం, L. A. M. & S.

ఫిజిషియన్ అండ్ సర్జన్ క్లాస్ 'ఏ'

మెడికల్ ప్రాక్టిషనర్

హెచ్. నం. **4-2-1069.** సుంకు భవనం

జయసూర్య మార్గ్, రామ్‌కోటి,

హైదరాబాదు-**500 001**

ప్రతినెల డాక్టరుగారి క్యాంపుల వివరములు

సరికొత్త క్యాంపులు

ప్రతినెల 2 వ తేదీ ఏలూరు కేసర్లపల్లి ఆంజనేయ ధర్మశాల (బస్టాండుదగ్గర) మ. 1 గం నుండి 2 గం.

ప్రతినెల 14 వ తేదీ తిరుపతి హోటల్ విక్రమ్ (ఆర్.టి.సి. బస్టాండుదగ్గర) ఉ. 8 గం. నుండి 12 గం.

1వ తేదీ	గుంటూరు	కన్యకాపరమేశ్వరి దేవస్థానం (లాలాపేట)	ఉ. 9 గం. నుండి 2 గం.
1వ తేదీ	విజయవాడ	బృందావన్ లాడ్జి, (కాంగ్రెస్ ఆఫీసురోడ్డు)	సా. 6 గం. నుండి 9 గం.
2వ తేదీ	గుడివాడ	మంజు లాడ్జి, (బస్టాండువద్ద)	ఉ. 8 గం. నుండి 11 గం.
2వ తేదీ	ఏలూరు	కేసరపల్లి ఆంజనేయ ధర్మశాల (బస్టాండు దగ్గర)	మ. 1 గం. నుండి 2 గం.
2వ తేదీ	రాజమండ్రి	హోటల్ అప్సర (గోదావరి స్టేషన్‌దగ్గర)	సా. 6 గం. నుండి 9 గం.
3వ తేదీ	విశాఖపట్నం	హోటల్ మనోరమ (జ్యోతిథియేటర్ దగ్గర)	ఉ. 10 గం. నుండి మ. 2 గం
4వ తేదీ	ఖమ్మం	మయూర లాడ్జి	ఉ. 8 గం. నుండి 11 గం.
10వ తేదీ	ఒంగోలు,	గౌతమీ క్లినిక్ (జిల్లా పరిషత్ దగ్గర)	ఉ. 8 గం. నుండి 11 గం.
మరియు	నర్సారావుపేట	శ్రీనివాసా లాడ్జి	సా. 4 గం. నుండి 6 గం.
25వ తేదీ	చిలకలూరిపేట	శ్రీ గంగాభవన్ లాడ్జి	రా. 7-30 నుండి 9 గం.
14వ తేదీ	అనంతపురం	బృందావన్‌లాడ్జి (శ్రీ రఘువీర టాకీస్‌వద్ద)	ఉ. 8 గం. నుండి 2 గం.
15వ తేదీ	తిరుపతి	హోటల్ విక్రమ్	ఉ. 8 గం. నుండి 12 గం.
15వ తేదీ	పలమనేరు	ఆర్.బి. ట్రావెలర్స్ బంగ్లా	12 నుండి 5 గం. వరకు

ఎన్. బి: పై క్యాంపులన్నిటికి డాక్టరుగారు తప్పక హాజరు కాగలరు.

దాసరి నారాయణరావు

కృష్ణవేణి సమర్పించు

లక్ష్మి ఫిలింస్ కంబైన్స్



నిర్మాత: ఎన్. ఆర్. అనురాధాదేవి

సంగీతం: జి.కె. వెంకటేశ్ కెమెరా: కె.యస్. మణి ఎడిటింగ్: బాలు

Edited&Published yq V. LeelavathyRaghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024,& Printed by D. Hanumanaha Rao, at Kranti Press, 12, Francis JosephStreet, Madras-600001.

వ్యవస్థాపకులు

కీ॥ శే॥ వి. వి. రాఘవయ్యగారికి

స్మృత్యంజలి



1928—1971

మీ కార్యదీక్ష, క్రమశిక్షణా, సహృదయతా మాకు ఆశీస్సులై నిలుస్తుండగా మీరు స్థాపించిన యీ సాహిత్య జ్యోతిని వెలిగిస్తూ ముందుకు సాగుతున్నాము. మీరు మాకు దూరమైన క్షణాన్ని కసితీరా తిట్టుకొంటూ, మీ జ్ఞాపకాల్ని మననం చేసుకొంటూ మీకు మా స్మృత్యంజలి ఘటిస్తున్నాము.

—స్టాఫ్ మెంబర్లు, జ్యోతి